ధర్మము

# భారత నీతి కథలు-1,2



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

“ మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి “

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భారతనీతికథలు,

మొదటి భాగము.

కృతికర్త:

భోగరాజు నారాయణమూర్తిగారు,

విజయనగర సంస్థానకవి.

పబ్లిషర్సు.

వేంకటరామ్ అండ్ కో,

హెడ్డాఫీసు:-ఏలూరు.

1928.

రామా ముద్రాక్షరశాల, ఏలూరు.

సర్వస్వామ్య సంకలితము] [వెల 0—6—0.

# విషయసూచిక.


1. ఉదంకుడు—గురుభక్తి ... ... 1-6
2. అగ్నిభట్టారకుడు—సత్యవ్రతము... ... 6-10
3. కద్రువ—మచ్చరము ... ... ... 10-13
4. గరుత్మంతుడు—మాతృభక్తి ... ... 14-19
5. జరత్కారుడు—పితృదేవతాప్రీతి ... ... 19-22
6. శృంగి—క్రోధము ... ... 22-25
7. కచుడు—గురుసేవాధర్మము ... ... 25-31
8. శర్మిష్ఠ—గర్వభంగము ... ... ... 31-35
9. యయాతి—ధర్మసంశయములు ... ... 35-39
10. పూరుడు—పిత్రాజ్ఞ ... ... ... 39-42
11. శకుంతల—పతిభక్తి ... ... ... 43-47
12. దుష్యంతుడు—లోకాపవాదభీతి... ... 47-50
13. భీష్ముడు—బ్రహ్మచర్యవ్రతము ... ... 51-54
14. భీష్ముడు—సోదరప్రేమ, ధర్మదీక్ష ... 55-58
15. దీర్ఘతముడు—సంసారదుఃఖము ... ... 59-61
16. మాండవ్యుడు—హింసాఫలము ... ... 62-65
17. పాండురాజు—దుర్వ్యసనము ... ... 65-68
18. కుంతి—మంత్రప్రభావము ... ... 68-71
19. దుర్యోధనుడు—పాపవ్యవసాయము ... 72-75
20. ద్రోణుడు—పరాభవము... ... ... 76-80
21. అర్జునుడు—గురుదక్షిణ ... ... ... 80-35
22. దుర్యోధనుడు—లాక్షాగృహము... ... 85-89
23. భీముడు—కుటుంబరక్షణము ... ... 90-94
24. కుంతి—ప్రత్యుపకారబుద్ధి... ... ... 95-100


Checked 1969

# భారతనీతికథలు.

## మొదటిభాగము.

### 1. ఉదంకుఁడు-గురుభక్తి.

పూర్వకాలమున నుదంకుఁడనునొక, ఋషికుమారుఁడు గలఁడు. అతఁడు పైలుఁడను మహర్షి నాశ్రయించి, సమస్త శాస్త్రములు నభ్యసించి మహాతపస్సంపన్నుం డయ్యెను. అత్యంత గురుభక్తి పరాయణుండగుటచే నుదంకునకు నణిమాది సమస్తగుణ సంపదలును వశములైనవి. అపరిమిత నిష్ఠాపరుఁడై యతఁడు గురుకులమున గురులకుఁ బరిచర్య లొనర్చుచుఁ గాలముగడుపుచుండ నొకనాఁడు గురుపత్ని వానిం జీరి "కుమారా! నీవుపౌష్యమహారాజు పాలికింబోయియాతని దేవికుండలంబులు ప్రతిగ్రహించి నేఁటికి, నాలవనాఁడు తెచ్చి నాకొసంగవలయు" నని యాజ్ఞాపించెను.

కోఁడనే యుదంకుఁడు గురుపత్ని నియోగంబునఁ బౌష్యమహాదేవి కుండలంబులఁ గొనివచ్చెదనని బయలు దేరెను. మహారణ్య మార్గములనుండి యొంటరిగనే ప్రయాణము చేయుచుండెను. గురుసేవా లోలుఁడైన యుదంకుఁ డాఁకలి దప్పులుగాని ప్రయాణాయాసముగాని లేశమును బాటింపలేదు. అట్లునిశ్చితకార్య దీక్షతో నతఁడు పోవుచుండ, మార్గమధ్యమున నొకచో మహోక్షవాహనము నెక్కి వచ్చుచుండిన యొకదివ్య పురుషుఁడు వానికెదురయ్యెను. కోఁడనే యుదంకుఁడు వానింగాంచి భక్తి ప్రణామంబు లాచరింప నమ్మహాపురుషుఁడు "వత్సా! నీవెవ్వఁడవు? ఎందుఁబోయెద" ననియడిగెను. గురుపత్ని నియోగంబునఁ బౌష్యమహాదేవి కుండలంబులం గొనివచ్చుటకై పోవుచున్నానని యుదంకుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. దానికా దివ్యపురుషుఁ డెంతయుఁ బ్రసన్నుఁడై "కుమారా! నీగురుభక్తికి సంతసించితిని. ఈమహోక్ష గోమయమును భక్షింపుము. నీకు సర్వమును శుభంబగు" నని పలుక నుదంకుఁ డాతఁడు చెప్పినచొప్పునఁ గావించెను. ఆదివ్యపురుషుఁడు దేవేంద్రుఁడు. ఆతఁడొసంగిన గోమయ మమృతము. చిట్టచివర గురువు చెప్పినంత వఱకు నీ రహస్య ముదంకుఁ డెఱుఁగఁడు.

ఆదివ్యపురుషుని వీడ్కొని యుదంకుఁ డతిత్వరితగతిం జని పౌష్యమహారాజును సందర్శించి దీవించి, వానిచే సత్కరింపబడి యిట్లనియె. "మానవేంద్రా! నేను పైలమహర్షి శిష్యు

డను. నన్నుదంకుఁ డందురు. గురు కార్యార్థము వచ్చితిని. నీవి కుండలంబులు మాగురుపత్ని కొఱకు సమర్పింపుము." ఆమాటలకుఁ బౌష్యుండు సంతసించి "ఉదంకా! నీవంటి సత్పాత్రుని నీయఁగల్గుటచేఁ గృతార్థుండ నైతిని. మదీయ ధర్మపత్ని యక్కుండలంబులు దాల్చియున్నది. మద్వచనంబున నామె నడిగి వానిని గైకొ"మ్మని పలికెను. వెంటనే యుదంకుఁ డంతఃపురమునకుం జని పౌష్యమహాదేవిం గానక క్రమ్మఱి బౌష్యుపాలికి వచ్చి "రాజేంద్రా! నీ దేవిం గానక యిట్లు వచ్చితిని. నీవే యక్కుండలంబుల నిప్పించియి"మ్మనిన నతనికి రాజిట్లనియె. "ఓ భూసురోత్తమా! దేవి మహాపతివ్రత. పవిత్ర. అశుచులకుఁ గానరాదు. నీవు త్రిభువన పావనుఁడవు. అశుచివని నిన్నెట్లనఁగలను."

ఉదంకుఁ డామాటలు విని మార్గమధ్యమునఁ గావించిన వృషభ గోమయ భక్షణమునఁ దనకెంగిలి భావంబయ్యెనని యోచించి, శుద్ధోదకంబులతోఁ గాలుసేతులు గడిగికొని యాచమనంబు చేసికొని పౌష్యానుమతంబున మఱల నద్దేవి యొద్దకుం జనియెను. తోడనే పౌష్యమహాదేవి యుదంకునకు నమస్కరించి కుండలములు సమర్పించుచు నిట్లనియె. "రవినిభ తేజా! తక్షకుఁడీ కుండలముల పేక్షించుచున్నవాఁడు. వాఁడభేద్యుఁడు. మాయాదక్షుఁడు. వానివలన సురక్షితముగఁ జేసికొనుచుం జనుము." అట్లే యని యుదంకుఁ డద్దేవిని వీడ్కొని గృహాభిముఖుండై బయలుదేరెను.

పౌష్యమహాదేవి చెప్పినట్లే మాయలమారియైన తక్షకుఁడు దిగంబరవేషముతోఁ గుండలములు నపహరించుటకై యుదంకుని వెంటనే యనుసరించెను. పాప ముదంకుఁడు మాత్రము తనవెంట వచ్చువాఁడు తక్షకుఁడని యెఱుంగక, దారినడుమ నొక జలాశయము గని శుచిప్రదేశమున దనచేతి కుండలములు పెట్టి, యాచమించుచున్నంత నా సర్పస్వామి గ్రక్కున వాని నపహరించి యందుండి పరుగిడఁ దొడఁగెను. ఉదంకుఁడును వాని పిఱుంగని పోయి పట్టుకొనినంతనే ఫణివల్లభుఁడు దిగంబర వేషమును విడిచి నిజరూపమును వహించి భూవివరమునుండి పాతాళమున కేగెను. వానితోడనే దగిలి యవ్వివరంబునుండి తానును నాగలోకమునకుఁ జని, యుదంకుఁడు పన్నగాధీశ్వరులైన యనంతవాసుకైరావత తక్షకుల స్తుతియింప, నతిప్రమాణతురంగంబు నెక్కిన మహాతేజస్వి యగు నొక దివ్యపురుషుఁడు వానికి గోచరుఁడయ్యెను.

ఆదివ్యపురుషుఁడు దేవేంద్రుని సఖుఁడైన పర్జన్యుఁడు. అతఁడెక్కిన తురంగమగ్ని. ఇంద్రుని యనుగ్రహంబున నుదంకుఁడమృతపానము చేసినవాఁడగుటచే, వాని యభిమతము సిద్ధించుటకై వారిద్దఱు నట్టి రూపములతో వచ్చుట సాక్షాత్కరించిరి. వాహనారూఢుండైన పర్జన్యుని దర్శించినంతనే యుదంకుఁడు మంత్రపూర్వకముగ నతి భక్తితో వానిని స్తుతించెను. ఆ దివ్యపురుషుండును ప్రసన్నుండై వరము వేఁడుమన, "ఈ నాగకులంబెల్ల నాకు వశంబగున ట్లనుగ్ర

హింపు"మని యుదంకుఁడు ప్రార్థించెను. అట్లని నీవీ యశ్వ కర్ణరంధ్రంబుల మహాధ్మానంబు గావింపుమని పర్జన్యుఁడు పలుక నుదంకుఁడు వల్లెయని యాతఁడు చెప్పినట్ల కావించెను. క్రోధనే కల్పాంతంబునం బుట్టు బాడబానల శిఖలవలె నయ్యశ్వకర్ణంబులనుండి మహాగ్నిజ్వాలలు వెలువడి పాతాళంబెల్ల వ్యాపింపఁ జన్నగనుగొనుచు బన్నగాధీశ్వరునకును గూడ హృదయములు పగిలిపోయినవి. ఇయ్యది కుండలాపహరణంబుచేఁ గలిగెనని యుదంకునికోపాగ్ని కానోపునని తక్షకుఁడు భీతిల్లి, తక్షణము కుండలంబులం గొనివచ్చి యుదంకునకు సమర్పించెను.

ఇట్లు నాగకులంబునకెల్ల మహాక్షోభంబు గావించి తక్షకునిచేతి కుండలంబులు గొని యుదంకుఁడు, "నాలవ నాఁటికి కుండలంబులం గొని రావలయునని గురుపత్ని నన్ను నియోగించె. ఆమె వీనిని ధరింపవలసిన దినంబిదియే. ఈదిన మతిక్రమింపకుండ నేనెట్లుపోఁగలను? ఈ పాతాళమునుండి యెట్లు వెలువడఁగలను. నేఁడు పోఁజాలని యెడల నీప్రయత్న మంతయు నిష్ఫలంబె కదా" యని యాత్మగతంబునఁ జింతింప సాగెను. పర్జన్యుఁడు వాని యభిప్రాయ మెఱింగి, "ఈహయంబు నెక్కి యేగుము ఇది మనసుకంటెను గాలికంటెను మిక్కిలి వడిగల"దని తన తురంగము నొసంగెను. అద్దివ్య పురుష వచనంబున నుదంకుఁడు దాని నధివసించి తక్షణంబె గురుగృహంబు చేరఁగొనియె. గురుపత్నియు శుచిస్నాతయై

నూతనపరిధానముల ధరించి, కుండలంబులఁ దోడుగ నవనతంబగుటచే నుదంకుని రాకగోరుచు నుదంకునింగని మిక్కిలి సంతసించి, యాతఁడర్పించిన రత్నకుండలంబులం గైకొని యలంకరించుకొనియె.

ఇట్లు గురుకార్యంబు నిర్వహించిన శిష్యుం జూచి గురుండు మహానంద భరితుఁడై యిట్లనియె. "కుమారా! నీవలనఁ బరమప్రీత హృదయుఁడనైతిని. నీవు గుర్వర్థంబునందు ఋణవిముక్తుండవైతివి. ఇంక నిజేచ్ఛనుండుము.

క. కరమిష్టము సేసితి మా
కరిసూదన! దీన నీకునగు సత్ఫలముల్
గురుకార్య నిరతులగు స
త్పురుషుల కగుటరుదె యధికపుణ్య ఫలంబుల్..

## 2. అగ్నిభట్టారకుఁడు - సత్యవ్రతము.

భృగుఁడను నొక బ్రాహ్మణోత్తముఁడు గలఁడు. అతఁడు సదాచారుఁడు. అనంత తపోమహిమాన్వితుఁడు. ఒకనాఁడాతఁడు స్నానమున కేగుచు నగ్నిహోత్రమును గూర్చి చేయవలసిన విధానములను దన భార్యయైన పులోమకెఱింగించి తాను వెడలిపోయెను. గర్భిణియై యున్న పులోమ భర్త

చెప్పిన చొప్పున నగ్నిహోత్రగృహంబు ప్రవేశించి యగ్నుల యందు మిక్కిలి శ్రద్ధవహించి యుండెను.

ఆసమయంబునఁ బులోముఁడను నొకవింత రక్కసుఁడు భృగుని యిలుసొచ్చి, యగ్నిహోత్ర గృహంబుఁ బ్రవేశించి యచ్చటనున్న మహాసాధ్వియగు పులోమంజూచి యెంతయు నున్మత్తచిత్తుండయ్యెను. "ఓయీ జాతవేదా! ఈనవ్యసుందరి యెవ్వరి భార్య? ఈమె పేరేమి? నీవెఱిఁగినది నాకెఱిఁగింపు" మని తోడనే యారక్కసుఁ డగ్నిహోత్రు నడిగెను. పాప మగ్నిభట్టారకున కప్పుడు విషమావస్థ తటస్థించినది. తా నెఱింగినయర్థం బితరులడిగినప్పుడు కలయాఁపు చెప్పకుండుటయు, సత్యమును జెప్పకుండుటయు మహాపాతకములనియాతఁ డెఱుఁగును. ఉన్న దున్నట్లు పలికిన యెడఁ బులోముని వలనఁ బులోమ కేట్టిహాని సంభవించునో, ఆపైని భృగుం డాగ్రహించి తన కేమి శాప మొసంగునో, అందుచే భృగుశాపమునకా? యసత్యదోషమునకా? దేనికిప్పుడు సిద్ధపడవలయునని జాతవేదుఁడు పలువిధంబుల హృదయవేదన నొందసాగెను. ఇట్లు తర్కించి, శాపమువలని భయం బెప్పటికైన నెట్లులైనఁ దీర్చుకొనవచ్చునుగాని, యసత్యమువలన పాపం బెట్టివారికిని నెన్నటికిఁ దొలంగదని నిశ్చయించుకొని, "ఈమె భృగుపత్ని పులోమ" యని యద్దానవున కెఱింగించెను.

తోడనే పులోముఁడు పరిమోహహృదయుండై 'ఆహా! ఈపులోమ తొల్లి నేను వరించిన సుందరి. ఇప్పుడు భృగుని

భార్యనై యున్న"దని పలుకుచు, రక్కసుండు గావుఁ దక్షణము వరాహరూపమును ధరించి యమ్మహాపతివ్రత నెత్తుకొని యతిత్వరితగతిఁ బరుగిడఁ జొచ్చెను. అప్పుడు పులోమ గర్భంబుననున్న యర్భకుఁడా పరుగులవలని యలజడి భరింపలేక మహాగ్రహంబుతోఁ గుక్షిచ్యుతుం డయ్యెను. అందువలన వానికి 'చ్యవనుం' డను పేరు కలిగినది. ప్రళయకాల మహాగ్నివలె భయంకరుండై వెడలిన చ్యవనుని దృష్టియందుఁ బడినంతనె వరాహరూపంబున నున్న దానవుఁడు భస్మసాత్కృతుండయ్యె. పులోమయు భృగుకుల వర్ధనుండైన కొడుకు నెత్తికొని నిజాశ్రమంబునకు వచ్చెను.

అంతఁ గృతస్నాతుండై భృగుమహర్షి వచ్చి, బాలార్కునింబోని బాలకు నెత్తికొని ముద్దాడుచున్న నిజపత్నింజూచి యత్యంత విస్మితుండై, యామెవలన వృత్తాంతం బంతయు నెఱింగి, మిక్కిలిమీఱినరోషంబున నగ్నిభట్టారకుంజూచి, ఓరీ! నీవతి క్రూరుండవు. సర్వభక్షకుఁడవు గమ్మని" తీవ్రమైన శాపమిచ్చెను. పాపము శాపగ్రస్తుఁడై జాతవేదుండేమిచేయుటకుం దోఁపక, భృగునితో నిట్లనియె. "తాపసోత్తమా! యసత్యదోషంబునకు వెఱచి కలదెఱింగించితి. అఖిలజగత్కర్మసాక్షినై నేనసత్యమునుబలుకవచ్చునా? ఇదినిమిత్తంబుగానీవు నాకుశాపంబిచ్చితివి. నేనలిగిననీకుఁ బ్రతిశాపంబీనోపనివాఁడను గాను. కాని యెట్లుచేసినను బ్రాహ్మణులు పూజ్యులనియు వారల కెగ్గుచేసిననిహపరంబులు చెడుననియు నెంచి యుపేక్షించితిని.

లోకహితుండనైన నాకు శాపంబిచ్చి లోకంబులకెల్ల నపకారంబొనర్చితివి. సర్వభక్షకుండనై నేనశుచినైనచో విధ్యుక్తంబులైన సకల బ్రాహ్మణ కర్మంబులును జెడు. లోకయాత్రయే జరుగదు.

అని పలుకుచు నగ్నిభట్టారకుఁడు నిఖిలలోక వ్యాప్తంబైన తన మూర్తి నుపసంహరించెను. తోడనే లోకంబుల నెచ్చటెచ్చటనున్న యగ్నులును నొక్కమారుగఁ జల్లారినవి. దేవతార్చనలయందు దీపధూపాదులు నిలిచిపోయినవి. పితృకార్యములు శాంతించినవి. అగ్నితో సంబంధించిన జనుల నిత్యకృత్యము లన్నియు మానినవి. ఇట్లు లోకములకెల్ల మహాసంక్షోభము గలిగినంతనే జనులెల్లరు మహామునులకడ కరిగిరి. మహామునులు దేవతల సందర్శించిరి. దేవతలు మునులతోఁగూడ బ్రహ్మపాలికింజనిరి. బ్రహ్మయు భృగుశాపంబున నగ్నిభట్టారకుని యుపసంహారంబు నెఱింగి యగ్ని దేవుని రావించి యిట్లనియె. "లోక పాలకా! సకలప్రాణులకును నీవే భర్తవు. లోకప్రవృత్తికి నీవే హేతుభూతుఁడవు. భువనభారమును నీవుపేక్షించుట పాడిగాదు. నీవు సర్వభక్షకుఁడవయ్యును శుచులయందెల్ల నత్యంతశుచివై పాత్రులయందెల్ల బరమ పాత్రుండవై పూజ్యులయందెల్ల నగ్రపూజ్యుండవై సత్యంబు దప్పక భువనంబుల నడుపుము."

విశ్వగురుండైన విధాత ప్రార్థనంబున వైశ్వానరుండు తోడనే లోకంబుల ననుగ్రహించె.

క. తనయెఱిఁగిన యర్థం బొరుఁ
డనఘా ! యిది యెట్లు చెప్పుమని యడిగినఁ జె
ప్పనివాఁడును సత్యముఁ జె
ప్పనివాఁడును ఘోరనరక పంకమునఁబడున్.

## 3. కద్రువ - ఉచ్చైశ్శ్రవము.

వినతయుఁ గద్రువయుఁ గశ్యప ప్రజాపతి భార్యలు. భార్యలభక్తిసేవా విశేషంబులకు మిక్కిలి సంతసించి, మీ యభీష్టంబు తెలియఁగింపుఁడని కశ్యపుఁడొకనాఁడు వారినడిగెను. దీర్ఘదేహులును బలవంతులు నగు వేవురుకొడుకులను గద్రువ కోరినది. ఆ వేవురికంటెను బలాధికులు మహాతేజులు నగు నిద్దఱు కొడుకులను వినత కోరినది. అట్లే యగుఁగాక యని కశ్యపుఁడు వారికా వరముల ననుగ్రహించి, గర్భంబు లిమ్ముగా రక్షించుకొనుఁడని చెప్పి తాను దపము చేసికొనుటకు గంధమాదనమునకుఁ బోయెను. కద్రూ వినతలును గొంతకాలంబునకు గర్భంబులుదాల్చిరి. మఱి కొంతకాలంబునకా గర్భంబు లండంబులైనవి. ఆ యండములను వారు ఘృతకుంభంబులం బెట్టి రక్షించుకొనుచుండఁ గ్రమముగఁ గద్రూగర్భాండము లవిసి, యందు శేషవాసుక్యైరావత తక్షక కర్కోటకాదులగు వేవురు కొడుకులు గలిగిరి.

వినత గర్భాండములు రెండింటిలో నొక్కటియు నవియకుండెను. పుత్రసహస్రపరిశోభితయైన కద్రువం జూచి పాపము వినత యతిలజ్జావశముచే నుండెను. ఆ కారణమున నొకనాఁడామె తన గర్భాండములు రెంటిలో నొక యండమును బలవంతముగ పగులఁజేసెను. అందలి యర్భకుఁడు కింకను సంపూర్ణ శరీర మేర్పడియుండలేదు. ఊరువులు లేనివాఁడగుటచే ననూరుఁ డనియు నెఱ్ఱనివాఁ డగుటచే నరుణుండనియు వాని సార్థకనామములు. వికలాంగుఁడైన యనూరుఁ డండంబునుండి వెలువడినంతనే తల్లిపై నాగ్రహించి, నన్ను సంపూర్ణశరీరుం గానీక యండంబు పగిలించిన యపరాధమున, నీవు నీసవతికి దాసివై యేనూఱేండ్లుండుము" మని శపించెను. తాను జేసిన యకార్యంబునకును పుత్రుని శాపంబునకును వినత మిక్కిలి దుఃఖింపసాగినది. అప్పు డనూరుండామెను గమనించి "అమ్మా! విచారింపకుము. ఈ రెండవ యండము తనకుఁ దానె యవియు నంతవఱకు నుండనిమ్ము. అందుఁ బుట్టెడు నా సోదరుఁడు మహాబలపరాక్రమ సంపన్నుఁడు. వాఁడు నీదాసీత్వముఁ బాపఁగలఁడని ధైర్యము చెప్పి యతఁడు సూర్యుని రథసారథిగా నేగెను. అనూరుఁడు చెప్పిన చొప్పుననే వినత తన రెండవ యండమును భద్రముగఁ గాపాడుకొనుచుండెను.

ఇట్లు దినములు గడపుచు నొకనాఁడు వినత కద్రువతో వినోదార్థము సముద్రతీరమున విహరింపఁబోయెను.

అప్పు డత్యంతధవళమైన యొక యశ్వరాజము వారి దృష్టుల నాకర్షించినది. అది సామాన్యతురంగముగాదు. దేవదానవులు సముద్రమును మథించినప్పు డమృతముతోఁ గూడ నుద్భవించిన దేవతాహయము. దాని ధావళ్యమునకుఁ గద్రూవినత లత్యాశ్చర్యమును బొందిరి. అప్పుడు కద్రువ వినతం జూచి "చూడవె! చంద్రుని యందు మచ్చవోలె సంత ధవళంబైన యీ యశ్వమునకు వాలమునందు నల్లయై యున్న" దనిపలికెను. అందుకు వినత నవ్వుచు "అక్కా! నీవే కన్నులం జూచితివే? శుద్ధధవళ మూర్తియైన యీ యశ్వరాజునకు నల్లయెక్కడిది. లేదులే"దని ప్రత్యుత్తరమిచ్చెను. మచ్చరమున నామెమాట లిచ్చగింపక కద్రువ, "వినతా! దాని ధవళదేహంబున నల్లయున్న నీవునాకు దాసివగుము. లేనియెడల నేను నీకు దాసినయ్యెద" నని యామెతోఁ బన్నిదము పలికెను. ఆయుచ్చైశ్శ్రవము లేశమును నల్లలేని దగుటచే పాపము వినత యానందమున కంగీకరించి "రమ్మురమ్ము చూతమ" ని కద్రువను బిలచెను. "ఇప్పుడు ప్రొద్దు లేదు. రేపకడఁ జూత"మని పలుకుచుఁ గద్రువ యింటికి మఱలెను. వినతయు నిజ నివాసమున కేగెను.

నాఁటిరాత్రి కద్రువ తన కొడుకులనెల్ల రావించి. తన సవతికిని దనకును జరిగిన పన్నిదంపు వృత్తాంతంబంతయు నెఱింగించి యిట్లనియె. "కుమారులారా! అత్యంత ధవళమూర్తియైన యాతురంగంబునందు నల్లలేకున్నయెడల వినతికు నేను

దాసివి గావలసివచ్చును. రేపు రేపకడ మేమేగి చూచునరికి మీలో నెవ్వరైన నయ్యుచ్చైశ్శ్రవ వాలంబును జుట్టుకొని యుండవలెను. అందువలననే నేపన్నిదము గెలిచి వినతను దాసిగాఁగొందు." ఆమాటలకు నాగముఖ్యులలో నొక్కఁడును సమ్మతింపలేదు. స్త్రీలు మూర్ఖులగుటచే వారు చెప్పిన చొప్పున వర్తింపఁ గూడదనియు, అధర్మకార్యము తల్లి చెప్పినను జేయరాదనియు, కద్రూవినతలిద్దఱు మాకొక్క రూపయనియుఁ బలువుగ పలువిధంబులఁ బలుకుచు నేక గ్రీవంబుగ నామెయాజ్ఞ తిరస్కరించిరి. అంతఁ గద్రువ కోపోద్దీపిత ముఖియై జనమేజయుఁడు సేయబోవు సర్పయాగంబున నీ పాములన్నియుఁ బంచత్వంబునొందుఁగాకయని శపించె.

తీవ్రమగునట్టి శాపంబునకు నెఱచి కర్కోటకుండను నొక నాగముఖ్యుఁడు తల్లి పంచిన రూపంబున నాతురంగ వాలమును నీలముగాఁబట్టి వ్రేలాడఁ గడంగెను. ఆకారణంబున మఱునాఁ డుదయంబున నేగి చూచునరికిఁ గద్రువకు విజయంబును వినతి కపజయింబును గలిగెను. నాటినుండియు వినత కద్రువకు దాసియై యోపిన పనులు సేయుచుండె.

క. ధర్మజ్ఞులైన పురుషులు
ధర్మువునకు బాధసేయు ధర్మువు నెందున్
ధర్మముగా మదిఁ దలఁపరు
ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్.

# 4. గరుత్మంతుఁడు - మాతృభక్తి.

కద్రువకు వినత దాస్యము సేయుచుండఁ గ్రమముగా నేనూఱేఁడులు గడచినవి. అనూరుఁడు చెప్పిన చొప్పున నామెకు దాస్యవిముక్తియు సమీపించినది. అందుకనుగుణముగ రెండవ యండం బవిసిన నందుండి గరుత్మంతుఁడు పుట్టి, పుట్టినతోడనే తల్లికి మనఃప్రీతి యొనర్పుటకై మహాజవంబున గగనంబున కెగసెను. ఆ వేగాతిశయముచే మహాపర్వతము లన్నియుఁ జలించినవి. భూమ్యాకాశములఁ బేఁగిన ధూళిచే సూర్యమండలము మాటువడినది. సముద్రములు ఘూర్ణిల్లినవి. అట్లు మింటఁ గొంతవడికిఁ గ్రీడించి గరుత్మంతుఁడు తల్లికడ వ్రాలి యామె పాదములకు నమస్కరించెను. అదిచూచి సహింపలేక కద్రువ వానిం బిలిచి నాకొడుకుల నెత్తికొని యూడించుచుండుమని నియోగించెను. అట్లేయని గరుడుఁడు పాముల నెల్లఁ దన వీపెక్కించుకొని సూర్యమండలమువఱకు నెగసెను. అప్పుడు రవికిరణంబుల వేఁడిమికిఁ దాళలేక పాములన్నియుఁ మూర్ఛిల్లి నేల వ్రాలినవి. కద్రువ వినతాసుతునిపై నాగ్రహించి, భక్తితో దేవేంద్రు నారాధించి మహావృష్టిగురియించి కొడుకుల బ్రతికించుకొని, పూర్వము కంటెను గఠినమైన పనులచే వారిని బాధించుచుండెను.

ఆకారణమున నొకనాఁడు వైనతేయుఁడు తల్లికి నమస్కరించి, "అమ్మా! పక్షతుండహతులచే మహాపర్వతంబులనైన నుగ్గుగాఁ జేయు బలప్రసిద్ధిగల నాకీపాముల మోయుచుండ నేల? నీకీదాస్యమేల కలిగిన"దని యడిగెను. తోడనే తనకుఁ గద్రువ తోడి పన్నిదంబును ననూరుశాపంబును వినత వానికెఱింగించి, "ఖగేంద్రా! నీకారణంబున దాస్యవిముక్తి కలుగునను నాశ తోనిట్లు శోకమును ద్రింగుకొని కాలమును గడుపుచున్నాను. కొడుకులు సమర్థులైనఁ దల్లిదండ్రుల యిడుములు వాయుట యెంతయుం గలదు. నీయట్టి మహావీరుఁడైన పుత్రుంబడసి యు సవతికి దాసినై యుండు నే" యని దీనముగాఁ బలికెను. ఆమాటలకు గరుడుఁడు మిక్కిలి దుఃఖితుండై కాద్రవేయుల పాలికేగి "మాదాస్యము తొలఁగు నుపాయము సేయుఁడు. మీకిష్టంబైనది దేవతలనైన జయించి తెచ్చియిచ్చెద" నని పలికెను. ఉరగులును మహానంద భరితులై "విహగేంద్రా! నీకును నీతల్లికిని దాస్యవిరాసంబు వలయునేని యమరుల జయించి, యమృత భాండమును మాకుఁ దెచ్చియిమ్మని యడిగిరి.

వైనతేయుండు నట్లె యని తక్షణము తల్లికడకు వచ్చి యా వృత్తాంతము సెప్పి, యమృతహరణార్థం బరిగెదనని మ్రొక్కిన యామె సంతసిల్లి కొడుకును గౌఁగిలించుకొని, "నాయనా! సూర్యచంద్రులును మారుతాగ్నులును నిన్నెల్లప్పుడు రక్షించుచు నీయభీష్టములు సేయుచుందురు. నీకున్నతియు జయంబును

జేకురుఁగాక" యని దీవించెను. తల్లిదీవనలెల్ల గైకొని విహంగ వల్లభుఁడు గమనోన్ముఖుండై "యమ్మా! యమృతముదెచ్చు నప్పుడు లావు గలుగవలయు. నాకాహారం బుపదేశింపు"మని యడిగిన వినత యిట్లనియె. "తండ్రీ! సముద్రమధ్యమున వేలకొలఁది నిషాదులు నివసించుచుఁ బ్రజలకు హాని చేయుచున్నారు. నీవువారిని భక్షింపు" మని చెప్పెను. తోడనే ఖగస్వామి తల్లిని వీడ్కొని యతిత్వరితగతి నేగి, సముద్రోదరంబున నున్న నిషాదుల ననేక శతసహస్రసంఖ్యల వారిని నొక్కుమారె కంఠంబు తెఱచి దిగమ్రింగెను.

కాని గరుత్మంతుని కింకను నాఁకలితీరలేదు. అందుచే నతఁడు దివ్యన గగనమార్గంబున నెగసి, గంధమాదనముపైఁ దపముచేసి కొనుచుండిన తనతండ్రిని దర్శించి నమస్కరించి, మాతృదాస్య వృత్తాంతమును; తా నమృతము దెచ్చుట కుద్యమించుట, నిషాద ఖాదనము నెఱింగించి, తన కింకను నాఁకలి తీరలేదని చెప్పెను. కశ్యపుఁడు వాని ప్రజ్ఞావిశేషముల కాశ్చర్యపడి, "కుమారా! మూఁడు యోజనముల పొడవును, పది యోజనముల విస్తీర్ణమును గలయొక కూర్మంబును, ఆరు యోజనముల పొడవును బండ్రెండు యోజనముల విస్తీర్ణమునుగల గజమును నిరంతరము నరణ్యములోఁ బోరాడుచున్నవి. వానిని భక్షించి నీయాఁకలి దీర్చుకొ"మ్మని చెప్పెను. తోడనే ఖగనాథుం డంబరవీథి నెగసిపోవుచు గజ కూర్మము

లున్న తావునకేఁగి, యారెండింటి నతిసూక్ష్మముగ తన రెండు కాళ్లతో నడచి పట్టి మరలఁ బైకెగసెను. అంతటి మహా శరీరములుగల యాగజకచ్ఛపముల నెచ్చట భక్షింపనగునని యోజించుచును నవ్విహంగపుంగవుఁడు గగనమునుండి వచ్చుచుండ నొకచో రోహిణంబను నొకమహావృక్షము వాని కంటఁబడియెను. ఆవృక్షశాఖలలో నొకశాఖకు నూఱుయోజనముల విస్తీర్ణముకలదు. వాలఖిల్య మహామును లామహాశాఖనంటి తలక్రిందుగా వ్రేలాడుచుఁ దపము చేసికొను చుండిరి. గరుడుఁ డా మహాశాఖపై వ్రాలి యచ్చట భక్షింపవలెనని యనుకొనెను. కాని యాతఁడు వ్రాలినంతనే యాకొమ్మ పెళపెళవిఱిగి నేలబడుటకుఁ దపోభంగము గలుగకుండ, ఖగేంద్రుఁ డమ్మహాశాఖను నోటితోఁ గఱచిపట్టి కాళ్ల నిఱికించుకొనిన గజకూర్మములతోఁగూడ వినువీధింబోయి మునులఁ దండ్రిని దర్శించి మ్రొక్కెను. కశ్యపుఁడు వానియద్భుత శక్తికి మఱింత వింతపడి, వాలఖిల్యులంగాంచి "ఓమహర్షులారా! ఈగరుడుఁడు మీకుబాధయగునని నోటనున్న తరుశాఖ విడువ నేరకున్నవాఁడు. వినిగరుణించి మీరొండు కడకుఁ జనుం"డని ప్రార్థించెను. వాని ప్రార్థనమున వాలఖిల్యులు దానినివిడిచి చనిరి.

అప్పుడు కశ్యపుఁడు "కుమారా! ఇచ్చటికి లక్షయోజనముల దూరమున నిష్పురుషమగు నరణ్యముగలదు. ఈతరు

శాఖనచ్చటఁ బడవైచి హిమవంతంబు మీఁదికిఁ బోయి గజకచ్ఛపంబుల భక్షింపు"మని చెప్పెను. వైనతేయుండును నట్లే కావించెను. గజకూర్మభక్షణమున నాఁకలితీరి నూతన బలోత్సాహములు గలిగి, తక్షణము దేవలోకముపై వ్రాలి, దేవేంద్రాదులతో యుద్ధమును బ్రారంభించెను. ఇంద్రాది దిక్పాలకులును ముక్కోటి దేవతలును వైనతేయునిచే బరాజితులై తొలంగిరి. గరుత్మంతుఁ డమృతరక్షకులనెల్లఁ బారఁదోలి యమృతభాండమును బరిగ్రహించి నంతనే యింద్రుఁడు వానితోఁ జెలిమిచేసికొని, "ఇట్లొనరించుట నీకు న్యాయమా" యని బ్రతిమాలుకొనఁజొచ్చెను. "మాతృదాస్య విముక్తికై నేనీయమృతమును గాద్రవేయులకీయకతప్పదు. చేతనైనయెడ నీవువారికిఁ జిక్కకుండఁ జేసికొను" మని యుపాయము చెప్పి వినతాసుతుఁడు క్షణమాత్రములోఁ గద్రూకుమారుల కడ వ్రాలి, యమృతమును సమర్పించి తనకును దనతల్లికిని దాస్య విముక్తియైనదని వారిచే ననిపించుకొనెను. అమృతభాండమును జూచినంతనే నాగముఖ్యులెల్లరు మహానందభరితులై దానిం ద్రావుట కత్యాతురులై గుమిగూడఁజొచ్చిరి. మీరలెల్లరు సుస్నాతులై శుచులై దీనినుపయోగింప వలయునని గరుత్మంతుఁడుచెప్పి తల్లితోఁగూడ నచ్చటినుండి తొలంగిపోయెను. కాద్రవేయులెల్లరు స్నానములకేగి వచ్చులోపున నదృశ్యరూపముననున్న యింద్రుఁ డమృతభాండము నచ్చటినుండి సురక్షితముగాఁ గొనిపోయెను.

క. ఈ సౌపర్ణాఖ్యానము
భాసురముగ వినిన పుణ్యపరులకు నధిక
శ్రీసంపదలగు దురిత ని
రాసంబగుఁ బాయు నురగరక్షోభయముల్.

# 5. జరత్కారుఁడు - పితృదేవతాప్రీతి.

ఇహమునందున్నంత కాలము సర్వవిధంబుల సంరక్షించి పోషించి గతించిన పితురులకుఁ బరలోక క్రియలచే నుత్తమ గతులు చేకూర్చువాఁడే నిజమైన పుత్రుఁడనంబడును.

పూర్వము జరత్కారుఁడను నొక బ్రాహ్మణ కుమారుఁడు వివాహము చేసికొనక, నిత్యబ్రహ్మచర్యమునందే దీక్ష వహించి, కాలము గడుపుచుండెను. వానికి సంసారమునందలి మోహము లేశమును లేదు. తపస్సు వేదాధ్యయనము ఋషులతోడి చెలిమి జరత్కారునకు నిత్యకృత్యములు. అతఁడొక నాఁడు వనములో నొకపల్లపునీటినేలయందుఁ మూషకవిలూనంబై మూలము మాత్రమె మిగిలియున్న యొక తృణస్తంభము నవలంబించి తలక్రిందుగ వ్రేలాడుచున్న ఋషులంగొందఱఁ జూచెను. ఆఋషులు సూర్యకిరణంబులె యాహారంబుగా జీవించుచుండిరి. వారిని సమీపించి జరత్కారుండిట్లు ప్రసంగింప నారంభించెను. "మహామునులారా ! మీరు తల

క్రిందుగ వ్రేలాడుచున్నారు. ఇదియత్యుగ్రము. ఇదియు నొక తపంబేనా? దీని విధానము నాకెఱిఁగించిన యెడల నేనుఁ గూడ నిట్టితపంబాచరించెద."

ఇట్లడిగిన నధోముఖులైన యాబ్రాహ్మణులు జరత్కారున కిట్లనిరి. "అయ్యా! ఇదెక్కడితపము! సంతానవిచ్ఛేదంబున బహుదుఃఖితులమై వేఱాధారములేక యిట్లు వ్రేలాడుచున్నాము. ఇట్లేయుండి యేకాలంబున నధమలోకంబున బడెదమో తెలియదు. మందభాగ్యులమైన మావంశమున నొక్క పాపకర్ముఁడు పుట్టి, వివాహంబు చేసికొనక సంతానంబు నడయక పితృపితామహులమైన మాకిట్టి దుస్థితి ఘటించినాఁడు. మే మవలంబించిన ఉశీరస్తంభంబు వేళ్ళెల్లంగాలుండు మూషకరూపంబున వచ్చి క్రమక్రమముగఁ గొఱికి వేయుచున్నాఁడు. ఇంకొక్క వేరుమాత్రమె మిగిలియున్నది. ఆపాపాత్ముండు పుత్రకుండైనచో నదియుం దెగిపోవును. మేమధఃపాతులమగుదుము. మాయదృష్టవశంబున వాఁడు వివాహితుండై పుత్రవంతుండగునెడ నూర్ధ్వగతుల మగుదుము."

జరత్కారుఁడు వారిదుస్థితికెంతయుఁ జింతించి "ఆర్యులారా! పితృపితామహులగు మీకిట్టి యవస్థ కలిగించిన యా పాపాత్ముఁడెవ్వఁ"డని యడిగెను. అందుకా ఋషులమందానందభరితులై "నాయనా! సావధానముతో మాపలుకు లాలకించిన నీకంటె మాకాప్తు లెవరున్నారు! ఆ పాపాత్ము

పేరు జరత్కారుఁడు. వానిని నీవెఱుంగుదువేని మాపడియెడు నీచావస్థయంతయుఁ జెప్పి మాకు సద్గతులు గలిగింపుమని బోధింపుము" అని చెప్పిరి. ఆమాటలకు జరత్కారుఁడు మిక్కిలి దుఃఖించి వినయముతో నమస్కరించి " పితామహులారా! నేనే యామహాపాపాత్ముఁడైన జరత్కారుఁడను. మీరు నాపితృదేవతలు. నాకారణమున మీకిట్టి దుస్థితి కలుగుట కెంతయు లజ్జపడుచున్నాను. ఇంతవఱకు సంసారమునందును దారపరిగ్రహణంబునందును నాకు బుద్ధిపుట్టలేదు. మిమ్మిట్లు చూచి మీకు హితమ్ముగునట్లుగ నింక భార్యార్థము ప్రవర్తింపఁగలవాఁడను. జరిగిన దానికి క్షమింపుఁ" డనిన విని యమ్మహామునులు సంతసిల్లి " కుమారా! తగిన పుత్రులం బడసినవారికంటె లోకంబున ధన్యులు లేరు. నీవుపోయి భార్యనెంచుకొని సంతానంబు వడయుము. మమ్ముద్ధరింపు"మని బ్రతిమాలిరి. సనామమైన కన్యకను మాత్రమే పరిగ్రహించెదనని చెప్పి జరత్కారుఁడు వారిని వీడ్కొని కన్యాన్వేషణము ప్రారంభించెను.

అధఃపాతులగుటకు సిద్ధముగనున్న తన పితృపితామహులకు నూర్ధ్వాభిగమనంబుఁ గలిగించు సంపూర్ణ సంకల్పముతో సనామయగు కన్యకొఱకు జరత్కారుఁడు భూమండలమెల్ల వెదకెను. కాని యట్టికన్యక వాని కెందును లభింపదయ్యె. ఇంతలో సర్పస్వామియైన వాసుకి యీ వృత్తాంతమును దన చారుల వలన విని తన సహోదరియైన

జరత్కారుం దోడ్కొని తక్షణము జరత్కారు మహామునిని దర్శించి "మహాత్మా! నా వంశము ధన్యమైనది. ఇంక నీ వంశమును ధన్యము కాఁగలదు. ఇది మదీయసోదరి. నీకోరిన సనామయగు కన్య. దీనిం బరిగ్రహింపుమని వేఁడెను. జరత్కారుఁడా కన్యంబరిగ్రహించి వివాహంబై యాస్తీకుండను పుత్త్రుం బడసి తన పితృవర్గమును తరింపఁజేసెను.

చ. తగిన సుపుత్త్రులంబడసి ధర్మువు దప్పక తమ్మునుత్తముల్
వొగడఁగ నమ్మహాత్ములు వొందుగతుల్ గను ఘోరనిష్ఠతోఁ
దగిలి తపంబు సేసియును దక్షిణ లిమ్ముగనిచ్చి యజ్ఞముల్
నెగడఁగఁ జేసియుం బడయనేర రపుత్త్రకులైన దుర్మతుల్.

# 6. శృంగి—క్రోధము.

హాస్తిపురాధీశ్వరుఁడైన పరీక్షిత్తునకు మృగయాసక్తి మెండు. ఆవ్యసనముచేఁ దఱచుగ నతఁడు వేటయందే తిరుగుచు నొకనాటి వేటలోఁ దన కదృశ్యమైన మృగము కొఱకు సంచరించుచు నయ్యరణ్యమధ్యమున శమీకుఁడను నొక మహర్షిని సందర్శించెను. దర్శించి, "మునీంద్రా! నా చేత నేటువడిన మృగం బమ్ముతోడ నిల్లువచ్చె. అయ్యది యే వైపునకుం బాఱెనో మీరెఱుంగుదురేని దెల్పుఁ"డని యడిగెను. అమ్ముని మౌనవ్రతుండు గావున వానికేమియుఁ బ్రత్యుత్తర మీయలేదు.

ఆకారణమునఁ బరీక్షితుండలిగి సమీపముననే చచ్చిపడి యున్న యొకపామును వింటికొనతో నెత్తి వాని మెడపైఁ బడవైచి తన పురంబునకుఁ బోయెను.

ఆశమీకునకు శృంగియను కుమారుఁడు గలఁడు. అతఁడు గొప్ప తపస్సంపన్నుఁడు, మహాకోపి. తనతండ్రి మెడ యందలి మృతసర్పమును జూచినతోడనే శృంగి మహాగ్రహావశుఁడై కృశుఁడను మునివలన, నది పరీక్షితుఁడు చేసిన యకార్యమని తెలిసికొనఁ గలిగెను. తెలిసినంతనే యతఁడు శాపజలంబులెత్తి "మహావృద్ధుఁడగు మాతండ్రి నవమానించిన పరీక్షితుఁడు నేఁడు మొదలుగా సప్తదినంబులలోఁ దక్షక దష్టుండై మరణించుఁ గాక" యని కడుఁ దీవ్రముగ శపించెను. కొంతసేపునకు శమీకుఁడు తపము చాలించి కన్నులువిచ్చిచూచి, యాశాపవృత్తాంతమున కెంతయుఁ జింతింపసాగెను. "కుమారా! క్రోధముగలవాని తపంబును, ప్రమత్తుఁడగువాని సంపదయు, ధర్మబాహ్యుఁడగు వాని రాజ్యమును, భిన్న కుంభములోని జలమువలె వ్యర్థములు. యోగ్యులకుండవలసిన శాంతములేక నీవు మహాకోపివై భరతకుల పవిత్రుండైన పరీక్షితునిఁ బరీక్షింపక శాపంబిచ్చి లోకమునకు మహాపకార మొనర్చితివి. రాజరక్షితులముయేకదా మునులు నిర్విఘ్నముగఁ దపము చేసి కొనఁ గలుగుచున్నారు. అట్టి రాజులకుఁ గీడు సేయుటకంటెను

మహాపాపమేమున్నది? పరీక్షితుఁడు మృగయావ్యసనమున నపరిమిత క్షుత్పిపాసా పీడితుఁడై యెఱుఁగక నాకవజ్ఞఁజేసెను. అమ్మహాత్మునకు నీవిచ్చిన శాపము ద్రిప్పఁ గలుగుదువేని మేలు." అని శమీకుఁడు పలుక, శృంగి మిక్కిలి పశ్చాత్తాప పడుచుఁ దన శాపమును దాను ద్రిప్పుకొనఁ జాలనని చెప్పెను.

తోడనే శమీకుఁడు గౌరవముఖుండను వానిని బిలిచి యీవృత్తాంతమంతయుఁ బరీక్షిత్తునకుఁ జెప్పి ప్రాణరక్షణోపాయమునను౦డుమని బోధించిరమ్మనిపంపెను. గౌరవముఖుండేగి జరిగినదంతయుఁ బరీక్షితునకుఁ దెలుపఁ బాపభీతుఁడు తన యకార్యమున కెంతయు నొచ్చుకొని, శృంగిశాపమునకు విపరీతభయ సంతాపము లొందసాగెను. మంత్రివర్గముతో విచారించి యప్పటినుండియుఁ బరీక్షితుఁడు ప్రాణరక్షణమున నప్రమత్తుఁడై యేక స్తంభ సౌధమున నివసించుచుండెను. తక్షకుని విషము నుపసంహరించుటకు మహామంత్ర తంత్రము లెఱింగిన విషవైద్యులు నిరంతరము వానిని గాఁచికొని యుండిరి.

ఇంతలో నేడవదినము వచ్చినది. శృంగిశాపశక్తిచేఁ దక్షకుఁడుపురికొల్పబడిపరీక్షితునిఁగడతేర్చుటకువృద్ధబ్రాహ్మణ వేషముతో బయలుదేరెను. ఆనాఁడే కశ్యపుఁడను నొకగొప్ప విషవైద్యుఁడు తక్షకుని బారినుండి రాజును రక్షించితీరెదనను పట్టుదలతో హస్తిపురమునకేగుచు మార్గమధ్యమున నమ్మాయవృద్ధబ్రాహ్మణునిఁ గలిసికొనెను. వానింజూచినంతనే తక్ష

కుఁడు నీవెవ్వఁడ వెందుబోయెదవని యడుగఁ గశ్యపుఁడు వాని కిట్లనియె.

"అయ్యా! తక్షకుఁడను పన్నగుఁడు నేఁడు పరీక్షిత్తు నింగఱచి చంపునట. నా మంత్రతంత్ర ప్రభావంబున నమ్మహీనాథుని రక్షించుటకుఁ బోయెద." ఆమాటలకు, దక్షకుఁడు నవ్వుచు "అనఘా! నేనే తక్షకుఁడను. నీమందులు నీమాయలు నామెడ సాగిరావు. తిరిగిపొమ్ము. వలయునేని యిమ్మహావృక్షమును గఱచి భస్మముచేసెద. చూడు"మని పలుకుచు నచ్చట నున్న వటవృక్షమును గఱచెను.

వెంటనే తక్షక విషానలంబున క్షణమాత్రములో నమ్మహావృక్షము భస్మరాశియైనది. కశ్యపుండును నవ్వుచు నా భస్మమును మంత్రించి యెప్పటియట్లు వృక్షంబు గావించి, "తక్షకా! ఇప్పుడేమందు"వని యడిగెను. తక్షకుఁడు విస్మయమంది "అయ్యా! నీవు సమర్థుఁడవెయైనను నావిషప్రభావమునకు శృంగి శాపప్రభావము గూడ దోడుపడును. అందుచే నీవు పరీక్షితుని రక్షింపఁజాలవు. ఆతఁడిచ్చు ధనముకంటె నధిక ధనంబు నావలన బడయఁగలవు. పొ"మ్మని పలికెను. కశ్యపుఁడును జరుగబోవునది దివ్యజ్ఞానమున నెఱిఁగి నిజనివాసంబునకు బోయెను.

తక్షకుఁడు తక్షణంబ కొందఱ నాగకుమారులం బిలిచి మీరలు విప్రవేషధారులై సురభికుసుమ ఫలాదులం గైకొని రాజుకడకు నరుగుఁడని నియోగించెను. అదృశ్య రూపమున

దక్షకుఁడు వెంటనంటి వచ్చుచుండఁ జని నాగకుమారులు పరీక్షితుని దర్శించి యాశీర్వాద పూర్వకంబుగ వానికిని వాని చుట్టునున్న వారికిని పుష్పఫలాదులొసంగిరి. అందు రాజందుకొనిన ఫలంబునందు నల్లని క్రిమియయి వెడలి క్రమ క్రమముగఁ బెరిగి సర్పమై తక్షకుఁడు పరీక్షితునిఁగఱచి మాయమయ్యెను. ఆకాటుతోడనే తత్పరిజనంబులెల్ల బెదరి యఱచుచు నలువంకలకుఁ బాఱిపోయిరి. ఏడవదినమగు నాఁటి సూర్యాస్తమయముతోడనే మహాకోపియగు శృంగిశాపంబునఁ బరీక్షితుఁడస్తమించెను.

క. క్రోధము తపముం జెఱచును
గ్రోధము యణిమాదులైన గుణములఁ బాపున్
గ్రోధము ధర్మక్రియలకు
బాధయగుం గ్రోధిగాఁ దపస్వికిఁ జన్నే

# 7. కచుఁడు - గురుసేవాధర్మము

పూర్వము దేవదానవ యుద్ధములలో దేవతల కంటె రాక్షసులే యెక్కుడు జయము గాంచుచుండిరి. ఇందుకుఁ గారణము రాక్షసగురువైన శుక్రునకుఁ గల మృతసంజీవనీ విద్యయే ఆవిద్యాప్రభావమున నతఁడు చనిపోయిన రాక్షసుల

నెల్ల బునర్జీవితులఁ జేయఁగలుగు చుండెను. ఆవిద్యగలవా
రెవ్వరును దేవతలలో లేకుండుటచేత దేవసైన్యములు పరా
జితములగు చుండెను. ఈరహస్యము నిర్జరులు గ్రహించి శుక్రు
నకు శిష్యుఁడై వానియొద్దనున్న మృతసంజీవనీ విద్య నభ్య
సించి రాఁగల ధీమంతుఁడు మనలో నెవ్వఁడని యూహించి
బృహస్పతి కొడుకైన కచునిం బ్రార్థించిరి. సురాసుర సంగ్రా
మములలో నిత్యము సురలకుఁ గలుగుచుండిన పరాజయములఁ
జూచుచున్నవాఁడు గావునఁ గచుఁడు వారి ప్రార్థనమును
మన్నించి దేవకార్యార్థియై రాక్షసరాజ్యమును జొచ్చిశుక్రుని
దర్శించెను. దర్శించి వినయముతో నమస్కరించి " ఆచార్య
వర్యా! నేను గచుండనువాఁడను. దేవగురుండైన బృహస్పతి
కుమారుఁడను. శిష్యవృత్తిని మిమ్ము సేవింప వచ్చితి" నని
పలికెను.

బృహస్పతికిఁ గుమారుండగుటచేతను,నయవినయాదిగుణా
గణుండగుటచేతను శుక్రుడు తక్షణమ వానిని శిష్యునిగా సంగీక
రించెను. నాటనుండియు గురుని యాజ్ఞలెల్లఁ దక్షణమ నిర్వ
హించుచు గురుని చిత్తవృత్తి కనుకూలుఁడై ప్రవర్తించుచు
మనోవాక్కాయకర్మల నేకాకారుఁడై కచుఁడు గురుసేవ సేయు
చుండెను. దిన దిన ప్రవర్ధమానమగు వాని భక్తి విశేషమునఁ
గచుఁడు దానవశిష్యులందఱలో శుక్రున కభిమాన శిష్యుఁ
డయ్యెను. శుక్రునికంటెను శుక్రుని కూతురగు దేవయానికిఁ
గచునియం దభిమానము గలిగినది. గురునితోఁ బాటుఁ

కుమారికకుఁ గూడఁ గచుఁ డనుదినంబును బుష్పఫలాదులను దెచ్చి సమర్పించుచుండును.

ఇట్లు కచుఁడు తన యుత్తమ ప్రవర్తనముచేత శుక్రునకును దేవయానికిని బ్రాణములలోఁ బ్రాణమై పెక్కేండ్లతినిష్ఠతో శుశ్రూష గావించెను. ఆ రాక్షస పాఠశాలయందలి రాక్షసబాలురెల్లరుఁ గచునియందసూయవహించి వానినెట్లులైనఁ గడతేర్ప వలెనని నిశ్చయించుకొనిరి. కచుని గౌరవంబును శుక్రుని యాదరంబునుజూచి వారు సహింపఁగలేకపోయిరి. ఆ కారణమున నొకనాఁడు సురగురుకుమారుఁ డొంటరిగ వనమున హోమధేనువులఁ గాచుచుండఁ గొందఱు రక్కసిబుడుతలు వానిని వధియించి యొక మహావృక్షమునకు వ్రేలఁగట్టి పోయిరి. నాఁడుసాయంకాలమైనను గచుండింటికి రాకుండుటచే శుక్రుడును శుక్రునికంటె దేవయానియు వానికొఱకు విచారింప సాగిరి. కచరహితంబుగ వచ్చిన ధేనువులం జూచి నంతనే కచునకుఁ బ్రాణాపాయము గలిగినట్లు వారు నిశ్చయించుకొనిరి. దేవయాని రోదనము ప్రారంభించెను. తండ్రి యామె నోదార్చి దివ్యజ్ఞానమున నంతయుం దెలిసికొని మృతుండైన కచుం దోడ్కొని రమ్మని తన మృతసంజీవనిం బంపెను. అదియు క్షణమాత్రమున వానిం బునర్జీవితుం జేసి తోడ్కొనివచ్చెను. వానిం జూచి శుక్రదేవయానులెంతయు సంతసించిరి.

అట్లు లబ్ధప్రాణుండైన కచుం జూచి రాక్షసార్భకులెల్లరు దుర్భరదుఃఖమును బొందసాగిరి. ఈసారి శుక్ర దేవయానుల యాశ లడుగంటునట్లు కడ తేర్ప నిశ్చయించుకొనిరి. అట్టి నిశ్చయముతో వారెల్ల రొకనాఁడు పూర్వమువలెనే వనంబున కేకతముగ వచ్చిన కచునిఁ జిత్రవధ గావించి తత్కళేబరమును నగ్నియందునైచి భస్మముచేసి, యాభస్మమును మద్యమునందు గలిపి శుక్రునకొసంగిరి. మద్యపానరతుండైన కావ్యుఁ డామద్యము సామాన్య మద్యమనుకొని దానిని సేవించెను. ఆనాఁడును వేళ యతిక్రమించియు నిల్లుసేరని కచునికై దేవయాని యేడ్చుచు వానింజూచికాని కుడువనని భీష్మించియుండ, శుక్రుండామె నోదార్చి మఱలఁ దనయోగదృష్టిఁజూచెను. కాని లోకాలోక పర్యంతభువనంబుల యందెచ్చటను వానికిఁ గచుండు గానరాలేదు. భస్మమయుండై సురయందుఁ గనఁబడి యతఁడు తన యుదరము నందున్నట్టులెంతో సేపునకుఁగాని తెలిసికొనలేకపోయెను. తెలిసినంతనే శుక్రుండు చింతించి నేటి నుండియు సకలవర్ణముల వారికిని మద్యపానము మహాపాపం బగుఁగాక, యని శపించి, తన యుదరంబున నున్న కచునప్పుడె సంజీవితుం జేసెను.

అట్లు సంజీవితుండైన కచుఁడు గర్భమునుండి శుక్రునిం బిలిచి 'మహాత్మా! తనువును జీవంబును సత్వంబును గలిగినవి. ఇంక వెలుపలికి వచ్చు మార్గం బుపదేశించి రక్షింపు' మని

ప్రార్థించెను. శుక్రుఁడు వాని ప్రార్థనమును మన్నించి 'కుమారా ! నాయుదరము భేదించి కాని నీవు వెలుపలికి రాఁజాలవు. ఉదరము భేదించిన నేను మృత్యువుఁడ నయ్యెదను: నన్ను బునర్జీవితుం జేయుటకు నీకు మృతసంజీవని నుపదేశించెద. పరిగ్రహింపు' మని యప్పుడే వానికామంత్రము నుపదేశించెను. కచుఁడామహావిద్యనభ్యసించి గురుని యుదరమును భేదించుకొని వచ్చి మూర్ఛితుండైన శుక్రుని సంజీవితుం జేసెను.

అంతలో శుక్రుఁడు కచునకు సెలవిచ్చి నీవింక మీ తండ్రి కడకుఁ బోవచ్చునని చెప్పెను. కచుండును గృహాభిముఖుండై దేవయాని కతిప్రియపూర్వకంబుగాఁ జెప్పినామెకన్నీరు మున్నీరుగావగచివగచి, "కచా! నిన్ను విడువలేను. బ్రహ్మచారి వగు నీవు కన్యనగునన్నుఁ బరిగ్రహింపుము" అని ప్రార్థించెను. ఆమాటలకుఁ గచుఁడు చెవులు మూసికొని "హరి ! హరి ! గురుపుత్రి ! సోదరీ ! దేవయానీ ! నీవిట్టి పలుకులు పలుకవచ్చునా? నేనును మీతండ్రిగర్భమునుండియే వెలువడినవాఁడ నగుట మన మిరువురము నేకోదరులము. ఏకోదరులకు వివాహము చెల్లునా తల్లీ!" యని కచుఁడామె ప్రార్థనమును నిరాకరించెను. ఆకారణమున దేవయాని మిక్కిలి కోపించి, 'నామనోరథమును వ్యర్థముచేసిన నీకు మృత సంజీవని పని సేయకుండుఁగాక' యని శాపమిచ్చెను. కచుఁడు నవ్వుచు, నాకు బనిసేయ కున్నను నాచేత నుపదేశము గొన్న

వారికి నేయుంగాక' యని బలుకుచు ' నీవు ధర్మవిరోధంబు నాలించితివి గావున నిన్ను బ్రాహ్మణుండెవ్వండును వివాహమాడ కుండుంగాక' యని ప్రతిశాపంబిచ్చి దేవలోకంబునకుం జని యమ్మహామహుండా విద్య నమరులకెల్ల నుపదేశించెను.

ప. గురుకులమునందు గురులకుఁ
బరిచర్యలొనర్చి తాను పరవితనిష్ఠా
పరుఁడై జ్ఞానము నేర్చెను
గురునయనశమాదికాష్ఠ గుణములశోభన్.

---

# 8. శర్మిష్ఠ-గర్వభంగము.

అప్పటి రాక్షస రాజ్యమునకెల్ల రాజు వృషపర్వుఁడు. వానికి శర్మిష్ఠయను కుమార్తెకలదు. శర్మిష్ఠ దేవయానికంటె చిన్నది. ఇయ్యిరువురును తఱచుగఁ బలువిధములగు వినోదములతోఁ గ్రీడించుచుఁ గాలము గడపుచుందురు. కానిశర్మిష్ఠ రాజుకూతురను గర్వమునఁ బరిజనమును దూలనాడుచుండుట వాడుక. దేవయాని మిక్కిలి యభిమానవతి. ఒకరిచే మాట పడనొల్లదు. అందుచే నా రామవిహారమునకు రమ్మని శర్మిష్ఠ కబురు పంపినప్పుడెల్ల నామెతోడి వినోదములకు దేవయాని సంశయించుచుండును.

ఒకనాఁడు రాజకన్యకయైన శర్మిష్ఠ దానవ కన్యకా సహస్రములు తన్నుఁ జుట్టుకొని రా, దేవయానీ సహితంబుగ జలక్రీడకు బయలుదేరెను. ఉద్యానవన మధ్యమునందున్న చంద్రకాంత శిలాసోపానములు గల యొక సుందర కాసార తీరమున వారందరుఁ జేరిరి. అది సాయంసమయమగుటచేత నప్పుడప్పుడే తామరలు మూసికొనుచున్నవి. కలువలు వికసింప దొడంగినవి. పక్షులు గూఁడ్లకుఁ జేరుకొనుచున్నవి. తుమ్మెదలు ఝుంకార ధ్వని గావించుచున్నవి. సమీపమునం గల రసాలశాఖాగ్రంబుపై గోకిల మనోహరముగఁ బాడుచున్నది. నెమలిపిట్ట నాట్యమాడుచున్నది.

ఇట్టు నేత్రానందకరమైన యయ్యారామ సరోవరతీరంబునఁ జేరి, వారందరుఁ దమతమ కట్టుబట్టల గట్టుపైఁ బెట్టుకొని యొకరి నొకరు త్రోసికొనుచు గుభిల్లున నీటిలోని కుఱుకసాగిరి. అందఱునుఱికి నొండొరులపై నీళ్ళుజల్లుకొనుచు, ఒకరిపాదము లొకరు పట్టి లాగికొనుచు, ఒకరి కన్నులొకరు మూయుచు నీటిభయముగలవారిని బలువుగపట్టి యడుగంటఁ ద్రోయుచు మరలఁ దీయుచు, అనేకవిధముల వినోదములతో నీటి యాటలాడుకొనిరి. ఇంతలో గట్టుపై ప్రత్యేకస్థలములఁ బెట్టుకొన్న వారి కట్టుబట్ట లన్నియు వాయువశంబున గలసి పోయినవి. కొంతసేపునకు జలక్రీడ చాలించి వచ్చి కన్యకలెల్లరు నొక్కయెడఁ గూడుకొనినయాబట్టలకుప్పలోఁ దమతమపరిధానముల

నెంచుకొనసాగిరి. ఆత్రొక్కిడిలో దేవయాని కట్టుబట్టను శర్మిష్ఠయు, శర్మిష్ఠకట్టుబట్టను దేవయానియు బొరపాటునఁ గట్టివేయఁజొచ్చిరి. అది యెఱింగి దేవయాని శర్మిష్ఠనుఁజూచి, 'అమ్మా! లోకోత్తర చరిత్రుండును మీతండ్రికి గురువునగు శుక్రుని తనూజనగుటచే మీయందఱకుఁ బూజ్యురాలను. నీ కట్టిన మైలకట్టుట నాకుఁ దగ' దని పలికెను. ఆమాటలకు రాజకన్యక తోక త్రొక్కిన త్రాచువలెఁ జెలరేగి,

“ఛీ,ఛీ! దేవయానీ! కడుపుకూటికై మాయయ్యను సేవసేయుచు, దీవించుచు, మంచిచేసికొనుచు, జీవించుచుండిన యేకాకుఁడగు శుక్రుని కూతురువని నిన్నెఱుంగుదును. నోటికి వచ్చినట్లెల్లఁ బేలకుము. రాజకూతురనైన నాకట్టిన పుట్టంబును గట్టుకొన లేననుటకు నీకు సిగ్గెల కలుగదు? నీ త్రుళ్ళుపాటడఁచెదను. తొందరపడకు” అని యిచ్చకు వచ్చిన దుర్భాష లాడఁజొచ్చెను. పాపము దేవయాని ఖిన్నవదనయై నోటమాట లేక యట్లె యుండిపోయెను. ఆమె సంతతో విడువక. యహంకార చిత్తయైన శర్మిష్ఠ తన చెలికత్తెలచే దేవయాని నొకపాడునూతిలోఁ ద్రోయించి, వారందఱతోఁ జల్లగా నింటికిసాగెను. పాపము దేవయాని తన్ను రక్షించువారెవ్వరును లేక, యేమిచేయుటకును దోపక, యాపాడునూతిలో రోదనము సేయుచు వెఱ్ఱిదానివలెఁ గేకలు వేయుచుండెను. ఆసమయమున నామె యదృష్ట వశమున యయాతి

యను నొకరాజు వేటాడిపోవుచు నామె కేకలువిని యా పురా తన సమీపమును సమీపించెను. వేట కారణమున నాప్రాంత మున సంచరించుచుండు యయాతిని దేవయాని తెలుసుగాఁ జూచుచున్న దయో గావున, నానికిఁ దనవృత్తాంతం బంతయు నెఱింగించి రక్షింపుమని కోరెను.

యయాతియవ్విప్ర కన్యయం దెంతయు దయాళుండై తనదక్షిణ హస్తంబునుజాచి యామె పాణి పల్లవమును గ్రహించి వెలుపలికిఁ దిగిచి తనపురంబునకుఁ బోయెను. ఇట్లు యయాతిచే రక్షింపబడియు దేవయాని, శర్మిష్ఠచేసిన యెగ్గు వలనఁ బురంబు సేరుట కిష్టపడక, తన్ను వెదకుచువచ్చిన ఘూర్ణికయను పరిచారికంగని యిట్లనియె. "ఘూర్ణికా! నేనింక వృషపర్వు పురంబు సొరనొల్లను. శర్మిష్ఠ నాకుజేసిన యవమానము మాతండ్రికి కెఱిగింపుమని చెప్పిపంపెను. ఘూర్ణికవలన శుక్రుండంతయు నెఱింగి యత్యాతురతతో వచ్చి అమ్మా! నీకింతకోపము తగదు. కోపంబువలన సర్వా నర్థములు నుగలుగును. శర్మిష్ఠ రాజుకూఁతురు. నీవామెతోనిగ్ర హించి నిలువజాలవు. ఇంటికి బోవుదమురమ్మని యనేక విధ ముల బ్రతిమాలెను. కాని యెంతకును దేవయాని తనపంతము వీడదయ్యెను. అంత శుక్రుండు విసిగి కూఁతు నోదార్చి తల్లీ! నీవేనాకుగతివి. నీతోడ నేనునువత్తు ననిపలికి యామెతో దేశాంతర గమనమునకు నిశ్చయించుకొనెను.

ఇంతలో రాజైన వృషపర్వుఁడీ వృత్తాంత మంతయు జారులవలనవిని, తన పరివారముతోఁగూడ శుక్ర దేవయానుల కడ ప్రత్యక్షంబై "గురువర్యా! మీయనుగ్రహంబుననే యింత వరకు దేవతలజయింపఁ గలుగుచుంటిమి మీరుమమ్మొడబాసిన మారాజ్య మొక్కక్షణమైన నిలువనేరదు. ఈ దేవయాని కెయ్యది యిష్టంబు దానిని నేనవశ్యంబు గావించెద. అనుగ్రహించి సెలవిండని ప్రార్థించెను. అప్పుడు కావ్యుఁడు నాభిప్రాయముగ దేవయాని మొగంబుచూచెను. దేవయానియు సంతసిల్లి శర్మిష్ఠనుగన్యకా సహస్రముతోఁ దనకుదాసిగానీయ వలయునని కోరెను. తత్క్షణమ వృషపర్వుఁడు కూఁతురాపించి కన్యకాసహస్రంబుతో దేవయానికి దాసిగానిచ్చి శుక్రునకు నుపశ్రియంబుచేసె. నాటినుండియు శర్మిష్ఠ తన గర్వస్వభావమును విడిచి, నిత్యమును దేవయానిని గొలుచుచుండె.

క. కడునసుర క్త్రియు నేర్పును
గడకయుఁ గలవారి నఱక కడవఁగ నెగ్గుల్
నోడివెడు వివేకశూన్యులు
కడనుండెదు నంతకంటెఁ గష్టము గలదే?

---

# 9. యయాతి - ధర్మసంశయములు.

శర్మిష్ఠ దేవయానికి దాసియైన తరువాతఁ గొంత కాలము గడచెను. శర్మిష్ఠయు నామె తోడికన్యకలును గూడ

దేవయానిని బట్టుపు దేవినిఁ గొల్చినట్లు కొల్చుచుండిరి. ఇప్పుడు శర్మిష్ఠకు గర్వముపోయి పశ్చాత్తాపమును బశ్చాత్తాపము తోడనే నయ వినయాది సుగుణములును గలిగినవి. దేవయానికిఁ బూర్వపు నయవినయాది గుణములు పోయినవి. పోవుటతోడనే గర్వము బలిసినది.

ఒకనాడు దేవయాని శర్మిష్ఠాది కన్యలతో వనవిహారమున కేగి, పూర్వమువలెనే యయాతినిఁ జూచెను. నేఁటికి బడలి సుఖోపవిష్టుండై యున్న యారాజు శర్మిష్ఠను జూచి యామె యతిశయ రూపలావణ్యములకు మెచ్చుకొనుచు, నామెయెవ్వరో తెలిసికొనఁగోరెను. అప్పుడు దేవయాని నాతని సమీపించి "రాజేంద్రా! నన్ను మున్నె యెఱుంగుదువు. ఈమె వృషపర్వునికూఁతురు. శర్మిష్ఠ. దాస్యవృత్తితో నిరంతరము నాకడనే యుండును." అనిచెప్పి మఱియు నిట్లనియె. మహీనాయకా! పురాతన కూపమునుండి నాపాణిని గ్రహించి యెత్తి నన్నుఁగాపాడిన ప్రాణదాతవు. ఆనాడే మనకుఁ బాణిగ్రహణము జరిగినది. ఇంక శాస్త్రోక్తమైన పాణిగ్రహణము కూడఁ గావించి నాతోసకలభోగములు ననుభవింపుము. దేవకన్యలవంటి యీకన్య లెల్లరు నిరంతరము సేవించుచుండ మనము భూలోక స్వర్గసుఖము లనుభవింపగలము."

ఆమెమధురాలాపములకు యయాతి మిక్కిలి సంతసించియు క్షత్రియుఁడు బ్రాహ్మణకన్యను వివాహమాడవచ్చునా?

యను ధర్మసంశయమునఁ బడి, దేవయానిఁ గిట్లనియె. " సుందరీ ! నీతండ్రియైన శుక్రభగవానుఁడు సకల ధర్మాధర్మవిదుఁడు. క్షత్రియుఁడనగు నేను నిన్నుఁ జేపట్టవచ్చునని యమ్మహాత్ముఁడు సెలవిచ్చెనేని మన వివాహము జరుగఁగలదు. నీవాతని యనుజ్ఞ నడుగుము " అందుకు దేవయానియు సమ్మతించి యప్పుడే శుక్రుని రావించి తన మనోరథమును వానికెఱింగించెను. కూతుపతిప్రీతి మన్నించువాఁడైన శుక్రుఁడు దేవయాని యభీష్టమును సమ్మతించి, యయాతి దేవయానుల వివాహమును నిశ్చయించెను. నిశ్చయించి శర్మిష్ఠను మాత్రము నీవు భార్యగాఁ బడయఁగూడ దని యయాతి కాజ్ఞాపించి, కూఁతునిచ్చి వివాహము గావించెను.

యయాతి దేవయానిం బెండ్లియాడి యామెతో నిజపురంబునకుఁ బోయెను. శర్మిష్ఠాది కన్యకలును దేవయానితో డనేవచ్చిరి. యయాతి శర్మిష్ఠను నశోకవన సమీపంబున నొక గృహమునందుంచి దేవయానితో నిష్టభోగంబు లనుభవించుచుండెను. కొండొకకాలమునకు దేవయానికి యదుతుర్వసులను నిరువురుకుమారులుపుట్టిరి. కొడుకులు పుట్టినతర్వాత దేవయానికి మఱింతగర్వమధికమైనది. తనపుత్రులను దన వైభవమును జూపి యప్పుడప్పుడామె దీనురాలై యున్న శర్మిష్ఠను హేళనము సేయుచుండెను. ఐశ్వర్యమునం దుండవలసిన యడకువ దేవయానికి లేదు.

రాజనందనయైన శర్మిష్ఠ దేవయాని నిత్యమును గావించు నవమానముల భరింపలేక భరించుచు, యుక్తవయసు వచ్చుటచే వివాహాసక్తి కలిగి, పాపమూరక విచారించుచుండెను. దాసియై యున్న తన్నింక నే రాజకుమారుఁడును బెండ్లాడఁడని యుఁదన జీవితమంతయు నట్లు దాస్యవృత్తితోడనే గడపవలసి యుండు ననియు నామె నిశ్చయించుకొనినది. ఆనిశ్చయమువలన నామెకు జీవితముపై నాశయుఁబోయినది. ఒకనాఁడామె బలవంతముగ మరణించుటకుఁ బ్రయత్నించుచుండ నాకస్మికముగ యయాతి యచ్చటకు వచ్చుట తటస్థించెను. వచ్చినంతనే రాజామెనుఁగని ప్రయత్నమును వారింప శర్మిష్ఠ యేడ్చుచు వాని కిట్లనియె. "రాజేంద్రా! నన్నేల వారించితివి? జీవితమునందు నాకింకెట్టి యాశలున్నవని జీవింపుమనెదవు? రాజకుమారా! చిరకాలమునుండి నాహృదయము నీయందు లగ్నమైనది. నన్నుఁ జేపట్టి నాకుఁ బతిభిక్షయుఁ బుత్రభిక్షయుఁ బెట్టెదవేని జీవించెదను. లేనియెడ నన్ను వారింపక యుండుము. వెడలిపొమ్ము."

ఆమె యేడుపువలనఁ బాపము యయాతికి గుండె నీరైనది. తాను గురించి చేపట్టకున్న శర్మిష్ఠ ప్రాణత్యాగము మానదు. చేపట్టిన శుక్రునియెడ మాట తప్పవలసివచ్చును. ప్రాణరక్షణము చేసిన నసత్యదోషము, అసత్యదోషమునకు వెరచిన శర్మిష్ఠాప్రాణభంగము. ఇట్టియెడ నేమి చేయవలయునో యని యయాతికి మిక్కిలి ధర్మసంశయము కలిగినది. అప్పుడు శర్మిష్ఠ

దాని చిత్తవృత్తి నెఱిఁగి, 'రాజేంద్రా! ప్రాణాపాయమునం దును, సర్వధనాపహరణమందును, విప్ర ప్రాణరక్షణాదుల యందును నసత్యము పలుకవచ్చునని మాశుక్రాచార్యుల వారు నీతి శాస్త్రమునం దొక సూత్రము వ్రాసి' రని యా సూత్రము జదివెను. అదివిని శర్మిష్ఠను జేపట్టుట శుక్రమతం బున నసత్య దోషముండదని యెంచి యయాతి యప్పుడే యామెను భార్యగా నంగీకరించెను. కాని చాలకాలమువఱకు నా రహస్య మెవ్వరికిఁ దెలియదు. శర్మిష్ఠ యయాతివలనఁ గ్రమముగ ద్రుహ్యానుపూరులను ముగ్గురు కొడుకులం బడసెను.

క. వినుఁబొంకఁగఁ బ్రాణాత్యయ
మున సర్వ ధనాపహరణమున వధగా వ
చ్చిన విప్రార్థమున గవా
శయసంబుల వివాహ సమయము లందున్.

---

## 10. పూరుఁడు - పితృాజ్ఞ.

రహస్య మెంతవఱకు దాఁగును? శర్మిష్ఠా యయాతుల దాంపత్య రహస్యము కొంత కాలమునకు దేవయానికిఁ దెలిసి పోయినది. యయాతి రూపమును బోలిన తేజోవంతులగు శర్మిష్ఠ కొడుకులను జూచి దేవయాని మీతల్లిదండ్రు లెవ్వని

యడిగెను. వారు ప్రేక్ష్యలో యయాతి శర్మిష్ఠను జూపిరి. శర్మిష్ఠ యదృష్టమునకుఁ గన్యకా నివహంబంతయు సంతసించునది. దేవయాని దుఃఖించినది. తనతండ్రి నాదన్న పని పతి చేయుటచే నామెకుఁ బట్టరాని యాగ్రహము పొడమినది. ఈర్ష్యాస్వభావుల కంటెఱుఁగు సమానులేరుగా! దుఃఖాతిశయమునకుఁ గలిగిన కోపముచేతఁ బతి యెంత ప్రతిమాలినను వినక శుక్రునకంతయు నెఱింగింప వలయునని దేవయాని బయలుదేరెను. కూతుమాటలువిని ముక్కోపియైన శుక్రుండు తన్నేమిచేయునో యను భయంబున యయాతియు నామె వెంటనేగెను.

మాయలమారియైన దేవయాని ఘొల్లున 'నేడ్చుచుఁ దండ్రి పాదములపైఁబడి శర్మిష్ఠను బరిగ్రహించి పతి తనకుఁ జేసిన యవమానమును జెప్పివేసెను. మహాకోపియైనశుక్రుండు తనకుఁ బ్రొక్కియున్న యయాతినేమియు ననకయే 'నీవు యౌవనగర్వంబున నాకూఁతున కప్రియంబు చేసితివి. కావున జరాభారపీడితుఁడవు గ'మ్మని శపించెను. శాపతప్తుఁడై రాజు గడగడ వడకుచు "మహాత్మా! ప్రాణత్యాగమునకు సిద్ధపడిన శర్మిష్ఠను మృత్యువునుండి తప్పించుటకై నేను మీకిట్టి యప్రియంబు గావింపవలసి వచ్చినది. అనాథ ప్రాణరక్షణము మా క్షత్రియుల ధర్మమని మీ నీతిశాస్త్రమునందున్నయెడల నన్ను క్షమించి శాపమును మఱలింపుఁడు.

తరుణవయస్కుఁడగు నేను ముసలితనమును భరింపఁజాలను. దేవయానితో సకల భోగముల ననుభవించు నాసక్తియు నాకింకను దీరలేదు.” అని కావ్యునిఁ బ్రార్థించెను. వానికి శుక్రుండు కరుణించి “ నీముదిమి నీకొడుకులయం దొక్కని కియుంబెట్టి, వాని జవ్వనంబు నీవుగొని రాజ్యసుఖంబు ననుభవింపుము. భోగసంప్రాప్తినొందిన పిమ్మట వాని జవ్వనము వానికిచ్చి నీముదిమి నీవు గైకొనుము. ఇట్లిచ్చువాఁడు నీ ముదిమి దాల్చునో వాఁడె రాజ్యమున కర్హుఁడగును, వంశకర్తయునగు” నని పలికెను.

యయాతియు సంతసించి దేవయాని సమేతుఁడై తన పురంబునకు వచ్చెను. శుక్రుశాపంబున ముదిమి వాని నావేశించినది. తల నఱఁకఁ బొడఁగెను. ఇంద్రియములు పటుత్వము తప్పెను. అవయవములు బలహీనములయ్యెను. శరీరము ముడుతలు వడెను. దగ్గు వగర్పు ప్రారంభించెను. పాపము సుందరాకారుఁడైన యారాజు ముదిమిచే మిక్కిలి వికారాకారుఁడై కానవచ్చెను. ఇట్టి రూపముతో నతఁడు తన కొడుకులనెల్ల రావించి, “తనయులారా ! నాకింకను రాజ్యసుఖతృప్తి కలుగకున్నది. కావున మీయం దొక్కఁడు నాముదిమి నొంది తనజవ్వనంబు నాకీయవలయు”నని యడిగెను. అప్పుడు యదుతుర్వసు ద్రుహ్యానులు తండ్రిం జూచి, “ ముదిమియు రోగంబును దైవవశంబున వచ్చెనేని వాని ననుభవింపక తప్ప

దు గాక ఎఱిఁగి యెఱిఁగి యెంతటి మూర్ఖులైన గోరి చేసు
కొందురా ! వృద్ధుండైనవానిఁ గుబేరునైనను గాంతల
రోయుచుందురు. ఇట్టి భోగబాహ్యమైన జరాభారము
మేమొల్ల" మని తొలఁగిపోయిరి. కోపాతిశయంబున యయాతి
వారల కందఱకుఁ దీవ్రములగు శాపములిచ్చి, యంత
గడగొట్టు వాఁడగు శర్మిష్ఠకుఁ గొడుకగు పూరుని
యడిగెను. అడుగుటయే తడవుగఁ బూరుఁడు నిర్వాదముగఁ
దండ్రియాజ్ఞ దలధరించెను.

యయాతి పూరునకుఁ దన ముదిమినొసంగి నవయౌవ
నుండై వెయ్యేండ్లు రాజ్యభోగములెల్ల ననుభవించి, తృప్తుండై
పూరు జవ్వనంబు వానికిచ్చి, దన జరాభారంబు తానదా
ల్చెను. మఱియు రాజు శుభలగ్నంబున మంత్రి పురోహిత
సామంత పౌరజన సమక్షంబునఁ బితాజ్ఞాపరిపాలకుండైన
పూరుని సింహాపీఠకపైఁ గూర్చుండబెట్టి సకల సామ్రాజ్యము
నకును బట్టభద్రునిఁ గావించెను.

క. తనయుండు తల్లిదండ్రులు
పనిచినపని సేయఁడేని బలు కెరలోఁ జే
కొనఁడేని వాఁడు తనయుం
డనఁబడునే పితృధనమున కర్హుండగునే !

# 11. శకుంతల - పతిభక్తి.

పూర్వము విశ్వామిత్రుఁడు జగములకు భయంకరముగ నతి ఘోర తపమును గావింపఁ జొచ్చెను. ఆ తీవ్ర తపము నుండి వెడలిన మహాగ్నిజ్వాలలు దేవలోకమునకుఁ గూడ వ్యాపింప సాగినవి. అందువలన దేవతలును భయకంపితులైరి. ఇంద్రుఁడు తన యింద్రత్వమునకు విశ్వామిత్రుఁ డెట్టి భంగము దలపెట్టునో యని భయపడి, తత్తపోవిఘ్నము గావించుటకు నిశ్చయించుకొనెను. అప్సరోగణమునం దసమాన సౌందర్యవతియగు మేనక యీ కార్యమునందు నియోగింపఁబడినది. మహేంద్రుని యాజ్ఞచొప్పున మేనక భూమండలమునకు వచ్చి విశ్వామిత్రుని యాశ్రమమున సంచరించుచుండ నా రాజర్షి యామెనుజూచి వికలచిత్తుడై మోహించెను. మేనకయుఁ దపస్సమాధినుండి వాని చిత్తమును మఱలించి కొంతకాలము వానికడనే యుండెను. ఆకాలములో వారికొక యాఁడుశిశువు జన్మించెను. మేనక యా శిశువును మాలినీ నదీతీరంబునఁ బడవైచి తాను దేవలోకమునకుఁ బోయెను. విశ్వామిత్రుండును దపంబునకుం జనియె.

కణ్వుఁడను నొకమహర్షి శిష్యగణముతోఁ బుష్పఫలాదులకై పోవుచు నదియొడ్డునఁబడి యేడ్చుచుండిన యాబాలికం జూచెను. అతఁడు చూచుసరి కాశిశువు శకుంతల పక్షులచే

సంరక్షింపఁబడుచుండెను. అందుచేఁ గణ్వుఁడామె శకుంతల యను పేరిడి తన యాశ్రమమునకుఁ గొనివచ్చి పెంచి పెద్ద దానిని జేసెను. శకుంతలకు సంపూర్ణ యౌవనము వచ్చినది. కణ్వుఁడామెను గన్న కూఁతుకంటె నల్లారుముద్దుగఁ బ్రేమించి పెంచిన వాఁడగుటచే, శకుంతల నిరంతరానంద భరితయై కల కల లాడుచుఁ దన సౌందర్యాతిశయమున సాక్షా ద్వనలక్ష్మి వలెఁ దోచుచుండెను. రూపగుణ విద్యాసౌందర్యములయందు నాటికన్య లెవ్వరును శకుంతలకు సాటిరారని మహర్షులు నిరంతర మామెను బ్రశంసించుచుందురు.

ఇట్లు దినములు గడచుచుండ నొకనాఁడు దుష్యంతుఁ డను నొకమహారాజు వేఁటాడిపోవుచుఁ గణ్వమహర్షిని సందర్శింపవలెనని వాని యాశ్రమమునకు వచ్చెను. అప్పుడు కణ్వుఁ డాశ్రమమున లేఁడు. శకుంతల వాని కతిథిసత్కారము గావించినది. దుష్యంతుఁడు జగన్మోహినియైన శకుంతలంజూచి మునికన్య లింతటి సౌందర్యవంతులా యని విస్మయపడుచుండెను. ఆమెను జేపట్టవలెనను కుతూహలము పుట్టెనుగాని శకుంతల నిజముగఁ గణ్వుని కూఁతురేయైనచో దానట్టి తలంపు తలంపరాదనియెంచి రాజామె యథార్థచరితంబును దెలియఁగోరెను. శకుంతలయు దుష్యంతునియం దనురాగము గలిగి తన జన్మవృత్తాంతము నెఱిఁగించెను. రాజెంతయుసంతసించి తానవశ్యముగఁ గోరఁదగినదని యెంచి "సుందరీ! నీవీమునిపల్లె నుండ

నేల ? నీరూపలావణ్యములకు వల్కలాజినములు నీవన్యఫలాహారములు నీకుటీరావాసములు నుచితములుగావు. నాకుభార్యవై సమస్తరాజ్య సుఖంబులు ననుభవింపు" మని ప్రార్థించెను. శకుంతల లజ్జచే మొగమును వంచుకొని "ధర్మస్వరూపులును గుణధాములునగు మాతండ్రిగారిప్పుడే వచ్చెదరు. వారు వచ్చి యిచ్చిరేని నన్నుఁ బాణిగ్రహణము చేసికొనవచ్చును" అని బదులు చెప్పెను. అదివిని దుష్యంతుఁడు "శకుంతలా! నీవన్నది నిజమేయైనను వరనిర్ణయంబునఁ గన్యకు స్వాతంత్ర్యముగలదు. మఱియు నెనిమిది వివాహములలో గాంధర్వవివాహము క్షత్రియులకు ధర్మయుక్తమైనది. ఈ వివాహములకు మంత్రము లక్కరలేదు. కావున మన మిప్పుడు గాంధర్వవిధినిఁ బెండ్లాడుదము."

శకుంతలయు దాని కంగీకరించి తనకుఁ బుట్టు కుమారుని యౌవరాజ్యమునకుఁ, బట్టభద్రునిఁ జేయవలయునని వరముకోరినది. దుష్యంతుఁ డత్యంత సంతోషముతో నావరమొసంగి శకుంతలను భార్యగాఁ బడసెను. మహారాజైన దుష్యంతునిఁ బతిగాఁబడసి శకుంతలయు మహానంద పరవశయైనది. దుష్యంతుఁడు కొంతవర కామెతో వినోదించి, "సుందరీ! నేనింక బోయివచ్చెదను. కొలఁదిదినములలోనే నామంత్రులను నీతండ్రికడకుఁ బంపి నిన్ను రప్పించుకొందును. విచారింపకు" మని ధైర్యము చెప్పి పురాభిముఖుండై పోయెను.

ఇంతలో కణ్వుఁడాశ్రమమునకు వచ్చెను. కాని శకుంతల మాత్రము పూర్వమువలె నిప్పుడు వాని కట్టెపుల బడలేకుండెను. ఆమె ముఖలక్షణములును మాటలతీరును కణ్వునకు వింతగా దోచినవి. అందుచే నతఁడు దివ్యజ్ఞానమున జరిగిన దంతయు నెఱింగి తన యెడ భయపడుచుండిన శకుంతల కిట్లనియె. "అమ్మా! నీకులగోత్ర సౌందర్యములకు దగిన వరుం గైకొంటివి. నీకు జనించు కుమారుఁడు మహావీరుఁడైన చక్రవర్తి కాఁగలఁడు. నీవు మిక్కిలి ధన్యురాలవని" పలికెను. శకుంతలకిప్పుడు సంపూర్ణానందము కలిగినది. త్వరలో భర్తను సందర్శింప వలయునను నాతురత తప్ప నామె కెట్టి విచారమును లేదు. ప్రతిదినము నామె పతిపంపు మనుష్యులకొఱ కెదురు చూచుచుండెను. కాని యేమి ప్రయోజనము! దినములు, వారములు, నెలలు, సంవత్సరములు గూడ గడచినవి. పతికడనుండి యామె కెట్టి వార్తయు రాలేదు.

దుష్యంతుఁ డేగిన తర్వాత శకుంతల గర్భిణియై యత్యధిక తేజోవంతుఁడైన కుమారుం గాంచెను. వాఁడతిబాల్యముననే మహాబలవంతుఁడై యడవులలోని బెబ్బులులను మదపుటేనుఁగులను బట్టి కట్టుచుండుటచే, మహర్షులెల్లరు వానికి సర్వదమనుఁడని పేరుపెట్టిరి. చక్రవర్తిలక్షణములుగల కుమారుం గాంచిన సంతోషము లేశమును లేక శకుంతల చింతాకులచిత్తయై పాపము పతికొఱకు బరితపించుచుండెను. సంవత్సర

ములు గడచినను భర్త తన్నుఁ దలఁపోయకుండుట యాత్యాశ్చర్యముగఁ దోఁచినది. కణ్వుఁడామె చిత్తవృత్తిని గనిపెట్టి, తల్లీ ? నీవిట్లు కుమిలింపనేల ? నాశిష్యులు నీకుఁ దోడుగావచ్చెదరు. కుమారునితోఁ గూడ నీవింకఁ బతికడకేఁగుము." అని సెలవిచ్చెను. శకుంతలయు నందుకు సమ్మతించి ప్రయాణమయ్యెను.

గీ. ఎట్టిసాధ్వులకును బుట్టిన యిండ్లను
పెద్దకాలమునికి దద్దతగదు
పతులకడన యునికి సతులకు ధర్మవు
సతుల కీడు గడయుఁ బతులచూపె.

## 12. దుష్యంతుఁడు - లోకాపవాదభీతి.

సామంత మంత్రిపురోహితప్రముఖులతో దుష్యంతుఁడు నిండుకొలువున నుండఁగా శకుంతల వానిని దర్శించినది. తన్నుఁ జూచినతోడనే తనపతి తనకెదురుగా వచ్చి మహానందముతో గుమారు నందుకొని యెత్తి ముద్దాడి తన్నంతఃపురమునకుఁ దీసికొనిపోవునని యనుకొనుచు శకుంతల కొండంత యాశతో వచ్చినది. కాని యానాఁడు రాజామెం జూచి పలుకరింపనైనలేదు. వానిచూపులును శకుంతలకుఁ గ్రూరముగాఁ దోఁచెను. చక్రవర్తియైన తనభర్త బహుకార్య

ఇంతలో గణ్వుఁడాశ్రమమునకు వచ్చెను. కాని శకుంతల మాత్రము పూర్వమువలె నిప్పుడు వాని కట్టెదుట బడలే కుండెను. ఆమె ముఖలక్షణములును మాటలతీరును గణ్వునకు వింతగా దోచినవి. అందుచే నతఁడు దివ్యజ్ఞానమున జరిగిన దంతయు నెఱింగి తన యెడ భయపడుచుండిన శకుంతల కిట్లనియె. "అమ్మా! నీకులగోత్ర సౌందర్యములకు దగిన వరుం డైకొంటివి. నీకు జనించు కుమారుండు మహావీరుండైన చక్రవర్తి కాఁగలఁడు. నీవు మిక్కిలి ధన్యురాలవని" పలికెను. శకుంతలకిప్పుడు సంపూర్ణానందము కలిగినది. త్వరలో భర్తను సందర్శింప వలయునను నాతురత తప్పనామెకెట్టి విచారము లేదు. ప్రతిదినము నామె పతిపంపు మనుష్యులకొఱకెదురు చూచుచుండెను. కాని యేమి ప్రయోజనము! దినములు, వారములు, నెలలు, సంవత్సరములు గూడ గడచినవి. పతికడనుండి యామెకెట్టి వార్తయు రాలేదు.

దుష్యంతుఁ డేగిన తర్వాత శకుంతల గర్భిణియై యత్యధిక తేజోవంతుఁడైన కుమారుంగాంచెను. వాఁడతిబాల్యము ననే మహాబలవంతుఁడై యడవులలోని బెబ్బులులను మదపు టేనుఁగులను బట్టి కట్టుచుండుటచే, మహర్షులెల్లరు వానికి సర్వదమనుఁడని పేరుపెట్టిరి. చక్రవర్తిలక్షణములుగల కుమారుంగాంచిన సంతోషము లేశమును లేక శకుంతల చింతాకుల చిత్తయై పాపము పతికొఱకు బరితపించుచుండెను. సంవత్సర

ములు గడచినను భర్త తన్నుఁ దలపోయకుండుట యాశ్చర్యముగఁ దోచినది. కణ్వుఁడామె చిత్తవృత్తిని గనిపెట్టి, తల్లీ ? నీవిట్లు దుఃఖింపనేల ? నా శిష్యులు నీకుఁ దోడుగా వచ్చెదరు. కుమారునితోఁ గూడ నీవింకఁ బతికడ కేగుము." అని సెలవిచ్చెను. శకుంతలయు నందుకు సమ్మతించి ప్రయాణ మయ్యెను.

గీ. ఎట్టిసాధ్వులకును బుట్టిన యిండ్లను
నెడ్డ కాలమునికి దద్దతగదు
పతులకడన యునికి సతులకు ధర్మువు
పతుల కీను గడయుఁ బతులచూవె.

---

## 12. దుష్యంతుఁడు - లోకాపవాదభీతి.

సామంత మంత్రిపురోహితప్రముఖులతోఁ దుష్యంతుఁడు నిండుకొలువున నుండఁగా శకుంతల వానిని దర్శించినది. తన్నుఁ జూచినతోడనే తనపతి తన కెదురుగా వచ్చి మహానందముతోఁ గుమారు నందుకొని యెత్తి ముద్దాడి తన్నంతఃపురమునకుఁ దీసికొనిపోవునని యనుకొనుచు శకుంతల కొండంత యాశతో వచ్చినది. కాని యానాఁడు రాజామెం జూచి పలుకరింపనైన లేదు. వానిచూపులును శకుంతలకుఁ గ్రూరముగాఁ దోఁచెను. చక్రవర్తియైన తనభర్త బహు కార్య

మగ్నుఁడగుటచేఁ దన్ను మఱచియుండునని యామె భ్రాంతిపడి నాని కిట్లనియె. "సార్వభౌమా! వేఁటనెపమునఁ గణ్వాశ్రమమునకువచ్చి యందు నీవు నాకొసంగిన వరమును జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము. బాలార్క తేజుఁడైన యీబాలుఁడు నీకొడుకు. వీని కభిషేకముచేసి యువరాజును గావింపుము."

దుష్యంతుఁడా మాటలువిని మూఁగ మొగముతో "నీ వెక్కడిదానవో నే నెఱుఁగను. అసందర్భములాడక యెచ్చట నుండి వచ్చితివో యచ్చటికే పొమ్మ"ని చులకనగా బలికెను. అప్పుడు శకుంతలకుఁ గలిగిన దుఃఖ మెంతని చెప్పఁగలము. ఆ మాటలతో నామెకు శరీరముపై స్మృతియే తప్పిపోయినది. దుఃఖాతిశయమునఁ గన్నులనుండి యెన్నికడవల నీరుగారినదో యామెకుఁ దెలియదు. అతిప్రయత్నముతోఁ దన దుఃఖమును ద్రింగి ద్రింగి, గద్గదపడిన కంఠమును సవరించుకొని, కోపమునచే నెఱ్ఱవడిన కన్నులు తుడుచుకొని ధైర్యము దెచ్చుకొని కొంతసేపునకు శకుంతల సభ్యులువినుచుండ దుష్యంతున కిట్లుపన్యసించెను.

"రాజేంద్రా! ఎఱుఁగనంటివేమి? నీవు న న్నెఱుఁగవా? నన్ను జేపట్టుట యెవ్వరు నెఱుంగరని యిట్లసత్యము పలికినఁ జెల్లుననుకొంటివా? పంచభూతములుఁ జంద్రసూర్యులు నహర్నిశలు వేదములు నంతరాత్మలు నుండ సత్య మెన్నఁడును మఱుఁగుపడనేరదు. నన్నుం గూర్చి నీ యంతరాత్మ నడుగుము. అది యెన్నఁడు నసత్యమాడదు. కణ్వాశ్రమమున

నాథుఁడు నన్నుఁ జేపట్టి నీవు నాకొసంగినవరము నీ కెఱింగింపఁ
గలను. పతివ్రతయు సంతానవతియు నగు సతిని బాధించు
వార్కెతి కిహపరములు లేవు. సార్వభౌమా! పరమార్థమును
గ్రహింపుము. దీపమువలన నొండొకదీపము ప్రభవిల్లునట్లు నీ
యాత్మతనువు. వలన నీపుత్త్రకుఁ డుద్భవిల్లె. కులవిస్తారకుఁడైన
యీ కుమారుఁడు నూరశ్వమేధ యాగంబు లొనరించునని
వీని జనన కాలంబున మహర్షులెల్లరు వినుచుండ గగనము
నుండి సరస్వతి వచించినది. వంశకరుఁడైన పుత్త్రుని నను
కూలవతియైన భార్యను నీవింకఁ బరిగ్రహింపుము. అసత్యము
లాడకుము. అశ్వమేధములు వేయును నొక్క సత్యమును
దూచిన సత్యమే యెక్కుడు తూఁగును. సత్యమునకు మించిన
యుత్తమధర్మము లేదు. మహర్షియైన విశ్వామిత్రునకు దేవ
కాంతయగు మేనకకుఁ బుట్టిన నేను కేవలమానవులవలె నసత్య
ములాడు దానను గాను. సర్వవిధముల నన్నుం బోలియున్న
నీ కుమారునైనం జూచి నన్ను మన్నింపుము."

శకుంతల యెంతబోధించినను దుష్యంతుని ముఖలక్ష
ణములు మారలేదు. చూపులయందలి కాఠిన్యము బోలేదు.
"నీ వెక్కడ? నేనెక్కడ? నిన్నెన్నఁడును జూచియే యెఱుంగను.
నీ యవివేకప్రసంగములకు సభ్యులెల్లరు నవ్వుచున్నారు.
ఇఁక చాలించి యిందుండి వెడలిపొమ్మని రాజామెను మతింత
తీవ్రముగాఁ బలికెను. పాపము శకుంతల గుండె బాదుకొనుచు

వెక్కి వెక్కి యేడ్చుచు, "నాథా! పుట్టిననాఁడు తల్లిదండ్రు చేతను, నేఁడు నీ చేతను, నొక్కవిధముగా విడువ బడితిని. ఇది తొల్లి నోచిన నోముఫలము. ఇంక దైవమే నాకు శరణం" బనుచు నిరాసతో నందుండి పోవసమకట్టెను. అప్పుడు సభ్యు లెల్లరు నత్యాశ్చర్య మొందునట్లుగ, "శకుంతల సత్యము పలికెను. ఈకుమారుఁడు నీకును శకుంతలకును జనించినవాఁడు. వీనిని భరింపుము. ఈమహాసాధ్విని బరిగ్రహింపు" మని యాకాశవాణి బిగ్గఱగా వినవచ్చెను. ఎల్లవారును శకుంతల మహాసాధ్వి యని కొనియాడుచు దుష్యంతునివంకఁ జూడ సాగిరి. అప్పుడు దుష్యంతుఁడు సభ్యులనుద్దేశించి, "నేను శకుంతలం జేపట్టుట యన్యులెఱుంగరు. ఆకారణంబున లోకాపవాదంబునకు వెఱచి నేనిట్లు గావించితిని. ఆకాశవాణివలన మీకెల్లరకు యథార్థము స్పష్టమైన" దని పలుకుచు నత్యానురాగంబునఁ దటాలునఁ గొడుకు నెత్తుకొని, అతిగౌరవంబున శకుంతలను సంభావించెను.

ఇట్లు తండ్రిచే భరింపబడిన వాఁడగుటచే శకుంతలా కుమారునకు భరతుఁడను నామమయ్యెను. దుష్యంతుఁడు భరతున కానాఁడే యౌవరాజ్యమునకుఁ బట్టభద్రునిఁ గావించెను.

క. సంతతగృహమేధి ఫలం
బంతయుఁ బడయంగనోపు ననుగుణభార్యా
వంతుండగువాఁడు క్రియా
వంతుఁడు దాంతుండు పుత్రవంతుండు నగున్.

---

# 13. భీష్ముఁడు - బ్రహ్మచర్య వ్రతము.

పూర్వ మొకప్పుడు గంగాదేవి మానవకన్యకయై వచ్చి, హస్తినాపురమునకు రాజైన శంతనుని వివాహమాడెను. ఆ దంపతులకు దేవవ్రతుండను మహావీరుఁడైన కుమారుఁడు జనించెను. అంతటితో మానవరూపమును జాలించి, గంగ నిజరూపము దాల్చుటకు నిశ్చయించి, శంతను నొప్పించి, కుమారునిఁగూడ దనతోడనే తీసికొనిపోయెను. దేవవ్రతుఁడు గంగాదేవి సంరక్షణమునఁ బెరుగుచు సకల శాస్త్రములు నభ్యసించి, యందు, విలువిద్యయం దాకాలపు వీరులలో నగ్రగణ్యుండయ్యెను. శంతనుఁ డొకనాఁడు గంగయొడ్డున విలువిద్య నభ్యసించుచుండిన దేవవ్రతునిఁజూచి, తనకుమారుఁడని యెఱుఁగక, బాల్యముననే యింతటి మహావీరుఁడైన యీ రాజపుత్రుఁ డెవ్వఁడోయని యత్యాశ్చర్యము బొందసాగెను. అప్పుడు గంగ వానికి బ్రత్యక్షమై "మహీనాథా! వీఁడు నీ కుమారుఁడైన దేవవ్రతుఁడు. వసిష్ఠమహర్షితో సమస్తవేదములను నభ్యసించినాఁడు. సకల శాస్త్రములయందును శుక్ర బృహస్పతులకుఁ దక్కువ కాఁడు. అస్త్రవిద్యయందుఁ బరశు రామునివంటి దక్షుఁడు. ఇంక వీనిం గొనిపోయి యౌవరాజ్యమునకుఁ బట్టభద్రుం జేయుము." అని పలికి మాయమయ్యెను.

శంతనుఁడు మహానంద భరితుఁడై పురంబునకు వచ్చి, సకలసామంత మంత్రిపురోహిత ముఖ్యుల సమక్షమున గాంగేయుని యువరాజుగాఁ జేసెను. సమస్త సద్గుణ సంపన్నుఁడైన యట్టి పుత్రునిఁ బడయఁగల్గిన యానందముచే శంతనుఁడు నాలుగు సంవత్సరములు రాజ్యవ్యాపారములు విడిచి, నిత్యము కొడుకుతోడనే వినోదించుచుఁ గడపెను. ఇట్లుండ నొకనాఁడు శంతనుఁడు యమునాతీరంబున విహరించుచు, యమునలో నోడ నడపుచుండిన యొక కన్యారత్నమును జూచెను. తోడనే యామెను భార్యగా, బడయవలయునని వాని కనురాగము గలిగినది. కలిగినంతనే రాజాకన్యను సమీపించి, సుందరీ! ఎవ్వరిదానవు? ఇయ్యమునానదియందోడ నడపుచుండుటకుఁ గారణంబే"మని యడిగెను. త్రిలోకసుందరియైన యాకన్యక రాజుమాటలకు మందహాసము చేయుచు, "నేనుదాశరాజునకుఁ గుమారికను. ధర్మార్థముగా నిట్లోడ నడపుచుండుమని మా తండ్రి నన్ను నియోగించెను. నన్ను సత్యవతి యనియు యోజనగంధి యనియు నందు"రని బదులు చెప్పెను.

అప్పుడే శంతనుఁడు రథారూఢుఁడై దాశరాజుకడకుఁ జని తన యభిప్రాయమును వాని కెఱిఁగించెను. దాశరాజమితానంద భరితుఁడై శంతను నత్యంత భక్తితోఁ బూజించి "మహారాజా! కన్యకపుట్టినప్పుడె యితరులసొమ్మయినది. అందు నీవంటి మహనీయుఁడైన రాజుకోరి యడిగినప్పుడు నాకింత

కంటె సంతోష మింకేమున్నది ? సత్యవతిని నీకొసంగుటలో నాకెట్టి యభ్యంతరమును లేదు. కాని యీకన్యకు నీవు ధర్మపత్నిగాఁ బడయనెంచితివేని నేను గోరినది నాకనుగ్రహింపవలయు"నని యడిగెను. ఈయడిగిన దానిం దప్పక యిచ్చెదనని శంతనుండును బలికెను. అప్పుడు దాశరాజు "భూపాలా ! ఈకన్యక వలన నీకుబుట్టిన కుమారుఁడు నీయనంతరమును నీరాజ్యమునకు రాజుగావలయు'నని చెప్పెను. పాపము శంతనుఁడు దేవవ్రతునిఁ దలంచి, దాశరాజున కెట్టి ప్రత్యుత్తరమును జెప్పలేక యింటికివచ్చి యెడతెగని విచారముతోఁ గాలము గడుపుచుండెను.

శంతనుని సంతాపమును దేవవ్రతుఁ డొకనాఁడు కనిపెట్టెను. భయభక్తులతోఁ జేతులుజోడించి చెంతకువచ్చెను. వచ్చి, "తండ్రీ ! మీరిట్లు చింతించుటకుఁ గారణంబేమి ? మీచేరక్షింపఁబడుచుండిన రాజ్యమునకు శత్రుభయము గలిగినదా! సామంతరాజులు వశము తప్పిరా ? మీపరితాపంబునకు గారణంబెట్టిదియైనను మీమనోరథమును నెరవేర్చి తీరెద. దయతో నాకాజ్ఞాపింపుమని పలికెను. తోడనే శంతనుఁడు కుమారుం జేరఁదీసి, కౌఁగిలించుకొని, " కుమారా ! నీయట్టి కుమారుఁ డుండ నాకు సంతాపింపనేల ? కాని నీవు నా కేకపుత్రుఁడవు. ఏకపుత్రుంగలవాఁ డపుత్రకుఁడైనట్లే యని ధర్మశాస్త్రంబున విని బహుపుత్రార్థంబు ప్రయత్నింప నిశ్చయించితిని. నీకిష్టమేనా !" యని యడిగెను.

వెంటనే దేవవ్రతుఁడు వృద్ధులైన మంత్రిపురోహితాదులతో నాలోచించి, శంతనుఁడు సత్యవతి యందనురక్తుఁడగుట యెఱిఁగి, సైన్యసమేతుఁడై దాశరాజు కడకేగెను. తన తండ్రి యభీష్టము నెఱింగించెను. దాశరాజు శంతనునకుఁ జెప్పిన ప్రత్యుత్తరమే వానికిని జెప్పెను. అప్పుడు గాంగేయుఁడు దాశరాజును సభ్యులును వినుచుండ, 'ఓ రాజు గారా! మాతండ్రికి హితంబుగా యువరాజునైన నేను నా రాజ్యాధికారమును సత్యవతీ కుమారుని కొఱకు విడుచుచున్నాను. వాఁడే మాకెల్లరకు ప్రభువును వంశకరుఁడునుగాఁ గలఁ"డని గంభీరముగా నుడివెను. సభాసదులెల్లరు సత్యవ్రతుఁడైన దేవవ్రతుని వేనోళ్ళఁ గొనియాడిరి. దాశరాజును సంతసించి, దేవవ్రతా! నీవంటిధర్మజ్ఞుఁడు లేడు. రాజ్యాధికారమును నీవు విడిచినను నీవలెనే నీతనయు లూరకుందురా" యని ప్రశ్నించెను. గాంగేయుఁడు నవ్వుచు వివాహము చేసికొనక నాజీవితంబంతయు బ్రహ్మచర్యవ్రతమునఁ గడపెద" నని ప్రతిజ్ఞ చేసెను. ఇట్లు తండ్రి హితంబు సేయుటకై రాజ్యమును విడుచుటకును, వివాహమును మానుకొనుటకును బ్రతిజ్ఞ చేసిన దేవవ్రతునిపై దేవతలు పుష్పవర్షమును గురియించి భీష్ముండని పొగడిరి. దాశరాజును మిక్కిలి సంతసించి శంతనునకు సత్యవతిని సమర్పించెను.

చ. అనుపమరాజ్యసంపదకు నర్హుఁడు వంశము విస్తరింప నో
పిన సుచరిత్రుఁడీసుతుఁడుభీష్ముకుతొల్లియుదండ్రికింబ్రియం
బనఘుఁడు సేయుచుండి నిఖిలావనిరాజ్యనివర్తనంబునున్
దనరఁగ బ్రహ్మచర్యమును దాల్చె జగద్విదిత ప్రతిజ్ఞుఁడై.

# 14. భీష్ముఁడు-సోదరప్రేమ-ధర్మదీక్ష

శంతనుఁడు సత్యవతిని వివాహమై భీష్ముని యసాధారణప్రజ్ఞను మెచ్చి వానికి స్వచ్ఛందమరణంబుగా వరంబిచ్చెను. సత్యవతియందు వానికిఁ జిత్రాంగదుఁడు విచిత్రవీర్యుఁడు నను నిరువురు పుత్రులు కలిగిరి. కాని యాకుమారులకు యుక్తవయసు రాకుండఁగనే శంతనుఁడు పరలోకమున కేగెను. అప్పటినుండియు భీష్ముఁడే వారలను సంరక్షించుచుండెను. పెద్దవాఁడైన చిత్రాంగదునకు భీష్ముఁడు పట్టాభిషేకముచేసెను. కాని చిత్రాంగదుఁడు యుక్తప్రవర్తనుఁడు గాక యెల్లప్పుడు, బ్రాహ్మణులను దేవతలను గంధర్వులను దూషించుచుండుటచే చిత్రాంగదుఁడను నొకగంధర్వుఁడు భీష్ముఁడు లేనిసమయమున నీచిత్రాంగదుని సంహరించెను. భీష్ముఁడు మిక్కిలి విచారించి తనచిన్నతమ్ముఁడైన విచిత్రవీర్యుని సింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టెను.

విచిత్రవీర్యునకింకను వివాహము కాలేదు. గంగానందనుఁడు తమ్మునిపెండ్లికై పలుప్రయత్నములను నిత్యముఁ జేయుచుండెను. ఇంతలో గాశిరాజు తనకుమార్తెలకు స్వయంవరమును జాటించెనను వార్త వానికిఁ దెలిసినది. గాంగేయుఁడు ధనువునుధరించి రథంబెక్కి యొక్కఁడే స్వయంవరమునాటికి వారణాసీపురంబునకుఁ జనియెను. స్వయంవరమునకు వచ్చిన

రాజకుమారులెల్లరు వింతపడి చూచుచుండ నతఁడు రాజ
కుమారికల ముగ్గురను దనరథంబెక్కించుకొని సింహనాదము
చేసి, "ఓ రాజులారా! నాతమ్మునకు వివాహముసేయుటకై
నేనీకన్యలను బలవంతముగఁ గొనిపోవుచున్నాను. మీరెవరైన
నున్నయెడ నడ్డపడవచ్చు"నని నిర్భయముగాఁ బలికెను. రాజ
వీరులెల్లరు వానిశౌర్యసాహసముల కత్యాశ్చర్యమును బొందిరి.

ఆనాఁడు రాజకుమారులనేకులు యుద్ధరంగమున గంగా
నందను నెదిరించిరి. పర్వతముపై వర్షించు మహావర్షమువలె
భీష్మునిపై ననంతమైన బాణవర్షము కురిసిరి. అతఁడు
లేశమును జలింపక యేకవీరుడై శత్రుసైన్యములనెల్ల నేల
పాలు గావించి రాజవీరులనెల్ల క్షణమాత్రమునఁ దహతహ
లాడించెను. భీష్ముని యుద్ధనైపుణ్యమున కాగలేక హతశేషు
లైన రాజులు పారిపోయిరి. సాల్వుఁడను రాజుమాత్రము యుద్ధ
రంగమునుండి యింకను దొలఁగిపోలేదు. భీష్ముఁడు వాని మొండి
తనమునకుఁ గోపించి మొదట వానిచేతనున్న విల్లుఖండించెను.
పిమ్మట వానిసారథిని గడతేర్చెను. తరువాత గుఱ్ఱములను
గూలచేసెను. అనంతరము రథమును బిప్పిచేసెను. ఇట్లువిల్లు
లేక రథములేక సాల్వుఁడు భగ్నమనోరథుఁడై వెనుకకు
మఱలవలసి వచ్చెను.

రాజచక్రమునెల్ల నోడించి గంగాకుమారుఁడాముగ్గురు
కన్యకలఁ గొనివచ్చి విచిత్రవీర్యునకుఁ బెండ్లిసేయుటకునిశ్చయిం

చెను. అంబయు అంబాలికయు అంబికయు నను నామములు గల యామువ్వురు కన్యలలో నంబకు విచిత్రవీర్యుని వివాహ మాడుట యిష్టములేదు. ఆమె సాల్వుని యిదివరకే వరించినది. అంబ యీసంగతి భీష్మునకు విన్నవించుకొనెను. సాల్వుడు తనకు శత్రువైనను, ధర్మస్వరూపుడైన భీష్ముడు వెంటనే యంబను వానికడకు బంపివేసెను. అంబాలికయు నంబికయు విచిత్రవీర్యునకు భార్యలైరి. వారి వివాహమును భీష్ముడతి వైభవముతో గావించెను. పెండ్లియగుటయె మొదలుగ నన న్యాస సౌందర్యవతులైన యంబాలికాంబికలయందు విచిత్ర వీర్యుడు విపరీత మోహమును వహించి రాజకీయ వ్యవ హారము లన్నిటిని విడిచిపెట్టెను. స్త్రీలోలుడైనవాడెన్న డును బ్రయోజకుడు కాజాలడు. చిరంజీవియు గానేరడు. అతికాముకుడైన విచిత్రవీర్యుడు క్రమక్రమముగా శుష్కించి రోగపీడితుడై కొంతకాలమునకు గాలముచేసెను.

భీష్ముడు వానికి బరలోక క్రియలొనర్చి పుత్ర వియోగమున దుఃఖించుచుండిన సవతితల్లియగు సత్యవతిని బతివిహీనులైన మరదండ్రను నిరంతరము నోదార్చుచుండెను. పాపము సత్యవతి యొకనాడు భీష్ముని జెంతకు బిలిచి వాని కిట్లనియె. "కుమారా! శంతనుని సంతానమును శంతనుని కీర్తియు శంతనుని రాజ్యభారమును నీయందే స్థిరమైనవి. రాజ్యమురాజకమగుటయె గాక యిప్పుడు వంశమంతరించు సమయముకూడ దటస్థించినది. తరతరంబులనుండి వచ్చు

చెందిన యీ కురువంశము నీనాఁడు నీవుండఁగనే నీకన్నుల యెదుట నశించిపోవుట నీకు యశస్కరముకాదు. నీవు సమస్త ధర్మములు నెఱిఁగినవాఁడవు. సవతి తమ్ములను భేదము వహింపక నా కుమారులను బెంచి పెద్దవారింజేసి వంశవిస్తారమునకై నీ చేసిన ప్రయత్నములన్నియు విధివశమున వ్యర్థములైనవి. తండ్రీ! నీవు చిరంజీవివై నీతండ్రి రాజ్యమును వంశమును నుద్ధరింపుము. నీ బ్రహ్మచర్య వ్రతము నింకఁ జాలించి వివాహితుఁడవై సంతానవంతుడవై నీ తేజము దిక్కులఁ బిక్కటిల్ల సామ్రాజ్యమును బరిపాలింపుము.”

భీష్ముఁడామె చెప్పినదంతయు విని నయ వినయంబులతో సత్యవతి కిట్లుత్తరమిచ్చెను. “తల్లీ! మీరు వచించిన దంతయు నిక్కువము. పితృహితంబును గోరి యానాఁడు మాతండ్రి కొలువుకూటమున సకల రాజమండలము వినుచుండఁ జేసిన ప్రతిజ్ఞ నిప్పుడు తప్పుటకంటె నధర్మమే మున్నది? అమ్మా! నన్ను క్షమింపుము.

క. హిమకరుఁడు శైత్యమును న
ర్యముఁడు మహాతేజమును హుతాశనుఁ డుష్ణ
త్వము విడిచిరేని గుర్వా
ర్థమునాచేకొనిన సద్వ్రతంబు విడుతునే ?”

# 15. దీర్ఘతముఁడు-సంసారదుఃఖము.

బాలకులారా! శకుంతల కథవింటిరి. అందు శకుంతల పాతివ్రత్యమహిమను దెలిసికొంటిరి. జరత్కారుఁడు గరుత్మంతుఁడు దేవవ్రతుఁడు మొదలగువారి కథలనువింటిరి. వారి పితృభక్తివిశేషములను దెలిసికొంటిరి. పతులయందు భార్యలకును దండ్రియందు కుమారులకును భయభక్తులు లేకపోవుట నేటికాలమునందువలె నాటికాలమునందు గూడఁగలదనియు నందువలన లోకమునకుఁ గలిగిన యపకార్యమును బ్రస్తుతకథ మీకుఁ దెలుపఁగలదు.

దీర్ఘతముఁడను నొకబ్రాహ్మణుఁడు కలఁడు. అతఁడు సదాచారసంపన్నుఁడు. మహాతపశ్శాలి. దైవభక్తియు వేదాధ్యయనము వాని నిత్యకృత్యములు. పాపమా బ్రాహ్మణుఁడు పుట్టుగ్రుడ్డియగుటచేవానికి దీర్ఘతముఁడను పేరువచ్చినది. అంధుడగుటచే వానికెవ్వరును గన్యకనీయరైరి. ఆకారణమునఁ జాలకాలమువరకు వానికి వివాహముకాలేదు. సహధర్మచారిణియైన భార్యయుండినగాని గృహస్థు గృహస్థధర్మములను జేయుటకుఁ బనికిరాఁడు. భార్యయుండినఁగాని సంతానవంతుఁడునుగాఁజాలఁడు. సంతానవంతుఁడు కానియెడల వాని పితృదేవతలు తరింపలేరు. ఈ కారణముల వలన దీర్ఘతముఁడు వివాహప్రయత్నములను మానక చిరకాలము బహుప్రయ

త్నములుచేసి ప్రద్వేషిణీయను నొకకన్యకను భార్యగాఁబడయ
గల్గెను. దీర్ఘతముఁడామెను వివాహమాడిన కొంతకాలమున
కాదంపతులకు గౌతముఁడు మొదలగుపుత్రులు జన్మించిరి.

ప్రద్వేషిణికాపురమునకు వచ్చినదిమొదలు దీర్ఘతమునకు మనశ్శాంతి లేదు. వాని జపతపములును నన్నగిలినవి. మిక్కిలి ద్వేషబుద్ధిగలదగుటచే నామెకు ప్రద్వేషియనునది సార్థకనామము పతియంధుఁడయినచో భార్య సమస్తోపచారములును జేయవలసియుండ నాప్రద్వేషిణి భర్తకు సేవసేయనొల్లక ప్రతివిషయమునందును విసుగుకొనుచు గేకలువేయుచు నిందించుచుఁ బాపమాబ్రాహ్మణుని నిత్యమును బెట్టరాని బాధలు పెట్టుచుండెను. భార్య గయ్యాళియైనచో సంసారముకంటె నరకములేదు. భార్యయనుకూలవతియు విద్యావతియునైనచో సంసారముకంటె స్వర్గములేదు. తల్లిననుసరించి గౌతమాదులైన తనయులుగూడ దీర్ఘతమునకు ననుకూలురు కాకపోయిరి. వారందఱును యుక్తప్రవర్తనలఁ గావింపవలయునని దీర్ఘతముఁడనేక ధర్మోపన్యాసముల నిచ్చుచుండెను. కాని వారి చెవులకెక్కలేదు.

ఒకనాడయ్యంధుఁడు ప్రద్వేషిణికిఁ బతివ్రతాధర్మము నుపదేశించుచుండఁగా నామూర్ఖురాలు చెంతనున్న యోగదండముతో వానివీపుపై వేసి "ఓరీ పశువా! నిర్గుణ్ణిబ్రదుకునకు దొంగ నొకరికి బుద్ధులుగూడఁ జెప్పవలయునా! చచ్చినట్లు పడియుండక యూరక ప్రేలెదవేమి? నీపాటిధర్మము లెఱుఁగని

నా కెవ్వరు నిచ్చుటలేరు. పతిచే భరింపఁబడునది గావున "భార్య" యయ్యెననియు; భార్యను భరియించువాఁడు గావున 'భర్త' యయ్యెననియుఁ జెప్పుచున్నవాఁడవు. నీసంగతి నాలోచించి కొంటివా? గ్రుడ్డివాఁడవగు నిన్ను నేను భరించుచున్నాను. కాని నన్ను నీవు భరింపలేవు. నాకెట్లు భర్తవయ్యెదవు? నీచే భరింపఁబడకుండ నేను భార్య నెట్లయ్యెదను? అందుచే నీవు భర్తవు కావు. నేను భార్యనుగాను. తక్షణమే నా యిల్లు విడిచి పొ"మ్మని మఱల వాని వీపుపై నొకటి వేసెను. ఆదౌర్జన్యమును జూచుచుండియుఁ గుమారు లెవ్వరును దల్లిని వారింపరైరి. ఇల్లు విడచిపొమ్మని ప్రద్వేషిణి మరల మరల గద్దించి పలికెను. కాని పాపమంధుఁ డెందుఁ బోఁ గలఁడు? అప్పుడా గయ్యాళి యాజ్ఞప్రకారము నిర్దయులైన గౌతమాదులు తండ్రి కరచరణములు కట్టి మోసికొనిపోయి గంగలోఁ బారవైచిరి.

ఒక్క ప్రద్వేషిణి కారణమున దీర్ఘతముఁడు స్త్రీలందఱ యందును గూడ ననసూయయు నాగ్రహమును వహించి యిట్లు శపించెను.

క. పతిహీనలైన భామిను
లతిధనవతులయ్యుఁ గులజలయ్యును సకలా
కృతలయ్యుఁ మాంగల్య ర
హితలయ్యెడు గృపణవృత్తి నిదియు మొదలుగాన్.

# మాండవ్యుఁడు - హింసాఫలము.

పూర్వము మాండవ్యుఁడను బ్రహ్మర్షి మహీమండలం బెల్లఁ దానొక్కఁడె సంచరించి సమస్త పుణ్యతీర్థంబులను సేవించెను పుణ్యతీర్థములన్నియును సేవించిన తరువాత నతఁడొక చోట నిశ్చలముగఁ దపము చేసికొనుటకు నిశ్చయించెను. ఒక యరణ్యమునం దాశ్రమమును గట్టుకొనెను. ఆయాశ్రమా రణ్యమునకుఁ గొలదిదూరముననే యొకపట్టణముకూడనున్నది. మాండవ్యుఁడొక చెట్టుక్రిందఁ గూర్చుండి యూర్ధ్వబాహుఁడై మౌనవ్రతంబును వహించి నిశ్చలముగాఁ దపస్సు ప్రారంభించెను.

ఇట్లుండ నొకనాఁడా సమీపముననున్న పట్టణములోఁ జౌర్యముజరిగినది. చోరులు రాజుగారి ద్రవ్యమును నపహరించి పారిపోయిరి. రాజభటులు వారినిఁ బట్టుకొనుటకుఁ బలువురు పలుదిక్కులవెదక నారంభించిరి. ఆవెదకువారిలో నొకగుంపు రాజభటులుమాండవ్యాశ్రమమువైపు వచ్చిరి. ఆచుట్టుప్రక్కలన్నియువెదకిరి. దొంగలు కానరాలేదు. అప్పుడువారు మాండవ్యునిసమీపించి, "అయ్యా! రాజధనము నపహరించినచోరులీ ప్రాంతమునకువచ్చినట్లున్నది. వారేవైపునకుఁబోయిరో మీరు చూచినయెడల మాకుఁజెప్పుఁడనియడిగిరి. కానిమాండవ్యుఁడు మౌనవ్రతుండగుటచే రాజభటుల కేమియుఁ బ్రత్యుత్తరమీ

యు లేదు. ఇంతలో నయ్యాశ్రమములోపల మనుష్యుల యలి
జడి వారికిఁ దోచినది. వెంటనే రాజభటు లనుమానించి, కత్తుల
నవలంబించుకొని చప్పుడు చేయకుండ మెల్లఁగా నాశ్రమములోఁ
బ్రవేశించిరి. ప్రవేశించుటయే తడవుగ ధనముతో దొంగలు
వారికంటఁబడిరి. తక్షణమే రాజభటులు వారిం బట్టి కట్టి
ద్రవ్యమును భద్రపఱచి మాండవ్యుఁడే దొంగలకు ముఖ్య
గాఁడై యిట్లు దొంగతనము చేయుచు మాటాడకున్నాఁడని
నిశ్చయించుకొనిరి.

రాజభటులు దొంగలతో మాండవ్యునిఁగూడ రాజ
సభకుఁ దీసికొనిపోయిరి. జరిగినదంతయు రాజునకు విన్నవించిరి.
మాండవ్యుఁడు మాటాడకుండుటయు, వాని యాశ్రమము
నందే ధనముతోఁగూడ దొంగలు పట్టుపడుటయు రాజునకుఁ
గూడ ననుమానము కలిగించినవి. ఆకారణమున రాజు చోరు
లకు మరణదండనము విధించి, పట్టణము వెలుపల మాండవ్యు
నొక శూలమునకు గ్రుచ్చివేయుఁడని యాజ్ఞాపించెను. వాని
యాజ్ఞానుసారముగఁ జోరులు సంహరింపఁబడిరి. మాండవ్యుఁడు
శూలమునకు గ్రుచ్చఁబడెను. కాని మహాతపశ్శాలి యగు
వానికందువలన లేశమును బాధ కలుగలేదు. ఆశూలముపై
నతఁడు పూర్వమువలెనే నిశ్చలముగాఁ దపము చేసుకొను
చుండెను. ఇట్లు పెక్కుదినములు గడచినవి. మాసములును
గడచినవి. కావలివారు రాజుకడ కేగి నిరాహారుఁడై యా

ముని యింకను జీవించియే యున్నాడని రాజునకుఁ దెలిపిరి. వానియునికి రాజునకును మహాశ్చర్యము కలిగించినది. అతఁడు దొంగకాఁడేమో యని యప్పుడు స్ఫురించినది. ఇంకను వానిని బరీక్షించి రండని రాజు భటుల నియోగించెను.

కొంతకాలమైన తరువాతఁ గొందఱు మహర్షులా దారినేగుచు శరీరదుఃఖమును దలంపక తపస్సమాధియందున్న మాండవ్యునిఁగని నమస్కరించి "మహాత్మా! ఇట్టి మహాతపస్వివయిన నీకిట్టి దుఃఖమును గావించిన వారెవ్వ"రని యడిగిరి. మాండవ్యుఁడు కన్నులువిప్పిచూచి నవ్వుచు, మహర్షులారా! ఎవ్వరని యడుగనేల? సుఖదుఃఖములు కర్మవశమునఁ గలుగుచుండును. అందుచే నెవరికష్టసుఖములకు వారే కర్తలుగాని యితరులు కానేర"రని చెప్పి మఱలఁ గన్నులు మూసికొనెను. మహర్షులరాకయు వారి సంభాషణమును గూడఁ గావలివారు రాజునకుఁజెప్పిరి. అప్పుడు రాజు పరివారముతో వచ్చి, మాండవ్యునకు నమస్కరించి, "మహాత్మా! నేను జేసిన యజ్ఞానమును సహింపుము. నన్ను క్షమింపు" మని ప్రార్థింపసాగెను. "రాజా! నీవిధి నీవు నిర్వహించితివి. నీవలన దోషములే" దని మాండవ్యుఁడు వాని ననుగ్రహించెను. రాజు వానిని శూలమునుండి తప్పించెనుగాని, శూలాగ్రమునఁ జిన్నముక్కవిరిగి వానికంఠమునందుండి పోయినది. అందుచే నాముని యణిమాండవ్యుఁడను పేరు వహించెను. పిమ్మటమాండవ్యుఁడు తన

తపఃశ్శక్తిచే యమునకేగి యమునింజూచి, "నేనేమి పాపము చేసితిని? నాకిట్టి దారుణదండన మేలకలిగించితివో చెప్పు"మని యడిగెను. యముఁడు మాండవ్యునకిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

క. సాలయక తూనిఁగల గొ
ఱ్ఱులఁ బెట్టితి నీవు నీచిఱుత కాలము ద
త్ఫలమిప్పు డనుభవింపక
తొలఁగునె హింసాపరులకు దుఃఖప్రాప్తుల్.

---

# 17. పాండురాజు - దుర్వ్యసనము.

సత్యవతి యెంత ప్రార్థించినను భీష్ముఁడు వివాహము చేసికొనుటకును సంతానముఁ బడయుటకును నంగీకరింపలేదని మీరు విన్నారుకదా? తరువాత నేమైనదో వినుఁడు. చిత్రాంగద విచిత్రవీర్యులు మరణించిన పిమ్మటఁ గౌరవవంశము నిరాధారమైనది. రాజ్యమరాజ్యకమైనది. అప్పుడు భీష్ముని యనుమతంబున సత్యవతి భక్తితో వ్యాసమహర్షిని స్మరించెను. వ్యాసుఁడు సామాన్యఋషి మాత్రుఁడు కాడు. అతఁడు భగవంతుఁడైన శ్రీకృష్ణుని యవతారమని దేవతలుఁగూడ వానిని బూజించుచుండెడివారు. వ్యాసుఁడు ప్రత్యక్షమైనంతనే సత్యవతి కురుకులమునకును గురురాజ్యమునకును దటస్థించిన విపత్తు

వానికెఱిఁగించెను. అప్పుడు భగవంతుఁడైన వ్యాసుఁ డనుగ్రహించి "అంబికాంబాలికలు పవిత్రచిత్తలై నేను జెప్పినట్లొక సంవత్సర మొక వ్రత మతిదీక్షతోఁ గావించినచో వారికిఁ బుత్రోత్పత్తి యగు" నని పలికెను. వ్యాసమహర్షి చెప్పిన చొప్పున నంబికాంబాలిక లావ్రతము నాచరించిరి. అంబికకు ధృతరాష్ట్రుఁడును, నంబాలికకుఁ బాండురాజును జన్మించిరి. అందు ధృతరాష్ట్రుఁడు పుట్టుగ్రుడ్డి.

భీష్ముని పోషణంబున వారిరువురును దినదిన ప్రవర్ధమానులై పెరిగిరి. సమస్తవిద్యలనభ్యసించిరి. విలువిద్యయందు బాండురాజు భీష్మునియంతవాఁ డయ్యెను. వారికివివాహములు గూడ జరిగెనవి. గాంధారదేశాధిపుఁడైన సుబలుని కూఁతురగు గాంధారిని ధృతరాష్ట్రుఁడు పెండ్లాడెను. కుంతిభోజునికన్యయైన కుంతిని, మద్రరాజుకూఁతురైన మాద్రినిఁ బాండురాజు వివాహమయ్యెను. గాంగేయుని సాహాయ్యమున ధృతరాష్ట్రుఁడు సింహాసనము నెక్కి రాజ్య పరిపాలనము సేయుచుండెను. పాండురాజు భూమండలమునఁగల రాజులనందఱ జయించి, ధన కనక వస్తు వాహనాదులను గొల్లకొలఁది గప్పములుగా గ్రహించి ధృతరాష్ట్రునకు సమర్పించుచుండెను. వాని పరాక్రమమునకు దిగ్విజయమునకును, సత్యవతియు, భీష్ముఁడును దల్లులు మొదలగువారెల్లరు మహానందభరితులై పాండురాజు ననేకవిధంబుల శ్లాఘించిరి. పాండురాజు తెచ్చిన ధనరాసులతో

ధృతరాష్ట్రుఁడు నూరశ్వమేధయజ్ఞములు చేసెను. బ్రాహ్మణులకు గొప్పగొప్ప దక్షిణలీయఁబడినవి. దీనులు, బంధులు మొదలగు దిక్కులేనివారికిఁ దగిన సంరక్షణము చేయఁబడినవి. క్షామచోరవ్యాధిభయములు లేక రాజ్యమంతయు రామరాజ్యమువలె సకలైశ్వర్యములతోఁ దులఁదూగుచుండెను.

ఇంకఁ జేయవలసిన పనులేమియు లేనందునఁ బాండురాజు మృగయావ్యసనమునఁ జిక్కుబడెను. రేయుంబవళ్లు వేటతప్ప వానికి మఱియొక యుద్యమము లేదు. ఎంతటివాఁడైన దుర్వ్యసనములందుఁ జిక్కుకొనరాదు. దుర్వ్యసనములవలనఁ బెక్కనర్థములు కలుగును. పాండురాజది గుర్తింపక నిరంతరము నరణ్యములయందే నివసింపసాగెను. ధృతరాష్ట్రుఁడు వానికిఁ గావలసిన యిష్టాన్నపానభూషణాంబరాదు లన్నియుఁ బట్టణమునుండి వానికిఁ బంపించుచుండెను. ఇట్లు దినములు గడుపుచుండ నొకనాటి వేటయందుఁ బాండురాజున కొక్క మృగమైనఁ జిక్కలేదు. పెక్కు మృగముల వెంటఁ బడెనేమియు నొక్క మృగమునైనఁ బడవేయకుండుటచే వానికిఁ గోపమువచ్చినది. ఆకోపముతోఁ బట్టుదలయు గలిగినది. ఆ పట్టుదలవలన వానికి యుక్తాయుక్త విచక్షణజ్ఞానముపోయినది. ఒక యాఁడులేడియు ఒకమగలేడియు నత్యంత సంతోషముతో నొకచోట వినోదించుచుండఁగా బాండురాజు కఠినచిత్తుఁడై యా రెండింటిని నైదు బాణములతో నేలఁగూల్చెను.

ఆలేడి దంపతులలో నాఁడులేడి వెంటనే ప్రాణములు విడిచెను. మగలేడిమాత్రము కొంచెము కొనయూపిరితోనుండి పాండురాజుంజూచి, " ఓయీ! నేను గిందముఁడను మహార్షిని. విలాసార్థము నాభార్యతోఁ గూడ నీమృగరూపమును ధరించి యిచ్చట వినోదించుచున్నాను. మృగములను జంపి జీవించు కిరాతుఁడైనను బరువెత్తలేని వానిని, ప్రసవసమయమందున్న వానిని, వినోదించుచున్నవానిని నెన్నఁడును సంహరింపఁడు. నీవింత కఠినచిత్తుఁడ వైతివేల? ఇఁకమీఁద నీ వెన్నఁడైన భార్యావినోదము నొందితివేని తక్షణము మృతుండ వయ్యెద' వని శపించెను.

క. ఎట్టి విశిష్టకులంబునఁ
బుట్టియు సదసద్వివేకములు గల్గియు మున్
గట్టిన కర్మఫలంబులు
నెట్టన భోగింపకుండ నేర్తురె మనుజుల్.

---

## 18. కుంతి - మంత్రప్రభావము.

శాపతప్తుండైన పాండురాజుతోఁ బాటు వాని భార్యలైన కుంతియు మాద్రియుఁగూడ మిక్కిలి దుఃఖింపసాగిరి. వేటయందే కాక భార్యలయందును భోగములయందును రాజ్య

మునందునుగూడఁ బాండు రాజునకు విరక్తికలిగినది. అందుచే నతఁడు తన జీవిత శేషమును దపస్సుతోఁ గడపవలయునని నిశ్చయము చేసికొని పట్టణమునకుఁబొమ్మని భార్యలకు సెల విచ్చెను. కాని మహాపతివ్రతలైన కుంతీమాద్రులు భర్తను విడిచిపెట్టలేరు. అందుచేఁ బాండురాజు వారియునికికి సమ్మతింపక తీరదయ్యెను. అప్పటికిఁ దనయొద్ద సిద్ధముగనున్న ధన ధాన్యరాసులను బ్రాహ్మణులకు దానముచేసి యతఁడు మిగిలిన వస్తువులను బరివారమును ధృతరాష్ట్రునికడకుఁ బంపివేసెను. వారుమువ్వురును వల్కలములు ధరించిరి. శతశృంగమను పర్వతముపై సత్యవ్రతములతోఁ దపము మొదలిడిరి.

ఒకనాఁడు పాండురాజు దేవతలతోఁగూడ దేవలోకమునకుఁబోవుచు వచ్చుచున్న కొందఱుమహామునులనుగాంచెను. మీరెందుఁ బోవుచున్నారని యడిగెను. 'నేడమావాస్యయగుటచే మహర్షులందఱు బ్రహ్మనుబూజించుటకై పోవుచున్నా' రని వారు చెప్పిరి. తోడనే పాండురాజుగూడ భార్యలతో బయలుదేరుట కుద్యుక్తుఁడగుచుండ ఋషులు వానిని రాఁగూడదని వారించిరి. అపుత్రకులైనవారికిస్వర్గద్వారంబు తెఱవబడదనుసంగతి నెఱింగినవాఁడగుటచేఁ బాండురాజువిచారించి మహర్షుల ప్రోత్సాహమున ధైర్యము వహించి, సంతతియు సంతతివలన ముక్తియుఁగలుగునుపాయ మాలోచింపసాగెను. భార్యలతో నతఁడు నిత్య మీవిషయమునుగూర్చియే ప్రసం

# 19. దుర్యోధనుఁడు-పాపవ్యవసాయము

యమాదిదేవతల వరములచేతఁ బాండురాజునకుఁగలిగిన యేవురు కుమారులు దినదిన ప్రవర్ధమానులగుచుండిరి. వారు పాండవులని వ్యవహరింపఁబడుచుండిరి. అచ్చట హస్తిపురములో ధృతరాష్ట్రునకు గాంధారియందు నూరుగురు కొడుకులు నొక కుమార్తెయుఁ గలిగిరి. ధృతరాష్ట్ర పాండురాజు లిరువురు నిట్లు సంపూర్ణ సంతానవంతులగుటచేతఁ గురువంశమును గూర్చి కాని కురురాజ్యమును గూర్చి కాని భీష్మునకును సత్యవతికిని నెట్టివిచారమును లేదు.

ఇట్లుండఁగా గొంతకాలమునకుఁ బాండురాజు స్వర్గస్థుడయ్యెను. మాద్రి తన కుమారులైన నకుల సహదేవులను గుంతి కప్పచెప్పి, తాను భర్తతో సహగమనము చేసెను. మహర్షులు వచ్చి కుంతిని బాండవులను బలువిధముల నోదార్చిరి. ఓదార్చి వారిని హస్తిపురమునకుఁ దీసికొనివచ్చి ధృతరాష్ట్రున కప్పచెప్పిరి. పాండురాజు మరణమునువిని భీష్మాదు లెల్లరు మిక్కిలి దుఃఖించిరి. పాండవులచే నుత్తర క్రియలు చేయించిరి. తండ్రిలేని పిల్లలని ధృతరాష్ట్రుఁడు వారినిఁజేరఁ దీసి తనపుత్రులతో సమానముగ నాదరించి మన్నించుచుండెను. వాని పోషణమునఁ బాండవులు సమస్తబంధువులకును

గడు ముద్దుగాఁ బెరుగుచుండిరి. వీధులయందాడుకొనుచున్న ప్పుడు వారి శరీరకాంతులు, సౌందర్యాతిశయములు చూచి పౌరులు వారిని దేవతలనుకొనుచుండిరి. సౌందర్య తేజోవిశేష ములచేతనే గాక, తమ తమ, యుత్తమ ప్రవర్తనములచేఁ గూడఁ బాండవులు ప్రజలచే నాకర్షింపఁబడుచుండిరి.

ధృతరాష్ట్రుని కొడుకులలో దుర్యోధనుఁడు పెద్దవాఁడు. రెండవవాఁడు దుశ్శాసనుఁడు. పాండవులలో భీముఁడును గౌర వులలో దుర్యోధనుఁడు నొక్కనాఁడే జన్మించిరి. దుర్యోధనుని జన్మకాలమున ననేక దుర్నిమిత్తములు పుట్టినవి. గ్రుడ్లగూబలు నక్కలు, గాడిదలు భయంకరముగా నఱచినవి. మేఘములు లేకయే యాకసమునందు సూర్యమండలము మాటుపడినది. రక్తము వర్షించినది. బంధువులు, మిత్రులు, పురోహితులు, ప్రజలు దుర్యోధనుఁడు దుష్టుఁడును వంశనాశకుఁడు నగునని నిశ్చయించుకొనిరి. ఆ దుర్నిమిత్తములకు సత్యవతియు నంబి కాంబాలికలును మిక్కిలి భయపడుచుండ, వ్యాసమహర్షి, వారి కడకు వచ్చి, "దుష్టుఁడైన దుర్యోధనుని మూలమున మున్ముందు జరుగఁబోవు ఘోరకృత్యములు మీరు చూడ లేరు. వీఁడు వంశక్షయకారుఁడు. ఇదంతయు ధృతరాష్ట్రుఁడే యనుభవింపఁ గలఁడు. మీరిప్పుడే నిశ్చింతగాఁ దపోవనంబు నకుఁ బొం" డని బోధించెను. దివ్యజ్ఞానమున నమ్మహర్షి చెప్పినది విని సత్యవతి తన కోడండ్రతోఁ గూడ వనమున కేగి తపము చేసికొనుచుండెను.

హస్తినాపురములోఁ బాండవులును గౌరవులు కూడఁ దఱుచు బాల్యక్రీడలతోఁ బ్రొద్దుపుచ్చుచుండిరి. ఆయాటల లోనే వారికిని వారికిని బరస్పర విరోధములు పుట్టి, క్రమక్రమముగా నగ్నిజ్వాలల వలె వ్యాపించినవి. పందెములు వేసి పరు వెత్తునపుడు, మల్లయుద్ధమునఁ బెనగునపుడు, పాండవులలో రెండవవాడైన భీముఁడే జయమును బొందుచుండెను. దుర్యోధనాదు లెన్నిమారు లెంత ప్రయత్నించినను నొకనాడైన వాని నాటలలో నోడింపలేక పోయిరి. భీముని శరీరము వజ్ర శరీరముగాని చర్మ శరీరము గాదు. అటులోఁ బదుగురు కౌరవు లొక్కమారుగ భీమునిపై బడుచుండిరి. భీముఁడు తనబాహు బలముచే వారందఱను గ్రిందఁ బడఁద్రోసి, చర్మము లొలియు నట్లు నేల నీడ్చివేయుచుండెను. ఒక్కొక్క భుజముపైఁ బదు గురవంతున నెక్కించుకొని నీటిలో దుమికి, ముంచుచుఁ దేల్చుచు వారి కూపిరి యాడకుండఁ జేయుచుండెను. దుర్యోధనుని తమ్ములు కొందఱు పండ్లు కోసికొనుటకుఁ జెట్టెక్కి నపుడు, భీముఁడా చెట్టును వ్రేళ్ళతోఁ గూడ నిటు నటు గద లింపఁ బండ్లతోఁ గూడఁ గౌరవులు నేలఁబడుచుండిరి.

ఈకారణములచేతఁ బాండవులపైఁ గౌరవులకు విరోధము ప్రబలినది. మాయోపాయముచేసి భీము నెట్లైనఁ జంపి వేయవలయునని, దుర్యోధనుఁడు తమ్ములతో నాలోచించెను. తమ్ములందఱు నందుకు సమ్మతించిరి. ఒకనాడు భీముఁడు జలక్రీడ లాడి మిక్కిలి యలసి, కాసారతీరంబునఁ జల్లగాలిలో హాయిగా

నిద్రించుచుండ, దుర్యోధనుఁడు వానికరచరణములు లతలతోఁ గట్టించి గంగలోఁ ద్రోయించెను. తోడనే భీముఁడు మేల్కాని యాబంధనములనెల్లఁ దృణమాత్రముగఁ ద్రెంచి యొడ్డు చేరుకొనెను. మఱియొకనాఁడు దుర్యోధనుఁడు భోజనమున విషము కల్పించి భీమునకుఁ బెట్టించెను. దుర్యోధనుని సవతి తమ్ముఁడగు యుయుత్సుండనువాఁడు చూచి, భీమునితోఁ జెప్పివేసెను. క్షుధాతురుఁడై యున్న వాయునందనుఁడు లేశము లక్ష్యపెట్టక భయపడక భుజించినంతనే యావిషాన్నము వానికమృతాన్నమైనది. ఇంకొకనాఁడు భీముఁడు గాఢనిద్రయందుండఁగా దుర్యోధనుని నియోగంబున వాని సారథి భయంకరములైన పెక్కు విషసర్పములను గొనివచ్చి నిద్రించుచున్న వానిని గఱపింపసాగెను. ఆక్రూరసర్పములు భీముని మర్మస్థానములను నతి తీవ్రముగఁ గఱచినవి. కొంతసేపునకు భీముఁడు మేల్కాని తన్నుఁగఱచుచుండిన పాములను బాదములతోఁ జదుకఁద్రొక్కి, చేయెత్తి చెంతనున్న సారథిదౌడపై నొక్కటి చరచెను. వెంటనే యాదీనుఁడు కడవెడు రక్తమును గక్కుకొని యచ్చటనె చచ్చెను. దుష్టుల దురాలోచనములన్నియు ధర్మపరులయెడ నిట్లే వ్యర్థమగుచుండును.

క. అవిరళవిషఫణిదంష్ట్రలు
పవనజు వజ్రమయ తనువుపయి తోలును నో
పవు భేదింపఁగఁ బాప
వ్యవసాయుల చెయ్వు లర్థవంతములగునే?

---

# 20. ద్రోణుఁడు - పరాభవము.

ద్రోణుఁడు భరద్వాజమహర్షికిఁ గుమారుఁడు. అతఁడు బాల్యమునఁ దండ్రికడ విద్యాభ్యాస మొనర్చు చుండెను. పాంచాల దేశాధీశ్వరుఁడగు పృషతునకు ద్రుపదుండను నొక కుమారుఁడు కలఁడు. ద్రుపదుఁడుఁగూడ ద్రోణునితోడనే భరద్వాజునికడఁ జదువుకొనుచుండెను. పృషతుఁడు భరద్వాజునకు మిత్రుఁడగుటచేతఁ దన కుమారునిఁగూడ వానియొద్దనే ప్రవేశపెట్టెను. ద్రోణద్రుపదు లిరువురును నత్యంత శ్రద్ధతోఁ జాలకాలము విద్యాభ్యాసము గావించిరి. ద్రోణునకు విలు విద్యయందు మక్కువ యెక్కువ.

పృషతుఁడు కాలధర్మము నొందుటచేత ద్రుపదుఁడు చదువు చాలించి రాజ్యమునకుఁబోయి పట్టాభిషేకము చేసికొనవలసి వచ్చినది. విద్యాసక్తి తీరక ద్రోణుఁ డగ్నివేశుఁడను మహాముని నాశ్రయించి వానియొద్ద ధనుర్విద్య నేర్చుకొనసాగెను. అగ్నివేశుఁడు ప్రతిభావంతుఁడైన శిష్యునకు ధనుర్వేదమును సంపూర్ణముగా నేర్పెను. విద్యాపరిపూర్ణుండగుటచేఁ గొలఁది కాలముననే ద్రోణునకు విద్యార్థి యవస్థ తప్పినది. ఇంక నీవు వివాహమును జేసికొని గృహస్థుఁడవై సంతానమును బడయుమని తండ్రి వానికి నియోగించెను.

తండ్రి చెప్పిన చొప్పున ద్రోణుఁడు కృపియను కన్యకను వివాహంబయ్యెను. కొలదికాలములోనే యీ దంపతులకు సుపుత్ర ప్రాప్తియుఁ గలిగినది. తల్లి దండ్రులు కుమారున 'కశ్వత్థామ' యని పేరుపెట్టిరి.

సంసారము వృద్ధియగుచున్న కొలదిని ద్రోణునకుదారి ద్ర్యము వృద్ధియగుచుండెను. భార్యాపుత్రులను సుఖపెట్టు టకై ధనమార్జింపవలసిన యవసరముతటస్థించినది. శుభకార్య ములయందు దక్షిణలుపుచ్చుకొని కాని రాజులకడ నుద్యో గము చేసికాని బ్రాహ్మణుఁడు జీవింపవలసి యున్నది. ద్రోణుఁడు పాపమీ రెండువిధములనుగూడఁ బ్రయత్నించు చుండెను. దక్షిణలుగాని యుద్యోగములుగాని వానికెచ్చటను లభింపదయ్యె. ఇంతలోఁ బరశురాముఁడనునొకమహానీయుఁడు బ్రాహ్మణులకుఁ గోరినదెల్ల నొసంగుచుండెనని వానికిఁ దెలియ వచ్చినది. ద్రోణుఁడు వెంటనే బయలుదేరెను.

పరశురాముఁడు జమదగ్నికుమారుఁడు. అతఁడు ప్రపం చములోనున్న సమస్త రాజులను జయించి జగదేకవీరుఁడై జగత్తునకెల్ల ప్రభువైన బ్రాహ్మణోత్తముఁడు. ద్రోణుఁడు వెదకి వెదకి, మహేంద్రపర్వతముపైఁ దపముచేసికొనుచుండిన పరశు రాముని సందర్శించెను. పరశురాముఁడు నీవెవ్వరనియడుగ, 'నేను భరద్వాజుని కుమారుఁడను. ద్రోణుం డనువాఁడను. విత్తాపేక్షచే వచ్చితి' నని యతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. పరశు

రాముఁడు మిక్కిలి విచారించి, 'ఓయీ! నీవు తరుణమును మించి వచ్చితివి. ఉన్నధనరాసులన్నియు బ్రాహ్మణులకుఁ బంచిపెట్టితిని. రాజ్యమంతయుఁ గశ్యపుఁడను వానికి ధారపోసితిని. నేనీకొండపై, జేరుకొని తపము చేసికొనుచున్నాను. ఈశరీరమే మిగిలియున్నది. ఇవి యస్త్రములు. ఇవి శస్త్రములు. వీనిలో నీకుఁ గావలసినవి యున్నయెడలఁ దప్పక యిచ్చెదను. పుచ్చుకొను' మని చెప్పెను. ద్రోణుఁడు వాని గారవాదరములకు మిక్కిలి సంతసించి, చేతులు మోడ్చి, 'మహాత్మా! నీవు జగదేక వీరుఁడవు. ఈ శస్త్రాస్త్రములతోఁ బ్రపంచమంతయు జయించితివి. ఇట్టిశస్త్రాస్త్రములకంటె ధనము నాకెక్కువ కాదు. ఇట్టి దివ్యాయుధములుండ ధనలోపమును గలుగదు. కావున వీనిని నాకనుగ్రహింపు'మని ప్రార్థించెను. తత్క్షణమే పరశురాముఁడు తనశస్త్రాస్త్రములను ద్రోణునకిచ్చి వానిని బ్రయోగించు రహస్యములను మంత్రములను గూడ నతిప్రీతితో నుపదేశించెను.

ధనము లేక పోయినను దివ్యాస్త్రలాభము గలిగినందులకు ద్రోణుఁడు సంతోషించుచు నింటికి వచ్చెను. ఎంత సంతోషించినను దారిద్ర్యముచేత సంసారమును నడుపుట వానికి సాధ్యముగానుండెను. భార్యాపుత్రుల కింట నన్నోదకములున్న యెడల నిరంతర ప్రయత్నము లెన్నియైనఁ జేయవచ్చును. అందుచే ధనప్రయత్నము ద్రోణునకుఁ దప్పినది కాదు. ఆ

సందర్భములోఁ దన చిన్ననాఁటి మిత్రుఁడైన ద్రుపదరాజు
వానికి జ్ఞప్తికివచ్చెను. పట్టభద్రుఁడై స్వతంత్రుఁడై రాజ్య
మేలుచుండిన తన మిత్రుఁడు తనకుఁ దప్పక యుపకారము
చేయఁగలఁడని వాని కాశపొడమినది. ఆయాశతో ద్రోణుఁడు
పాంచాలరాజ్యమున కేఁగి ద్రుపదరాజును దర్శించెను. అప్పుడు
రాజు నిండుకొలువుండి నీవెవ్వఁడవని ద్రోణునడిగెను. తన్నుఁ
జూచినంతనే రాజత్యాదరమున గౌరవించునని యనుకొనుచుం
డిన ద్రోణుఁడా ప్రశ్న కాశ్చర్యపడి, "నేను ద్రోణుండను వాఁ
డను. బాల్యమున మనము సహాధ్యాయులము. నన్నింతలోనే
మఱచితివా" యని యడిగెను. ఐశ్వర్యగర్వాంధుఁడైన రాజా
మాటలు విని సహింపక యత్యాగ్రహమును బొంది "దరిద్ర
బ్రాహ్మణుండవైన నీకును మహారాజునైన నాకును నెక్కడి
స్నేహము ? నీవు నన్నిట్లనవచ్చునా ! స్నేహములైనను వివా
హములైనను సమానులకే గాని దరిద్రులకును ధనవంతులకును
నెట్లైన జరుగునా? నీవు నోటికివచ్చినట్లెల్లఁ బ్రేలక తక్షణము
యిందుండి వెడలి పొమ్మని తీవ్రముగాఁ బలికెను. పాపము
ద్రోణునినోట మాట లేదు. నిండుకొలువులో ద్రుపదుఁడు
చేసిన పరాభవమున కతఁడు మిక్కిలి ఖిన్నుఁడయ్యెను. వాని
కప్పుడు విపరీతమైన యాగ్రహముజనించినది. అయ్యాగ్రహాతి
శయముచే వానికన్నులు నిప్పుకణములవలె మారినవి. "ఓరి !
గర్వాంధుఁడా ! నీవుచేసిన పరాభవమునకుఁ దగిన ప్రాయశ్చి
త్తముచేసి, నీయైశ్వర్యమద మడగించెదను. తొందరపడకు"

మని మనసులోఁ బ్రతిజ్ఞచేసికొని ద్రోణుఁడుతత్క్షణమయచ్చట నుండి వెడలిపోయెను.

క. తనువున విఱిగిన యలుఁగుల
ననువునఁ బుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్
మనమున నాటినమాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె చెపుమా.

## 21. అర్జునుఁడు - గురుపక్షము

పట్టణవాసమునఁ గుటుంబజీవనముసుఖముగా జరుగునని యెంచిద్రోణుఁడుభార్యాపుత్రులతో హస్తిపురమునకుబయలు దేరెను. ఆకాలములో హస్తిపురమువంటి లక్ష్మీకరమైనపట్టణ మింకొకటిలేదు. అట్లు ద్రోణుఁడు కుటుంబముతో బయలుదేరి పట్టణసమీపమునకు వచ్చుసరికి, బంతులాటలాడుకొనుచున్న పాండవులును గౌరవులును వాని కంటఁబడిరి. ఆసమయమున బంగారుబంతి సమీపమున నున్నయొకనూతిలోఁ బడిపోయి నది. ఆబంతినిఁ దీసికొను సాధనములేక నూట యేవు రన్న దమ్ములును నూతిచుట్టుమూగిరి. అప్పుడు ద్రోణుఁడు వారిని సమీపించిసంగతి తెలిసికొని, నవ్వుచు, "రాజకుమారులారా! ఇంతటి స్వల్పకార్యమునకే యింతతడబడుచున్నారేమి? మీరు విలువిద్య నేర్చుకొనుచుండలేదా? నూతిలోనున్న బంగరు

బంతిని నా బాణములతోఁ దీసి మీకిచ్చెదను జూడుఁడు. ఈ విద్య వరులెవ్వరు నెఱుఁగరు." అని చెప్పి విల్లెక్కుపెట్టి యొక బాణమును మంత్రించి నూతిలో విడిచెను. వారందఱుఁ జూచుచుండ నా బాణము బంతిని గ్రుచ్చుకొనెను. ద్రోణుఁడు మఱియొక బాణమును విడువ నది యా బాణమును గ్రుచ్చుకొనెను. ఇట్లు తేఁడు బాణములతో నూతిపొడవున నొక త్రాడు గావించి, చేతికందినంతనే పైకిఁ దీసివేసెను. ఆ బాణముతో బంతియు వచ్చినది.

రాజకుమారులు కెవ్వున కేకలిడుచు బంతి నెగరవేసికొనుచు, ద్రోణుని బట్టి రాజమందిరమునకుఁ గొనివచ్చి, తమ తాతగారైన భీష్మునకుఁ జూపి వృత్తాంతమంతయు నెఱింగించిరి. భీష్ముఁడు ద్రోణుని బూజించి వాని కపరిమితమైన ధనధాన్యరాసులొసంగి రాజకుమారుల కస్త్రవిద్యాగురువుగా నియోగించెను. మంచిదినములలో సంపద లప్రయత్నముగనే వచ్చుచుండును. చెడుదినములలో నెంత ప్రయత్నించినను లాభముండదు. దారిద్ర్యపీడితుఁడైన ద్రోణుఁడిప్పుడు గొప్ప యైశ్వర్యవంతుఁడై రాజకుమారులకు విలువిద్య చెప్పుటకుఁ బ్రారంభించెను. "నా యొద్ద నస్త్రవిద్య నభ్యసించి నాయిష్టము నెవరు తీర్పఁగలరో చెప్పుఁ" డని ద్రోణుఁడు రాజకుమారుల నందఱ నడిగెను. దుర్యోధనాదులు నూరుగురు మొగములు వంచుకొని యూరకుండిరి. అప్పుడు కుంతికుమారులలో మూఁడవవాఁడగు నర్జునుఁడు, గురునకు నమ

స్కరించి " మీ యభీష్ట మెట్టిదైనను నేను దీర్చెద " అని ప్రతిజ్ఞ చేసెను.

తనయిష్టమును సేయఁబూనిన యర్జునుని యాచార్యుఁడతిస్నేహమునఁ గౌఁగిలించుకొని మహానందమును బొందెను. ప్రతిదినము నితర రాజ్యములనుండి కూడ రాజకుమారులు హస్తిపురమునఁ బ్రవేశించి ద్రోణాచార్యునికడ నస్త్రవిద్యాభ్యాసమును బ్రారంభించుచుండిరి. ద్రోణుని బోధనా నైపుణ్యము వలన వాని శిష్యులందఱు నత్యల్పకాలములో నత్యధికమైన విద్య నొందఁ గలుగుచుండిరి. వందల కొలఁది నున్న రాజకుమారులలో నర్జునుఁడే ప్రతి విషయమునందు నగ్రస్థానము నొందుచుండెను. కౌరవులలో ననేకులు వానికంటె నధికులు కావలెనని ప్రయత్నించుచుండిరి. కాని విలువిద్యయం దర్జునుని ప్రతిభావిశేషము వారి కెవ్వరికిని బట్టువడ లేదు. ఒక్కొక్కప్పుడు ద్రోణుఁడు గూడ వాని యస్త్రవిద్యాకౌశలమునకు వింతపడుచుండెడివాఁడు. తన ప్రతిజ్ఞ నెరవేర్చుట కొక్క యర్జునుఁడు తప్ప రాజపుత్రులలో మఱియొకఁడు సమర్థుఁడు కాఁడని యెంచి, కొడుకునకుఁ జెప్పని రహస్యములఁ గూడ ద్రోణుఁడు వానికిఁ జెప్పుచుండెను.

కొంతకాలము గడచిన తరువాత భీష్ముఁడు ధృతరాష్ట్రుఁడు మొదలగు పెద్దలు రాజకుమారుల యస్త్రవిద్యానైపుణ్యమును బరీక్షించిరి. ఆ పరీక్షలో నందఱికంటె నర్జు

నుఁడే ప్రథమగణ్యుండయ్యెను. ఆనాఁడే యర్జునుని కీర్తి వెల్లివి రిసెను. అర్జునుఁడు ద్రోణుని యంతవాఁడయ్యెనని భీష్మాదులే నిశ్చయించినప్పుడిఁక నితరుల పొగడ్తలేల? ఆ మఱునాఁడుదయమున శిష్యులెల్లరు పాఠశాలకు వచ్చినంతనే ద్రోణుఁడు వారి నందఱిం బిలిచి నాకు గురుదక్షిణ యొసంగుఁడని యడిగెను. అడిగినంతనే రాజకుమారులెల్లరు వాని పాదములకు నమస్కరించి కట్టెదుట నిలిచి మీరేయది యిష్టంబు చెప్పిన తక్షణము తెచ్చెదమని యేకగ్రీవముగాఁ బలికిరి. ఐశ్వర్యగర్వాంధుఁడైన పాంచాల రాజును బట్టి తెచ్చుటయే నాకు గురుదక్షిణ యని ద్రోణుఁడు చెప్పెను.

చెప్పుటయుఁ దడవుగ దుర్యోధన దుశ్శాసనాదులైన కౌరవులును దక్కిన రాజపుత్రులును దమ తమ శస్త్రాస్త్రములతో రథారూఢులై బయలుదేరి ద్రుపదుని పట్టణమును ముట్టడించిరి. వారివెనుక పాండవులును రథములెక్కి ద్రోణునితోఁగూడ వెడలిరి. అప్పుడర్జునుఁడు ద్రోణుంజూచి “గురువర్యా! ద్రుపదరాజు మహాస్త్రకోవిదుఁడని మీరొకమారు సెలవిచ్చితిరి కదా! ముందుఁ బఱువెత్తిన మన దుర్యోధనాదులకతఁడు పట్టువడునా?” యని యడిగెను. ద్రోణుఁడు నవ్వుచు నూరకుండెను. పాండవులు పాంచాలపురము సమీపించునరికి కురుకుమారులకు పాంచాల రాజునకును ఘోరయుద్ధము జరుగుచుండెను. పాంచాలపతి మహాసైన్యముతో వచ్చి

దుర్యోధనాదులను బాణవర్షములో ముంచివేసెను. వారి రథములను బగులఁగొట్టెను. వారి సారథులను జంపివేసెను. వారి కవచములను జీల్చివేసెను. వారికోదండములను ద్రుంచి వేసెను. ఇంక యుద్ధరంగమున నిలువఁజాల మని హాహాకారములతో వారందఱుఁ బాండవు లున్నయెడకుఁ బఱువెత్తిరి. తోడనే యర్జునుఁడు ద్రోణునకు ధర్మరాజునకు నమస్కరించి, భీముని నకులసహదేవులను దోడుగా నుంచుకొని, పాంచాల సైన్యములపైఁబడెను. అర్జునుని బాణవర్షముచేత శత్రుసైన్యములశౌర్యాగ్ని క్షణములోఁ జల్లారిపోయినది. బెబ్బులిఁజూచిన లేళ్ళమందలవలెఁ దన సైన్యములు పాఱిపోవుట చూచి, ద్రుపదుఁడు మహాపౌరుషముతో నర్జునుని పైకివచ్చెను.

అర్జునుఁడు కొంతసేపు వానితో యుద్ధముచేసి, కొదమ సింగమువలె వాని రథంబుపై కుఱికెను. తోడనే సైన్యము లన్నియు హాహాకారములు గావించినవి. భయంకర ఖడ్గ హస్తుండైన యర్జునునిఁ జూచినంతనే ద్రుపదునకు మతిపోయినది. ప్రాణభీతికలిగినది. శరీరము గడగడవడకినది. అర్జునుఁడు వానింబట్టి కట్టి రథంబుపైఁ బడవేసి తెచ్చి ద్రోణునకుఁజూపి, "గురూత్తమా! ఇదిగో నాగురుదక్షిణ" యని పలికెను. ద్రోణుఁడు నవ్వుచు ద్రుపదునిఁ జూచి" ఓహో! మీ రెవ్వరు? ద్రుపదమహారాజుగారా? మీకైశ్వర్య గర్వమను రోగము

కుదిరినదా ? ఇప్పుడైనను మముఁ జ్ఞప్తికిఁ దెచ్చుకొందురా ?"
అని పెక్కువిధములఁ బరాభవించి విడిచెను.

క. ప్రక్షీణదర్పుఁడు ద్రుపదు ర
థాక్షమునకుఁ గట్టి తెచ్చి యర్జునుఁడు క్రియా
దక్షుండయి గురునకు గురు
దక్షిణఁ దా నిచ్చిచేసెఁ దత్సన్మానమున్.

# 22. దుర్యోధనుఁడు-లాక్షాగృహము

అర్జునుఁడు ద్రుపదునిఁ బట్టి తెచ్చిన నాటనుండియు నాని యస్త్రవిద్యాకౌశలము పూర్వము కంటెను లోకప్రసిద్ధి గాంచెను. ప్రజలకుఁ బాండవులపై సత్యధిక భక్తి గౌరవములు గలిగినవి. ధృతరాష్ట్రుండును మిక్కిలి సంతసించి భీష్మాదులతో నాలోచించి ధర్మరాజును యౌవరాజ్యాభిషిక్తునిఁ గావించెను. పట్టభద్రుండైన ధర్మజుఁడు ధర్మపరిపాలనము చేయుచుండ వీరాగ్రేసరులైన యాతని నలువురు తమ్ములును సకల దిక్కులయందలి రాజులను జయించి, కప్పములను గొనివచ్చి యన్నగారికి సమర్పించుచుండిరి.

దుర్యోధనుని ద్వేషాగ్ని మరల రగులుకొనినది. అన్ని విషయములయందును బాండవు లున్నతి నాతఁడు సహింప

లేకుండెను. బాల్యక్రీడలలోఁ గలహాములు పుట్టినప్పటినుండి యుఁగూడఁ బాండవు లెట్టులైనఁ గడతేర్పవలయునని యే వాని ముఖ్యప్రయత్నము. ధర్మజుని పట్టాభిషేకము పాండవుల దిగ్విజయము మున్నగునవిచూచి, యీసారి వారినిమునుముట్ట సంహరింపవలయునని యామూర్ఖుఁడు నిశ్చయించుకొనెను. అట్టి నిశ్చయముతోఁ నతఁడొకనాఁడు తండ్రినిసమీపించి తన మనోదుఃఖము నిట్లువెల్లడింపనారంభించెను "తండ్రీ! బాల్యమునుండియుఁ గూడ బలవంతులగు పాండవులకు నేను వెఱచుచున్నాను. అందుకుఁదగినట్లునీవు పాండవ జ్యేష్ఠుని యౌవరాజ్యాభిషిక్తునిఁ జేసితివి. ఆకారణమున మన ప్రజలును, మన బ్రాహ్మణ ప్రధాన వరులును మన ముందు భక్తివిశ్వాసములు విడిచి పాండవదాసు లగుచున్నారు. ప్రజలెల్లరును మున్ముందు ధర్మరాజునే సార్వభౌమునిగా నెంచుకొనెదరు. ఇంక మన వంశమువారి కెప్పటికిని రాజ్యార్హత యుండదు. మూర్ఖులైన పౌరజనంబులు పాండవులను బొగడుచుండుటయు నిన్ను నన్ను నిందించుచుండుటయు నిరంతరము నేను వినజాలకున్నాను. కావున వారల నెట్లయిన నిప్పురంబు నుండి వెడలింపవలయు."

ఆ మాటలకు ధృతరాష్ట్రుండు మిక్కిలి దుఃఖించెను. పాండవులను విడిచిపెట్టుట వాని కిష్టములేదు. అందు ముఖ్యముగా ధర్మరాజునాతఁడు విడిచియుండలేఁడు. అందుచేఁ బాండ

వుల యందలి మచ్చరమును విడిచి వారితోఁ గలిసి యుండు మని కొడుకున కనేక విధముల బోధించెను. తండ్రి యెంత బోధించినను దుర్యోధనుఁడు తనపట్టుదల విడువలేదు. దుర్యోధనుని బోధనము వినలేక కడకు ధృతరాష్ట్రుఁడు సమ్మతించి పాండవులను వారణావతమునకుఁ బంపివేయుటకు నిశ్చయించెను. అట్టి నిశ్చయముతో నతఁడు పాండవులను పిల్పించి యిట్లనియె.

“ కుమారులారా ! వారణావతమును గూర్చి మీరు వినియేయుందురు. అది జగత్పావనమైన గంగాతీరమునందున్నది. మీవంటి రాజకుమారులకు మిక్కిలి నివాసయోగ్యమైనది. జననీ సమేతులై మీ మంత్రి పురోహితాది వర్గములతోఁ గూడ నేగి యందుఁ గొంతకాలముండి మరలి రండు.” ధర్మరాజాదులు వెంటనే యందుకు సమ్మతించి వారణావతమునకుఁ బ్రయాణమైరి. అన్నదమ్ములేవురును గాంధారీ ధృతరాష్ట్రులకును, భీష్మద్రోణాదులకును నమస్కరించిరి. దుర్యోధనాది సోదరుల సందఱఁ బ్రియపూర్వకముగ సంభావించిరి. వృద్ధబ్రాహ్మణులకు మ్రొక్కి వారి యాశీర్వాదముల నొందిరి. ఎల్లవారును మీ పునర్దర్శనము మాకు శీఘ్రకాలములోఁ గలుగుఁ గాక యని పలుకుచుండ బ్రాహ్మణుల స్వస్తి వచనములతోఁ గూడ కుంతీసమేతులై పాండవులు వారణావతమునకుఁ బయలుదేరిరి.

పాండవులు హస్తిపురము విడిచినంతనే దుర్యోధనుఁడు తమ్ములతోఁ గూడ మహానందభరితుఁ డయ్యెను. పాండవ

సంహారమునకు దనకు మంచి యవకాశము కలిగినదని మెచ్చి యతఁడు పురోచనుఁడను శిల్పిని రప్పించెను. పురోచనుఁడు వచ్చినంతనే దుర్యోధనుఁడు వానిని గౌరవించి, ఓయీ! నీవొక్కండవె నాకుఁ బరమవిశ్వాసివి. వాయువేగంబుగల వేసడములఁ బూనిన రథమెక్కి నీవిప్పుడ వారణావతమునకుఁ బోవలయును. పోయి యందు నీశిల్పకలాచతురత్వ మేర్పడ లక్కతోనొక విశాల సుందర మందిరమును నిర్మింప వలయును. నిర్మించి యందుఁ బాండవుల విడియింపవలయు. విడియించి వారలేమఱి యున్న సమయముఁగని పెట్టి యాలాక్షాగృహమునకు నగ్ని దగిలించి పాండవుల మరణవార్తతో వచ్చినాకు శ్రవణానందము గావింపవలయు" నని యాజ్ఞాపించెను.

దుర్యోధనుని యాజ్ఞానుసారముగఁ బురోచనుఁ డతి త్వరితగతిని వారణావతమునకుఁ బోయి యక్కడ లక్కయిల్లు నిర్మించుటకుఁ బ్రారంభించెను. పాండవులును గొన్ని దినముల కచ్చటఁ బ్రవేశించిరి. వారువచ్చునరికి లాక్షాగృహము పూర్తియైనది. మీ రిందు నివసింపవలయునని పురోచనుఁడు వారలను బ్రార్థించెను. సుధాధవళంబైన యాసుందర మందిరము చూచి మెచ్చి పాండవులందు నివసించిరి. కృష్ణ చతుర్దశినాఁటి రాత్రి, పాండవులు నిద్రించుచుండ, లాక్షాగృహమునకు నిప్పంటింపవలయునని దుర్యోధనుని యాజ్ఞ. ఈరహస్యమును ఖనకుఁడను నొక యాప్తుఁడు పాండవులకుఁజెప్పి వేసెను. ఆ పాపగృహమునుండి తప్పిపోవుట కనువైన యొక

బిలమును గూడఁ ద్రవ్వించెను. దుర్యోధనుని దుర్నయము నటుఁ బాండవులు విస్మితులై, మిక్కిలి జాగరూకతతోడనే సంచరించుచుండిరి. వారెప్పు డేమి చేయుచుందురో కనిపెట్టి తనకుఁ జెప్పుచుండుటకుఁ బురోచనుఁ డొక కిరాత స్త్రీ నచ్చటఁ గాఁపుంచెను.

ఇంతలో లాక్షాగృహ దహనదినము వచ్చినది. ఆ కృష్ణచతుర్దశినాటి రాత్రి, కాపున్న నిషాదవనిత తన యేవురు కొడుకులతోఁ జెడఁద్రాగి మొద తెలియకుండ నా యింటి ప్రక్కనె నిద్రించుచుండెను. పురోచను కన్న మున్నగా భీముఁడు తన యన్నను దమ్ములను దల్లిని శీఘ్రముగా బిలములోనికిఁ బంపి, పురోచను శయన గృహమునకు మెల్లఁగఁ దానే నిప్పంటించి, యందుండి వెడలిపోయెను. పాండవులు సుక్షేమముగా బిలమునుండి వెడలిపోయిరి. ఆకాశమంటుకొను మంటలతో లాక్షాగృహము క్షణములో భస్మరాశి యైనది. నిషాదవనిత తన యేవురు కొడుకులతో దహింపఁబడినది. ఇట్లు దుర్యోధనుని యధర్మప్రయత్నము వ్యర్థమైనది. ధర్మమూర్తులైన పాండవులకే శుభము కలిగినది.

గీ. వేదవిహితంబులును శాస్త్రవిహితములును
శిష్టచరితంబులును నన( జెప్ప నొప్పి
ధర్మములు మూఁడు విధములఁ దనరుచుండు
కడగి యున్నియు సద్గతి కారణములు.

# 23. భీముఁడు - కుటుంబ రక్షణము.

లాక్షాగృహ దహనంబునఁ బురోచనుఁడును భస్మమయ్యెను. చచ్చిన నిషాదవనితను నామె యేవురుకొడుకులను జూపి ఖనకుఁడు కుంతియుఁ బాండవులును గతించిరని చెప్ప నారంభించెను. వారణావతవాసులెల్లరు నాశవములను జూచి దుఃఖింపసాగిరి. ఈయసత్య మరణవార్తను ఖనకుఁడు హస్తిపురంబునఁగూడ జెప్పెను. పట్టణమంతయు రోదనధ్వనులతో నిండెను. మహాసాధ్వియైన కుంతిం దలంచియుఁ బాండవు సుగుణసంపదలం దలపోసియు రాజమందిరంబెల్ల ఘొల్లున నేడ్వసాగెను. ఆదుఃఖవార్తను నిండుసభలో విని పాపము ధృతరాష్ట్రుఁడుగుండెలు బాదుకొనుచు నావఱచినట్లఱచెను. పాండవులకిట్టి దుర్మరణము దుర్యోధనుని మూలముననే కలిగియుండునని యెంచి ప్రజలును బంధుమిత్రాదులును గూడ వాని ననేకవిధములఁ దూలనాడిరి. కాని దుర్యోధనుఁడాపలాషణములను లేశమును బాటింపలేదు. తమ్ములైన దుశ్శాసనాదులతోడను మిత్రులైన కర్ణాదులతోడను మహానంద భరితుఁడై నాఁటిదినమంతయు పర్వదినమువలెఁ గడపెను.

ఇచ్చట బిలములోఁ బ్రవేశించిన పాండవులు ప్రాణభీతిచే నతిత్వరితగతిం బోవుచుఁగొంత సేపునకలసిపోయిరి. కుంతి లేశమును నడువలేక పోయెను; ధర్మరాజాదులడుగిడఁ జాలకుండిరి.

నాఁటి నడురేయిని లేశమును నిద్రలేక వారి శరీరములు తూలి పోవుచుండెను. అప్పుడు భీముఁడు తల్లిని మూఁపుమీఁదను ధర్మరాజార్జునులను బాహువుల మీఁదను, నకులసహదేవులను దొడలమీఁదను నెక్కించుకొని, వారు తన్నుఁ గట్టిగఁబట్టి యుండ, చీకటియనక ముండ్లనక రాళ్లనక మహావేగంబునఁ బోయి పోయి మఱునాఁడొక యరణ్యమునఁ బ్రవేశించెను. వారందఱుఁ జల్లనియొక చెట్టునీడను జేరుకొనిరి. మితిమీఱిన యాఁకలియు దప్పికయు భరింపలేక; భీముఁడు దక్కఁ దక్కిన వారందఱుఁ జల్లని యా చెట్టునీడను మూర్ఛపోయినట్లు నిద్ర పోయిరి. భీముఁడా చెట్టెక్కి నలువంకలు చూచి సమీపముననే యొక కొలను గాంచెను. తల్లియు నన్నదమ్ములను దప్పితీర్చుట కతఁడా సరోవరము కడ కేగి కృతస్నానుఁడై తాను వలసినంత నీరమును ద్రావి, తామరాకు దొన్నెలతోఁ దన వారికై జలములఁ గొనివచ్చెను. కాని గాఢనిద్రయందున్న వారల నిద్రకు భంగము గలిగింపలేక యతఁడా జలముల నొకచో భద్రపఱచియుంచెను.

భీముఁడు వారి ప్రక్కనే కూర్చుండెను. కఱకు ఱాలనేలపై నిసుక పట్టియున్న వారిశరీరములను జూచెను. దుష్టుఁడైన దుర్యోధనుని మూలమున సుకుమారులైన తనవారికిట్టి కష్టములు గలిగెనుగదా యని యూరక దుఃఖింప సాగెను. క్షణమాత్రములో సకలైశ్వర్యములు నంతరించి, యరణ్యవాసము కలిగినందుకు వింతపడసాగెను. అట్లు వింతపడుచుండ, సాక్షా

త్కరించిన లక్ష్మివలెనే యొకదివ్యసుందరివచ్చి వానికట్టెదుట నిలిచెను. భీముఁడాచక్కని కన్యకంజూచి, యామె సౌందర్యాతిశయమునకు విస్మితుఁడై, "సుందరీ! నీవెవ్వతెవు? అడవులలో నింతప్రొద్దేల మెలఁగెదవు. పొమ్ము. పొ"మ్మనిపలికెను. వానిమాటల కాసుందరి నవ్వుచు, "మనోహరా! ఈయరణ్యము హిడింబుఁడను రాక్షసేశ్వరుని వాసస్థానము. నేనాతనికిఁ జెల్లెలను. హిడింబయనుదానను. మాయన్న మీరిందుఁ బ్రవేశించుటచూచి, మిమ్మందఱను జంపితెచ్చి వంటకముచేసి తనకుఁ బెట్టుమని నన్నుఁ బంపెను. నేనుఁగూడ నట్టితలంపుతోడనేవచ్చి వజ్రశరీరుఁడవైన నీసుందరాకృతిం జూచి మోహించితిని. నన్ను భార్యగాఁ బరిగ్రహింపుము. మాయన్నవలని భయంబులేకుండ మన మిరువుర మెందేనింబోవుద"మని ప్రార్థించెను. అందుకు భీముఁడు, "ఓసీ! మీ యన్నవలన నాకు లేశమును భయంబు లేదు. రానిమ్ము. గాఢనిద్రయందున్న తల్లిని నన్నదమ్ములనువంచించి స్త్రీలోలుఁడనై పోయెదననుకొంటివా? ఊరక వ్రేలక పొ"మ్మని తృణీకరించెను.

హిడింబ వానిపాదములపైఁబడి "ప్రాణేశ్వరా! ఈ జన్మమున నీవే నాకుఁ బతివి. నన్ను రక్షింపుము. నన్నుఁ జేపట్టితివేని మాయన్న మీయందఱను రక్షింపఁ గలఁడు. వానిని సామాన్యునిగా గణింపకుము. వాని వశముఁ జొచ్చి బ్రతికిపోవుట మృత్యుముఖమునుండి బ్రతికిపోవుట. దానవకన్యనను నేనుకామచారిణినై మీయందఱను మీయిచ్ఛకువచ్చిన

ప్రదేశమునకుఁ గొనిపోఁగలను. నన్ను రక్షించిన నిన్నును నీ కుటుంబమును రక్షించుకొనినవాఁడవగుదువు."అని పలికెను. ఈ సంభాషణలోనే భయంకరములైన హిడింబుని బొబ్బలును గేకలును వారికి వినవచ్చెను. చెల్లెలింత యాలస్యము చేసినదని హిడింబుఁడామెపై నత్యాగ్రహమును వహించి పండ్లు కొఱుకుచుఁ గేకలిడుచు వచ్చుచుండెను. అప్పుడు హిడింబ గడగడ వడకుచు, "ప్రాణేశ్వరా! రక్షింపు"మని భీముని వెనుకఁ జొచ్చెను. భయంకర వికారుఁడైన హిడింబుఁడు వచ్చినంతనే భీముఁడు చెలరేఁగి, తటాలున వానిజుట్టుపట్టి, వాని కేకలవలనఁ దనవారికి నిద్రాభంగము గలుగకుండ, కొంచెము దూరమీడ్చుకొనిపోయెను. అప్పటికిని వారికి నిద్రాభంగము తప్పినది కాదు. ఆరక్కసుని బొబ్బలవలన వారందఱు మేలుకొనిరి. మేలుకొని చెంతనున్న హిడింబంజూచి, యాశ్చర్యపడి "నీవెవ్వతెవు. మాభీముఁ డెక్కడ ?" నని యాతురతతో నడిగిరి. హిడింబ భయభక్తులతోఁ గుంతికిని, ధర్మజునకును మ్రొక్కి, తనవృత్తాంతమంతయుఁ జెప్పి, భీమహిడింబులీ సమీపముననే పోరాడుచున్నారని పలికెను. రాక్షస కన్యయైనను హిడింబ సౌందర్యాతిశయమునకును నామె యుత్తమ శీలమునకును సంతసించి, వారందఱు నామెతో యుద్ధభూమికి వచ్చిరి.

అచ్చట భీమ హిడింబాసురు లతిఘోరముగఁ బోరాడుచుండిరి. ఇరువురకును జయమునుగూర్చి సంశయముకలిగెను.

ఇరువురకును ప్రాణభీతికలిగినది. అట్టిస్థితిలో భీముఁడు తల్లిని అన్నదమ్ములనుజూచి, యర్జునుని ప్రోత్సాహవాక్యములువిని, క్రొత్తబలమును గ్రొత్తధైర్యమును వహించి, యారక్కసుని పాదములుపట్టి గిరగిరఁద్రిప్పినేలం గొట్టెను. తోడనే నోట రక్తమును గ్రక్కుచు నారక్కసుఁడు పర్వతమువలెఁ గూలి చచ్చెను. సంతోషముతో నందఱును గెవ్వున గేకలిడిరి. అప్పుడు భీముఁడు హిడింబనుజూచి, "నీవింకను మాతోడనే యుంటివా ? నిన్నును మీయన్నకడకుఁ బంపెదను ర"మ్మని పలుకుచుండ హిడింబ కుంతిని ధర్మజుని శరణువేఁడెను. వారామెనుగరుణించి భీముని శాంతపరచి "నాయనా! దీనురాలైనయామెను బరిగ్రహింపుము. రాక్షసకన్య యయ్యును శరణుజొచ్చినపుడు రక్షించుట ధర్మము. మనకాపదగలిగినను ధర్మమున కాపద గలుగ నీయరాదు. నిన్నుఁగోరి యీామె యన్నను వదలుకొనినది. కావున మాయాజ్ఞను మన్నింపు" మని పలికిరి. భీముఁడువారి యాజ్ఞచొప్పున హిడింబను భార్యగా సంగీకరించెను. కొంతకాలమునకు వారికి ఘటోత్కచుండను సుతుఁడు పుట్టెను.

క. ఆపదయైనను ధర్మువు
ప్రాపుగ రక్షింపవలయుఁ బరమార్థము ధ
ర్మోపాయము ధార్మికులకు
నాపద జన్మాంతరమున కనుగతమగుటన్.

# 24. కుంతి - ప్రత్యుపకారబుద్ధి.

మహావీరుండైన ఘటోత్కచుండు పుట్టినంతనే యౌవనవంతుండును మహాస్త్రకోవిదుండును నయ్యెను. వానింజూచి పాండవులును గుంతియు నత్యాశ్చర్యమునొందిరి. ఘటోత్కచుండు కొన్ని దినములు తండ్రికడనుండి మీరు తలంచి నప్పుడెల్లఁ బ్రత్యక్షమగుచుందునని చెప్పి సెలవుగైకొని తల్లితోఁ గూడ రాక్షసలోకమునకుఁ బోయెను. పిమ్మటఁ బాండవులు శాలిహోత్రుఁడను మహర్షియొద్ద ననేకశాస్త్రము లభ్యసించి యచ్చటనుండి వెడలి యేకచక్రపురంబను నొక యగ్రహారము జేరుకొనిరి. జటాజినములు వల్కలములు ధరించి వారేవురును వేదాధ్యయనము సేయుచు బ్రాహ్మణకుమారుల వలెనే యాగ్రామమున సంచరించుచుండిరి. వారు బ్రాహ్మణులనియే గ్రామస్థులనుకొనుచుండిరి. ఒక బ్రాహ్మణగృహస్థుఁడు వారి నాదరించి తనయింట నివాసమొసంగెను. పాండవులందు నివసించుచుఁ బ్రతిదినము నింటింట భిక్షాన్నమును దెచ్చుకొనుచుఁ బంచికొనుచుండిరి. తెచ్చిన వానిలో సగము భాగము భీమునకుం బెట్టి తక్కినసగమును గుంతి, కడమకొడుకులును దానును భుజించుచుండెను. తేజోమూర్తులైన పాండుకుమారులంజూచి

భగవంతుఁ డిట్టివారి కీభిక్షాటనమేల కల్పించెనో యని గ్రామస్థులు విచారించుచుండిరి.

తన యింట నివాస మొసంగి యాదరించుచుండిన బ్రాహ్మణగృహస్థున కేమి ప్రత్యుపకారము చేయవలయునో యని కుంతి నిత్యమును మనస్సులోనూహించుచుండెను. ఎంత యూహించినను బ్రస్తుతము తాను జేయఁగలిగిన దేమియు నామెకుఁ దోచలేదు. ఇట్లుండ నొకనాఁటి మధ్యాహ్నమున భీముఁడు దక్కఁ దక్కినవారు భిక్షాన్నములను దెచ్చుటకు బయలు దేరిరి. భీముఁడును గుంతియు మాత్రమే యింటనుండిరి. అప్పుఁ డాకస్మికముగ నాబ్రాహ్మణగృహమునుండి పెద్దరోదన ధ్వని కుంతికి వినవచ్చినది. కుంతి వింతపడి వినుచు భీముని బిలిచి "కుమారా! ఆరోదన ధ్వని వినుము. మన కుపకారి యైన బ్రాహ్మణున కేదేనాపద తటస్థించి యుండును. ఆపత్కాలంబున వానికిఁ దోడుపడుటకంటె మనకుఁ గావలసిన దేమి?" యనిపలికెను. భీముఁడును దల్లిమాటలకు సంతసించి "అమ్మా! ఎవ్వరివలన నెట్టియాపద యాబ్రాహ్మణునకుఁ గలిగినదో కనుఁగొనిరమ్ము. ఎట్టిదుర్ఘటకార్యమైనను నేను జేసి యాతనికి శుభము గలిగించెద" నని చెప్పి యామెనుబంపెను.

కుంతి లోని కేగి చూచుసరికి బ్రాహ్మణుఁడు భార్యాపుత్రాదులతోడను, బాంధవులతోడను ఘోల్లున రోదనము సేయుచుండెను. "ఆ రాక్షసుని పాలికి నేనే పోయెద" నని

యొకరును "నీవువలదు నేను బోయెద" నని మఱి యొకరును "తండ్రీ! లేకలేక పుట్టిన యేకపుత్రుఁడవు నీవుండుము. నేనే యారాక్షసున కాహారమయ్యెద"నని బ్రాహ్మణుఁడును రోదనము సేయుచు ననుకొనుచుండిన మాటలను గుంతి వినెను. కాని యామెకు విషయము స్పష్టముగా బోధపడలేదు. అందుచే బ్రాహ్మణుని పిలిచి, "అయ్యా! మీకుఁ గలిగిన యాపద యేదియో నాకుఁ జెప్పుము. తొలఁగింపఁ బ్రయత్నించెద" నని యడిగెను. ఆమాటలకుఁ బాపము బ్రాహ్మణుఁడు నెత్తి నోరు మోఁదుకొనుచు. "అమ్మా! వెఱ్ఱితల్లీ! మాకుఁ గల్గిన యాపద యే భగవంతుఁడైన బ్రత్యక్షమై తీర్పవలసినది కాని మానవులకు సాధ్యముగాదు. ఇచ్చటికి సమీపకాననమున బకుఁ డను నొక రాక్షసుఁడు కలఁడు. వానికి యేకచక్రపురంబువారు దిన దినము నిలువరుస చొప్పున నొక మనుష్యుని రెండెను బోతులం బూన్చిన బండెడన్నమును సమర్పించు చుండవల యును. ఆ రాక్షసుఁడామనుష్యుని నాయన్నమును నెనుపోతు లతోఁ గూడ భక్షించుచుండును. ఆ రక్కసునకు వెఱచి యీ గ్రామమువారిట్టి క్రమము నేర్పఱచుకొనిరి. తల్లీ! నేఁడు మావంతు వచ్చినది. మాలో......"అని మఱి మాటాడలేక మఱింత ఘొల్లున నేడువ సాగెను.

ఆ మాటలకుఁ గుంతియు మిక్కిలి దుఃఖించి, "బ్రాహ్మణోత్తమా! దుఃఖింపకుము. నీకొక్కఁడే పుత్రుఁడు. నాకేవురు

పుత్రులున్నారు. నేఁడు వచ్చిన మన యింటివరుసకు నాకుమారులలో నొకనిఁ బంపెదను. నీ వూఱడిల్లు" మని పలికెను. "అమ్మా! వలదు వలదు నాకు బ్రహ్మహత్యా పాపము సంభవించు"నని బ్రాహ్మణుఁడనెను. కుంతి వెంటనే భీముని బిలిచి యావృత్తాంతమును జెప్ప నతఁడు మహానంద భరితుఁడై త్వరలో వంటలు కానిండని బ్రాహ్మణునకుఁ జెప్పెను. ఇంతలో ధర్మరాజాదులు భిక్షాన్నములతో నింటికివచ్చి సంతోషాతిశయమున నుప్పొంగుచుండిన భీమునిఁజూచి వీనికి నేఁడెవరితోడనో మఱల యుద్ధము తటస్థించి యుండునని భావించి, తల్లినడిగిరి. ఆమె యావృత్తాంతమును జెప్పినంతనే, ధర్మరాజు, 'అమ్మా! పరుల మేలుకై తమపుత్రుల నిచ్చుకొనువారున్నారా ?' యని యామెను వారించెను. కుంతి నవ్వుచు, 'నాయనా! నూర్వురు కొడుకులున్న తల్లియైనను కొడుకుచావు గోరునా? భీముఁడెన్నఁడును జావఁడు. వాఁడు వజ్రశరీరుఁడు. వీనిబాల్యము నొకనాఁడు నేను వీని నెత్తుకొని వచ్చుచుండ, నితఁడు నాచేతులనుండిజాఱి యొకపాషాణముపైఁ బడినంతనే, యారాతిబండ పొడి పొడిగాఁ జితికి పోయినది. నీతమ్ముఁడవశ్యమా రాక్షసుని సంహరించి యీ బ్రాహ్మణునకే గాక, యీ గ్రామము వారికందఱకు శుభము గలిగింపఁ గలఁడు. నీవు భయపడకు" మని చెప్పి యొప్పించెను.

# భారత నీతికథలు

## రెండవ భాగము

కృతికర్త:

భోగరాజు నారాయణమూర్తిగారు

విజయనగర సంస్థానాస్థానకవి

పబ్లిషర్సు:

వేంకట్రామ అండ్ కో.,

సికింద్రాబాదు

1945

కాపీరైటు రిజర్వుడు]

[వెల 0—12—0

# విషయసూచిక.


| | | |
|---|---|---|
| 1. | అంగారపర్ణుడు—గర్వభంగము ... | 1—5 |
| 2 | సంవరణచరిత్రము—పురోహితప్రభావము ... | 5—9 |
| 3. | విశ్వామిత్రుడు—గర్వభంగము ... ... | 10—14 |
| 4. | కల్మాషపాదుడు—బ్రాహ్మణతిరస్కారము ... | 15—19 |
| 5. | ఔర్వుడు—భయంకరకోపాగ్ని ... ... | 20—24 |
| 6. | అర్జునుడు—ధనుర్విద్యాఫలము ... ... | 24—29 |
| 7. | కర్ణాదుల మత్సరము—పరాజయము ... ... | 30—33 |
| 8. | పాండవులు—మాతృభక్తి ... ... ... | 34—38 |
| 9. | ఇంద్రసేన—పాతివ్రత్యము ... ... ... | 39—42 |
| 10. | సుందోపసుందులు—మోహప్రభావము ... | 43—47 |
| 11. | అర్జునుడు—సమయరక్షణము ... ... | 48—51 |
| 12. | నంద—బ్రాహ్మణశాపము ... ... | 52—56 |
| 13. | అర్జునుడు—శరణాగతరక్షణము ... ... | 56—61 |
| 14. | మందపాలుడు—సంతానాపేక్ష ... ... | 61—65 |
| 15. | బృహద్రథుడు—పుత్రప్రాప్తి ... ... | 66—70 |
| 16. | జరాసంధుడు—సాధుహింసాఫలము... ... | 70—75 |
| 17. | శిశుపాలుడు—దైవదూషణము ... ... | 76—81 |
| 18. | ద్రౌపది—పాతివ్రత్యమాహాత్మ్యము ... ... | 81—87 |
| 19. | కిమ్మీరుడు—మార్గనిరోధము ... ... | 87—91 |
| 20. | అర్జునుడు—ఈశ్వరసాక్షాత్కారము... ... | 91—96 |
| 21. | అగస్త్యుడు—వాతాపిజీర్ణము ... ... | 96—100 |
| 22. | కౌశికుడు—క్రోధస్వభావము ... ... | 101—105 |
| 23. | దుర్యోధనుడు—ఘోషయాత్ర ... ... | 105—111 |
| 24. | సైంధవుడు—పరస్త్రీవాంఛాఫలము ... ... | 111—116 |

# భారత నీతి కథలు

## రెండవ భాగము

### 1. అంగారపర్ణుఁడు - గర్వభంగము

పాండవులు బ్రాహ్మణవేషములతో నేకచక్రపురమున జీవించుచు నొకనాఁడు ద్రౌపదీస్వయంవర వార్తలు వినిరి. ద్రౌపది పాంచాల దేశాధీశ్వరుండైన ద్రుపదుని కూఁతురు. లోకమునఁ జాటింపఁబడిన యామెస్వయంవర వార్తవిని ప్రసిద్ధులైన రాజకుమారులెల్లరుఁ బాంచాలరాజధానియగు కాంపిల్య నగరమునకుఁ బ్రయాణమగుచుండిరి. స్వయంవరోత్సవమున బహువిధ దక్షిణలం బడయఁగల మని వేదాధ్యయన సంపన్నులగు బ్రాహ్మణులుగూడఁ బాంచాలపురము చేరుకొనుచుండిరి. ఆ దినములలోఁ బట్టణములయందును బల్లెలయందును బ్రజలలో నిదియే ప్రసంగము.

ఈ వార్తలన్నియు వినుచుండుటచేత ద్రౌపదీ స్వయంవరమును దర్శింపవలయునని పాండవుల కుత్సాహముకలిగినది. తల్లియైన కుంతి కుమారుల యభీష్టమును గ్రహించి "నందనులారా! మన మీ యేకచక్రపురమునఁ బ్రవేశించి చాలకాలమైనది. ఇంకెంతకాల మిందుండఁగలము? ఉన్నను నేమి లాభము? మఱియు నొరులయింట నింతకాలముండుట యుచితముకాదు. దక్షిణ పాంచాలదేశములు మిక్కిలి రమ్యంబులనియుఁ బాంచాలరాజు పరమధార్మికుం డనియును మనము వినుచుందుము. అంతియెగాక, యాదేశమునందలి గృహస్థులు

కోరకయే బ్రాహ్మణులను దమంత పిలిచి సత్కరించుచుందు-రట. కావున మన మింకఁ బాంచాలరాజ్యమునకుఁ బోవుద" మని చెప్పెను. ధర్మరాజాదు లా మాటల కమందానందమును జెంది, "తల్లీ! నీ యాజ్ఞానుసారమే కావించెద" మనిరి.

ఇట్లు ప్రయాణమును నిశ్చయించుకొని, తమయింటి బ్రాహ్మణునకుఁ జెప్పి సెలవుగైకొని, యొక శుభదినంబునఁ బాండవులు తల్లితోఁ గాంపిల్యనగరమునకు బయలుదేఱిరి. అడవులు, కొండలు, నేఱులు, నదులు దాటుకొనుచు వారు పెక్కుదినములు ప్రయాణముచేసిరి. ఒకనాటి ప్రయాణములో వారికి మార్గమధ్యమున మహావిష్ణు సమానుఁడగు వ్యాస మహర్షి కానవచ్చెను. పాండవులును గుంతియు మిక్కిలి భక్తి వినయములతో నాతనికి నమస్కరించిరి. వ్యాసుఁడు వారి యెడఁ బ్రసన్నుఁడై, "ధర్మమూర్తులగు మీకందఱకు శుభం బగుఁగాక! మీ రుపేక్షింపక కాంపిల్య నగరంబున కేఁగుఁడు. అక్కడ మీకు మేలుకాఁగల"దని యాశీర్వదించి తనత్రోవం జనియెను. వ్యాసుని మహదాశీర్వాదమునకుఁ దల్లియుఁ గొడుకులు నమితానందభరితులై మార్గాయాసంబును బాటింపక రాత్రులును బగళ్ళును బయనము సాగించుచుండిరి.

ఆ ప్రయాణములో నొకనాటి యర్ధరాత్రమునఁ గటిక చీఁకటిలో దారి తెలియుటకు మండుచున్న యొకకొఱవి చేతఁ బట్టుకొని యర్జునుఁడు ముందు నడచుచుండెను. తక్కిన వారా వెలుఁగులో వానివెనుక వచ్చుచుండిరి. గంగానదియందలి సోమశ్రవం బను పుణ్యతీర్థంబున స్నానము చేయవలయునని వారి సంకల్పము. అందుచే వారా తీర్థపుమార్గముననే పోవు

చుండిరి. వారు గంగను సమీపించుసరికి, భార్యతో జలక్రీడా ర్థము వచ్చిన యంగారపర్ణుడను గంధర్వుడు పాండవుల పాద ధ్వనివిని, యాగ్రహించి విల్లునమ్ముల ధరించి ముందు నడచు చున్న యర్జుననడ్డగించెను. వానిం జూచిన తోడనే యర్జునుఁ డును, దక్కినవారును దటాలున నిలిచిపోయిరి. అప్పు డంగార పర్ణుండు గంభీరధ్వనితో వారికిట్లనియె. అర్ధరాత్రములును సంధ్యలును భూత యక్ష దానవ గంధర్వులు సంచరించెడు సమయములు. ఈ రెండు వేళలయందును నెంతటి బలవంతు లైన రాజులైన నీప్రాంతముల సంచరింపనేరరు ఇదంతయు నేను విహరించుచుండు ప్రదేశము. నే నంగారపర్ణుండను గంధ ర్వుఁడను. కుబేరుని సఖుండను. ఈవనంబున గంగయు “నంగార పర్ణ”యను పేర నొప్పుచుండు. మీరెవ్వరు? ఇట్లేలవచ్చితిరి? నన్నెన్నఁడును మీరువిన లేదా?,

వానిమాటల కర్జునుఁడునవ్వుచు ‘ఓయీ! గంధర్వా! అర్ధరాత్రములయందును సంధ్యలందు నిందు సంచరించుట కశ క్తులుగాని మేమట్లు భయపడము. ఎప్పుడైనను నెచ్చటనైనను మేము స్వేచ్ఛగా విహరింపఁగలము. మఱియుఁ బుణ్యనది యైన యీ భాగీరథి లోకమునకెల్ల సేవ్యయేకాని యొక్కని సొమ్ముకానేరదు. జననీ భాతృసహితుండనై నేనిప్పుడు గంగాభిషేకార్థము వచ్చితి. నీవువలదన్న నుడుగువాఁడనుగా నని పలికెను. అప్పు డంగారపర్ణుఁడు క్రోధోద్దీపిత మానసుండై ‘యట్లనిన నీఁక గాచుకొ’మ్మని పలుకుచు నర్జునునిపై నఖండ బాణవర్షమును గురియించెను. చేతంగల కొఱవి ద్రిప్పుచు నయ్యమ్ములు తన్ను దాకకుండఁ గాచుకొని పార్థుఁ

డా గంధర్వునిపై నాగ్నేయాస్త్రమును విడిచెను. అయ్యస్త్రము నుండి వెడలిన పెనుమంట లా గంధర్వుని రథముపైఁ గ్రమ్మి దానిని భస్మమొనరించినవి. అంగారపర్ణుఁడు నేలఁగూలి సొమ్మసిల్లి పడియె.

నేలఁగూలినంతనే యర్జునుఁడు వానిం గొప్పువట్టి ధర్మజాదులకడ కీడ్చి తెచ్చెను. అప్పుడు గంధర్వభార్యయైనకుంభీనస బోరన నేడ్చుచు వచ్చి ధర్మరాజు పాదములపైఁబడి తనకుఁ బతిదానమును గావింపుమని ప్రార్థించెను. కుంతీ ధర్మనందను లామెను గరుణించి యౌదార్య యంగారపర్ణుని విడిచిరి. అట్లనుగ్రహింపబడిన యా గంధర్వుఁడు ముకుళితహస్తుఁడై యర్జునున కిట్లనియె. "నీచేతఁ బరాజితుండ నగుటచే నేటి నుండియు నీయంగారపర్ణత్వమును విడిచి చిత్రరథుండను పేరసంచరించుచుందు, నేను స్త్రీలోలుండనై యుండుటచేతను నీవుబ్రహ్మచర్య వ్రతస్థుండవగుటచేతను నీవుజయించుటయు నేనోడుటయుఁ దటస్థించినది. మఱియొకఁ డీయర్ధరాత్రంబున నన్ను గెలిచి పోఁజాలఁడు.

గీ. పాండుపుత్ర ! నీవు బ్రహ్మచర్యస్థుండ
వగుటఁజేసి మన్మథార్తు నన్ను
నోడిచి తిందు రాత్రి యుద్ధంబుసేసి కా
మోపభోగ నిరతుఁ డోడువడఁడె?

## 2. సంవరణచరిత్రము-పురోహితప్రభావము

నాటియర్థరాత్రమునఁ బాండవులును జిత్రరథుఁడును జాలసేపు సంభాషించిరి. ఆగంధర్వుఁడు వారికిఁ గడుంగూర్చు

మిత్రుడయ్యెను. పాండవులును వానికి మిత్రులైరి. నాటిరాత్రి సంభాషణములోఁ జిత్రరథుఁడు 'పాండుకుమారులారా! పవిత్ర చరిత్రుఁడును ధర్మజ్ఞుఁడు నగునొక బ్రాహ్మణుని మీరు పురోహితునిగా నెంచుకొనుఁడు. అట్టిపురోహితునిఁ బురస్కరించు కొను రాజులకుఁ బాపభయంబును నపజయంబును గలుగవు. మీపూర్వుఁడైన సంవరణుం డను రాజు పురోహితుని యను గ్రహంబుననే తపతియను కన్యకను బడయఁ గల్గె'నని చెప్పెను. తోడనే పాండవులు సంవరణ చరిత్రంబును, బురోహిత ప్రభా వంబును దమకెఱింగింపవలసినదని కోరిరి. గంధర్వుఁ డిట్లు చెప్ప నారంభించెను.

సూర్యునకు సర్వశుభలక్షణ లక్షితాంగి యగు తపతి యను కూతురు గలిగెను. కాలక్రమంబున నక్కన్యారత్నము రూపగుణవిద్యాసమృద్ధిని యొవర్ధిల్లుచు, యౌవన ప్రాప్తయైనం తనే యాదిత్యుఁ డామెవివాహముమగూర్చి విచారింపసాగెను. సర్వవిధములఁ దపతి కనుగుణుండైన పతిం బడయుటకుఁ దపనుఁడు నిరంతరము పయత్నించుచుండెను. అట్టియెడ భరత వంశజుండును అజామీళునికుమారుండు నగు సంవరణుం డను రాజు తపతి గుణరూప విద్యావిశేషములను విని యామె యందు బద్ధానురాగుఁడయ్యెను. కాని తన ప్రభుత్వగౌరవము చేత సామాన్య రాజకన్యను బడయఁగలిగినట్లు సంవరణుం డాదిత్యకన్యను బడయఁజాలఁడుకదా! అందుచే సూర్యభగవా నుఁడు తనకుఁ బ్రసన్నుఁడై తపతీసతిని దనకనుగ్రహించుటకై యా రాజు జపోపవాసాది విధులతో నిత్యమును వాని నారా ధించు చుండెను. భగవంతుఁడైన భాస్వంతుఁడు వాని భక్తి

ఇంకయు దివ్య గగనమండలమున నధికప్రభతో నేను వెలుంగుచుండ భూమండలమున సుప్రసిద్ధుడై వెలుంగు సంవరణుండె నా పుత్రికిం దగిన వరుండని నిశ్చయించుకొనెను.

ఇట్లు సూర్యోపాసనాయత్తచిత్తుండై రాజు కాలము గడుపుచు నొకనాడు మృగయావినోదార్థము వనమున కరిగెను. ఆ వనంబున వేటతమకంబున సంచరించుచు సంవరణుని తురంగము క్షుత్పిపాసా పీడితమై నేల వ్రాలినది. అందువలన నతడు పాదచారియై సంచరించుచు క్రమక్రమముగ నొక పర్వతప్రదేశమును సమీపించి, యాకస్మికముగ నచ్చట నిరతిశయ రూపలావణ్యాతిశయములు గల యొక కన్యాలలామం గాంచెను. సంవరణుండామెనుజూచినంతనే యనిమిష లోచనుండై 'ఓహో! ఈ హేమగాత్రి తనుకాంతిచే నీ వృక్షలతాదు లన్నియు బంగారువికారము నొందుచున్నవి. ఈమె త్రిభువన సామ్రాజ్యలక్ష్మియో, యక్షకాంతయో, సిద్ధకన్యకయో, యమర సుందరియో కావలయును! దివ్యాంగనలకైన నిట్టి రూప విలాస సంపదలుండుట యసంభవము.' అని పలు విధముల శ్లాఘించుచు మెల్లగ నామెను సమీపించెను. సమీపించి రాజు తత్సౌందర్యావలోకనమునందు నిశ్చలత్వము నొందిన తన చూపు లామెయందె నిలిపి 'అబలా! నీవెవ్వరిదానవు? ఒంటరిగ నిర్జనంబున నేల మెలంగుదానవు?' అని యడిగెను. దానిమాటల కక్కన్య నిరుత్తరయై మేఘ మధ్యమున సౌదామిని వోలె దటాలున మాయమైనది.

ఇట్లదృశ్యయైన యక్కన్యంగానక సంవరణుడు ప్రలాపించుచు మిక్కిలి దుఃఖించుచుండ గొంతసేపునకు వానిం

గరుణించి మఱల నా సుందరి ప్రత్యక్షమై యిట్లల వగచెదవని యడిగెను. తోడనే యతఁడత్యానంద భరితుఁడై "సుందరీ! అధిక ప్రతాప బలదర్పంబుల రాజలోకమున కెల్ల నేనే పెద్దను. మున్నెవరికి నెందుకు భయంపడనివాఁడను. నేఁడు నీ యెడ భయార్తుఁడనై తిని. ప్రాణదానము గావించి నన్ను రక్షింపుము. గాంధర్వవివాహంబున నన్ను వరింపు"మని ప్రార్థించెను. రాజు మాటలకు లజ్జావనతవదనయైన యా మదవతి కొంతవడికి మొగంబెత్తి, "రాజేంద్రా! భువనైక దీపకుండగు సవితృనకు నేను తనూజను. సావిత్రి కవరజను. తపతి యనుదానను. నా యందు నీకుఁ బ్రియంబుగలదేని మా తండ్రి నడుగుము. అతండు నన్ను నీకీయఁగలండు. ఇట్టి సందర్భములఁ గన్యలకు స్వాతంత్ర్యంబులేమి నీ వెఱుంగుదువు గదా! కావున నాకై యాదిత్యు నారాధింపు"మని చెప్పి, తపతి సూర్యమండల మున కరిగెను.

తపతి యరిగినంతనే సంవరణుండు మూర్ఛాగతుం డయ్యెను. అప్పుడు వానిమంత్రిలలో నొకండువచ్చి రాజును శీతలోపచారంబుల సేదదీర్చెను. సంవరణుఁ డాపర్వతమున సూర్యునతిభక్తి నారాధించుచు నొకనాఁడు తన పురోహితుఁడైన వసిష్ఠమహర్షి ని దలంచుకొనెను. బ్రహ్మ సమానుండును మహాతపశ్శాలియు నగు వసిష్ఠమహాముని వానికిఁ బ్రత్యక్షమై వ్రతోపవాస కృశీభూత శరీరుండై యున్న పృథివీపతిం జూచెను. చూచి చూచిన మాత్రముననే, యాతఁడు తపనతనూజయైన తపతియందు బద్ధానురాగుండై యుండుట యోగదృష్టిచే, గ్రహించి సంవరణునకు శుభంబొనఁగూర్ప నిశ్చయించి

యాక్షణమ యప్రతిహత ప్రభావుండగు నమ్మునికులతిలకుండు సంకల్పమాత్రంబుననే యాదిత్యమండలమును సమీపించి, లోకలోచనుండైన కమలబాంధవుని సందర్శించి వేదమంత్రంబుల నెంతయు సన్నుతించెను. మునీశ్వర వరిష్ఠుండైన వసిష్ఠుని లోకబాంధవుండతిగౌరవంబున సంభావించి "మహాత్మా! మీయాగమనంబునకుఁ గారణంబే"మని యడిగెను. తోడనే వసిష్ఠుఁడు "ప్రభాకరా ! మా రాజు సంవరణుఁడు విద్యా గుణ సౌందర్య లావణ్యాదులయందు నీ తనయకుం దగిన వరుండు కూఁతుంగన్న ఫలంబుగా నీకన్నియ నాతని కొసంగవలయు'నని యడిగెను. భగవానుఁడాతని నెంతయు నాదరించి' మహాత్మా! రాజవంశకరుండైన సంవరణుండే తపతికి దగిన పతి,యుఁ పలుకుచు,నాక్షణమె యకన్యారత్న మును వసిష్ఠువెంటఁ బుత్తెంచెను.

ఇట్లొకనిమిషార్థంబున రెండువేల యోజనంబులునడచు నాదిత్యురథంబుతో నశ్రమంబున నరిగి తపనదత్తయైన తపతిందోడ్కొనివచ్చి, వసిష్ఠుండు విధివంతముగాఁ దనరాజునకు వివాహంబుచేసెను. కావున మహాత్ములైన పురోహితులను బడసినరాజులకు నిష్టశుభంబులగుట నిశ్చయంబు.

ఉ. వేదము వేదియుంగలుగు విప్రవరేణ్యుఁ డగణ్యపుణ్య సం
పాది పురోహితుండయినఁబాపముపొందునె భూపతింబ్రతా
పోదయ! కాన మీఁదగు గుణోన్నతికిందగు ధర్మతత్వసం
వేదిఁబురస్కరింపుఁడు పవిత్రచరిత్రు మహీసురోత్తమున్.

# 3. విశ్వామిత్రుఁడు - గర్వభంగము

గంధర్వుఁడు చెప్పినకథ విని పాండవులు మిక్కిలి సంతసించిరి. ఆ తపతీ సంవరణులకుఁ బుట్టిన కురుని మూలంబుననే మీవంశము కౌరవవంశ మయినది యని కూడ నాతఁడు వారి కెఱింగించెను. అంతయు విని యర్జునుం డత్యానందభరితుఁడై 'గంధర్వోత్తమా! పూజ్యులును బుణ్యభాగులును నగు మా పూర్వులకుఁ బురోహితుఁడైన వసిష్ఠమహర్షి మాహాత్మ్యము మేమింకను వినఁగోరెదము. మ మ్మనుగ్రహించి వచియింపు' మని ప్రార్థింప గంధర్వుఁ డిట్లనియె.

తొల్లి కన్యాకుబ్జమున గాధినందనుండగు విశ్వామిత్రుం డను రాజు కలఁడు. అతఁడు తన పరాక్రమాతిశయంబున ధాత్రి నిరమిత్రంబుగాఁ జేసి తన్నెదుర్కొనువారు లేకుండ నిర్భయంబుగ రాజ్యపరిపాలనము గావించుచుండెను. తాను క్షత్రియుం డగుటయుఁ దన్నెదిరింపఁగల శత్రుబలంబులు లేకుండుటయుఁ దలంచి, గాధేయుఁడు క్షత్రబలంబు కంటె మించిన బలము లేదని గర్వించు చుండెను. ఆ గర్వాతిశయంబున నతఁడు బ్రాహ్మణ ప్రభావంబులను గాని, తపః ప్రభావంబులను గాని లేశమును పాటింపకుండెను.

ఇట్లు రాజ్యమదాంధుఁడైన విశ్వామిత్రుం డొక్కనాఁడు మృగయా వినోదార్థం బపార సేనాసమేతుండై మహారణ్యంబుల కరిగి, పెద్దయుం బ్రొద్దు వేటాడి మిక్కిలి డస్సెను. అయ్యరణ్య భాగంబున ననతిదూరంబుననే వానికొక మున్యాశ్రమము గానవచ్చినది. అయ్యాశ్రమాంతరంబున గాధేయుం డొక్కింత విశ్రమింపఁదలంచి మెల్లగా నచ్చటఁ

జేరుకొనియెను. చేరి ప్రాంతముల సంచరించు ఋషికుమారులం బిలిచి యతఁడియ్యాశ్రమ మెవ్వరిదని యడుగ వసిష్ఠమహర్షి దని చెప్పి వారాతనితో లోనికిఁగొనిపోయిరి. అప్పుడుమహాత్ముఁ డైన వసిష్ఠుఁడు వానిరాక నెఱిఁగి యెదురుగవచ్చి యర్ఘ్య పాద్యాదులొసంగి, విశ్వామిత్రు నతిప్రీతిం బూజించెను. మఱియురాజునుపై నికులును మృగయావిహారంబునఁ గడుంగడు డస్సినవా రగుటచే నయ్యందఱుంగూడ నభిమతాహారంబు లొసంగి పరితృప్తులఁ గావింపుమని వసిష్ఠుఁడు తన హోమ ధేనువైన నందినిని నియోగించెను.

మహర్షి యాజ్ఞానుసారముగ నా నందిని తన సంకల్ప మాత్రంబుననే ఘృతంబును నదిగా ప్రవహింపఁజేసెను. అన్న రాసులను బర్వతపంక్తులుగాఁ బేర్చెను. రసపూరితంబులగు బహువిధోపదంశముల ననేకములఁ గల్పించెను. వివిధభక్ష్య భోజనంబుల నపారంబుగా సృష్టించెను. ఇట్లు తనకును లక్షల కొలఁదిగల తన సేనలకును క్షణమాత్రంబుననే చతుర్విధా హారంబులఁ బ్రసాదించి పరితృప్తులఁ గావింపఁగలిగిన యా హోమధేనువుంజూచి, దాని యద్భుతకృత్యంబునకు విశ్వా మిత్రుండెంతయు నిశ్చేష్టితుండయ్యెను. అతఁడట్లు విస్మితుం డగుచు నాత్మగతంబున 'అద్దిరా! శంఖంబులంబోలు కర్ణంబు లును, మెత్తని వలుదపొదుఁగును, గుఱచలై పొలుచు కొమ్ము లును, మృదువైన రోమంబులును, శరత్కాల చంద్రికా సన్ని భంబైన మేనిచాయయుఁ గల యిమ్మొదవు "పెన్నిధి చిక్కిన" ట్లిమ్మునికెట్లు చిక్కెను? దీనినెట్లులైన నేను దక్కించు కొందు' నని నిశ్చయించుకొనెను. అట్టి నిశ్చయముతో విశ్వా

మిత్రుఁడు వసిష్ఠుని సమీపించి యిట్లనియె. "మునిచంద్రమా! మీ రొసంగిన యాతిథ్యంబున మేము కృతార్థులమైతిమి. మీయాజ్ఞానుసారముగ నాశ్రిత జనానందినియగు నందిని సంకల్పమాత్రంబుననే షడ్రసోపేత భోజనంబుల మమ్ముఁ బరితుష్టులఁగావించె. సకలభోగంబులు వర్జించి యరణ్యంబులం జేరి వారిభక్షులును బర్ణభక్షులునై తపము చేసికొనుచుండు మీవంటి ఋషులకు మహదైశ్వర్యదాయకంబగు నీ హోమ ధేనువువలన నేమి ప్రయోజనంబున్నది? ప్రయోజనము లేకుండుటయె కాదు. అనర్థదాయకంబుగాఁగలదు, ఈ నందిని కల్పించు భోగములయందు మీకాసక్తి వొడముచుండును. అట్టియాసక్తివలనఁ దపోభంగము జరుగుచుండును. కామ ధేనువుంబోలు నిట్టి హోమధేనువు మీవంటి యుత్తమ తపస్వులకడ నుండరానిది. కావున దీనిని నాకనుగ్రహింపుఁడు. నందినికన్న నుత్తమంబులగు నొకలక్ష మొదవుల మీకిచ్చెద.'

వసిష్ఠుఁడు వానిమాటలకు నవ్వుచు, 'రాజేంద్రా! ఈచిడిపికుఱ్ఱకి లక్ష మొదవుల నొసంగనేల? వానిని నేనెట్లు కాపాడఁగలను? పితృదేవతలను, మీవంటి యతిథులను దీని చేతనే నిత్యమును సంతృప్తులఁజేయఁగలుగుచున్నాను. అందుచే నియ్యది 'యన్యుల కీయఁబడ'దని బదులుచెప్పెను. తోడనే కోపస్వభావుఁడగు విశ్వామిత్రునకు వసిష్ఠునిపై దురాగ్రహము జనించినది. "నేనుక్షత్రియుండను.నిగ్రహానుగ్రహసమర్థుండను. నీవు బ్రాహ్మణుఁడవు. పరమశాంతుండవు. నన్నేమిసేయఁ గలవు? లక్ష మొదవుల నిచ్చెదనన్న నొల్లవైతివి గావున నవశ్యముగ బలిమిం జేసియైనను దీనిం బరిగ్రహింతు"నని పలు

కుచు నందినిం బట్టుకొనుఁడని తన సైనికులకు నియోగించెను. పరులవలన బాధ కలుగకుండ సాధుజనుల రక్షింపవలసిన రాజు తానే సాధుబాధ కుపక్రమించునెడ నింక నెవరేమి చేయఁగలరు!

గాధేయుని యనుమతిచొప్పున నాతని సైనికులు నందినిం బట్టుముట్టిరి. కాని యయ్యది వారికిం బట్టువడక, తీవ్రములగు వారి దండతాడనంబులచేఁ బీడింపఁబడి యఱచుచు వసిష్ఠునొద్దకువచ్చి యిట్లనియె. "మహాత్మా! అధర్మపరులగు నిన్నరులకు నన్నిచ్చితి రే? నన్నేల యుపేక్షించితిరి? ఇది మీకు ధర్మమా?" వసిష్ఠుఁడామాటల కేమియుఁ బ్రత్యుత్తరం బీయక యూరకుండె. అందువలన వాని యభిప్రాయం బెఱింగి తన్ను వారి కీయలేదని గ్రహించి, నందిని తన వత్సంబును బట్టుకొను చుండిన సైనికులవంకకుఁబరుగెత్తెను. తోడనే తక్కిన సేనలును నందినిని వెంబడించెను. అప్పట్టున నాకామధేనువు విజృంభించి మండు వేసంగిలోని మధ్యందిన మార్తాండమూర్తియుం బోలె దుర్నిరీక్ష్యయై యుక్కుమీర రంగవిక్షేపంబు గావించెను. తోడనే భయంకరమగు నంగారవృష్టి కురియసాగెను. మఱియు నందిని వాలంబునుండి శబర సేనలును, శకృన్మూత్రమునుండి శక యవన పుండ్ర పుళింద ద్రవిడ సింహళ సైన్యములును, ఫేనంబులనుండి దరద బర్బర సైన్యములును జనించినవి. ఇట్లు జనించి శత్రుసైన్యములకంటె నధిక సంఖ్యాకంబులై యాయద్భుతసైన్యములు విశ్వామిత్రుని సేనల నెల్ల నిముసములో నేలపాలు గావించెను.

అట్టి బ్రహ్మతేజోజనితంబైన ప్రభావంబుచూచి విశ్వా

మిత్రుఁడు లజ్జావనత వదనుఁడై తన క్షత్రబలమును నిందించి యెల్ల బలంబులకు మిక్కిలి తపోబలంబెయని తెలిసికొనెను.

చ. పొలుపగు రాజ్యసంపదల భోగములెల్లఁ దృణంబుగా మదిం
దలఁచి విరక్తుఁడై విడిచి దారుణ శైల వనాంతరంబులన్
వెలయఁ దపంబుసేసి గుణవిశ్రుతుఁడై పడసెన్ మహాతపో
బలమునుసర్వసంపదలు, బ్రహ్మఋషిత్వము,దివ్యశక్తియున్

# 4. కల్మాషపాదుఁడు-బ్రాహ్మణ తిరస్కారము

వసిష్ఠుని యద్భుత ప్రభావమునకుఁ బాండవులు మహాశ్చర్యచేతస్కులైరి. 'చిత్రరథా! నీవు సర్వజ్ఞుండవు. నీ మూలంబున బ్రహ్మతేజోధికుండైన వసిష్ఠుని మాహాత్మ్యమును వినఁగలిగి కృతార్థుల మైతిమి. మిత్రమా! ఆ మహాత్మున కిల్లాలై ధన్యురాలైన పుణ్యురాలెవరు? పురాణదంపతులం బోలు నా పుణ్యదంపతులకుఁ బుట్టిన పుత్రులెవ్వరు? వారును దండ్రియంతటి తపస్సంపన్నులు కాఁగలిగిరా?' అని వసిష్ఠ కథాశ్రవణ కౌతూహలంబున నర్జునాదు లెన్నియో ప్రశ్నలడుగుచుండ నా గంధర్వుండు వెండియు వారి కిట్లనియె.

జగత్పావనశీలయైన యరుంధతి వసిష్ఠుని భార్య. ఆమ్మహాసాధ్వియం దాయనకు నూర్వురు పుత్రులు జనించిరి.

అయోధ్యా పురాధీశ్వరుండును నిక్ష్వాకు కుల సంభవుండును నగు కల్మాషపాదుం డను రాజు మృగయావినోదంబున నొక్కనాఁడు వసిష్ఠాశ్రమ సమీపారణ్య భూముల విహరించుచు గిరి గహన సంచారంబున నెంతయు డస్సి విశ్రి

మార్గము దదాశ్రమమువంకకు వచ్చుచుండెను. అప్పుడువసిష్ఠ పుత్రశతంబున కగ్రజన్ముండును నధిక తపశ్శక్తియుక్తుండును నగు శక్తియను మహాముని యొయ్యరణ్యంబున నింధనార్థంబు పోవుచు మార్గమధ్యంబున వానికెదురయ్యెను. రాజులదర్శించి నంతనే మ్రొక్కుటయుఁ బ్రక్కకుఁ దొలంగుటయు మున్నగు భక్తివినయ సూచనంబులు తన యెడఁ జూపని శక్తింజూచి, రాజాభిమానంబునఁ గల్మాషపాదుఁడు తెరువు దొలంగుమని యొసడించుచుఁ బలికెను. "రాజా! ఎట్టి రాజులైనను బ్రాహ్మణోత్తము లెదు రగుడెంచు నప్పుడు భక్తియుక్తులై నమస్కరించి ప్రియంబులు పలికి మార్గం బొసంగెదరు. ఇదియే యుత్తమ ధర్మము. దీనిని నీవేల యెఱుంగకున్నా" వని శక్తి బదులు చెప్పెను. అంతఁ గల్మాషపాదుఁడు వానిపై నాగ్రహించి తన చేతనున్న కశకోలతో నమ్మునీంద్రుని దీవ్రముగ వ్రేసెను. ఇట్లవమానితుండైన శక్తియు నపార కోపారుణిత నయనుండై వానిం జూచుచుఁ జూచి "ఓరీ! రాజాధమా! నీవు రాక్షసాకారంబున నకారణంబ నాకపకారంబు గావించితివి. కావున రాక్షసుండవై మనుష్య మాంసం బాహారంబుగ నుండు" మని శపించెను. అప్పుడు రాజు వానిని వసిష్ఠతన యునిగా గ్రహించి తన యపరాధంబునకు వగచుచు ముకు ళితహస్తుఁడై "మునీంద్రా! నన్ను మన్నించి యీ శాపంబు బాపుకొను నుపాయంబును బ్రసాదింపు"మని ప్రార్థింపసాగెను. అంతలో వసిష్ఠునకు బద్ధవైరుండైన విశ్వామిత్రుఁడచ్చటికి వచ్చి వారలు తన్నెఱుంగకుండ నంతర్హితుఁడయి యుండి, కింకరుఁ డను నొక్క రక్కసుని రాజహృదయంబునఁ బ్రవేశింపుమని

యాజ్ఞాపించెను. విశ్వామిత్రు నాదేశంబునను, శక్తి శాపంబునను గింకరుఁడు కల్మాషపాదుని యంతరంగంబున నావేశింపఁగల్గెను.

ఇట్లు రాక్షసావిష్టుఁడై యారాజు తన రాజ్యంబునకు వచ్చి, పూర్వపు మనఃప్రవృత్తి లేశంబును లేక క్రూరదృష్టులు గ్రుంచి స్వభావమును సహించి రాజకార్యములయందు మతిలేకుండ సంచరింపసాగెను. వానికడ కొకనాఁడొక బ్రాహ్మణుఁ డపథిక క్షుధార్తుఁడై వచ్చి, సమాంసంబైన భోజనంబు తనకు బెట్టింపుమని యడుగఁ గల్మాషపాదుండు ప్రేయసీకేళికై యంతఃపురంబునకుఁ బోయి యాసంగతి మఱచిపోయెను. నాటి యర్ధరాత్రంబున స్ఫురణకు వచ్చినంతనే యతఁడు తన వంటవానిం బిలిచి, యా బ్రాహ్మణునకు భోజనము నొసంగుమని నియోగించెను. కాని బ్రాహ్మణుం డయ్యకాలభోజన మంగీకరింప లేదు. ఆసంగతి వానసంబువాఁ డెఱింగింప మనుష్యమాంసంబు గొని పోయి పెట్టుమని కల్మాషపాదుఁడనెను. వాఁడును వధ్యస్థానంబునకుం జని నరమాంసమును గొని బ్రాహ్మణునకు వడ్డించినంతనే యతఁ డయ్యది దివ్యదృష్టినిగ్రహించి, యాగ్రహించి, "ఓరీ రాజాధమా! అభోజ్యంబైన మానవ మాంసమును బెట్టిన నీవు మనుష్యాదుండవుకమ్ము" అని శపించెను. కల్మాషపాదుండును మానుషభావంబు విడిచి రాక్షసుండయ్యె.

ఇట్లురాక్షసుండైన తత్క్షణంబుననే యతం డతిత్వరిత గతిని శక్తి యొద్దకువచ్చి "నీకారణంబున నాకిట్టి శాపవ్యాపారంబు సంభవించెను. కావున దీని ఫలంబు మున్ముందు నీవె యనుభవింపు"మని పలుకుచు వానిం జంపివేసెను. ఆ కృత్య

మునకు విశ్వామిత్రుండెంతయు సంతసించి, యా రాక్షసునకు బోధించి వసిష్ఠపుత్రుల నందఱంగూడ వానిచేఁ జంపించెను. ఇట్లొక్కమాఱుగ రాక్షసనిహతులైన కుమారకులం జూచి, పరమయోగధురుండయ్యు బాపము వసిష్ఠుఁడు శతపుత్రశోక దందహ్యమానమానసుండయ్యెను. క్రమక్రమముగ నతఁడు దుఃఖాతిశయంబున వివశాత్ముండై యాత్మహత్య మహాపాపం బని తలంపనేరక, యావిషాదంబున దావానల మధ్యంబునఁ జొచ్చెను. కాని యాతఁడు చొచ్చినంతనే యమ్మహానలంబు వానికి శీతంబై వానికెట్టి యపాయంబును గావింపదయ్యె.

అంత వసిష్ఠుఁడు కంఠదేశంబున రాయి గట్టుకొని సముద్రమధ్యమున నుఱికెను. తోడనే సముద్రస్వామి తన యుత్తుంగ తరంగహస్తంబుల నాతనింబట్టియెత్తి యతిభద్రం బుగఁ దీరంబునం జేర్చె. సుతశత వర్జితంబైన యాశ్రమంబింకఁ జూడనొల్లనని వసిష్ఠుం డింటికిఁ బోనొల్లక యచ్చటినుండి మేరు పర్వతంబునకుఁ బోయి యత్యున్నతంబయిన తచ్ఛిఖరం బెక్కి యందుండి తటాలున నేలకు దుమికెను. అత్యధిక తపస్సంప న్నుఁడైన యమ్మహాత్ముని దేహబంధము లేశమైన గాయము పడదయ్యె. పిమ్మట నతఁ డతిభయంకరముగఁ బ్రవహించు చుండిన యొక మహానదిం బ్రవేశించెను. అయ్యది శతవిధం బులఁ బరిద్రుతయై వసిష్ఠునకు స్థల మొసంగుటచే దానికి శతద్రు నామము వచ్చినది.

ఇట్లు శరీర పరిత్యాగంబున కెన్నివిధంబుల ప్రయత్నిం చినను గడ కప్రాప్తమరణుండై వసిష్ఠుండు విసిగి, మరణ వ్యవ సాయంబు విడిచి యాశ్రమంబునకు వచ్చుచు నొకచో శక్తి

భార్యయగు నదృశ్యంతినిఁ జూచెను. తోడనే గర్భవతియగు తనకోడలి యుదరంబునుండి షడంగాలంకృతంబైన వేదనాద మతి మనోహరముగ వానికి వినవచ్చెను. ఆ ధ్వని శక్తి కంఠ ధ్వనిగా నూహించుటచే వేదవేదాంగముల ధరించిన పౌత్రుఁ డామె పుణ్యోదరమున నున్నవాఁడని సంతసించి మునుమని ముఖముచూచి యేను కృతార్థుఁడ నయ్యెద నని యతఁడు నిశ్చయించు కొనెను. నాఁటినుండియు వసిష్ఠుఁడు మరణ ప్రయత్నమును సంపూర్ణముగా విడిచి నిజాశ్రమంబునఁ గోడలిని గాపాడుచుండ నొకనాఁ డాకస్మికముగ రాక్షసుం డైన కల్మాషపాదుం డచ్చటికి వచ్చెను. వాని భయంకరాకృతిం జూచి యదృశ్యంతి వెఱచి గడగడ వడఁకుచుండ, వసిష్ఠుఁ డామెకు ధైర్యముచెప్పి మంత్రపూతంబులైన కమండలూద కంబుల నా రక్కసునిపైఁ జిలికె. తోడనే వాఁడు శాప విముక్తుండై రక్కసు రూపు విడిచి నిజరూపంబును దాల్చి యు త్తపోధనునకుఁ బాదాక్రాంతుఁడయ్యెను.అప్పుడు వసిష్ఠుఁడు వాని కిట్లు నీతి నుపదేశించెను.

చ. గుణములనొప్పి బ్రాహ్మణులకుం గడుభక్తుఁడవై సమస్తధా
రుణిఁ బ్రజఁ బ్రోచుచున్ విగతరోషుఁడవై సుఖముండుమింక బ్రా
హ్మణులకవజ్ఞసేయక శమంబును జేకొను మింద్రుఁడైన బ్రా
హ్మణులకవజ్ఞసేసి యవమానముఁబొందుఁ బ్రతాపహీనుఁడై.

## 5. ఔర్వుఁడు - భయంకర కోపాగ్ని

"గంధర్వోత్తమా ! నీవు కథాకథన కుశలుండవు. మహాత్ముల పుణ్యచరిత్రములను నీవలననే వినవలయు. మహర్షి

యైన వసిష్ఠున కుద్భవించిన పౌత్రుం డెట్టివాఁడయ్యె ? వాని వృత్తాంతముకూడ నొకింత మా కెఱింగింపు'' మని ధర్మ రాజాదులు మఱలఁ బ్రార్థింపఁ జిత్రరథుండు వారి కిట్లనియె.

పాండుకుమారులారా! వసిష్ఠుని మనుమఁడు జగత్ప్రఖ్యాత పురుషుం డగు పరాశరుండు. అతఁ డుదయించినంతనే పితామహుండు వానికి జాతకర్మాది విధివిధానములను గావించి యల్లారుముద్దుగఁ బెంచుచుండెను. తాతచేతను దాతకంటె నెక్కుడుగఁ దల్లిచేతను గారవింపఁబడుచు నొకనాఁడు పరాశరుండు మా తండ్రిగా రెందున్నారని తన జనయిత్రి నడిగెను. ఆమాటల కదృశ్యంతి ప్రత్యుత్తరంబీయక కన్నీరుగార్చుచు వలవలయేడ్వఁదొడంగెను. అందువలనఁ దనతండ్రి పంచత్వమొంది నట్లు గ్రహించి యమ్మునికుమారుఁడు "తల్లీ! దుఃఖింపకుము. కన్నీరు దుడుచుకొనుము. మాతండ్రి కపరాధంబు గావించి నీకిట్టిదుఃఖంబు గల్పించినవా రెవ్వరో నాకెఱింగింపుము. తగిన ప్రతిక్రియ గావించి నీ సంతాపం బడంగించెద'' ననుటయు, నదృశ్యంతి "నాయనా! నీజనకుఁ డొక్కరక్కసునిచే భక్షింపఁ బడియె'' నని యా వృత్తాంతం బంతయు వినిపించెను. గర్భవాసమునందే సకల వేదవేదాంగ పారీణుండై యత్యంత తపశ్శక్తియుక్తుండై జనించిన పరాశరుండు జనకవధ విధానంబు విని కోపదహన దందహ్యమాన హృదయుండై తన తపోమహాత్త్వంబున సకలలోకముల సంహరించెదనని కమండలువు గైకొనుచుండ వసిష్ఠుఁడు వచ్చి మనుమని వారించి యిట్లనియె.

తండ్రీ! నీ దుస్సాహసం బుడుగుము. నీ కొక్క యితి

హాసఁబు చెప్పెద వినుము. కృతవీర్యుం డను రాజు కలఁడు. అతఁడు భృగువంశమువారిని గురువులుగాఁ జేసికొని యనేక యజ్ఞములొనర్చి యా యజ్ఞములయందు వారి కపరిమితములైన ధనము లిచ్చి తృప్తిపరచెను. కృతవీర్యుఁడు స్వర్గస్థుఁడైన యంతనే యతని వంశస్థులైన రాజు లందఱు నతి ధనలుబ్ధులై “ఓ భృగువంశ బ్రాహ్మణులారా! కృతవీర్యుని మోసపుచ్చి మీరార్జించిన ధనంబులెల్ల మాకు దిరిగి చెల్లింపుఁ” డని తీవ్రముగ శాసించిరి. భార్గవులు రాజశాసనంబునకు భయపడి తమ తమ ధనకనక వస్తువాహనాదులను గొనిపోయి వారికి సమర్పించుకొనుచుండిరి. కొందఱు బ్రాహ్మణులు తమ ధనంబుల రహస్యముగఁ బాతిపెట్టి యూరకుండిరి. రాజు లనుమానించి యట్టివారి గృహముల శోధింపఁ దద్ధనంబులెల్ల బయలుపడెనవి. అంత నా క్షత్రియు లాగ్రహించి “యీ భార్గవులు రాజధన వంచకులు. వీరినిఁ గడతేర్ప వలయు”నని యెంచి, గర్భంబులనున్న యర్భకులు మొదలుగా భార్గవకుల సంహారంబును బ్రారంభించిరి. ఆ దారుణసంహారమునకు భయపడి కొందఱు భార్గవభార్యలు హిమవంతమునకుఁ బాఱిపోయిరి. వారిలో గర్భవతియగు నొక భార్గవి క్షత్రియులవలన నపాయంబు శంకించి, తన గర్భంబు నూరుదేశంబున ధరించెను.

ఇట్లు పలాయనులైన భార్గవ భార్యలను వెదకుచు క్షత్రియులు హిమవంతమును సమీపించిరి. అంతకు మున్నె భార్గవియూరు ప్రదేశమునుండి ప్రళయకాలచండమార్తాండునిం బురుడించు తీవ్రతేజంబుతో నౌర్వుండను నర్భకుం డుద్భవించెను. భార్గవ భార్యల సమీపించిన రాజులెల్లరు సమితో

గుఱ్ఱిండగు నబ్బాలకుంజూచి, హతదృష్టులై యంధులై చేయున దేమియు లేక తత్పర్వతారణ్య ప్రదేశములఁ గ్రుమ్మరుచుండిరి. అట్లు గుమ్మరుచు నొకనా డంధులైన యా క్షత్రియులెల్లరు భృగుపత్నికడకు వచ్చి మాకు దృష్టిదానంబు ప్రసాదింపవలయునని ప్రార్థింపసాగిరి. 'నేను మీదృష్టు లపహరించినదానను గాను. మీచేఁ దనగురువులు పరిభూతులైరని మీపై నలిగి మిమ్మంధులఁ గావించినవాఁడు భానుతేజుండైన యిక్కుమార కుండు. వీఁడు నూరు సంవత్సరములు నా యూరుగర్భంబునం దుండి సకల వేద వేదాంగములు నేర్చినవాఁడు. మహాత్ముఁ డితనిం బ్రార్థించిన మిమ్ముఁ గరుణింపఁగలఁ' డని భృగుపత్ని పలికెను. అంత క్షత్రియులు మహాప్రసాదమని యతిభక్తితో నౌర్వునిం బ్రార్థించి వానిప్రసాదంబున నేత్రంబులఁబడసి చనిరి.

పిదప నౌర్వుఁడు తన పితృబంధుజనులెల్ల నొక్కటఁ బరలోకగతులగుటకు దుఃఖించి సకలలోక ప్రళయార్థంబు ఘోరతపంబు సేయందొడఁగెను. అప్పుడు వాని తపంబు పెంపునఁ జరాచర సావృతంబులైన లోకంబులెల్ల సంక్షుభితంబులు కాఁజొచ్చె. దానంజేసి పితృలోక నివాసులైన భార్గవులు భూలోకమునకు డిగ్గి యౌర్వునకుఁ బ్రసన్నులై "అయ్యా! నీ తపోమహత్త్వమును జూచి లోకములెల్ల భయంపడియె. లోకానుగ్రహంబుగ నీ క్రోధంబు విడువుము. మే మసమర్థులమై క్షత్రియులచే వధియింపఁబడినవారము కాము. తపోమాహాత్మ్యమున మాకాయుష్యంబు కడు పెద్దదియైయుండుటయు, మనుష్యలోకంబున నుండుట కిష్టము లేకపోవుటయు నూహించి పాపభయముచే నాత్మఘాతముచేసికొనక, క్షత్రి

యులతో వైరంబు తెచ్చుకొని తన్నిమిత్తంబున దేహంబులు విడిచితిమి. దీనికి నలిగి సకల లోకంబుల కుపద్రవంబు గలిగింపక శాంతింపుము. ఇదియె మాయిష్ట" మని పలికిరి. ఔర్వుండును గొంత శాంతుఁడై ముకుళిత కరకమలుండై "మహాత్ములారా! క్రోధాతిశయంబున ముల్లోకములకుఁ బరాభవం బాచరింతునని ప్రతిజ్ఞఁబూనితి. నాక్రోధానలం బమోఘంబు. దీని నెందు విడువుమనెద" రని యడిగెను. అంతఁ బితృదేవతలు "కుమారా! జలములయందు సర్వలోకంబులు నుండు గావున నీ మహోగ్రక్రోధాగ్ని సముద్రమధ్యంబున విడిచి నీవుసత్యప్రతిజ్ఞుండవుకమ్ము. అయ్యది జలధి జలములను దహింపఁగల" దని చెప్పిరి.

పితృదేవతాదేశమున నౌర్వుండు తన కోపానలమును సముద్రమునందు విడిచెను. దాని కౌర్వానలం బను పేరు కలిగినది. నా యాదేశమున నీవును నౌర్వునివలె నింక శాంతచిత్తుండవై సకలలోక హితార్థం బీ యుద్యమమునుండి తొలంగుమని వసిష్ఠుఁడు బోధించినంతనే పరాశరుండును శాంతించెను.

క. కామంబును గ్రోధంబును
నేమఱక జయింపవలయు నెల్ల విధములన్
ధీమహిత యిదియె సతత
క్షేమంకరమైన పథము కృతబుద్ధులకున్-

# 6. అర్జునుడు - ధనుర్విద్యాఫలము

గంధర్వుఁడు చెప్పిన యుపాఖ్యానంబులకుఁ బాండవులు మిక్కిలి సంతసించి "చిత్రరథా! నీవు మా కతిప్రియుండవు. సమస్త విదుండవు. నీ యెఱుఁగని మహాపురుషులు లేరు. మాకుఁ బురోహితుఁడు గాఁదగిన ధర్మతత్త్వవిదుం డెవ్వఁడో యెఱిఁగింపు" మని యడిగిరి. అంత గంధర్వుఁడు పెద్దయుం బ్రొద్దు చింతించి, యచ్చటికి సమీపంబుననే యుత్కచం బను పుణ్యతీర్థంబునఁ దపము సేయుచున్న ధౌమ్యుఁ డను బ్రాహ్మణునిఁ బురోహితునిగాఁ బ్రార్థింపుఁ డనియు, నమ్మహాత్ముఁడు పురోహితుఁడైన మీకు సర్వార్థసిద్ధియగుననియుఁ జెప్పెను. పాండవులును సంగీకరించి గంధర్వుని వీడ్కొని ధౌమ్యునిపాలికేగి వానిని సందర్శించి, మాకుఁ బురోహితుండవు గమ్మని, యతిభక్తిం బ్రార్థించిరి. ధౌమ్యుండును వారి నతిప్రీతింబూజించి పురోహితత్వంబు పరిగ్రహించె. ధౌమ్యుని యాశీర్వాదపూర్వకంబగు ననుమతి వడసి పాండవు లాతని వీడ్కొని పాంచాలపురమునకు బయలుదేఱిరి.

ద్రౌపదీస్వయంవర మహోత్సవంబును దర్శించుటకై ద్రుపదపురంబునకుం బోవు బ్రాహ్మణుల ననేకుల మార్గ మధ్యమునఁ బాండవులు కలిసికొనిరి. బ్రాహ్మణవేషధారులై యున్న పాండవులనుజూచి, యాబ్రాహ్మణు లెల్లరు వారిని బ్రాహ్మణులుగా నిశ్చయించుకొనిరి. అంతియగాక, యాజాను బాహుండగు నర్జునునిజూచి, యాబ్రాహ్మణులు వీనిని ద్రౌపది వరియింపవచ్చుననియును బలుక సాగిరి.

ఇట్లు బ్రాహ్మణులతోఁ గూడఁ బాండు నందనులు

బ్రాహ్మణరూపధరులయి పోవుచు మార్గమధ్యమున నొక్కెడఁ గృష్ణమృగాజినధరుండైన కృష్ణద్వైపాయనుని గాంచి వినయంబున నమ్మునీంద్రునకు నందఱు నమస్కారంబులు సేసి కృతాంజలులైరి. వ్యాసుండు హృదయపూర్వకంబుగా వారి నాశీర్వదించి వారికి హృదయానందం బగునట్లు కాఁగల శుభంబులు నివేదించి చనియెను. అత్యానందముతో ధర్మజాదులు కతిపయ దినంబులకు ద్రుపదపురంబు ప్రవేశించి, నాలుగు సముద్రంబులం బోలె ఘూర్ణిల్లి మ్రోయుచున్న పురమునకు నాలుగు దిక్కులను విడిసియున్న నానాదేశాగత మహీనాథుల బహువిధ స్కంధావారంబులఁ జూచుచుఁ బోయి తమ్మెవ్వ రెఱుంగకుండ నొక కుంభకార గృహంబున విడిసిరి.

ద్రుపదుఁ డర్జునునిచే నోడింపఁబడి, ద్రోణునకు గురుదక్షిణగా నొసంగబడిన కథ బాలురకు జ్ఞప్తియుండవచ్చును. ఆనాటినుండియు ద్రుపదుఁడు ద్రోణునియందు మత్సరము కలవాఁడై, ద్రోణుని వధించునట్టి కొడుకును నర్జునునకు భార్య యగునట్టి కూతును బడయుదునని నిశ్చయించుకొని బ్రాహ్మణుల నాశ్రయించి పుత్రికామేష్టి యను యజ్ఞమును గావించెను. ఆ యజ్ఞంబున నగ్నిదేవుఁడు వానికిఁ బ్రసన్నుఁడై ధృష్టద్యుమ్నుం డను కుమారునిఁ గృష్ణ యను కుమారికను ననుగ్రహించెను.

పాండవులు లక్కయింటఁ గడతేఱి రను వార్తలు విన్నది మొదలుగ ద్రుపదుఁడు ఖిన్నుండై యర్జునుఁడు తన కల్లుఁడు కాఁగల భాగ్యంబు పోయెనని వగచుచు, నింకను

ననుమానంబు తీరక పాండవు లెందైనఁ గలరేమో యని నానా దేశంబులు వెదకించెను. కాని విప్రవేషధరులై యున్న వారి నెవ్వరును గుర్తింప లేక పోయిరి. ఆ కారణంబునఁ బాంచాలపతి స్వయంవరము చాటించెను. అంతరిక్షంబున నొక మత్స్యయంత్రమును లక్ష్యముగా నమర్చి యత్యున్నతంబును మహాభారంబు నగు విల్లు దెప్పించి, యవ్వింట నేను బాణంబుల నెవ్వఁ డా లక్ష్యము నేయువాఁడో వాఁడు పాంచాలినిం బడయఁగలఁడని ద్రుపదుఁడు రాజలోకమున కెల్ల వెల్లడించెను.

మహాపవిత్రయు నగ్నికుండ సంభూతయు నగు కృష్ణను బడయఁ బ్రయత్నించుటకై భూమండలమునంగల సకల దేశాధీశ్వరులును స్వయంవరమునకువచ్చిరి. కుంభకారగృహంబున బ్రాహ్మణవృత్తిని సంచరించుచుండిన పాండు కుమారులును బ్రాహ్మణవర్గంబులతోఁగూడి యమ్మహోత్సవమునకువచ్చిరి. అత్యంత రమణీయంబుగ నలంకరింపఁబడిన నాఁటి స్వయంవర రంగమున వీరాగ్రగణ్యులగు రాజపుత్రులకెల్ల ద్రుపదుఁ డుచిత సానంబులఁ గల్పించి గౌరవించెను. వేదవేదాంగవిదులైన విప్రవరులెల్లరు వేఱొక్కెడస నాదరింపఁబడిరి. రాజలోకములో నొకయెడ నున్న శ్రీకృష్ణుఁడు బ్రాహ్మణ మధ్యంబున నున్న పాండునందనులంజూచి సంతసించి పార్థుండు పాంచాలిం బడయుఁగాకయని కోరుచుండెను. అట్టి యవసరంబున మహావైభవంబుగ నలంకృతయై కేల సితపుష్ప మాలంగొని పాంచాలకన్యక రంగమధ్యంబున నుండి సకల రాజలోకంబుల కన్నులకు మిఱుమిట్లు గల్పించుచుండెను. భూసుర ప్రవరుల

పుణ్యాహ ఘోషములతోడను మంగళధ్వానంబులతోడను రాజకుమారుల పరస్పర సంభాషణములతోడను స్వయంవర రంగమెల్ల బోరన మ్రోయుచుండెను.

అప్పుడు ధృష్టద్యుమ్నుండు రంగమధ్యమునకు వచ్చి చేయెత్తి కలకలంబెల్ల వారించి, మూఁగిన రాజలోకంబునెల్లఁ జూచి, యగ్నిసమీపంబున గంధ పుష్ప ధూప దీపార్చితంబైన విల్లును నమ్ములును వైహాయసంబైన లక్ష్యంబును వారలకుంజూపి యిట్లనియె. "ఈ విల్లు మోపెట్టి యైదు బాణంబుల నీమత్స్యయంత్రంబు నేయు వాఁ డిబ్బాలకుం దగిన వరుండు. కావున మీమీ కార్ముక కళాకౌశలంబులును, బాహుబలాతిశయంబులును జూపుట కియ్యది యవసరంబు." అట్లు పలికి ధృష్టద్యుమ్నుండు పాంచాలిం జూచి వచ్చిన రాజవీరులనెల్ల నామె నెఱింగించుచుండెను.

ధృష్టద్యుమ్నుని పలుకులు వినినంతనే రాజపుత్రులకెల్ల నూతన సంభ్రమోత్సాహములు జనించినవి. ఒకొక్కఁడు వచ్చి విల్లుపట్టి తనభాగ్యమును బరిక్షించుకొని పోవుచుండెను. మహాభారంబగు నాకార్ముకంబు నెత్తఁజాలకయు, నెత్తివంపఁ జాలకయు, వంచి లక్ష్యంబు నేయఁజాలకయు, రాజకుమారులనేకులు లజ్జావనతవదను లగుచుండిరి. బలవంతులయ్యును గొందఱు రాజులు జగన్మోహినియైన పాంచాలిం జూచుచు మతిహీనులును బలహీనులు నగుచుండిరి. ఇయ్యది మాయా ధనువు. దీనిని మోపెట్టఁదలపెట్టరాదని కొందఱు బుద్ధిమంతులు తటస్థులై యూరకుండిరి. కృష్ణుని యనుమతంబున యదు వృష్ణిభోజాంధకవీరులు మిన్నకుండిరి. శిశుపాల జరాసంధ శల్యా

కర్ణ ప్రముఖులైన మహావీరు లెల్లరు గుఱితప్పి విఫలమనోరథు లైరి. అట్టిసమయంబున ధర్మజుని యనుజ్ఞచొప్పున బ్రాహ్మణ సమూహమునుండి యర్జునుఁడు నిలువంబడెను. తోడనే విప్రు లెల్లరు నొండొరులం జూచుకొని నవ్వుచు, పరాభవంబు లేకుండ మిగిలినవారు మన బ్రాహ్మణులేయని యా లోపము దీర్చుటకుఁ గాఁబోలు నీతఁడును బయలుదేరుచున్నాఁ డని పలికిరి. సామర్థ్యంబులేకున్న నీతఁ డేల సిద్ధపడునని కొందఱు పలికిరి. అత్యంత తేజస్వియైన వీనికి జయము తప్పక చేకూఱు నని కొందఱు నిశ్చయించిరి.

ఇట్లు బ్రాహ్మణు లెల్లరుఁ దమలో సంభాషించుకొను చుండ, నత్యాశ్చర్య నిమగ్నులై రాజకుమారు లెల్లరు నిశ్చల దృష్టితోఁ దన్ను వీక్షించుచుండ, నర్జునుం డవ్విలుంటి సమీ పంబునకు వచ్చి గురువులం దలంచి నమస్కారంబు సేసి, ధనువు నకుఁ బ్రదక్షిణంబుగావించి మ్రొక్కి, పూర్వపరిచితంబైన విల్లు మోపెట్టిన ట్లశ్రమంబున మోపెట్టి యెల్లవార లాశ్చర్యపడు నట్లుగ నేనమ్ముల నమ్మత్స్యయంత్రంబు నాక్షణంబ కూలనేసినం జూచి బ్రాహ్మణ క్షత్రియప్రముఖులైన జనులెల్ల విస్మితులై యుట్లనిరి.

చ. ఫలపవనాంబుభోజన శుభవ్రతవృత్తులఁ జేసిచూడ దు
ర్బలతనులయ్యు బ్రాహ్మణు లపారతపోబలసంపదన్ మహా
బలయుతు,లట్టివారలకు భవ్యుల కెందు నసాధ్య మెద్దియుం
గలదె చరాచరాఖిలజగంబులఁ బూజ్యులుగారె సద్ద్విజుల్.

# 7. కర్ణాదుల మత్సరము - పరాజయము

ఒక్క నిమిషంబులో నిట్లశ్రమంబున నంతరిక్షమునం గల మత్స్యమును దెగవేయుట మానవమాత్రున కసాధ్యంబనియు, నీతఁడు బ్రాహ్మణరూపముతో వచ్చిన సురేశ్వరుఁడో, హరుఁడో, భానుఁడో, గుహుఁడో కావలయుననియు నెల్లవారలు నర్జునుని శ్లాఘించుచుండిరి. అంతరిక్షముననుండి దేవతలు పార్థుపైఁ బుష్పవృష్టి గురియించిరి. బ్రాహ్మణవరులెల్లరును దమ పయిపుట్టంబులు వీచి, యానందాతిశయమునఁ గెవ్వున కేకలిడుచుండిరి. ధృష్టద్యుమ్నుండును, ద్రుపదుండును నర్జునుని సమీపించి వానికడనే నిలిచియుండిరి. అట్టి సంతోషసమయంబున సుందరాంగియైన పాంచాలి, రాజనందనులెల్లరు దన్నతి ప్రీతితోఁ జూచుచుండ, మందయానంబుతో వచ్చి, మన్మథాకారుఁడును మహాతేజశ్శాలియునగు నర్జునుని మెడయందుఁ బుష్పహారమును వైచెను.

అమ్మహోత్సవమును గనులారఁ జూచినంతనే మత్సరగ్రస్తులైన దుర్యోధనాదులకుఁ గన్నులు గుట్టినట్లయ్యె. "ఔరా! ఈ ద్రుపదుఁడు మనల నెంతపరాభవించె? బంధువునివలె మన రాజలోకము నితఁడేల రప్పింపవలయు? రప్పించి మనలం గాదని కన్యక నీ బ్రాహ్మణున కేల యొసంగవలయు? మనల నింత పరిభవించిన వీనికి గర్వభంగము గావింతము. ఉత్సవభంగ మొనరింతము లెండు? రం"డని రాజకుమారు లొండొరుల బిలుచుకొనఁ జొచ్చిరి. తన విద్యా ప్రభావంబున నీ విప్రకుమారుఁడు రాజకన్యకను బడయఁగలిగె. వీనియందెట్టి లోపంబును లేదు. మఱియు నెట్టిదోషంబు చేసినను

బ్రాహ్మణుండు వధ్యుండుకాఁడు. కావునవీనినివిడిచి గర్వాంధుఁడైన పాంచాలుని మర్దింపుఁ''డని యుద్ధసన్నద్ధులైన రాజనందనులెల్లఁ బార్థునిపైఁబోక ద్రుపదునిపై విజృంభించిరి. ఆ సమరసంరంభమును జూచి పాంచాలపతి భీతింగొని బ్రాహ్మణ సమూహంబునఁజొచ్చె, బ్రాహ్మణులెల్లరు శరణాగతుండైన ద్రుపదున కభయంబొసంగి, తమ తమ దండాజినంబులెత్తి రాజులపై విసరుచుండ, నర్జునుఁడు వారలంజూచి నవ్వుచు నిట్లనియె. "నా యస్త్రంబు లను మంత్రములచే నీరాజసర్పంబుల దర్పంబుడిగించెద. మీరించుక దూరము తొలంగి నన్ను జూచుచుండుఁడు.

ఇట్లు పలుకుచుఁ బాండవమధ్యముఁడు రాజచక్రంబుపై విజృంభించి యవక్రపరాక్రమంబున నపార బాణ పరంపరలు వర్షింపఁ గడంగెను. అప్పుడు భీముండొక్క మహావృక్షంబు పెఱికికొని వచ్చి దండహస్తుండైన దండధరుండునుం బోలె నర్జునునకు సహాయుండై నిలిచె.అయ్యిరువుర మహాసంరంభంబుఁ జూచి యాదవవర్గంబునందున్న బలరాముఁ డత్యాశ్చర్య నిమగ్నమానసుండగుచుండఁ గృష్ణుఁడు మెల్లఁగవానికిట్లనియె. "అగ్రజా! వనితాలాభదంబగు నమ్మహాకోదండమును దాల్చి విరోధివర్గంబును బారఁదోలుచున్నవాఁడు మన యర్జునుఁడు. వానిచెంతనే మహావృక్షహస్తుండై విజృంభించుచున్న వీఁడు వృకోదరుఁడు. అర్జునుఁడు మత్స్యయంత్రము వేసినప్పుడు బ్రాహ్మణవర్గమునుండి లేచి యావలికిఁ బోయిన గౌరవర్ణుఁడు ధర్మనందనుఁడు. వానివెనువెంటనే యరిగిన యిరువురు కుమారులును నకులసహదేవులు.'' ఇట్లయ్యేవురును బాండవులని

విన్నంతనే బలరాముఁడు మహానంద పరవశుండును నిశ్చేష్టితుండునై 'ఏమేమీ? కృష్ణా! వీరు పాండవులా? ఎంత భాగ్యము! లక్కయింట నగ్నిదాహమునుండి వీరెట్లు బ్రతికిరో కదా! ఈమహాపురుషుల దర్శింపగలిగిన యీ దినం బెంతటిపుణ్యదినము!' అని పలుమారు లనుకొనుచు నానందాశ్రువులు గురియుచుండెను.

నాటి రణరంగమున భీమార్జునులఁ దాకి, రాజులనేకులు పరాజితులగుచుండ, దుర్యోధనునకుఁ బ్రాణసఖుండును, వంగ రాజ్యాధీశ్వరుండు నగు కర్ణుఁడు పార్థునిందాకెను. మద్రదేశాధీశ్వరుండైన శల్యుఁడు భీమసేనునెదిరించెను. తత్ప్రాంత ప్రదేశంబులంగల వారెల్లఁ దమ తమ రణకళాకౌశలంబులఁ గడు వినోదంబుగ వీక్షించుచుండఁ గర్ణార్జునులు, భీమశల్యులును ఘోరముగఁ బోరాడుచుండిరి. కర్ణార్జునులొండొరులపై విడుచుచుండిన బాణపరంపరలచే నంతరిక్షంబంతయు నీరంధ్రంబయ్యెనది. అత్యంత సమర సంరంభముతో నర్జున ప్రయుక్తంబులైన యపార శరావళులనెల్ల గర్ణుఁడు వారింపలేక వెలవెలఁబోవుచు నింతటి యస్త్రకళాకౌశలము నార్జించిన యీ విప్రుండెవ్వఁడో యని మెచ్చుచు నాతని కిట్లనియె: 'విప్రకుమారా! బ్రాహ్మణులలోఁ బరశురాముఁడును, క్షత్రియులలో నర్జునుఁడునుదక్క రణరంగమున నాయెదుర నిలిచి నన్నెదిరింపఁ గలుగువాఁ డింకొక్కఁడును లేడు. నీవిక్రమమును నీవిల్లునేర్పు నునా కెంతయు మెచ్చు గలిగించినవి.'

అర్జునుఁడు మందహాసపూర్వకంబుగ రాధేయు నవలోకించి 'ఓయీ! నీవిప్పుఁడు చెప్పినవారిలో . నేనెవ్వఁడనుగాను.

సకలశస్త్రాస్త్రవిద్యల సుప్రసిద్ధి వహించిన బ్రహ్మతేజోధికుఁడను. రణరంగమున నిన్నోడించి పాఱఁదోలనున్న వాఁడను. అప్రస్తుత ప్రసంగమునింక జాలించిచక్క నిలువు' మని పలికెను. ఆమాటలకుఁ గర్ణుఁడు లజ్జపడి బ్రాహ్మణతేజం బజేయంబని విజయుతోడ యుద్ధంబు సేయనొల్లక మెల్లఁగ నచ్చోటినుండి తొలంగెను. శల్య భీమసేనులు పెనంగి మల్లయుద్ధంబు సేయునెడ భీముఁడు భీమబలంబున బట్టి శల్యుం ద్రొబ్బివైచిన నతండు వెచ్చెరలేచి యొడలు దులుపుకొనుచు బ్రాహ్మణులు నవ్వుచుండ నవలిపోయెను. అప్పుడు శ్రీకృష్ణుఁడు దుర్యోధనాదుల వారించుచు నెల్లవారును విన నిట్లనియె,

చ. పరులకు దుష్కరంబయిన భాసుర కార్యము సేసి యా
స్వయం | వరమునఁబత్నిగాఁబడసె వారిరుహాయత నేత్ర
గృష్ణ నీ | ధరణిసురాన్వయోత్తముఁడు ధర్మవిధిం
జెపుడయ్యె నింక ని | వ్వారికిని జన్నె వీని ననవద్య
పరాక్రము నాక్రమింపగన్.

# 8 పాండవులు – మాతృభక్తి

కృష్ణునిచే నివారితులై స్వయంవరాగతులైన భూపతులెల్లరు దమతమ దేశంబులకుం జనిరి. భీమార్జును లిరువురు నెల్లవారును జూచుచుండ ద్రౌపదిని వెంటనిడుకొని తమనివాసంబునకు బయలుదేఱిరి. అమితోత్సాహ పరవశులైయున్న బ్రాహ్మణు లెల్లరునుగూడ వారిచుట్టును గుమిగూడి నడుచుచుండిరి.

అప్పటఁ గుంభకార గృహంబునఁ గుంతి యొంటరిగఁ గూర్చుండి పాండవాగమనమును గోరుచు నిట్లు చింతింపఁ జొచ్చె. "అయ్యో! ఇంత ప్రొద్దెక్కినను గుమారులు రాకున్నవారేమి? ఉత్సవ సందర్శనోత్సుకులై పోయినవా రింతవఱకు నెందు మసలుచున్నారు? పాపస్వభావులైన కౌరవులు నా కుమారుల గుర్తించి వారికేట్టి యపాయంబును గావించి యుండరుకదా? దివ్యజ్ఞానసంపన్నుండైన వేదవ్యాసుండు మాకప్పట శుభంబగునని చెప్పె. ఆ మహాత్ముని వచనంబు నిక్కము గాకుండునా? ఓ వేల్పులారా! బ్రాహ్మణోత్తములారా! దిక్కులేనిదాననగు నాకు మీరే శరణంబు. నా కుమారుల భద్రంబుగ మఱల నాకంటం బెట్టుఁడు" అట్టి యవసరంబునఁ దల్లియున్నకు ధర్మరాజును గవలవారును మున్ను వచ్చియున్న, ననంతరంబ భీమార్జునులు ద్రౌపదీ సహితులై వచ్చి మేమొక్క భిక్ష తెచ్చితిమని తల్లికి నివేదించిన నామె యెఱుంగక యెప్పటియట్ల యని యెంచి సంతసించి దానిని మీరేవురును నుపయోగింపుఁడని నియమించి, వారి వెనుక భువనత్రయ రాజ్యలక్ష్మివలెనున్న పాంచాలిం జూచి తెల్లవోయెను.

అప్పుడు కుంతి చెంతనున్న ధర్మనందనుం జూచి, "కుమారా! మీరు భిక్షాటనము నుండి వచ్చి భిక్ష తెచ్చితిమని చెప్పుచుండుటయుఁ గాలక్రమంబున నా కలవాటుపడి యుండుటచే నేఁడుగూడ నట్టే యనుకొని పలికితిని. మీరెన్నఁడును నామాట నతిక్రమింపనివారు. ఇప్పుడేమి సేయవలయు? లోకమున లేని యాచారము నెట్లవలంబించువారము?", అని వగచుచుండ ధర్మజుఁ డర్జునుం జూచి; "పార్థా! నీవే

యగ్నిసన్నిధి నిక్కన్యను బాణిగ్రహణంబు జేసికొను' మని చెప్పెను. పెద్దవాఁడుండఁ గొండికవాఁడు వివాహంబగుట ధర్మవిరుద్ధంబు గావున నీమె నగ్రమహిషిగా నీవే పరిగ్రహింపుము. మానలుగుర యనుమతం బిట్టిదె' యని యర్జునుం దనెను. విధిప్రేరణంబున నయ్యేవురి చిత్తంబులుం గూడ బాంచాలయం దనురాగాయత్తమ్ములైనవి. ధర్మజుం డది గ్రహించి వేదవ్యాసవచనంబులం దలంచి 'సోదరులారా! ఇచ్చట మన యేవురకును శుభంబగునని వేదవ్యాసుండు వచియించె. తద్వచనానుకూలంబుగనే మనకు మాతృనియోగంబును గలిగినది. కావున నిక్కన్యను మన మేవురమును బరిగ్రహింతము' అని పలికెను.

అచట రాజమందిరంబున ద్రుపదుఁడు తన కూఁతునకు వరుండైనవాఁ డెవఁడో. వానిచరితం బెట్టిదో యెఱింగి రమ్మని ధృష్టద్యుమ్ననకు నియోగించెను. అతఁడును భీమార్జునుల వెంటనేవచ్చి, తన్నెవ్వరును నెఱుంగకుండ నక్కుంభకారగృహంబునందుండి యంతయు నెఱింగిపోయి తండ్రితో నిట్లనియె. 'జనకా! ఆ బ్రాహ్మణు లిరువురు మన కృష్ణం దోడుకొని యొక కుంభకారగృహమునకుఁ బోయి యొక ముదుసలియవ్వకు మ్రొక్క యామెచే మ్రొక్కించిరి. గౌరవర్ణుండగు నొక పురుషుని నియోగంబున నచ్చటనున్న నలువురును బ్రాహ్మణ గృహములకేగి భిక్షముదెచ్చియయ్యవ్వకు నిచ్చిరి. ఆమెయుఁ గృష్ణకునిచ్చి బలివిధానములకును బ్రాహ్మణాతిథులకును గొంత యన్నంబు పెట్టించి పిమ్మట నయ్యేవురకును బంచిపెట్టించి, శేషించినదాని నామెతోఁ గూడఁ దానును

భుజించెను. అయ్యవ్వ చెప్పినదెల్ల గావించుచు మనకృష్ణ లేశం బును వగవక నిండుమనంబుతో నున్నది. వారి పలుపులు కలుకు దర్భపూరి. వారి యశనము భిక్షాన్నము. అట్లయ్యు నాదిగర్భేశ్వరియైన కృష్ణ వారిని లేశము నేవగింపదయ్యె. వేషములనుబట్టి బ్రాహ్మణులవలెఁ గానవచ్చుచున్నను సంభాషణములనుబట్టి వా రుత్తమక్షత్రియులవలెఁ దోచుచున్నారు. వారు తమలోఁ జెప్పుకొనిన యాయుధ విద్యా రహస్యములను నేను వింటిని. ఎట్టులైనను వారు బ్రాహ్మణులో, క్షత్రియులో కావలయునుగాని తక్కిన జాతులకు సంబంధించిన వారు కారని నా నిశ్చయము.''

ద్రుపదుండు వాని మాటలు విని కొంతవఱకు సంతుష్టుండై వారల నింకను నెఱింగి రమ్మని తన పురోహితుం బంపెను. ఆ పురోహితుఁడు బ్రాహ్మణ సమూహముతోఁడ వచ్చి పాండవులంగని, ధర్మరాజు నియోగంబున భీముని చేతఁ బూజితుఁడై ''అయ్యా! మీ కులగోత్ర నామంబులను మిమ్ములను నెఱుంగ వేడి ద్రుపద మహారాజు నన్నంపెను. మఱియు నద్భుత మత్స్యయంత్రమ్ముఁ దెగ వేసిన యవ్వీరు మూర్తిని నాతఁడు చూడఁగోరుచున్నాఁ''డని పలికెను. ధర్మరాజు నవ్వుచు, ''విప్రోత్తమా! మత్స్యయంత్రమ్ముఁ దెగ వేసినవాఁ డెక్కన్యకు వరుండని మీ రాజు ప్రకటించె. ఆతఁడు నియమించిన ట్లయ్యంత్రమ్ము నేసి యీతఁ డెక్కన్యను బడసెను. ఇక మమ్ము, మా కులగోత్రములను నాతఁడేల యెఱుంగవలయును? ఎఱిఁగి యేమి సేయఁగలఁడు? ఇంతకు బలహీనుం డట్టి కార్ముకమును మోపెట్టి లేవియఁ

గలఁడా! కులహీనుం డట్టి లక్ష్యమును బడనేయఁ గలఁడా?' అని ప్రత్యుత్తర మొసంగెను. పురోహితుఁడు వారిని వీడ్కొని చని ద్రుపదున కా సంగతు లెఱింగించెను.

అంత ద్రుపదుండు పాండవుల రథారూఢులం గావించి తన మందిరంబునకు రప్పించి 'అయ్యా! మీరు క్షత్రియులో, బ్రాహ్మణులరో, మాయావృతులై సంచరించుచున్న మంత్ర సిద్ధులో, కాక కన్యాపరిగ్రహణార్థము దివము నుండి వచ్చిన దేవతలో యెఱుంగము. మీ కలరూపెఱింగినంగాని వివాహ ధర్మంబులు విధివిధానముగ నెఱవేర్చుటకు వీలుండదు. కావున మా సందేహంబు తొలఁగింపుఁ' డని యడిగెను. అప్పుడు ధర్మనందనుఁడు 'మేము క్షత్రియులము. పాండురాజు పుత్రులము. అందే నగ్రజుండను. వీరు భీమార్జునులు. వారు నకుల సహదేవులు. ఇమ్మహాసాధ్వి మా జనయిత్రి కుంతీదేవి' అని యెఱింగించెను తోడనే ద్రుపదుఁడు పట్టరాని సంతోషమున గెవ్వున నఱచి నా పుణ్యంబున లాక్షాగృహదాహమునుండి విముక్తులైతి రని వారి నెంతయు నభీష్టసత్కారంబులఁ బూజించి, ప్రియభాషణంబులాడి, 'ఇఁక స్వయంవర లబ్ధమైన యిక్కన్యక నర్జునుండు పాణిగ్రహణంబు సేయవలయు' నని పలికెను. ధర్మజుఁడు 'మే మేవురము నిక్కన్యను బడయఁగలవార' మని పలుకుచు, 'ఇయ్యది మాకు మాతృనియోగం'బని యా వృత్తాంతమును వాని కెఱింగించెను. ద్రుపదుఁడు వెలవెలఁ బోయి, 'ధర్మనందనా! నీవు సకల ధర్మాధర్మ విదుండవు. నీ పలుకులు ధర్మవిరుద్ధము లనఁజాలను. అయినను లోకమునం దిట్టి వివాహ మశ్రుతపూర్వము. కావున నీవును

నేనును గుంతియు ధృష్టద్యుమ్నుండును సావకాశముగ దేవు విచారించి నిశ్చయింత మని చెప్పెను.

"గీ. గురులలోనఁ బరమగురువు తల్లియ యట్టి
తల్లి వచనమును విధాతకృతియు
నన్యథాకరింప నలవియె......"

# 9. ఇంద్రసేన - పాతివ్రత్యము

అనాఁడు పాంచాలుఁడు వివిధవిధాంబరాభరణాదులను బహువిధభక్ష్య భోజ్యంబులను గుంతీ సహితులైన పాండుకుమారుల గౌరవించుచు మధురప్రియ భాషణంబులాడుచు వారితో సత్యానందమునఁ గడపెను. ఆ మఱునాఁడు వారందఱు నుచితాసనాసీనులై తొలినాఁటి ధర్మసందేహంబు నెత్తి ప్రసంగించుటకుఁ బ్రారంభించినంతనే తన దివ్యతేజంబున దశదిశలుం బ్రకాశింపఁజేయుచు మహాత్ముండైన వ్యాసభట్టారకుం డచ్చటికి వచ్చెను. ఇట్లు వచ్చిన కృష్ణద్వైపాయనునకుఁ గుంతీదేవియుఁ బాండవ పాంచాలురును నతిభక్తిని నమస్కరించి కాంచనమణిమయ పీఠంబున నాసీనుంగావించి యర్ఘ్య పాద్యాది విధులం బూజించిరి. వ్యాసుఁడు వారందఱి కుశలంబులడిగి, హితమధుర సత్యసంభాషణంబుల నందఱ నమందానంద హృదయులఁగావించి నంత, నమ్మునీంద్రునకు ముకుళిత కరకమలుండై ద్రుపదుం డిట్లనియె. "దేవా! ఈ ధర్మనందనుఁడు సర్వసమ్మతుండైన లోకగురుఁడు. ఇట్టి యీతఁడు మేమేవురమును పాంచాలిని వివాహమయ్యెదమని చెప్ప

చున్నాఁడు. మీరెఱుఁగనట్టి లోకాచారము కలుగదు. ధర్మజ్ఞులైన పూర్వులెవ్వరైన నిట్టి వివాహంబులు గావించిరా? ఈ ధర్మాధర్మనిర్ణయంబు మీకుఁదక్క నన్యుల కసాధ్యంబు.” వ్యాసుండును “మహారాజా! ధర్మతత్త్వవేదియైన యీ ధర్మనందనుం డెన్నఁడును ధర్మముతప్పి పలుకఁడు. దేవతామూర్తియైన కుంతి యెన్నంటను ననృతంబులు పలుకదు. ఇందలి పరమార్థంబు నీకెఱింగించెద రమ్ము.”

అని పలుకుచు నతఁడు ద్రుపదుని చేయూది స్థలాంతరమునకుం గొనిపోయి యేకాంతముగ వాని కిట్లనియె. “రాజేంద్రా! ఇందలి పరమరహస్యంబు నీకెఱింగించెదవినుము. తొల్లి నాలాయనయైన యింద్రసేన యనంబరగిన పరమ పతివ్రత మౌద్గల్యుండను మహర్షికి భార్యయై యుండెను. కర్మవశంబునఁ బాపము! అమ్మునీశ్వరుండు కుష్ఠువ్యాధి బాధితుండును, వయోవృద్ధుండును, దుర్గంధ వదనుండును, నతిదుఃఖజీవుండునునై యుండె. దుర్గంధ బంధురంబైన వాని శరీరము నుండి దినదినంబును గ్రిమిచ్ఛటాచ్ఛిద్రితంబులైన మాంసఖండంబులు తెగిపడుచుండె. చూచువారికిఁ బరమాసహ్యశరీరుండైన మౌద్గల్యుని నింద్రసేన యత్యంత భక్తి నారాధించుచు వాని యుచ్ఛిష్టంబె కుడుచుచు సేవించుచుండెను

ఇట్లుండ నొకనాఁడు మౌద్గల్యుఁడు భోజనము సేయుచుండ గుష్ఠవ్యాధిచే వానివ్రేలొక్కటి తెగి యన్నమునందుఁ బడెను. భర్త భుజించి వెడలినంతనే యింద్రసేన వాని భుక్తశేషంబును దానుగైకొని యయ్యన్నమునం బడిన వ్రేలెత్తి పారవైచి యథాక్రమంబుగఁ దానును భుజించె. మౌద్గల్యుం

డంతయు వీక్షించి మహానంద భరితుండై "ఇంద్రసేనా! నీవు మహాపతివ్రతవు. ఏవగింపక నాయుచ్ఛిష్టమును నింతయిష్టంబుతోఁ గుడుచుచున్న నీయెడల నేను బ్రసన్నుండ నైతిని. నీకు వలసిన వరంబు వేఁడుము" అని యడిగెను. మహాప్రసాదంబని యింద్రసేన, "మునీంద్రా! తపశ్శక్తిచే నీవు కామరూపధరుండవై యీబీభత్సంబగు రూపంబు విడిచి, మనోహరంబైన యాకారంబుతో పంచధా విభక్తుండవై నాతో సకలభోగంబులనుభవింపుము. చిరకాలమునుండి నాకున్న యభీష్టంబిదియే" యని తెలిపెను.

ఇంద్రసేన యభీష్టానుసారంబుగ మౌద్గల్యుం డైదు రూపంబులందాల్చి మర్త్య దేవలోకంబులయందు, నాకాశగంగాజలంబులయందుఁ, గైలాసమేరువులయందు నామెతో విహరించుచుఁ గొంతకాలంబున కామెను విడిచి తపంబునకుఁ బోయెను. చిరకాలము కుష్ఠురోగపీడితుని [illegible] టచే రూపవంతుఁడగు భర్తతోఁ గాఁపురముసేయు నుత్సాహమింకను నింద్రసేనకుఁదీరలేదు. కాలవశంబున నామెశరీరంబు విడిచి, కాశిరాజను రాజర్షికిం బుట్టి పెరుగుచుఁ దన పౌర్వాహ్ణ[illegible]కంబునఁగన్యాత్వమునందే చిరకాలంబుండి నిర్వేదించి [illegible]డను బతిభిక్షకై పశుపతి నుద్దేశించి తపమొనర్చుటకుఁ బ్రారంభించెను. అత్యంత సౌందర్యవతియగు నక్కన్యకామణి మహాయోగ నిమగ్నయై యతిదీక్షతో ఘోరతపము గావించుచుండ నామెకడకుఁ బ్రత్యేకంబుగ యముఁడు, వాయుదేవుడు, నింద్రుఁడు, నశ్వినులును బ్రీతులైవచ్చి, దేహాంతరమునం దీ సుందరి మాకుఁగోడలుకావలయుననితమలో వాంఛించుకొనిరి.

తీవ్రతపోనిమగ్నయైన యక్కాంతారత్నంబునుగొంత కాలము జలానిలాహారిణియై, కొంతకాలం బేకపాదంబున నిల్చి, కొంతకాలంబు పంచాగ్ని మధ్యంబున నిలిచి యత్యుగ్రదీక్షతో నీశ్వరారాధనముగావింప, బరమేశ్వరుం డామెకుఁ బ్రసన్నుండై వరము వేడుమనెను. తోడనే యక్క న్యక పతిం బడయుటయందలి యత్యాతురతచే నైదుమారులు పతి పతియని పలుకుచుఁ బతిదానమును బ్రార్థించెను. ఈశ్వరుం డామెను గరుణించి దేహాంతరంబున నీ కేవురు పతులయ్యెద రని యనుగ్రహించె. అప్పు డా సాధ్వీమణి "దేవా! సతి కొకండె పతిగాక పలువురు పతులుండుట లోకవిరుద్ధము. ఇట్టివరంబును నే నొల్ల" ననిన మహేశ్వరుడు "బాలా! నావచనంబున నీ కేవురు పతులయ్యెదరు. అందు లేశమును ధర్మభంగము వాటిల్లకుండు" నని పలికెను. "అట్లయిన నాకు భోగేచ్ఛయు సౌభాగ్యంబును బతిశుశ్రూషయుఁ బ్రసాదింప వలయు"నని యామె ప్రార్థింప శంకరుఁ డా వరంబులెల్లఁ గటా క్షించి యంతర్ధానుండై చనియె. అమ్మహాసాధ్వియే యజ్ఞ ముఖంబున నుద్భవించి నీకుఁబుత్రికయైనది. ఆమెపూర్వజన్మ వృత్తాంతమునుబట్టి యీజన్మంబున నామె కేవురు భర్తలు కలుగక తప్పదు. ధర్మవిరోధంబును లేదు. కావున నవశ్య ముగఁ బాంచాలిని బాండవులకు ధర్మపత్నిగా నర్పింపుము.

అని పలికి వ్యాసుఁడు ద్రుపదునకు దివ్యదృష్టి ప్రసా దించెను. తోడనే యత్యంత లావణ్యమూర్తియుఁ దపోనిమ గ్నయునైయున్న పాంచాలి పూర్వదేహంబును ద్రుపదుండు సందర్శించి విస్మితుండయ్యెను. ఇట్లు వ్యాసానుగ్రహంబునఁ

పాంచాలపతి సందేహ నివృత్తుండై శుభలగ్నంబున ధర్మ
పుత్త్రునకు ద్రౌపదినిచ్చి వివాహంబుగావించె. పిమ్మట భీమా
ర్జున నకులసహదేవులును క్రమంబున నామెను బెండ్లాడిరి.

"... ... ... ... ... ... ... ...
బాలికఁ దొల్లి యేవురకు భామినిగా సృజియించియున్న య
య్యేలరి బ్రహ్మ చెయ్వు పరమార్థముగా కదియేలయొండగున్."

## 10: సుందోపసుందులు-మోహప్రభావము

పాండవు లేవురును ద్రౌపదిని వివాహంబై ద్రుపదుని ప్రార్థనంబుపైఁ గొన్నిదినంబులచ్చట వసించిరి. లాక్షాగృహ దాహంబునుండి వెడలి పాండవులు కుంతీసమేతంబుగ సజీవులై యుండిరనియు, మత్స్యయంత్రమ్ము నేసి పాంచాలిం బడసిన వాఁ డర్జునుండనియుఁ గ్రమక్రమంబుగ రాజలోకమున కెల్ల వెల్లడియయ్యె. ధృతరాష్ట్రుండీ శుభవార్త వినినంతనే మితిలేని యానందము నొందుచు విదురుని రప్పించి, తత్క్షణంబ చని కుంతీసమేతులైన పాండవులను పాంచాలితోఁ గూడఁ దోడుకొని రమ్మని పంపెను. వాని యాజ్ఞానుసారంబుగ విదురుఁడు వచ్చి యత్యంతవైభవముతో వారినందఱం బిలిచికొని హస్తిపురంబునకుఁ జనెను. ధృతరాష్ట్రుఁడు కన్నకొడుకులవోలె వారి నాదరించి, మన్నించి వారికి న్యాయంబుగఁ జెందవలసిన యర్ధరాజ్యము నిచ్చెను. కృష్ణుని యాదేశంబున నింద్రుఁడు దేవశిల్పియగు విశ్వకర్మం బంప నాతండు పాండవుల కలకాపురంబుం బురుడించు నొకపట్టణంబు నతిరమణీయముగా రచియించి యిచ్చెను. అయ్యింద్రప్రస్థ పట్టణము రాజధానిగాఁ

పాండవులు ప్రజాపాలనము గావించుచు సుఖంబున్న దినములలో నొకనాఁడు నారదుఁడు వచ్చి వారిచే సత్కృతుండై సావకాశంబుగ నిట్లనియె.

పాండునందనులారా! సర్వ ధర్మజ్ఞులు నన్యోన్య నిత్య సౌహార్ద బుద్ధులు నగు మీ రేవురు ద్రౌపదీ సహితంబుగ నావలన వినవలసిన యితిహాసం బొండు కలదు. సోదరులైన సుందోపసుందు లనువా రొక్క యువతికారణంబునఁ దమలో నిగ్రహించి విగతజీవులైరి. మీ రావృత్తాంతము వినందగినది.

తొల్లి దితిపుత్రుండైన హిరణ్యకశిపు వంశంబున నికుంభుండను వానికి సుందోపసుందు లను నిద్దరు కొడుకులు పుట్టిరి. తపంబునకాని సర్వంబును బడయఁగాదని యేక నిశ్చయులై వింధ్యాచలంబునకరిగి, యింద్రియనిగ్రహులై, నిదాఘ కాలంబెల్లఁ బంచాగ్ని మధ్యంబున నిలిచి, వానకాలంబునను, శీతకాలమునను జలాశయంబుల వసియించి, వాయుభక్షకులై ఘోరతపంబు గావించిరి. దారుణంబైన వారి తపోవహ్ని దాహంబున జగంబులెల్ల భయకంపితంబులయ్యె. అత్యుగ్రంబైన ధూమం బాకాశంబెల్లఁగప్పె. దేవలోకంబెల్ల సంక్షుభితంబైనది. అట్టియెడ నిర్జరులెల్లరు బ్రహ్మపాలికిం జని సుందోపసుందుల తపంబువలని యనర్థములు విన్నవించుకొనిరి. కమలాసనుఁడు దేవతలకు ధైర్యముచెప్పి వీడ్కొనిచని, సుందోపసుందులకుం బ్రసన్నుండై వరంబులు వేడుమనెను. వారంత వారిజాసనునకు ముకుళిత కరకములులై 'దేవా! మాయిష్టము దయసేయ మీ కిష్టంబేని, మాకుఁగామరూపంబును, గామగమనంబును, సకల మాయావిత్వంబును, నన్యులచేత నవధ్యత్వంబును, నమరత్వంబును బ్రసాదింపవలయు' నని వేడిరి.

కమలగర్భుం డొక్క యమరత్వంబుదక్కఁ దక్కిన వరంబులు వారికొసంగెను. ఆ వరగర్వంబున నా రక్కసులు విజృంభించి దేవతానగరంబులెల్ల ముట్టడించిరి. భూలోకంబునఁ గల రాజర్షి మహర్షి వర్గంబులఁ బీడించిరి. పుణ్యవంతుల నిత్య నైమిత్తికకర్మంబులు విఘ్నముగావించిరి. సింహ వ్యాఘ్ర గజ రూపధరులై వనంబులందిరుగుచు మునిపల్లెలుసొచ్చి మునులకుఁ బ్రాణభయంబు గలిగించిరి. వారల క్రూరకర్మంబులకు వెఱచి వేల్పులు మునులునుబురాణమునియైన బ్రహ్మపాలికిఁజని కృతాంజలులై జగంబులకు సుందోపసుందులు సేయుచున్న యుపద్రవంబులు సెప్పిన, విశ్వగురుండు విస్మితుండై వారన్యులచేత వధ్యులుకారు. పరస్పర యుద్ధంబునఁ బంచత్వం బొందవలయునని విచారించి విశ్వకర్మను రావించి రూపలావణ్యవతియగు నొక్క యువతిని సృజియింపుమని నియోగించెను. రూపక్రియాకళావిదుండైన విశ్వకర్మ తిలోత్తమయను నొక యువతీలలామను దివ్యదేహంబుతో సృజించెను.

ఇట్లు సృజింపబడి తిలోత్తమ మహేంద్రాది సురబృంద పరివృతుండైయున్న యరవిందసంభవునకు నమస్కరించి పని యేమని యడుగ, పరమేష్ఠి యా సుందరీమణి కిట్లనియె. “తిలోత్తమా! సుందోపసుందులను దైత్యులున్మత్తులై వింధ్య కందరంబున నివసించుచు లోకంబుల కపకారంబు గావించుచున్నారు. వారిద్దరు నీ కారణమున నొండొరులతోడం బోరాడి గతించునట్లు గావింపవలయును.” తిలోత్తమ వల్లెయని చతురాననుని వీడ్కొని దేవసభకుఁ బ్రదక్షిణం బొనరించి మ్రొక్కి మహేంద్రాది దిక్పాలకులెల్ల దన దివ్య

సౌందర్యమును వేనోళ్ళ గొనియాడుచుండ, సర్వమోహినియై మర్త్యలోకమునకు వచ్చి, వింధ్యాచల విపినభూములఁ గుమ్మరుచు సుందోపసుందుల కంటఁబడెను. ఒక్కచో నివసించుచు, నొక్కమారె భుజించుచు, నొక్కశయనంబున శయనించుచు, నొక్కగతిని విహరించుచు, వారిద్దఱు నొక్కస్త్రీయందు బద్ధానురాగులైరి. తిలోత్తమనుదర్శించినంతనే 'ఇదినాప్రాణేశ్వరి' యని యొకఁడును, ఇది "నా హృదయేశ్వరి' యని యొకఁడును మోహాంధులై యామెచేతులం బట్టుకొనిరి. అప్పుడుతిలోత్తమ మందహాస వీక్షణంబులతో వారిని మఱింత భ్రమింపఁజేసి "అయ్యా! మీయిరువురకు నేనొక్కతె నెట్లుభార్యనగుదును? మీ రిరువుం బోరాడ నందెవ్వఁడు గెలుచునో వానిం జేపట్టెద' 'నని పలికెను.

ఆ మాటలు వినినంతనే మదాంధులైన సుందోపసుందులిరువురు నొండొరులతోడ విరోధించి పోరాటంబునకుం గడంగిరి. అట్లు పోరిపోరి, కొంతసేపునకు దృఢ ముష్టిఘాతంబుల నొకరి నొకరు పొడుచుకొని యా నిర్భాగ్యు లిరువురు నేలవ్రాలి ప్రాణములు విడిచిరి. కావున ద్రౌపదికారణంబున మీలో మీకు విప్రీతి పుట్టకుండ నేదే నొక్క నియమంబుఁ జేసికొని తన్నియమానుకూలంబుగ వర్తించుచుండుట క్షేమం బని బోధించెను. నారదుని హితోపదేశమునకుఁ బాండునందను లెంతయు సంతసించి, పాంచాలి, క్రమంబుగ నొక్కొక్కనికడ నొక్కొక్కయేఁ డుండునట్లును, నామె యెవ్వని యింటనుండునో యా యింటి కింకొకండు చనకుండునట్లును,

చన్నవాఁడు పండ్రెండు నెలలు తీర్థయాత్ర గావించునట్లును సమలో నొక సమయంబుఁ జేసికొనిరి.

క. ఇంతుల కారణమున ధృతి
మంతులు వొంకుదురు భేదమతి గావున మీ
రింతయు నెఱింగి యొండొరుఁ
జింతింపక సమయమింత సేయుఁడు బుద్ధిన్.

# 11. అర్జునుఁడు - సమయరక్షణము

నారదోపదేశంబునఁ బాండవులు గావించుకొనిన నియమము ననుసరించి పాంచాలి యిప్పుడు ధర్మరాజునింటనున్నది. తక్కిన సోదరు లెవ్వరు ద్రౌపదీ ధర్మనందనులున్న గృహంబునకుఁ బోవుటకు వీలులేదు. ఇట్లు సుఖంబుగఁ గాలము గడుపుచుండ నొకనాఁడొక విషమావస్థ తటస్థించినది. దీనానను౦డై యొక విప్రుండు రోదనము చేయుచుఁ బరుగు పరుగున నర్జునునికడ కరుదెంచి, 'రాజకుమారా, నా హోమధేనువును ముచ్చులు మ్రుచ్చిలించిరి. ధర్మరాజు రాజ్యము మా రాజ్యంబె యని మా బ్రాహ్మణుల మెల్లరము సంతసించుచున్నాము. ఇట్టి యధర్మకార్యంబు లీ రాజ్యంబున జరుగరానివి. తల్లిఁగానక మా ధేనువత్సంబు నిన్నటినుండియు నూరక యఱచుచున్నది. అర్జునా! మించిన లాభంబు లేదు. వడివడి బాణాసనంబు గైకొనిరమ్ము. ఆ ముచ్చుల సంహరించి నాకు ధేనుదానంబు గావింపు' మని యాతురతతోఁ బలికెను.

ఆబ్రాహ్మణునకు సంభవించిన యాపదకుఁ బార్థుండు మిక్కిలివగచి, కోదండమును గైకొనుటకై యాయుధాగారం బునకేఁగెను. అప్పుడందు ద్రౌపదీ ధర్మనందనులుండిరి. అర్జునుం డా సంగతి నెఱింగియు, విప్రుని రోదనంబు సహింపక యెట్లైన నట్లగునని తెగించి, తటాలున నాయుధాగారమున బ్రవేశించి, నిజశరాసనము నందుకొని వెడలిపోయెను. ఇట్లు వెడలి యతివీరులైన చోరుల వధియించి, బ్రాహ్మణునకు గోధనంబును సమర్పించి, క్రమ్మఱివచ్చి, యన్నగారికి నమస్కరించి, "లోకమర్యాదల రక్షించుచున్న మనయందే మర్యాద భంగంబైన నింతకంటె దుర్యశంబుండదు. కావున నాకు ద్వాదశమాసిక వ్రతంబు సలుప ననుజ్ఞ దయసేయవలయు" నని ప్రార్థించెను. ధర్మనందనుం డదివిని, "అర్జునా! గోబ్రాహ్మణులకగు బాధలఁ దొలగించువాఁడెట్టి క్రూరకర్ముఁడైనను వానినిఁ బాపము లంటనేరవు, మఱియుఁ దస్కర వధోపేక్షల వలన నశ్వమేధ భ్రూణహత్యల ఫలంబగును. అందుచే బ్రాహ్మణహితంబుగాఁ దస్కర వధార్థంబు నీ విప్పుడు గావించినది. సమయభంగము గానేరదు. సమయభంగ ప్రాయశ్చిత్తంబున కవసరంబును గానరాదు" అని చెప్పెను. వాని యుపదేశంబున నర్జునుఁడు తృప్తిపడక, "అన్నయ్యా! ఎట్టి నెపంబులు లేకయే మనము లోకాపవాదమును దొలగించుకొనవలయును. ఏదే నొక్క నెపంబు కల్పించుకొని ధర్మభంగము గావించిన యెడల మహాత్ములు గర్హింతురు. కావున నాకుఁ దీర్థయాత్ర కనుజ్ఞ దయసేయవలయు"నని మఱలఁ బ్రార్థించి మొక్కి ప్రయాణసన్నద్ధుం డయ్యెను.

ధర్మరాజాదు లర్జున తీర్థయాత్ర కంగీకరింపక తప్పినది కాదు. అంత గురుజనానుమతుండై పాండవ ముఖ్యుఁ డఖిల వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులు, ననేక శాస్త్రవిదులైన విద్వాంసులు, వివిధకథా దక్షులైన పౌరాణికులును దనకు సహాయముగా నరిగి సకలతీర్థంబులును సేవించుచు మహాభాగులైన యోగులను బూజించుచుఁ గ్రమక్రమముగా గంగాద్వారంబునకు వచ్చెను. అందు నిత్యంబును గంగాస్నానము చేయుచుఁ దత్తీరంబున హోమము సేయుచు నర్జునుఁడచ్చట గొన్ని దినములుండి, యొకనాఁడు ప్రభాతమున యథాక్రమంబుగ స్నానార్థము గంగలో దిగెను. కొంతసేపునకుఁ గృతస్నానుండై పితృతర్పణంబులు చేసి, యందుండి వెడలుటకు సిద్ధముగ నుండ వాని రూపలావణ్యాతిశయములకు మోహించి నాగకన్యక యొకతె జలమధ్యంబున వానింబట్టి నాగపురంబునకుఁ గొనిపోయెను. అత్యంతరమణీయంబైన తన హర్మ్యంబునందు వానినుంచినంతనే యర్జునుఁడు విస్మితుండై యానాగకన్యనుజూచి "సుందరీ! నీ వెవ్వతెవు? నీ పేరేమి? నన్ను బలిమి నిట్లు గొనివచ్చుటకు గారణంబేమి?" యని యడిగెను. అంత నాగాంగన మందహాస సుందరవదనారవిందయై, "సుందరాంగా! నే నులూపియను దానను. నాగకన్యను. ఐరావతకుల సంభవుండైన కౌరవ్యుఁడు మాతండ్రి. ఈ నాగభువనంబు నా నివాసంబు; చిరకాలమునుండి నీ గుణకీర్తనంబులు వినుచు, వివాహంబొల్లక నీయందు బద్ధానురాగనై యున్నదానను. నిన్నుఁ బడయనేరనినాఁడు ప్రాణపరిత్యాగము నిశ్చయించుకొంటిని. కావున

నీయందుఁ బతిబుద్ధిగాంచిన నన్ను గాంధర్వవిధిని బరిగ్రహింపు" మని ప్రార్థించెను.

పాండవమధ్యముఁ డా తనుమధ్య పలుకుల కక్కజం బొంది "సుందరీ! అన్నగారి యాదేశంబున సకల తీర్థంబులు సేవించుచు ద్వాదశమాసిక వ్రతదీక్షయందుఁ గ్రుమ్మరుచున్నవాఁడను. బ్రహ్మచర్యధర్మంబునందుండి నిన్నెట్లు భార్యగాఁ బడయగల" నని ప్రత్యుత్తర మిచ్చెను. ఉలూపి లజ్జావనతవదనయై "పాండుకుమారా! ద్రుపదరాజ పుత్రికయందు మీ సోదరు లేవురును గావించికొనిన సమయం బెఱుంగుదు. బ్రాహ్మణధేను రక్షణార్థంబు నీవు తత్సమయభంగము జేసికొనవలసి వచ్చుటయు నెఱుంగుదు. తన్నిమిత్తంబున నైన భవ తీర్థాగమనంబును నెఱుంగుదు. సర్వతీర్థ సేవనంబును, సర్వ వ్రతంబులు సలుపుటయు, సర్వదాన ధర్మక్రియలును బ్రాణదానంబుతో సమానంబులుగావు. నా మనోరథంబు విఫలంబైన నాకుఁ బ్రాణపరిత్యాగంబు తటస్థించును. వ్రతభంగము ప్రాణరక్షణంబునజరుగనేరదు. బ్రాహ్మణధేను ప్రాణంబులంబోలె నా ప్రాణంబులను రక్షించి ధర్మరక్షణముగావింపు" మని వేఁడుకొనెను.

అంతట నర్జునుం డులూపిఁ గరుణించి యామె మనోరథంబు నెరవేర్చెను. ఆ దంపతుల కిరావంతుఁడను పుత్రుండుద్భవించెను.

క. భూజన పరివాదం బ
వ్యాజమ్మునఁ బరిహరింప వలయును మనకన్
వ్యాజమున ధర్మలోపం
బాజి విజయ! పరిహరింతు రయ్య మహాత్ముల్.

# 12 నంద - బ్రాహ్మణశాపము

అర్జునుఁడు నాగలోకమునుండి వెడలి మఱల గంగా ద్వారమునకు వచ్చి జరిగిన వృత్తాంతము దనతో వచ్చిన బ్రాహ్మణులకు నెఱింగింప వారు హృదయానందము నొందిరి. గంగాద్వారమునుండి వెడలి యతఁడు హిమవత్పర్వత పార్శ్వమునకుం జని యందలి యగస్త్యవటమును దర్శించి యున్నతంబైన భృగుతుంగమును జూచి, యచ్చటనుండి హిరణ్యబిందు తీర్థంబునకుఁబోయి యందు గోదాన భూదాన హిరణ్యాది దానంబులాచరించి, ప్రాగ్దేశంబున నైమిశారణ్య మందలి జగన్నాథు దర్శించి, గయయు గంగాసాగరంబును జూచుచు, గ్రమక్రమముగా గళింగ దేశంబునకు వచ్చి, పిదప పూర్వ సముద్రతీరంబునఁ బురుషోత్తమ దేవునకు నమస్కరించి, మహేంద్రపర్వతము వీక్షించి, దక్షిణగంగ యగు గోదావరి, భీమేశ్వరము, శ్రీపర్వతము మున్నగువానిని సేవించుచు, దక్షిణసముద్ర తీరంబునఁ బ్రవేశించి, కావేరీ సముద్ర సంగమంబునుగాంచి, పదమూడవ మాసంబున మణలూరు పురంబుఁ జేరుకొనెను. అందున్న రాజు చిత్రవాహనుండు తన తనయ యగు చిత్రాంగద నాతనికిచ్చి వివాహమును జేసెను.

వివాహితుండైె యర్జునుండు చిత్రాంగదతోఁ గొన్ని దినములుగడిపి, యొకనాఁడు బ్రాహ్మణసహితుండై సమీపంబున సముద్ర తీరంబునఁ గల తీర్థము లాడుచుఁ జని చని సౌభద్రంబను తీర్థంబునుగాంచెను. పత్సుండందునుస్నానము చేయుట కుద్యమించుచుండ నచటనున్న బ్రాహ్మణు లాతని వారించి "అయ్యా! ఇది యెవ్వరికిని జొరరాని తీర్థము. ఇట్టివైదు తీర్థంబు లీసముద్ర తీరమునం గలవు. వీనియందు

మహా భయంకరములైన మొసళులు నిత్యము నివసించు చుండును. అందుచేఁ దీర్థ యాత్రలకు వచ్చినవారు వీనిని దర్శించుటయె కాని స్నానముచేయరు. సౌభద్ర, పౌలోమ, కారంధమ, ప్రసన్న, భారద్వాజము లను నామంబుల నీపంచ తీర్థంబులు నొప్పుచుండు. ఉగ్రగ్రాహభయంబున నూతేండ్ల నుండి యియ్యవి సాధుజన వర్జితంబులై యున్నవి. అని చెప్పిరి. కాని యర్జునుఁడు లేశమును వారిమాటలఁ బాటింపలేదు. వారెంత వారించినను వినక, 'సకలతీర్థ సేవార్థినయి వచ్చిన నాకీతీర్థంబులఁ గ్రుంకకుండుట పౌరుషంబుకా' దని పలుకుచు నత్యంత సాహసముతో జలములోని కుఱికెను.

తీరముననున్న బ్రాహ్మణులెల్లరు నర్జునున కెట్టియాపద సంభవించునో యని యత్యాతురతతో వీక్షించు చుండిరి. అప్పుడు జలమధ్యంబున నొక యుగ్రగ్రాహము తటాలునఁ బఱతెంచి కిరీటిం బట్టుకొనియె. బీభత్సుఁడు లేశమును భీతిల్లక మిక్కిలి యశ్రమంబున దాని పట్టు దప్పించుకొని, రెండు చేతులం గట్టిగఁ బట్టి తీరంబునకు విసరివైచెను. ఒడ్డునఁ బడుటయె తడవుగ నా భీకర గ్రాహము తత్‌క్షణంబ యభినవ యౌవనోద్భాసమానయగు దివ్యకాంతయై నిలిచెను. ఆ వింత చూచి బ్రాహ్మణులెల్లరు నిశ్చేష్టితులైరి. జలంబుల నున్న యర్జునుం డత్యద్భుతంబొంది తీరంబునకు వచ్చి 'నీవెవ్వతెవు? జలేచరత్వమున నింతకాల మేల యుండుంటివి? ఇప్పుడీ సుందరీ రూపము నెట్లు పడయఁగలిగితివి?' అని యాతురతతో నన్నియో ప్రశ్నలడిగెను. అప్పు డబ్బాలిక పార్థునకు వినయ పూర్వకంబుగా నమస్కరించి యిట్లనియె.

"మహేంద్ర నందనా! నేను నంద యను నప్సరసను. కుబేరుని ప్రియురాలను. నాసఖులైన సౌరభేయియు, సమీచియు, బుద్బుదయు, లతయు నను నలువురు నాయట్లె యీ తీర్థంబులం దున్నవారు. నన్నుంబోలె వారలంగూడ విముక్తలం జేసి రక్షింపుము. నా వృత్తాంతమును వినుము. మే మేవురము నత్యంత వినోదంబుతో నఖిలలోకపాల పురంబులు చూచుచు, భూలోకంబునకు వచ్చి యొక వనంబునం దుగ్రతపంబు సేయుచున్న యత్యంత శాంతచిత్తు నగ్నికల్పు బ్రాహ్మణు నొక్కనిం గంటిమి. కన్నంతనే బాల్యచపలత్వంబునను, దుర్యోగంబునను వాని తపంబునకు విఘ్నంబు సేయుబుద్ధి మాయేవురకు జనించినది. బ్రాహ్మణాగ్రహంబున రాఁగల కీడు భావింపలేక మేమమ్మహాముని ముందరఁ గొంతసేపుపాడితిమి. కొంతవరకు నాట్యము గావించితిమి. పెక్కుపరిహాసంబు లొనర్చితిమి. ఎన్ని గావించినను నత్యంత దృఢవ్రతుండైన యమ్మునివరుఁడు మావలను జూడలేదు. అప్పుడు మోహంబునకుఁ గారణంబులగు కొన్ని వికారంబులం గావించితిమి.

నిర్వికారుండైన యమ్మునివల్లభుండు మావికారంబులకుఁ గన్నులువిచ్చి యతికుపితుండై మమ్మేవురను మహోగ్రగ్రహంబులుగా శపించెను. మేమంతఁ జేయున దేమియు లేక వాని పాదంబులపై నేడ్చుచు వ్రాలి, "మహాత్మా! మహాపురుషులైన మీయట్టి విప్రుల కింతటి యాగ్రహంబుతగునా? అపరాధంబులు క్షమింపరా? పరుషంబు పలుకువారా? దేవా! మా చేసిన యజ్ఞానంబు సహించి మాకు శాపమోక్ష

ణంబును ప్రసాదింపు" మని ప్రార్థించితిమి. అంత నవ్విప్రుండు మమ్ముఁ గరుణించి, ఎవ్వఁడు మీచేతగృహీతుండై మీయున్న జలాశయంబుల నుండి మిమ్ము వెలువరించునో వాఁడే మీకు శాపమోక్షకరుండగు నని పలికె. అట్టి మహాత్ముండు మహాబలుండు మాకెవ్వండగునోయని విచారించుచు మేమందరముఁ గుమిలుచుండ, మార్గమధ్యంబున మాకుఁ దైత్రిలోకవర్తియుఁ ద్రికాలవేదియునగు నారదుం డెదురయ్యె. దుఃఖబాష్పంబులతో మేమమ్మహామునికి నమస్కరింప 'మీరిట్లేల యున్నవా' రని యడుగుచు జరిగిన వృత్తాంతమంతయు మావలన నెఱింగి యిట్లనియె.

'సుందరీమణులారా! విధికృతంబును విప్రకోపంబును గ్రమ్మరింప నెవ్వరికిని దరంబుగాదు. కావున దక్షిణసముద్ర తీరంబునఁ గల పంచతీర్థంబులఁ బ్రవేశించి మీ రేవురు నారెండ్లవఱకు నందుండుఁడు. పిదప, పాండవమధ్యముఁడైన యర్జునుండు తీర్థయాత్రార్థంబు వచ్చి, యమ్ముని చెప్పినట్లు మీకు శాపమోక్షకరుండు కాఁగలఁడు' అని చెప్పిచనియె. మునిశాపంబునను నారద హితోపదేశంబునను మహోగ్ర గ్రాహములమై యున్నాళ్ళకు నీవలన విముక్తింగంటిమి. నన్నుం బోలె నాసఖులంగూడఁ గటాక్షింపుమని ప్రార్థించెను.

బ్రాహ్మణ సమేతంబుగ నర్జునుం డా వృత్తాంతం బంతయు విని కరుణాయత్తచిత్తుండై నంద చెప్పిన నలువురకు శాపమోక్షంబు చేసిన నమరకన్యక లతిహర్షంబున వానిని దీవించి దేవలోకంబున కరిగిరి. అది మొదలుగ నప్పంచ తీర్థంబులకును నారీతీర్థంబు లను నామధేయమయ్యె.

క. ధృతిరహితుల చిత్తము ల
ట్లతివల యందేల తగులు నత్యంత దృఢ
వ్రతుల మనంబులు వారల
మతులఁ దృణస్త్రైణములు సమంబులుగావే.

# 13. అర్జునుఁడు - శరణాగతరక్షణము

అర్జునుఁడు క్రమ్మరి మణలూరు పురమునకు నచ్చి రాజ్యలీల సుఖంబుండి చిత్రాంగదయందు బభ్రువాహనుండను పుత్రుంబడసెను. అచ్చటినుండి యతఁడు యతివేషంబున ద్వారకా నగరమునకుం జని కృష్ణుని సోదరియైన సుభద్రం బెండ్లాడి, సుభద్రాసహితంబుగ నింద్రప్రస్థపురంబునకు వచ్చెను. సమయభంగముగాకుండ ద్వాదశమాసిక వ్రతం బును నిర్విఘ్నముగఁ గావించిన యర్జునునిఁ బాంచాలియుఁ గుంతియు ధర్మరాజాదులును వారలును మిక్కిలి యభినం దించిరి. వివాహితయై పతితోనేగిన సుభద్రం జూచుటకు బలరామ కృష్ణులు సాత్యకి ప్రద్యుమ్న వసుదేవ ప్రముఖు లైన యాదవులతో నింద్రప్రస్థ పురంబునకు వచ్చిరి. నితోత్సవంబులతో నత్యానందమున వారందరును దినములు పుచ్చుచుండ నొకనాఁడు కృష్ణార్జునులు వినోదార్థంబు ఖాండవ వనప్రాంతమునకు బయలుదేరిరి. మందమారుతం బనుభ వించుచు న వ్వనసమీపంబున నొకచంద్రకాంత శిలావేదికపై గూర్చుండి, వారిరువురు నిష్టకథా వినోదంబున కాలముఁ బుచ్చుచుండిరి. అట్లుండఁ గొంతసేపున కొక బ్రాహ్మ ణుం డాకస్మికముగ వారికడకు వచ్చి దీనాననుండై "అయ్యా! నే నమితభోజనుండను, మహాగ్నిబలుండను,

నాకిష్టమైన యన్నమ్మును గాంక్షించుచున్నాను తృప్తుండ నయ్యెద' నని యడిగిన కృష్ణార్జును లా బ్రాహ్మణు నతిభక్తిం జూచి 'విప్రోత్తమా! నీ కెట్టిభోజనంబు కావలయునో మాకుం దెలిపిన యెడల నిన్నుఁ బరితృప్తుంగావింపఁగలవార'మని చెప్పిరి.

బ్రాహ్మణుఁడంతఁ గృష్ణార్జునులం గొని యాడి యిట్లనియె. 'వీరాగ్రగణ్యులారా! నే నగ్నిదేవుఁడను. శ్వేతకి యను రాజర్షి తపంబుగావించి పరమేశ్వరుం బ్రసన్నుంజేసికొని శత వార్షిక సత్రయాగంబుఁ జేసెను. నాకు నీవు ఋత్విజుఁడవు కావలయునని ప్రార్థింప, దేవదేవుఁడు వానింగరుణించి 'యాజకత్వంబు బ్రాహ్మణులకు విధికృతము. దానినొరులు చేయఁ గూడదు. కావున నింక నీవు బ్రహ్మచర్యంబునఁ బండ్రెండేండ్లు నిరంతర ఘృతధారంజేసి హుతాశనుఁ దృప్తుంజేయు' మనిన నారాజు పరమేశ్వర నియోగంబున నగ్నితర్పణంబు చేసెను. అందువలన మహేశ్వరుండు సంతుష్టుండై శ్వేతకి పాలికివచ్చి దుర్వాసు రప్పించి, 'యజ్ఞప్రీతుండును దురితభీతుండును నగు నీ రాజునకు ఋత్విజుండవై వీనిచే సత్రయాగంబు సేయింపు' మని చెప్పెను. ఈశ్వరప్రేరితుండైన దుర్వాసుండు శ్వేతకికి ఋత్విజుండయ్యె. శ్వేతకియు సత్రయాగంబుగావించె. అట్టి ఘృతధారాకారణంబున నాకగ్నిమాంద్యమును దేజోహీనతయు దప్పియుఁ బుట్టింప, నేను బితామహుపాలికిం జని నా శరీర స్థితిని జెప్పుకొంటిని. కమలాసనుండు నాకీవ్యాధి యపరిమిత ఘృతోపయోగంబునఁ గల్గినదని గ్రహించి, 'హుతాశనా! దివ్యౌషధీయుక్తంబైన ఖాండవవనంబును భక్షించినం గాని నీకీ వ్యాధిపో'దని చెప్పెను.

నాటనుండియు నా దివిజవనంబును భక్షించి యీ వ్యాధి తొలఁగించుకొన వలయునని నే ననేక విధములఁ బ్రయత్నించితిని. నేను బ్రయత్నించి నప్పుడెల్ల మహాహస్తి యూధంబులం బోలు మేఘంబులు నన్ను భంగపరచుచు వచ్చె. ఇట్లేడుమారులు ప్రయత్నించి విఫల ప్రయత్నుండనై, మఱల వనజాసనుకడ కరిగి యింకేది యుపాయం బెవ్విధంబున ఖాండవ భక్షణం బెన్నండగునని దుఃఖించితి. అప్పుడు విరించి నన్నుఁగరుణించి భావికాలకార్యంబుఁ దలఁచి "కొంతకాలమునకు నరనారాయణు లను నాదిమునులు నరలోకంబున దేవహితార్థం బర్జున వాసుదేవు లను నామంబుల జన్మించి ఖాండవ సమీపంబున విహరింతురు. వారు భవత్ప్రార్థితులై తమ యస్త్రబలంబున సకలవిఘ్నంబులు నపనయించి నీకు ఖాండవోపయోగంబు ప్రసాదింతురు" అని చెప్పెను. నరనారాయణులారా! నాటనుండియు మీ దర్శనార్థంబు నిరీక్షించుచుంటి. తక్షకుండను పన్నగేంద్రుఁడు మహేంద్రునకుఁ బ్రాణసఖుండు. ఆ తక్షకుఁడు ఖాండవ వనమున నివసించుచుంటచే నింద్రుఁడవ్వనంబును నమ్మిత్రమును రక్షించున ట్లతిప్రయత్నమున రక్షించుచున్నవాఁడు. నన్ను మీరింకఁ గరుణింపవలయు నని ప్రార్థించెను.

అర్జునుండు, కృష్ణుఁడును దానును వాని వృత్తాంతం బంతయు సాంతముగ విని యిట్లనియె. "అగ్నిభట్టారకా! వారణహస్తానుకరణముగు వర్షధారలు గురియు మేఘమండలమును వారించుటకును, సురగణంబులతోడ నెత్తివచ్చు మహేంద్రునైన నెదిరించుటకు సమర్థములైన దివ్యబాణం

బులు నాయొద్దనున్నవి. కాని యట్టి బాణములకుఁ దగిన ధనువు, రథాశ్వములును లేవు. కృష్ణునకుఁ దగిన యాయుధములును లేవు. ఇట్టిస్థితిలో నీ మనోరథమును నెరవేర్పంగలమా యని సందేహించుచున్నాము.''

అది విని తత్క్షణమే యనలదేవుఁడు వరుణదేవునిం దలంచి, యతఁడు ప్రత్యక్షంబయినంతనే, ''తొల్లి సోముండిచ్చిన బ్రహ్మనిర్మితకార్ముకంబు నక్షయబాణ తూణీరములు గంధర్వహాయంబులఁ బూన్చిన రథంబును నతిరథుండైన యర్జునునకిమ్ము. గదయుఁ జక్రమును వాసుదేవున కి''మ్మని చెప్పెను. హుతాశనుఁడు చెప్పినచొప్పున వరుణుఁడు వాని నన్నిఁటినిఁ గృష్ణార్జునుల కొసంగెను. ఆ దివ్యాయుధముల యమోఘ ప్రభావంబులను నగ్నిదేవుండు వారి కెఱింగించెను. ఇట్లు సంప్రాప్త దివ్యచాప రథాయుధులై నరనారాయణులు మిక్కిల సంతసించి, సన్నద్ధులై రథంబెక్కి ''అనలదేవా! ఇంక సురాసుర పరివృతుండై సురపతివచ్చినను జయింతుము. శంకింపక యథేచ్ఛను ఖాండవదహనంబున కుపక్రమింపు'' మని హెచ్చరించిరి.

తోడనే నిజస్వరూపంబుతోఁ జెలరేగి సర్వభక్షకుఁడు ఖాండవ భక్షణమునకు ప్రారంభించెను. అంబరంబంటు నగ్నిజ్వాల లవ్వనము చుట్టును జుట్టుకొనినవి. ఒకవంక గాండీవధరుండై పాండవ మధ్యముఁడును వేఱొకవంకఁ జక్రధరుఁడై నారాయణుండును నవ్వనంబును గాచుచుండిరి. వనరక్షకులు చెలరేగి యమ్మంటలార్పుటకుఁ బ్రయత్నించి యర్జునుని బాణపరంపర లోర్వలేక యమసదనంబున కరిగిరి.

హుతాశనుం డత్యుత్సాహంబున వెలుంగుచు, లోకంబులకుఁ బ్రళయకాల భయంబునుబుట్టించుచుండెను. అంత దేవతలెల్ల వెఱచి దేవేంద్రుపాలికిం బోయి ఖాండవవనమునకుఁ గలిగిన యుపద్రవంబును జెప్పిన విని, యదరిపడి తత్కరక్షణార్థము మహామేఘంబులతో వెడలి యేనుఁగు తుండములవంటి వర్ష ధారలు గురియింప నారంభించెను. అప్పు డర్జునుఁడు తన యస్త్రకళానైపుణ్యమున గగనభాగంబెల్ల బాణపరంపరలచేఁ గప్పి, యొక్క చినుకైన లోనఁ బడకుండ గృహంబుగాఁ గావించెను. తక్షకుఁడు దగ్ధుఁడయ్యెననివగచి, వాని కుమారుఁడైన యశ్వసేనుని రక్షించుటకు మహేంద్రుఁడు చూచుచుండెను. అప్పు డర్జునుఁ డశ్వసేనునిగూడఁ గడ తేర్పఁ దలఁచుచుండ నింద్రుండు మోహినియనువిద్య పార్థుపైఁ బ్రయోగించి తక్షకకుమారుని వెలికిఁదీసి రక్షించెను. ఇంక నగ్నినార్పుట యశక్యంబని పాకశాసనుండు కృష్ణార్జునులతోఁ బోరిపోరి కడ కోడిపోయెను. ఖాండవమందున్న నముచి యను దనుజుని యనుజుండు మయుం డనువాఁ డందుండి వెలువడనేరక ధనంజయునకు శరణాగతుండయ్యెను.

క. శరణాగతరక్షణ త
 త్పరుఁడు ధనంజయుఁడు మయుని ప్రాణముగాచెన్
 గరుణను శరణాగతులగు
 పురుషుల రక్షించునంత పుణ్యముగలదే ?

# 14. మందపాలుఁడు - సంతానాపేక్ష

కృష్ణార్జును లిరువురు నాదిమునులైన నరనారాయణు లనియు, నట్టి మహాపురుషులతో నిగ్రహంబు గూడదనియు నశరీరవాణి దేవేంద్రున కెఱింగించెను. దేవేంద్రుండును యుద్ధము చాలించి కేశవార్జునులతో మైత్రి గావించుకొనెను. అంతియె గాక తన కుమారుని యస్త్రకళానైపుణ్యమును బలువిధముల గొనియాడి, యతండు వానికి నాగ్నేయ వారుణ వాయవ్యాది దివ్యబాణంబు లనేకము లిచ్చెను. ఇంద్రునిచే నశ్వసేనుండును విజయునిచే మయుండునుగాక; ఖాండవ దహనంబున రక్షింపఁ బడినవారు మఱినలువురు గలరు. ఆ నలువురను నగ్నిభట్టారకుఁడే స్వయముగ రక్షించెను. ఆ వృత్తాంతమును వినుఁడు.

మందపాలుం డను నొక మహర్షి గలఁడు. అతండు బ్రహ్మచర్యంబున నతినైష్ఠికుఁడై దివ్యసహస్రవర్షంబు లత్యుగ్రతపంబు గావించెను. తపస్సిద్ధిం బొందినంతనే యతండు యోగాభ్యాసమున శరీరము విడిచి, పుణ్యలోకములకుఁ బోవ యుచ్చటఁ బరిభవింపఁబడి మఱలవలసిన వాఁడయ్యె. తపస్సంపన్నుండ నయ్యు నాకుఁ బుణ్యలోకప్రాప్తియేల కలుగకున్నదని చింతించుచు మందపాలుఁడు కొందఱు దేవతలదర్శించి వారి నాసంగతి యడిగెను. అడిగినంతనే "అయ్యా! నీవెంతతపంబు చేసినను సంతానవంతుఁడవు కాకుండ సద్గతిని బడయఁజాలవు. కావున మఱల భూలోకంబునకేగి సంతతింబొందఁ బ్రియత్నింపు" మని బృందారకులు చెప్పిరి. అమరులహితోపదేశంబున మందపాలుఁడును మర్త్యలోకమునకువచ్చి నేను శీఘ్రముగాఁ బెక్కండ్రు సత్పుత్రుల నెవ్విధంబునఁబడయఁగలనో యని చింతింపసాగెను.

ఇహలోకమున విశేషకాలంబుండకుండ శీఘ్రకాలములోనే పుణ్యవంతుఁడై పుణ్యలోకమునకుఁ బోవలయునని మందపాలుని నిశ్చయము. అట్టినిశ్చయముతోఁ బక్షులయందు వేగంబుగ సంతానమును బడయవచ్చునని యెంచి యామునీంద్రుఁడు శార్ఙ్గకుఁడై జరిత యను నాఁడుపక్షిని భార్యగాఁ గొని పరమబ్రహ్మవిదులైన నలుగురు పుత్రులను బడసెను. మందపాలుం డా పక్షికుమారులను ఖాండవ వనంబునం బెట్టి తన పూర్వ భార్యయైన లపితతో విహరింపఁబోవుచుఁ బుత్రులను భద్రముగఁ గాపాడుచుండుమని జరితకు నియోగించెను.

అంతనగ్నిభట్టారకుఁడు ఖాండవ దహనంబున కుపక్రమించుట విని మందపాలుఁ డగ్నిసూక్తముల వానిని స్తుతించి తనపుత్రుల రక్షింపుమని ప్రార్థించెను. పుత్రరక్షణంబునఁ బతిచే నియోగింపఁబడిన జరిత ఖాండవ దహనంబు చూచి, శోకసంతాపితయై "ఱెక్కలురాని యీ పిల్లల నెందుఁ గొనిపోఁగలను? వీరితండ్రి వీరిని నిర్దయబుద్ధి నిందు విడిచి చనియె. పుత్రులను గాపాడుటకు నే నసమర్థను. ప్రళయాగ్నివోలె దిశలెల్లఁ గప్పుచు నీ మహానలజ్వాలలు మనమున్న వృక్షము వంకకుఁ గ్రమక్రమముగా వచ్చుచున్నవి. కుమారులారా! ఇంకేమిసాధనము? కోరినయట్లుఁ బడసిన యీకొడుకుల నపాయములు గలుగకుండ రక్షింపుచుండుమని మీ తండ్రి నాకుఁజెప్పి చనియె. రాఁగల యీ యగ్నిప్రళయంబు నాతఁడు లేశమునుదలంప లేదు. మీరందఱునిచ్చటనున్న బిలంబునందుఁ బ్రవేశింపుఁడు. అగ్నిజ్వాలలు మిమ్ముఁ దాకకుండ నిసుకచే బిలద్వారమును గప్పివేసెదను."

అని దుఃఖితయైన తల్లింజూచి యగ్రతనయుండైన జరితారి "అమ్మా! బిలము సొచ్చితిమేని నందున్న యెలుక మమ్ముం గడతేర్చును. ఇందేయున్న నగ్ని మమ్ముదహించును. ఎలుకచేఁ జచ్చుటకంటె నియ్యగ్నిచేఁ జచ్చినఁ బుణ్యలోకంబులు కలుగును. కావున నిందేయుందుము. మఱియు మాంస పిండంబులమైయున్న మాకు బిలప్రదేశంబున మూషకభయంబు తప్పదు. ఇందున్న మా కగ్నిభయంబు సంశయితంబు. ఎట్లనిన నొకప్పుడు జ్వాలనుండు వాయువశంబున మనవంకకు రాకుండఁ దొలంగవచ్చును. అప్పుడు మన జీవములు నిలుచును. ప్రాణాపాయ సమయంబులందు సంశయయుత కార్యములు కర్తవ్యములు. నియతములు వర్జ్యమ్ములు. కావున నీవన్న చోటికిఁ బోవనేరము. మేమిందె యుందుము. నీవు మాయందు మోహంబువిడిచి, బిలంబునఁ బ్రవేశింపుము. మేముదహన క్లేశమును బొందిన నీవు జీవించియుందువు. జీవించి పుత్రులం బడయుదువు. అట్లు కాక, నీపుణ్యంబున మాకగ్నిభయంబు తొలంగెనేని మాయొద్దకు వచ్చి యెప్పటియట్ల మమ్ముఁ గాపాడుచుందు" వని మ్రొక్కెను. తక్కిన కొడుకులును దల్లికి మ్రొక్కిరి. పాపము! జరిత బాష్పపూరితనయనయై యాసన్నతరు దహనోత్సుకుండై వచ్చు హవ్యవాహనుం గాంచి, ప్రాణభయంబున గగనంబున కెగసె.

అంత నన్నలువురు పుత్రులును నాలుగు వేదంబులం బోలె నగ్నిసూక్తంబులు పఠించుచు, సంస్తుతించుచు "మహాత్మా! అగ్నిభట్టారకా! మాకభయము! అభయము! అభయము!" అని యఱచిరి. అగ్నిదేవుం డప్పుడు మంద

పాలుని ప్రార్థనము దలంచి, యన్నలువురున్న వృక్షంబు భక్షింపక పరిహరించె. గగనంబునుండి జరిత యది చూచి యత్యానందముతోఁ గొడుకుల యొద్దకు వచ్చె. లపితతో విహరించు చుండిన మందపాలుండు కొడుకులం దలంచి, జరిత వారిని రక్షింపఁ గలిగెనో లేదో యనియు, నగ్ని దేవుండు తన ప్రార్థనమును మన్నించెనో లేదో యనియుఁ బలువిధములఁ జింతింపసాగెను. "అనలుఁడు క్రూరుఁడు. వానిని నమ్మఁదగ" దని యనుకొనుచు వచ్చి సురక్షితులై యున్న కొడుకులను జరితను గాంచి సంతసించి సంతాన కారణంబునఁ బుణ్య లోకంబులను బడయఁ గలిగెను.

క. ఎంతతపంబొనరించియు
సంతానము లేనివారు సద్గతిఁ బొందం
గాంతురె? నీ తపమేటికి?
సంతానము వడయు మఱలి సన్మునినాథా!

## 15. బృహద్రథుఁడు - పుత్రప్రాప్తి

పాండవు లింద్రప్రస్థపురము పరిపాలించుచు సుఖంబున్న దినములలో నొకనాఁడు నారదుఁడు వారికడకువచ్చి యిట్లనియె. "ధర్మనందనా! నేను లోకపాలుర సభలెల్ల విలోకించుచు యమసభకుం బోయితిని. మీ తండ్రి పాండురాజు యమసభ నుండి మీ కెఱిగించుటకై కొన్ని సంగతులు నాతోఁ జెప్పెను. వానిపలుకులు వినుఁడు. "హరిశ్చంద్ర ప్రముఖులైన మహా రాజులు రాజసూయమును జేసి దేవేంద్రలోకమును బడయఁ

గలిగిరి. నారదా! నేనీ యమలోకమునందుంటిని. నీవు సత్వరముగ భూలోకమున కేగి నా కుమారులంగని, రాజసూయమును జేసి నాకుత్తమగతులు గలిగించునట్లు భోధింపుము."
"ధర్మనందనా! పరాక్రమవంతులైన తమ్ములు గల నీకు దిగ్విజయము సుకరము. కావున నవశ్యముగ మీ తండ్రియాజ్ఞ నిర్వహించి వానిని బుణ్యలోకముల నొందింపుము."

నారదుని పలుకులు వినినంతనే యమసభయం దున్న తండ్రిందలంచి పాండవులు మిక్కిలి చింతించిరి. ధర్మరాజు పురోహితుండైన ధౌమ్యునితో నాలోచింప నతఁడు తప్పక రాజసూయమును గావింపవలసినదని వానిని ప్రోత్సహించెను. సోదరులైన భీమసేనాదులును దిగ్విజయమునం దత్యుత్సాహులైరి. అప్పుడు ధర్మరాజు తన యాప్తచరులను గొందఱిని రప్పించి "అనిల జవాశ్వములఁ బూన్చిన రథంబెక్కి మీ రీ క్షణమ ద్వారకకుఁబోయి పురుషోత్తముఁడైన వాసుదేవునిఁ దోడ్కొని రం"డని యాజ్ఞాపించెను. వారును ధర్మజు ననుమతింబునఁ బోయి వాసుదేవ సహితులై వచ్చిరి. పాండవులు కృష్ణభగవానున కెదురుగఁ బోయి యర్ఘ్యపాద్యాది విధులం బూజించి గౌరవించిరి. అందఱు సుఖాసీనులైనంతనే ధర్మరాజు నారద వచన ప్రకారం బంతయు వాసుదేవున కెఱింగించెను. వాసుదేవుండును బుత్రులఁ బడసిన ఫలంబుగా మీ తండ్రిని దేవలోక సుఖంబు లనుభవింపనిమ్మని పలుకుచు వానిని రాజసూయ యజ్ఞమునకు హెచ్చరించి యిట్లనియె. "ధర్మనందనా! రాజసూయము సేయుటకు సర్వవిధంబుల నీవర్హుండవు. పరాక్రమవంతులైన నీ సోదరులు భూమండలంబునంగల

రాజుల నెల్ల జయింపఁ గలరు. అప్రతిహత వీరుండైన జరాసంధుఁడుగలఁడు. వానిని భీమసేనుఁడు కడతేర్పఁగలఁడు" అని పలికెను. అప్పుడు పాండవు లత్యుత్సాహముతో "జరాసంధుఁ డెట్టివాఁడు? వాని వృత్తాంతము నెఱింగింప వలయు"నని యడుగఁ గృష్ణుండిట్లనియె.

మగధరాజ్యమును బరిపాలించుచుండిన బృహద్రథునకు నిద్దరు భార్యలు గలరు. అతఁ డయ్యిరువురియందును సంతానమును బడయఁజాలక, పుత్రుఁడు లేని విభవంబులన్నియు నేల యని నిర్వేదించి పత్నీద్వయ సమేతుండై వనంబున కరిగి చండకౌశికుం డనునొక మహాముని నతి భక్తితోఁ నారాధించుచుండెను. ఇట్లుపాస్యమానుండై చండకౌశికుండు బృహద్రథునిఁ గరుణించి నీకిష్టంబయినదాని నిచ్చెద వేఁడుమనిన, రాజు తనకుఁగల సంతానకాంక్షను విన్నవించుకొనెను. అప్పుడు చండకౌశికుఁడు నిమీలితలోచనుండై యించుక ధ్యానింప, శుకచంచువిలూనముగాని యొక చూతఫలము చెట్టుపైనుండి వాని యొడిలోఁ బడెను. అతఁడా ఫలము నందుకొని మంత్రించి, యీ ఫలోపయోగంబున నీకొక్క పుత్రుం డుద్భవిల్లునని చెప్పి బృహద్రథున కిచ్చెను. ఆరాజును గృతార్థుండనైతినని సంతసించి క్రమ్మఱి నిజపురంబునకువచ్చి, యాఫలంబును దన యిద్దఱు భార్యలకు సమంబుగా విభాగించి యిచ్చెను. వా రా ఫలభాగంబుల భుజించి గర్భిణులైరి.

అంతఁబదియవమాసంబున నొకనాటి రాత్రి యొక్కొక్క కన్ను, నొక్కొక్క చెవియు, నొక్కొక్క చెక్కును,నొక్కొక్క

చేయియు, నొక్కొక్కమూపునుగా రెండు మనుజశకలంబులు బృహద్రథ భార్యలకు జన్మించెను. ఆ శిశుశకలంబులంగాంచి నంతనే వారు భయపడిరి. భయపడి భర్తకుఁ జూపుటకు లజ్జవడి, వీని నెవ్వరు నెఱుంగకుండ వెలుపలవైచి రండని తమ దాదులకు నియోగించిన, వార లా రెండు వ్రయ్యలుం గొని పోయి రాజ గృహద్వార తోరణసమీపంబునఁ జదుకంబు నొద్ద నొకచోట వైచిరి. అప్పుడచ్చట నుండెడు జర యను రాక్షసి తనకు బలివేసిరని యెంచి, పరుగునవచ్చి యా శక లంబు లందుకొని, యవ్వి కదలుచుండుట కనిపెట్టి రెండిం టిని సమముగా నొండొంటితోఁ జేర్చినంతనే యవి యొక్క టిగా నయ్యెను. దృఢకఠిన శరీరుండైన యబ్బాలకుని జర యెత్తికోజాలకపోయెను. అందుచే వాఁడు రోదనముచేసెను. ఆరోదనధ్వని భూమ్యాకాశముల నిండి, యంతఃపురముననున్న కాంతాజనమునకెల్ల నత్యాశ్చర్యమును గలిగించెను. ఆ ధ్వని వినినంతనే ముదుసలి యువ్వలెల్లఁబఱతెంచి, మహాహర్షముతో నబ్బాలకు నెత్తుకొనిరి. బృహద్రథుండు నీ ధ్వని యెట్టిదో యని విచారించుచు వచ్చి తేజోధికుండైన బాలుం జూచు చుండ నట్టి యవసరంబున రాక్షసి కామరూపిణి కావున మనుష్య స్త్రీరూపధారిణియై. "మగధేశ్వరా! నేను జరయను [illegible]

శకలంబుల దాదులు గొనివచ్చి పారవైచిన వానినిట్లు సంధిం చితిని. వీనిఁగైకొను"మని చెప్పెను. అంతరాజు మహానంద భరితుండై, "జరా! నాకీ కుమారునిఁ దొల్లి చండకౌశికుం

డిచ్చెను. ఇప్పుడు నీ విచ్చితివి. నీవు మాకులంబెల్ల నుద్ధరింప వచ్చిన పుణ్యదేవతవుగాని రాక్షసివిగావు.'' అని దాని నతి ప్రీతిం బూజించి కొడుకు నెత్తుకొని దేవీద్వయంబునకు నిచ్చి జరయను రాక్షసిచేత సంధింపఁ బడినవాఁడు గావున జరాసంధుఁడను పేరిడిరి. వాఁడు పెద్దవాఁడైనంతనే బృహద్రథుండు వానిని పట్టభద్రునిజేసి తపంబునకుఁ బోయె. నాట నుండియు జరాసంధుం డతిధూర్తుండై, లోకకంటకుండై యనేక రాజకుమారులం బట్టితెచ్చి చెరబెట్టి భైరవపూజ లొనర్చుచు నొక్కొక్కని బలియిచ్చుచుండెను. వాఁడు మధుర పైకిని పెక్కుమారులు దండెత్తివచ్చెను. వాని కారణంబున మేము మధురానగరమునం దుండనేరక కుశస్థలంబునకు వచ్చి రైవతక పర్వతంబున దుర్గమును గట్టుకొంటిమి. వాఁడెంత వాఁడైన నేమి? మీరాజసూయమును బ్రారంభింపుఁడు. విఘ్నసంశయంబున మహాకార్యములు ప్రారంభింపకుండ రాదు.

క. ఆరంభరహితుఁ బొందునె
యారయ సంపదలు హీనుఁడయ్యును బురుషుం
డారంభ శీలుఁడయి యక్క
తారంభులనోర్చు నెంత యధికులనైనన్.

## 16. జరాసంధుఁడు - సాధహింసాఫలము

కృష్ణుఁడు చెప్పిన జరాసంధ వృత్తాంతము విని భీమార్జునులత్యంత రణోత్సవమును వహించిరి. అట్టి ప్రబలవీరుఁడు లోకకంటకుఁడు వధ్యుండగునా యని యుధిష్ఠిరుఁడు శంకింపఁ జొచ్చెను. అది కనిపెట్టి వాసుదేవుఁడు, ధర్మనందనా!

భీమార్జునుల నాకిల్లడయొసంగుము. వీరితోనేగి యవశ్యంబుగ
జరాసంధుని గయ్యమున కాహ్వానించి, వాని దుదముట్టిం
తును. మాముగ్గురిలో నెవ్వరిచేనైన వాఁడు హతుండగు"
నని ధైర్యముతోఁ బలికెను. 'వాసుదేవా! నీ నియోగంబున
మాకు శత్రుజయంబగుటకు సందియము లేదు. భీమార్జునుఁ డిరు
వురు నానయనంబులు. వీరిని విడిచి నేనొక్క క్షణంబును నిలువ
జాలను. అయినను నా హృదయము మిక్కిలి హృద్యంబగు
చున్నది. కృష్ణార్జునుల దలంచినవారికి శ్రీ విజయంబులగు
అట్టి కృష్ణార్జునుల సహాయులుగాఁ బడిసిన భీమసేనునకు శ్రీవిజ
యంబులందుట కేమి సందియము? మహాత్మా! మీ కింకఁ
గార్యసిద్ధియగుంగాక! శీఘ్రంబుగఁ బోయి శుభంబున మరలి
రం" డని ధర్మజుఁ డాశీర్వదించెను.

అంతఁ గృష్ణభీమార్జునులు యుధిష్ఠిరాను మతంబునఁ
బ్రయాణసన్నద్ధులై వీర శ్రీవిభాసిత ముఖులై కృతస్నాతకులై
బయలుదేఱిరి. అట్లుబయలుదేఱిన యయ్యాదవ పాండవ
వీరులఁ దేజోమూర్తులంగాంచి యమునందనుఁ డమందా
నందము నొందెను. ఆ భారతవీరులు ముగ్గురు ననేక పర్వ
తంబులు గడచి, తత్పర్వతజాతంబులైన కాలకూట శోణకంట
కీయంబులను నేరుల లంఘించి, సరయూనదియుఁ బూర్వకోస
లయు మిథిలాదేశంబును గంగయు నతిక్రమించి, పూర్వాభి
ముఖులై నిరంతర ప్రయాణంబుల మగధరాజ్యమును బ్రవే
శించి గోరథం బను పర్వతమెక్కిరి. ఆ పర్వతాగ్రము నుండి,
చిత్రవిచిత్రంబులగు నారామములతోడను, నత్యున్నతంబులగు
సౌధరాజములతోడను రమ్యంబై యున్న గిరివ్రజపట్టణంబును

వీక్షించిరి. అప్పు డన్నగరవైభవమున కాశ్చర్యపడుచు నచ్యుతుండు భీమార్జునులఁజూచి యిట్లనియె. "ఇప్పుడు మనమున్నది గోరథంబను పర్వతము, ఇట్లేబుషభమును, వైహారమును, ఋషగిరియుఁ, జైత్యకాద్రియు నను నీదైదు పర్వతములును శూరభటులువోలె నీపట్టణంబును గాచుచుండును. దానంజేసి యియ్యది గిరివ్రజపురంబయ్యె. ఈదుర్గబలంబుచేతను, గౌతముఁడను మహర్షివరముచేతను మగధరాజుల నెవ్వరును జయింపఁజాలరు"

ఇట్లు పలుకుచుఁ గృష్ణుఁడా ద్వారంబునఁబురంబుఁజొరనొల్లక వారితోఁజైత్యకాద్రికిం బోయెను. ఆ గిరిశృంగమున వారికి మూఁడు భేరులు కంటఁబడినవి. అప్పుడు కృష్ణుఁడా భేరులు చూపుచు "భీమా! అర్జునా! పూర్వపుమగధరాజులు మానుపాదంబను ఋషభంబును వధియించి దానిచర్మముతో నీ మూఁడు భేరులు నిర్మించిరి. శత్రుసేనా రిప్పురంబు సొచ్చునప్పుడు గౌతమవరంబున నీ భేరులు తమంత మ్రోగుచుండును. కావున మనము వీనినిఁ బగులగొట్టవలయు" నని చెప్పెను. కృష్ణభీమార్జునులు ముప్పురును భేరులుమూఁడింటినిఁ బగులఁగొట్టి, మార్గముకాని మార్గంబునఁ బట్టణము బ్రవేశించిరి. ప్రవేశించి, మాలాకార గృహంబులకును గంధకర గృహములకును నరిగి బలవంతముగఁ బుష్పమాలలును జందనాగరులును గైకొని వానితో నలంకరించుకొనిరి. రాజమార్గమునుండిపోవుచు వారు ముప్పురును నిత్యమును బ్రాహ్మణులకు సుప్రవేశంబైన జరాసంధ మందిరమునఁ జొచ్చిరి. వారభ్యాగతులైన బ్రాహ్మణులని యెంచి జరాసంధుఁ డెదురువచ్చి

భక్తితోఁ బూజించి మధుపర్కంబు లొసంగఁబోవ వారంగీక రింపలేదు. అప్పుడు జరాసంధుఁడు వారల సంశయించి,

"అయ్యా! మధుపర్కంబులు గ్రహింపనొల్లని మీరు స్నాతకపురుషులు కావలయును. చైత్యకాద్రిపైగల భేరులు పగులగొట్టినవారును మీరే కావలయును. ద్వారములేని మార్గంబునఁ బురముసొచ్చిన మీవేషముల బ్రాహ్మణత్వ మును, మహాసత్త్వ దీర్ఘబాహు వక్షోలక్షణంబుల క్షత్రి యత్వంబును బ్రకాశించుచున్నవి. మీ రెవ్వ"రని యడిగెను. అప్పుడు నారాయణుండు, "జరాసంధా! మేము క్షత్రియు లము, ద్వారమార్గమున మిత్రగృహము ప్రవేశింప వలయును. అద్వారమార్గంబున శత్రుగృహము ప్రవేశింపవలయును. గంధ మాల్యములయందు లక్ష్మియుండును. కావున వానిని మేము బలవంతముగఁ గైకొంటిమి. వేఱుకార్యంబున నీయొద్దకువచ్చు టచే నీయాతిథ్యము నంగీకరింపలేదు" అని చెప్పెను. తోడనే మగధేశ్వరుఁడు వింతపడి, "అయ్యా! మీకు నేనెన్నఁడు నే విషయంబునను నపరాధము చేసియెఱుంగను. దైవబ్రాహ్మణ భక్తుండను. ఇట్టినేను మీకేల శత్రుండనైతి" నని యడిగెను. తోడనే మాగధునకు మాధవుం డిట్లనియె. "మగధేశ్వరా! సార్వభౌముఁడైన యుధిష్ఠిరు నియోగంబున మేము దుష్ట సంహారమునకు వెడలితిమి. నిర్దయుండవై నృపతుల జెఱఁబెట్టి వారిం బశువులుగా బలియిచ్చుచున్నావు. నిరపరాధుల వధి యించుటకంటె మిక్కిలి పాతకంబొండు గలదా? నీయట్టిపాప కర్ముల నుపేక్షించిన; నిఖిలధర్మ రక్షకులమైన మమ్మా పాపం బులు పొందఁగలవు. పాపభయంబున నిన్ను నిగ్రహింపవచ్చి

లేమి. నాకంటె నధికుండైన వీరుఁడు లేఁడని నీవు గర్వింపకుము. సాధువుల బాధించువాఁ డెంతవాఁడైన నశింపకమానఁడు. కావున నీ వకారణముచెడక నావచనము వినుము! చెఱబెట్టిన రాజులనెల్ల విడిచిపుచ్చుము. నీ క్రౌర్యమును గట్టిపెట్టుము. ఇంక దాపనేల? నేను కృష్ణుఁడను; ఇతఁడు భీమసేనుఁడు, అతండర్జునుఁడు. రాజులవిడువనినాఁడీ పాండవసింహములు నీ గర్వంబడంగించువారు" అని కృష్ణుఁడు గంభీరముగ బదులు చెప్పెను. ఆ మాటలు విని జరాసంధుఁడు మహోగ్రహావేశమున నొడలు మఱచెను. మొగమెఱ్ఱవాఱినది. కనుబొమ్మలు ముడివడినవి. శరీరము వణఁకుచుండ నతఁడు కృష్ణున కిట్లనియె.

"దేవతారాధనమునకుఁ దెచ్చినరాజుల నేను విడువను. వారితోఁబోరాడి యోడించి పట్టితెచ్చినవాఁడనే కాని, అన్యాయముగ మోసపుచ్చి కొనివచ్చినవాఁడను గాను. కావున మీలో నేనొక్కనితోఁగాని యిరువురతోఁగాని మువ్వురితోనైనఁగాని సమరంబుసేయుటకుసిద్ధముగనున్నాను." "పలువురొక్కనితోఁబోరుట యధర్మము గావున మా మువ్వురిలో నీ యిష్టమువచ్చినవాని నెన్నుకొను"మని కృష్ణుండనుగ, జరాసంధుఁడు 'నేను బోరాడఁదగిన వీరుండితఁడే' యని భీమసేను నెన్నుకొనియె. తోడనే భీమసేనుఁడు వానికి నక్కజముగా మల్లయుద్ధ సన్నద్ధుఁడై ప్రతిఘటించి నిలిచెను. సమసత్త్వాతిశయులైన భీమ జరాసంధు లిరువురును ఘోరముగఁ బోరాడఁ గడంగిరి. వారి యుద్ధము చూపఱకు భయానకంబుగఁ దోఁచెను.

కార్తీకమాసంబునఁ బ్రథమదివసంబు మొదలు త్రయో

దశి వఱకును వారిరువురు మహాయుద్ధ మొనర్చిరి. ఆ రోజటి నాటిరాత్రి జరాసంధుఁ డించుక బలహీనుఁడైనంతనే కృష్ణుఁడు కనిపెట్టి, 'భీమసేనా! ఇమ్మాగధుని సత్వంబు క్షీణించినది. వాయుదేవుని బలంబును నీ బలంబును వెల్లడి యగునట్లు లోకకంటకుండగు వీని సంహరించి శాశ్వతయశం బొందు' మని ప్రోత్సహించెను. ఆ మాటలకు భీముం డుప్పొంగి క్రొత్త బలంబును వహించి, జరాసంధుని బట్టియెత్తి నవరంధ్రంబుల రక్తధార లొలుకునట్లు నేలవైచి కొట్టెను. అమ్మహాఘాతమున మాగధుండు మహాపర్వతమునవలెఁ గూలి విగతప్రాణుఁ డయ్యెను.

ఆ. వె. కారణంబు లేక దారుణంబగు సాధు
హింసఁ జేయు కుజనుఁ డెల్లవారి
కప్రియుండుగాక, యప్రియలక్షణం
బొందుగలదె తలఁప నుత్తములకు.

# 17. శిశుపాలుఁడు - దైవదూషణము

జరాసంధవధ జగద్విదితంబగునట్లు వాని కళేబరంబును భీమసేనుఁడు నగరద్వారతోరణ సమీపంబున వైచెను. ఆ భయంకరకృత్యమునుజూచి పట్టణవాసులెల్లరును భయాతిశయంబునఁ బ్రాణాపాయమును శంకించిరి. కరుణాసమేతుఁడైన గరుడధ్వజుఁడు మాగధులకెల్ల నభయమిచ్చి చెఱయందున్న రాజలోకంబునెల్ల విడిచిపెట్టెను. మోక్షితులైన క్షత్రియు లెల్లరు ననంత రత్నపుంజములను గానుకలుగా

సమర్పించుకొనిరి. జరాసంధుని కుమారుఁడైన సహదేవు నోదార్చి వాసుదేవుఁడు వానికిఁదండ్రిసింహాసనము నొసంగెను.

లోకైక వీరుండైన మాగధుఁడు వృకోదరునిచేఁజంపఁ బడుట వినినంతనే యుధిష్ఠిరుఁడు మహానంద భరితుఁడై రాజ సూయం బింక నిర్విఘ్నముగఁ గొనసాగునని ధైర్యమువహిం చెను. వానియాజ్ఞానుసారముగ భీముఁడు తూర్పు దేశమునకును నర్జునుఁ డుత్తర దేశమునకును, నకులుఁడు పశ్చిమదేశంబు నకును, సహదేవుఁడు దక్షిణ దేశమునకును దిగ్విజయార్థము మజల బయలుదేఱిరి. పాండురాజుకుమారుఁడైన ధర్మరాజు రాజసూయయాగము గావించుంగావున మీరా రా సార్వభౌము నకుఁ గప్పములు చెల్లించ వలయునని భీమార్జున నకుల సహదేవు.. తాము పోయిన దేశముల యందలి రాజులను శాసించిరి. నయముచేఁ గొందఱు, భయముచేఁ గొందఱును, పోరాడి యోడిపోయి కొందఱును, మొత్తముపై రాజులెల్ల రును పాండుకుమారులకు వశులై యపరిమితములైన ధన కనక వస్తువాహనాదులను యుధిష్ఠిరునకు సమర్పించుకొనిరి.

ధర్మరాజు రాజసూయ యాగమును బ్రారంభించెను. పురోహితుఁడైన ధౌమ్యుఁడు కావలసిన యజ్ఞోపకరణద్రవ్యము లన్నియు సమకూర్చెను. దిగ్విజయమున ధర్మరాజునకు సామంత రాజులైన మహారాజులందఱు నా యాగమున కాహ్వానింపఁ బడి వచ్చిరి. వచ్చిన రాజులకెల్లఁ దగిన నివేశము లొసంగఁ బడినవి. దుర్యోధనుఁడు కర్ణునితోడను నూర్వురు తమ్ములతోడను వచ్చెను. మరియు విరాట ద్రుపద శిశుపాల వృష్ణి భోజాంధక రాజులును, అంగ వంగ కళింగ కాశ్మీర కాంభో

జాదిరాజులును వచ్చిరి. అట్లువచ్చిన సకల రాజలోకములో
మనకుఁ బ్రస్తుతము శిశుపాలుఁడు ముఖ్యుఁడు.

శిశుపాలుఁడు చేదిరాజ్యమునకు రాజు. తండ్రి దమ
ఘోషుఁడు. తల్లి సాత్వతి. ఆ దంపతులకు వీఁడు చతుర్భుజ
లలాటనేత్రములతోఁ బుట్టి, పుట్టినంతనే గార్దభస్వరముతో
నేడువ నారంభించెను. ఆయద్భుతముఁజూచి తల్లిదండ్రులు భయ
విస్మయాధీన మనస్కులగుచుండ నొక్క యశరీరమైన భూతము
వారి కిట్లనియె. 'ఈ బాలు నెవ్వరెత్తికొనినచో వీని రెండు
చేతులు లలాటనేత్రమును మాయమగునో వానిచేత నితఁడు
చంపఁబడును. ఇతరులచేఁ జంపఁబడఁడు.' ఇట్లుపలికిన యశరీర
వాణిని విని వా రమితాశ్చర్యమునొంది, యా బాలునిఁజూడ
వచ్చిన వారికెల్ల వాని నెత్తుకొనుట కందించుచుండిరి. అతి
వికృత స్వరూపుఁడైన యా బాలుని, మేనత్తయైన సాత్వతినిఁ
జూచుటకుఁ గృష్ణుఁ డొకనాఁడు వచ్చెను. వచ్చినంతనే వాసు
దేవునిఁ బ్రియసత్కారంబులఁ బూజించి సాత్వతి తన కుమా
రుని వాని కందిచ్చెను. అతండక్కుమారుని నెత్తుకొనినంతనే
చూచువారికెల్ల నక్కజముగ వాని మిక్కిలి చేతులును,
మిక్కిలి కన్నును దటాలున మాయమైనవి. దానింజూచి
సాత్వతి యద్భుతచిత్తయై యశరీరవచనం బప్పుడు తలంచి
తనపుత్త్రునకు నారాయణుని వలన మరణంబగుట యెఱిఁగి
'ముకుందా! వీఁడు దుష్టుండైన నీ కనిష్ఠుండై యెంతటి యవిన
యము గావించినను, కరుణించి నూఱు అపరాధముల వఱకు
క్షమింపవలయునని ప్రార్థించెను. జగద్విభుండైన జనార్దనుండు
మేనత్తను మన్నించి యామె కా వరంబు నొసంగెను.

ఇది శిశుపాలుని బాల్యవృత్తాంతము. పెద్దవాఁడైన తరువాత నతఁడు జరాసంధాదులకు ప్రాణమిత్రుఁడై కృష్ణుని శత్రుకోటిలోఁ బ్రవర్తించు చుండెను. వివిధదేశాగతులైన రాజపుత్రు లెల్లరు నాడు ధర్మరాజు రాజసూయవైభవమును జూచి మిక్కిలి సంతసించి, సకల క్షత్రియ వీరులచే నలంకరింపఁ బడిన నిందుసభలో సర్వసమ్మతుండును జగన్మాన్యుండునునగు నొక్క మహాపురుషుని బెద్దగాఁ జేసి యర్ఘ్యం బొసంగి గౌరవింపు మని భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పెను. యుధిష్ఠిరుం డందుకు సమ్మతించి "మహాత్మా! ఈ రాజలోకములో నట్టి మహాపురుషుఁ డెవ్వరో నిర్ణయించినయెడల వాని కర్ఘ్యం బొసంగెద"నని యడిగెను. 'పుండరీకాక్షుండైన కృష్ణుండు దక్క నిందర్ఘ్యంబు గొనుట కర్హులిం కెవ్వరు గలరు? కావునఁ బురుషోత్తముఁడైన నారాయణుని గౌరవింపు'మని భీష్ముఁడు నియోగింపఁ దద్వచనంబున ధర్మనందనుఁడు సహదేవుఁడు తెచ్చిన యర్ఘ్యం బర్హణీయుండయిన వాసుదేవునకు శాస్త్రోప దిష్ట విధానంబున నిచ్చిన, దానింజూచి సహింపనోపక శిశు పాలుం డుపాలంభనపరుండై యధోక్షజు నాక్షేపించుచు ధర్మరాజున కిట్లనియె.

'యుధిష్ఠిరా! అవనీనాథు లనేకులుండ, విశిష్టాచారు లును బూజ్యులునగు బ్రాహ్మణులును పలువురుండ,గాంగేయు నవినీతి విని దుష్టచరితుండైన కృష్ణునిఁ బూజించి నీయవివే కంబు వెల్లడించుకొంటివి. నీవుధర్మపరుండవనియును,బూజ్యుండ వనియు నీసుగుణంబులు వినివచ్చిన మారాజలోకమును నీవిట్లు పరిభవింపవచ్చునా? ఈ దాశార్హుఁడు పూజార్హుఁడగునా?

శ్రీకృష్ణుండు మీకంతయిష్టుండేని వలసినంత ధనం బొసంగెదరు గాక! మావంటి మహారాజులును, కృపద్రోణాదులవంటి యాచార్యులును గల యీ నిండు సభలో వానిఁ బూజింప వచ్చునా? అని యింకనేమేమో నోటికివచ్చినట్లెల్ల ప్రేలుచు సభనుండి తొలంగిపోబోయెను. వానితోడనే వానిమిత్రులైన మఱికొందఱు రాజులును వెడలిపోబోయిరి. వారట్లు రణ సన్నాహ మొనర్చిన యెడల యజ్ఞమునకు భంగము వాటిల్లునని భయపడి ధర్మరాజు శిశుపాలుని సమీపించి మంచి మాటలతో వానిని శాంతిపఱచుటకుఁ బ్రయత్నింపసాగెను. ఎంత యెన్నివిధములఁ జెప్పినను వాఁడు తనమౌర్ఖ్యమును మానలేదు. మానక కృష్ణునకును గయ్యమునకుఁ గాలుఁ ద్రవ్వసాగెను. అప్పుడు చక్రధరుండు సకలరాజచక్రము విన గంభీరస్వరమున నిట్లు పలికెను.

"ప్రాగ్జ్యోతిషంబునం గల భగదత్తుపై నేను దండెత్తి పోయినప్పు డీ శిశుపాలుఁ డన్యాయముగఁ బ్రజల బాధించి ద్వారకానగరంబును గాల్చెను. మా భోజవంశపు రాజులు భార్యలతోఁగూడ రైవతకాద్రిని వినోదించుచుండ వారి నకారణంబ వధించెను. వసుదేవుఁడు చేయదలంచిన యజ్ఞము విఘ్నమొందునట్లు వాని హయము నపహరించెను. మఱియు వీఁడు వాగ్విషయంబులైన యపకారంబు లనేకములు నాకొనర్చె. తొల్లి మాయత్త సాత్వతి నన్నుం బ్రార్థించుటం జేసి, యిదురాత్ముఁడు చేసిన యపరాధశతంబు సహించితిని. ఇప్పుడు మీరందఱు నెఱుంగ నన్నకారణంబ దూషించి, నాకత్యంత శత్రుండయ్యె." ఇట్లు పలుకుచు నారాయణుండు

రాజచక్రంబెల్ల భయమొందునట్లు చరించును. బిరోయాగించి శిశుపాలుని మస్తకంబును దటాలున ఖండించెను.

క. భూరిగుణోన్నతు లనఁదగు
వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
క్పారుష్యము చనునె మహా
దారుణమది విషముకంటె దహనముకంటెన్.

# 18. ద్రౌపది - పాతివ్రత్యమాహాత్మ్యము

ఖాండవ దహనకాలమున నర్జునుఁడు మయునకుఁ గావించిన మహోపకారమునుదలంచి, మయుఁడురాజసూయ సందర్భమున నత్యద్భుతమగు నొక సభగావించి పాండవుల కిచ్చెను. ఆ విచిత్ర సభావైభవంబును జూచి వచ్చిన రాజులెల్లరు మితిమీఱిన యాశ్చర్యమును పొందిరి. చూచుటయం దింకను దనివిఁజెందక, దుర్యోధనుఁడు శకునితోఁ గొన్ని దినంబులందే యుండిపోయెను. ఒకనాఁడు దాని యపూర్వరమణీయతకు విస్మితుండై యాయాప్రదేశములం గ్రుమ్మరుచు, వివృతంబైన ద్వారమును సంవృతంబుగాఁ దలంచి చొరనొల్లక, సంవృతద్వారమును వివృతంబనిచొరంబోయి, కవాటఘటితలలాటుండగు చుండెను. మఱియు విమలమణిస్థలంబు జలాశయంబని కొని పరిధానం బెగఁద్రోచికొని, నిజమైన జలాశయంబును స్థలముగాఁ దలంచి కట్టినపుట్టము తడియంజొచ్చిన వాని యవస్థఁజూచిన పాంచాలియును పాండవులును నవ్వుకొనిరి. ధర్మరాజు వానిసంగతి విని భీమునిచేత దివ్యాంబరాభరణాదులు వానికి నిప్పించి పంపించెను.

దుర్యోధనుం డట్లు సభావ్రిభావంబునకు లజ్జితుండై కరిపురంబున కరిగి,ధర్మజు రాజసూయము తన కసూయాజనకం బగుటచేతను, వాని సభాలక్ష్మి తన నయనంబుల కగ్నిజ్వాల యగుటచేతను నిద్రాహారంబులు మాని పరాభవదుఃఖమునం బరితపించుచుండెను. వాని విపరీతస్థితి గని పెట్టి మేనమామ యైన శకుని వానిని సమీపించి మెల్లఁగ దుఃఖ కారణం బడిగెను.దుర్యోధనుఁడు తనకు సభలోఁ గలిగిన పరాభవమును, పాండవుల యైశ్వర్యమందలి యసూయయు శకుని కెఱింగించి, 'మామా! నీ వెట్లులైనఁ బాండవైశ్వర్యంబు హరించి నాకీయ వలయును. నన్నుఁబరిభవించినట్లు పాండవుల నింకుసభలోఁ బరిభవింప వలయును. అట్లు కానినాఁడు నేను ప్రాణపరి త్యాగముఁ గావింతు' నని కన్నీరుఁ గార్చెను. శకుని వాని నోదార్చి వానితో ధృతరాష్ట్రు నొద్దకుం జని దుర్యోధనుని మనోవేదనమును వ్యక్తపరచెను. దుర్యోధనుఁడును దనపరాభవముతండ్రితోఁ జెప్పుకొనెను. మాయాజూదంబాడి పాండవుల లక్ష్మిహరించుటకు శకుని దుర్యోధనులు ధృతరాష్ట్రుని కడ నిశ్చయించుకొనిరి. కాని యతఁడట్టి యకార్యమునకు నమ్మతింపక కొడుకున కనేక విధముల బోధించెను. ఎంత బోధించినను దుర్యోధనుఁడు తన పట్టు విడువలేదు.

రాజాజ్ఞ ననుసరించి విదురుఁడు పాండవులను హస్తి పురమునకుఁ దీసికొనివచ్చెను. శకుని దుర్యోధనులు వారి యెడఁ దమకు లేనియభిమానము నభినయించుచు గౌరవాదరణంబులు నెఱపుచు నొకనాఁడు ద్యూతరంగమునకుఁ దీసికొని వచ్చిరి. క్రమక్రమముగా ద్యూత ప్రసంగమును గావించిరి.

జూద మాడుటకు ధర్మజుని మెల్లఁగాఁ బ్రోత్సహించిరి. ద్యూతము సకలానర్థదాయకంబని యుధిష్ఠిరుఁడు వారిని నివారించెను. కాని వారు మాన లేదు. అందుచే జూదంబునకుఁ బిలువంబడి యాడకుండుట యధర్మంబని ధర్మనందనుఁడు శకునితో జూదమాడుటకుఁ బ్రారంభించెను.

పాచికలు పట్టినది మొదలు మాయావియుండైన శకుని ధర్మజునోడించుటకుఁ బ్రారంభించెను. ఓడుచున్న కొలఁదిని బట్టుదల వహించి, యుధిష్ఠిరుఁడు మఱింత కృతనిశ్చయుఁడగుచుండెను. "ఎట్టి శాంతులకైనను నెట్టిధర్మపరులకైనను ద్యూతము మత్సరకారణంబును గలహాకారణంబును నగు." అందుచే నా మాయజూదమునందు దగులుకొని బద్ధమత్సరుండై యుధిష్ఠిరుఁడు దేవబ్రాహ్మణ వృత్తులుదక్క నఖిలమహీతలంబును, బ్రాహ్మణులుదక్క సర్వప్రకృతి జనులను రాజపుత్రుల నొక్కొక్క యొద్దున నొడ్డి యోటువడెను. పిమ్మట నత్యంతధర్మ సమేతులును నాదిత్య తేజులును నగు భీమార్జున నకుల సహదేవుల నొడ్డి యోటుగాంచెను. అంతకంటెను దారుణంబుగ మహాసాధ్వియైన పాంచాలినొడ్డి, మత్సరాతిశయంబున మతిపోయిన యుధిష్ఠిరుఁ డామెనుగూడ దుర్యోధనాదులకు దాసిగాఁ జేసెను. కడకుఁ దన్నొడ్డుకొని యోడి, తానును వారికి దాసుఁడయ్యెను.

ఇట్లు సర్వము నోడినంతనే దుర్యోధనాదులు సంతోషాతిశయమునఁ గెవ్వునఁ గేకలిడసాగిరి. ఖిన్నులై దీనాననులై పాండవు లేవురును జలనములేని చిత్రప్రతిమలైరి. ఇట్టి కపటద్యూత మధర్మమని భీష్మద్రోణ కృపాదులైన పెద్ద

ఎల్లరును శకుని సుయోధనుల ననేక విధముల వారించిరి కాని, రారాజు వారిని లేశమును లక్ష్యపెట్టక, ప్రాతికామి యను వానిం బిలిచి నీవిప్పుడపోయి ద్రౌపది నీ సభలోనికిఁ దీసికొని రమ్మని యాజ్ఞాపించెను. తోడనే ప్రాతికామి పాంచాలిపాలికిం బోయి భక్తితో నమస్కరించి, 'తల్లీ ! ధర్మనందనుఁడు సమస్త రాజ్యమును సోదరులను దన్నును నిన్నును జూదమున దుర్యోధనున కోటువడియె. రారాజు నిన్నుఁ దోడ్కొని రమ్మని నాకు నియోగించెను. నీ వాతని కడకు రావలయు' నని పలికెను. పిడుగువంటి యా దారుణవార్త విని పాంచాలి సంతాపతప్త చిత్తయై దుఃఖించి 'అయ్యా ! ఏ యుగంబు నందైన భార్యను జూదమునందోడు భర్తలుందురా? నా భర్త మున్ను నన్నోటువడి పిదపఁ దన్ను నోటువడెనో, లేక తన్ను మున్నోడి పిదప నన్నోటువడెనో యెఱింగింపుము. నీ వెఱుఁగ వేని యా జూదరినే యడిగి రమ్మని పంపెను. ప్రాతికామి క్రమ్మఱివచ్చి పాంచాలి పలుకులు ధర్మనందనునకుం జెప్పి నిరుత్తరుండయ్యెను. అదిచూచి దుర్యోధనుఁడు తన సందేహ మచ్చటనే తీర్చుకొన వచ్చునని చెప్పి యామెను దోడ్కొని రమ్మని మరలఁ బంపెను.

ద్రౌపది ప్రాతికామి వెంట వచ్చి పాప మేకవస్త్రయై దుఃఖించుచుఁ గురువృద్ధ సమీపంబున నిలిచెను. అప్పుడు దుర్యోధన నియోగమున దుశ్శాసనుం డామెను సమీపించు చుండ నా సాధ్వీమణి వెఱచి గాంధారియొద్దకుఁ బాఱిపోయెను. దుశ్శాసనుండును విడువక వెంటనేగి, యతిదారుణంబుగ నామె కొప్పుబట్టి సభ కీడ్చుకొని వచ్చెను. ద్రౌపది బోరు

జోరున నేడ్చుచుఁ బాండవుల దక్కటి సభ్యులను నుద్దే శించి, 'ఇద్దురాత్ముండు నన్నవమానించు చున్నవాఁడు. వీనిని వారింపుఁ, డని మొఱపెట్టెను. ఆమె మొఱలాలకించు వారుగాని, యామె యడిగిన ధర్మసందేహమునకు బ్రత్యుత్తర మిచ్చువారుగాని నాటి సభలో లేరైరి. 'ఓ జగన్నాథా! ఆర్తజనశరణ్యా! జనార్దనా! రక్షింపుము రక్షింపు. మని ద్రౌపది నారాయణునిఁ బ్రార్థించినది. అప్పుడు దుర్యోధనుఁడు పాండవులయు, ద్రౌపదియు వస్త్రంబు లపహరింపుమనిదుశ్శా సనునకు నియోగించెను. ఆమాటలు వినుటయె తడవుగఁ బాండవులు తమపైనున్న వస్త్రము లచ్చటఁ బడవేసిరి. దుశ్శాసనుఁ డేకవస్త్రయైన పాంచాలి కట్టుబట్టను బలాత్కా రంబున నాకర్షించెను. నారాయణుని యనుగ్రహంబుచేతను, నామెపాతివ్రత్యమహిమచేతను దుశ్శాసనఁ డపహరించుకొలది నామె కట్టుచీర లక్షయంబై యాసభలో నొకకొండంత పోగుగాఁ బేర్చఁబడినవి. దుశ్శాసనునిచేతులు పీకినవి, ప్రాణ ములువిసిగినవి, దుర్యోధనాదులమొగములు వెల వెలఁబారినవి.

ఇప్పటికైనను బాంచాలిప్రశ్నమున కెవ్వరైన నుత్తరం బీయఁదగునని విదురుఁడు సభ్యుల నుద్దేశించి పలికెను. కాని దుష్టుఁడైన దుర్యోధనునకు వెఱచి యెవ్వరును మాటాడలేదు. లజ్జావనత వదనయై యేడ్చుచున్న ద్రౌపదిం జూచి తన తొడపైఁగూర్చుండుమని దుర్యోధనుఁడు కనుసన్నఁ గావిం చెను. అదిచూచి భీమసేనుఁడు పండ్లు పటపటఁగొఱకుచు ప్రళయకాల రుద్రుండై, "సాధ్వియైన పాంచాలిని గొప్పుపట్టి యీడ్చిన దుశ్శాసనుని, తొడపైఁ జేరుమన్న దుర్యోధనుని

రణరంగమున నింత లింతలుగ ఖండించెద. అట్లు గావింపని నాడు పితృపితామహుల గతికిం దప్పినవాఁడ నగుదు" నని ఘోరమైన శపథములఁ గావించెను. ఈ మహోపద్రవము లన్నియు ధృతరాష్ట్రునకుఁ దెలిసినవి. తెలిసినంతనే యతఁడు దుర్యోధనుని రావించి వాని యకార్యము నత్యాగ్రహముతో దూషించి పిదపఁ బాంచాలినిఁ బిలిచి శాంతవచనంబులతో నోదార్చి, 'సుందరీ! నీవునాకోడండ్రందఱిలోఁబూజ్యురాలవు. నీకిష్టం బెయ్యది? కోరుమిచ్చెద' నని పలికెను. కౌరవ దాస్యమునుండి ధర్మజుని విముక్తినిఁ జేయుమని యామె కోరెను. ధృతరాష్ట్రుం డావర మొసంగి యింకొకటి కోరు మనెను. తక్కిన నలువురు సోదరులను దమ తమ యాయుధములతోఁగూడ దాస్యము తొలంగునట్లు వరముకోరెను. ఆ వరము నొసంగి యతం డింకొక వరమ్మనుగూడ వేడుమనెను. కాని క్షత్రియసతి రెండువరములకంటె నధికముకోరుట విరుద్ధమనిపలికి యామె మఱియేమియుఁ గోరలేదు. ధృతరాష్ట్రుండు కోడలి గుణంబులకు ధర్మబుద్ధికి సంతసించి ధర్మజుని రావించి యాతం డోడిన సర్వస్వమును మఱల నాతనికిచ్చివేసెను.

గీ॥ క్షత్రనీతిక్రమంబులు గావుసూవె!
నిష్కృతియును జూదమును, ధర్మనిత్యులైన
వారి కీ రెండు వర్జింపవలయు నెపుడు
పాపవృత్తంబు జూదంబు పార్థివులకు

# 19. కిమ్మీరుఁడు-మార్గనిరోధము

ధృతరాష్ట్రుఁడు పాండవుల రాజ్యమును మఱలఁ బాండవుల కిచ్చివేసినంతనే దుష్టచతుష్టయంబని పేరువడిన కర్ణ శకుని దుర్యోధన దుశ్శాసనులు మిక్కిలి విచారించిరి. సర్వమును నపహరించి పాండవేయులను మఱల రాజ్యహీనులను గావింపవలయునని వా రుపాయము లాలోచింపసాగిరి. ధృతరాష్ట్రుఁడు కూడ నేకీభవించినగాని తమ కార్యము నిర్విఘ్నముగఁ గొనసాగదని వారు నిశ్చయించుకొని దుర్యోధనునిఁ దండ్రియొద్దకుఁ బంపిరి. పాండవ పరాక్రమంబు తనకుఁ బ్రాణాపాయకరంబనియు, విషసర్పంబుల కలుకవుట్టించి విడిచినట్లు పాండవుల విడుచుట కర్జంబుగాదనియు, జూదమునకు మఱల ననుజ్ఞ నొసంగవలయుననియు సుయోధనుఁడు తండ్రిని బ్రార్థించెను. ధృతరాష్ట్రుం డొడంబడి యప్పుడే తాను ద్యూతార్థము ధర్మనందనుం దోడి తేరఁ బ్రాతికామిం బంచినఁ బితృనియోగంబును విధి నియోగంబును నతిక్రమింపనేరక ధర్మజుఁడు వచ్చి జూదంబాడి యథాక్రమంబుగ నోడిపోయెను. ఆజూదంబులో వారు పణంబుగా నోడినది పండ్రెండేండ్లరణ్యవాసము నొకయేడజ్ఞాతవాసము. ఆనియమము ననుసరించి పాండవులు వనవాసములకుఁ బోయిరి.

పాండవులు కట్టుబట్టలతో లేచి, పాంచాలినిఁ దోడ్కొని బ్రాహ్మణ సమేతుండైన ధౌమ్యుం గూడి, పట్టణంబు విడిచి మూఁడహోరాత్రంబులు నిరంతరప్రయాణములు చేసిరి. నాల్గవ నాఁడు వారందఱును గామ్యకమను నొక వనముఁ బ్రవేశించి యందుఁ గొన్నిదినములు విశ్రమించిరి. ఒకనాటి యర్ధరాత్రి

మున రాక్షస పరిచారవేళయందు వా రవ్వనమున సంచరించు చుండ మార్గమధ్యమున వారికిఁ బెక్కు రాక్షసమాయలు గోచరించెను. ఆప్రాంతమున రాక్షససంచార మున్నట్లువారు సంశయించిరి. కొంఁది నిముషములలోనే మార్గంబునకడ్డంబుగ నున్న భయంకరంబగు నొక రాక్షసవ్యక్తిని వారు చూచిరి. దీర్ఘంబులైన వాఁడికోఱలు వెలువడ వదన గహ్వరముఁదెఱచి, గ్రుడ్లుమిలమిల మెఱయుచుండఁ దామ్రకేశములు గాలికిఁదూలు చుండ, సకలప్రాణి భయజనకంబుగా గర్జిల్లుచుఁ బాదఘట్టన లచే భూకంప ముదయింపఁజేయుచు, మార్గమునడ్డగించిన యా రాక్షసునిఁ జూచినంతనే వారందఱు దాగిరి. పర్వతంబునుం బోలిన వాని మహాకాయమును, భీకరాకృతియుఁజూచి వికీర్ణ వేణీభరంబుతో వచ్చుచుండిన పాంచాలి "పులింగాంచిన మేఁక వలె"గడగడ వడఁకసాగెను. అప్పుడు పాండవులేవురునక్కోమ లిం బట్టుకొని, భయము వాపి ధైర్యముఁ గఱపుచుండ, ధౌమ్యుఁడు రాక్షస మాయా విదారణంబులగు మంత్రములఁ జపియించి, యారక్కసుని మాయలనెల్ల దొలంగించెను.

అట్లు మార్గనిరోధంబుగావించిన దానవునుద్దేశించిధర్మ నందనుఁడు, నీవెవ్వండవు? ఇవ్వనంబున నేలయున్నవాఁడవు? మాకు మార్గనిరోధంబేల గలిగించెద' వని యడిగెను. అడిగి నంతనే యారాక్షసుఁడు కహకహ నవ్వుచు, ఏను బకాసు రుని యనుజుండను. కిమ్మీరుండనువాఁడను. సమస్త జంతు భక్షణ మొనర్చుచు నీకామ్యకవనంబున సంచరించుచుందును. మానవు లిందు సంచరించునెడ వారినినామాయలోఁ జిక్కించి, బ్రదికియుండగనే విఱిచి భక్షించుచుందును. యుద్ధమున

నన్నెదుర్కొనఁగలవారెవ్వరును లేక, బహుకాలమునుండి యీ కామ్యకవనంబు నిర్మానుష్యంబై నాకు మానవాశనము లభింపకున్నది. "మీరందఱు నిందుఁ బ్రవేశించుటచేత నిష్టంబైన, యాహారంబుననింకఁ బరితృప్తుండనయ్యెద''నని పలికెను. అది విని ధర్మరాజు "కిమ్మీరా! నీవుమమ్మెఱుఁగవు. నీచే భక్షింపఁ బడవలసిన వారము కాము. మమ్మెఱుంగక నీపలికిన పలుకులు పాటిసేయము. ఇంకనైన బుద్ధిగలిగి మార్గనిరోధంబు గావింపక తొలంగిపొమ్ము. నేను ధర్మజుఁడను, వీ రిరువురును భీమార్జునులు, వారు నకులసహదేవులు''అని చెప్పెను.

భీముండను పేరు వినినంతనే కిమ్మీరుఁడు మండిపడుచు పండ్లు పటపటఁ గొఱుకుచుఁ బర్వతగుహలు మాఱుమ్రోగునట్లు బొబ్బలిడుచు, "భీముఁడా, భీముఁడా! మా యన్నం జంపిన భీముఁడా? ఆహా! ఎంత యదృష్టము? వీని నెందైనఁ బట్టి కడ తేర్పవలయునని చిరకాలమునుండి తరుణమునకై నిరీక్షించుచుంటిని. నా యన్నయగు బకాసురునే కాక, నా యిష్టసఖుండైన హిడింబాసురునిఁ గూడ వీఁడే కడతేర్చినాఁడట. వాతాపిని మ్రింగిన తపసివలె వీనినిప్పుడే దిగమ్రింగి జీర్ణంబు గావించెద''నని పలుకుచుండ, నర్జునుండు తన గాండీవమును సవరించుకొనఁజొచ్చెను. నకుల సహదేవులును ఖడ్గము లాడింపఁ జొచ్చిరి. భీముఁడు వారినివారించి మత్తమాతంగముపై కుఱుకు కొదమసింగమువలెఁ గిమ్మీరుపైకి లంఘించెను. అప్పుడు భీమ కిమ్మీరులకు ఘోర యుద్ధము జరిగినది. ఆసన్నమహీరుహంబులం బెఱికి కొంతసేపును పాషాణంబులువట్టి కొంతసేపును గలహించి క్రమముగ మల్ల

యుద్ధమునకుఁగడంగిరి. మధ్య మధ్యయుధిష్ఠిరుఁడు "కిమ్మీరా! భీమునకు శరణాగతుండవగుము. బ్రతుకఁగల"వని బోధించుచుండెను. ఆ మల్లయుద్ధములోఁ బ్రచండ కోపంబున భీముఁడు విజృంభించి, తీవ్రతర ముష్టిఘాతముల వానిని హీనసత్త్వునిఁగాఁ గావించి కృతాంత దండానుకారంబులైన తన బాహుదండముల నమ్మనుజకంటకుని కటి కంఠ ప్రదేశంబులఁ బట్టి నేలంబెట్టి విఱిచి బకుంజంపినవిధంబునం జంపి విడిచెను.

ఆ. వె. కార్యగతుల తెఱఁగు కలరూపు సెప్పిన
నధికమతులు దాని నాచరింతు
రల్పభాగ్యబుద్ధు లగువారలకు నది
విరసకారణంబు విషముఁబోలె.

---

## 20. అర్జునుఁడు, ఈశ్వరసాక్షాత్కారము

ద్వైతవనంబునుండి పాండవులు బ్రాహ్మణులతోఁ గామ్యకవనంబునకరిగి సరస్వతీతీరమునఁ గొంతకాలము నివాసముచేసిరి. ఆ దినములలో నొకనాఁడు యుధిష్ఠిరుఁ డర్జునున కిట్లనియె. 'పార్థా! మహావీరులైన భీష్మాదులు ధనుర్వేద పారంగతులు. దుర్యోధనారాధితులై రణరంగమునఁ గౌరవ పక్షముననిలిచి మున్ముందు మనల నవశ్యము నెదిరించువారు. దివ్యాస్త్రకోవిదులైన యట్టి మహావీరుల నోర్చునట్టి యుపాయంబునీకుఁ జెప్పెద. కృష్ణద్వైపాయనుండు నాకుఁ బ్రసాదించిన 'ప్రతిస్మృతి' యనువిద్య నీకొసంగెదను. కవచ కార్ముక ప్రాస ఖడ్గ ధరుండవై యన్యుల కజేయుండవై యుత్తరదిక్కున కరిగి తపోయోగ బలంబున నింద్రునిఁ బ్రత్యక్షము సేయుము.

తొల్లి వృత్రునకు వెఱచి వేల్పులు తమతమ యాయుధంబులు మహేంద్రునకు సమర్పించిరి. ఇంద్రప్రసాదంబున నవియెల్ల నీకు లభింపఁగలవు. పిమ్మట నీశ్వరు నారాధించి వాని యనుగ్రహంబున నిష్టసిద్ధి వడయుము'.

ఇట్లు చెప్పి ధర్మరా జర్జునునకుఁ బ్రతిస్మృతి నుపదేశించెను. అర్జునుం డావిద్యాగ్రహణ ప్రభావమున నధిక తేజోమూర్తియై దివ్యాస్త్రలాభార్థం బగ్రజుచేత ననుజ్ఞ వడసి, హోమంబుగావించి, బ్రాహ్మణాశీర్వాదములతో బయలుదేఱెను. బయలుదేఱునప్పుడు పాంచాలివచ్చి 'జగన్నాతా! పరాభవదుఃఖమున మునిఁగియున్న మాయందఱిని నీవే దయతో నుద్ధరింపవలయును. సూర్యచంద్రులును, భూమ్యాకాశములును నిన్ను నిరంతరము గాపాడుచుండుఁగాక!' అని దీవించెను. అర్జునుండట్లుబయలుదేఱి పూర్వోత్తరదిశాభిముఖుండై యొక్కరుండ యరిగి, హిమశైల గంధమాదనంబు లతిక్రమించె. అచ్చటినుండి యింద్రకీలమను పర్వతముపైఁ బోవుచుండ నాకస్మికముగ నర్జునునకు 'నిలు నిలుము. పోవకు' మను మధురధ్వని వినవచ్చెను. దానికి విస్మయంబంది, పోవుచు ముందట నొక్క వృక్షమూలమున నున్న వృద్ధబ్రాహ్మణునిం గాంచెను. కాంచి నమస్కరించెను. అప్పుడు బ్రాహ్మణుండు 'నీ వెచ్చటివాఁడవు? ఈ ప్రదేశము శాంతతపస్వుల కాస్పదము. ఇట్టి పుణ్యనివాసంబున నాయుధము ధరింపఁగూడదు. తత్క్షణమవానినిఁ బారవిడువు' మని చెప్పెను. అర్జునుం డామాటలు లేశమును లక్ష్యపెట్టక, భయపడక, తన మార్గమునఁ బోవుచుండ, వానిధైర్యంబునకు మెచ్చి బ్రాహ్మణరూపంబు

విడిచి సహస్రాక్షుండు వానికిఁ బ్రత్యక్షుండై "అర్జునా! నీధైర్యమునకు మెచ్చితి. పరమేశ్వరునిఁగూర్చి నీ కావింపనున్న తపంబు నిర్విఘ్నంబుగఁ గొనసాగుఁగాక! నీకు దివ్యాస్త్రలాభంబగుఁగాక" యని యాశీర్వదించి యంతర్హితుం డయ్యె.

మహేంద్రు దర్శనమునను దదాశీర్వాదమునను ధనంజయుఁడు సంతుష్టుండై యింద్రకీలమునుండి హిమశైల శిఖరంబున కరిగి, యందు రమ్యంబైన యొక తపోవనంబు సొచ్చి యచ్చటఁ దపమును బ్రారంభించెను. ప్రారంభించి, మనోవాక్కాయకర్మనియతుండై పరమేశ్వరునందె చిత్తము నిలిపి, నిరంతర త్రిరాత్రోపవాసముల నొకమాసము సలిపి, ద్విగుణిత త్రిరాత్రోపవాసంబుల రెండవమాసము సలిపి, పక్షోపవాసంబుల మూఁడవమాసంబు సలిపి, యూర్ధ్వబాహుండై యొక పాదాంగుష్ఠాగ్రంబున నిలిచి వాయుభక్షణ సేయుచు నాల్గవమాసము సలిపి, యతి ఘోరంబైన తపంబొనరించెను. తత్తపోభారంబు భరింపలేక యయ్యాశ్రమంబునందలి మహర్షులెల్లరు నీశ్వరుపాలికేగి, యర్జునుని తీవ్రతపంబునుండి వెలువడుచున్న మహాగ్నిజ్వాలలు సర్వజీవులకును భయావహంబులగుచున్నవని చెప్పిరి. ఆ తపంబును వారించెదనని పరమేశ్వరుండు మహర్షులనుబంపి, పార్థుని బరీక్షించుటకుఁ గిరాతరూపమును దాల్చెను. జగన్మాతయైన పార్వతియుఁ గిరాత భార్యయయ్యెను. వారి పరివారమువా రెల్లరునుఁ గూడఁ గిరాత సైనికులైరి.

ఇట్టి సన్నాహముతోఁ బరమేశ్వరుఁడు ధనంజయుని తపోవనంబుఁ బ్రవేశించి, మూకుండను నొక్క దైత్యునకు

సూకరరూపంబు కల్పించి విడిచెను. అర్జునుం డయ్యడవిపందినిఁ జూచి గాండీవ గుణధ్వనిచేసి దానినేయుటకు సిద్ధపడుచుండ "వలదు వలదు. దానినేయకుమేయకు' మని యెఱుకురాజు వారించెను. అర్జునుండాగక తత్క్షణమే బాణమును బ్రయోగించెను. అంతకుమున్నే కిరాతరాజుగూడనొక బాణము నేసెను. కిరాతార్జునుల బాణములు రెండును దాఁకినంతనే యాసూకరము గిరగిరఁదిరిగి నేలవ్రాలి నిజరూపము దాల్చి మాయమయ్యెను. ఆసూకరమెవరి బాణముచేఁగడ తేఱినదని కిరాతార్జునులకు వివాదము గలిగినది. ఆవివాదము ముదిరి పరస్పర దూషణమునకుఁ గారణమైనది. ఆ పరస్పరదూషణము వారిని యుద్ధమునకుఁ బురికొల్పినది. అర్జునుఁడు కిరాతునిపైనలిగి గాండీవ విముక్తంబులైన యమోఘబాణము లనేకములు ప్రయోగించెను. అవియన్నియుఁ బర్వతముపై బడు వర్షధారల గతి నిష్ఫలంబు లగుటయు నెఱుకు రా జేయుశరంబులు తన నెఱకులనాటి తన్ను బాధించు చుండుటయుఁ దలచి యర్జునుం డత్యాశ్చర్యమునొంది, యీతఁడు కిరాతరూపమున వచ్చిన యింద్రుఁడో పరమేశ్వరుఁడో ధనేశ్వరుఁడో కావలయునని యనుకొనుచుండ, నాకస్మికముగ వానిచేతిలోనున్న గాండీవము మాయమైనది. అర్జునుఁడు మఱింతవింతపడి, యాకిరాతుఁడు సామాన్య కిరాతుఁడు కాఁడని గ్రహించియు వెనుదీయక వానితో మల్లయుద్ధమును ప్రారంభించెను. ఈశ్వరుఁడు తన దివ్యగాత్రమునఁ బాండవుని గాత్రమును నొప్పింప నతండు భరింపలేక వెంటనే నేలవ్రాలి మూర్ఛిల్లెను.

నేలవ్రాలిన కిరీటింగాంచిదయామయుండైన శంకరుఁడు

చిఱునవ్వులు నవ్వుచు, వానిభక్తికిని ధైర్యవృత్తికిని మెచ్చి మేలుకొలిపి ప్రత్యక్షదర్శనముకటాక్షించెను. ఇట్లు ప్రసన్నుండై నయీశ్వరునిఁగాంచి, యర్జునుండు పాదాక్రాంతుఁడై యతి భక్తితో స్తోత్రముగావించెను. త్రిలోచనుండు వానిస్తోత్రమును మన్నించి 'అర్జునా! నీయిష్టంబైన వరంబువేడు' మన నతండు పాశుపతాస్త్రమును బ్రసాదింపుమని ప్రార్థించెను. తోడనే సర్వేశ్వరుఁడు వానింగరుణించి మంత్ర ధ్యాన జప హోమ పూర్వకంబుగను, సంధాన మోక్షణ సంహార సహితమ్ముగను పాశుపతాస్త్రంబిచ్చి 'వత్సా! ఈయస్త్రంబున కసాధ్యంబెద్దియులేదు. దీని నల్పునియందుఁ బ్రయోగించిన జగత్సంహారంబు సేయు. ఈ దివ్య బాణంబున నీవఖిలలోకమ్ముల జయింపఁగల' వనిచెప్పి పురాంతకుం డంతర్హితుండయ్యె.

క. వరములు వేల్పులచే దు
ష్కరతపమునఁ బడయుదురు జగంబున నొరు లీ
శ్వరుచే వరములు వడసెం
గరుణ ధనంజయుఁడు తనదు కార్ముకశక్తిన్.

# 21. అగస్త్యుఁడు - వాతాపిజీర్ణము

పరమేశ్వరునిచేఁ బాశుపతాస్త్రంబు వడసి యర్జునుండు మహానందముతోఁదిరిగివచ్చుచుండ దేవగణంబులతో నింద్రుఁడు వానికిఁ బ్రత్యక్షంబై దేవతల బాధించు చుండిన నివాతకవచులను దానవులను సంహరింపుమనికోరెను. అర్జునుండును మహాప్రసాదంబని యమరావతికిం బోయి దేవకంటకులైన రాక్షసులఁ జంపి దేవతలు బహుమాన పూర్వకంబుగ నొసం

గిన దివ్యాస్త్రములను గైకొని మహావైభవముతో భూలోకమునకు వచ్చి తనవారింజేరుకొనెను. అర్జునుంజూచి వాని వృత్తాంతంబంతయు విని వాని దివ్యాస్త్రలాభంబునకుఁ బాండవులును బాంచాలియు నెంతసంతసించిరో యెవరువర్ణింపఁగలరు!

ధర్మరాజు తమ్ములతోడను బాంచాలితోడను బుణ్యాశ్రమంబుల సందర్శించుచు, మహర్షులవలనఁ బుణ్యకథా విశేషంబులును ధర్మవిశేషములును వినుచు నొకనాఁడగస్త్యాశ్రమమునకు వచ్చెను. అప్పుడు రోమశుండను మహాముని పాండవులకు మహాతపశ్శాలియైన యగస్త్యుని చరిత్రమును జెప్పఁ దొడంగెను.

అగస్త్యుఁడు బ్రహ్మచర్యవ్రతంబునఁ బెద్దకాలం బుగ్రతపంబు సేయుచుండెను. ఒకనాఁ డాతఁడు వనంబునం దిరుగుచు నొక్కపల్లంబున నధోముఖులై వ్రేలుచున్న తన పితరులం జూచి యివ్విధంబున మీరుండఁ గారణంబేమియనియడిగెను? 'నీ వధికనిష్ఠను బ్రహ్మచారివై తపంబు సేయుచు సంతానమును బడయకున్నావు. ఆకారణంబున మేమూర్ధ్వగతినుండి తొలంగితిమి. నీవుసంతానవంతుఁడ వగువఱకు నిట్లెయుండువార'మని చెప్పిరి. అగస్త్యుఁ డట్ల చేయుదునని పుత్రికాముఁడై తన తపశ్శక్తిం జేసి విదర్భరాజున కొక్క కూతుఁ బుట్టించెను. ఆబాలిక లోపాముద్ర యనునామంబుతోఁ బెరుగుచు యౌవనముఁ దాల్చినంతనే యగస్త్యభయంబునరాజకుమారులెవ్వరు నామెను వరింప సాహసింపఁజాలక పోయిరి. అంతనగస్త్యుఁడు విదర్భరాజు పాలికి వచ్చి తనకు లోపాముద్ర నిమ్మనియడిగెను. నారలఁగట్టి కూరలాహారంబుగా నుగ్రవ

నంబులలోఁ దపోభారంబునఁ గృశించియున్న బ్రాహ్మణునకు లోపాముద్ర నెట్లీయఁగలమని తల్లిదండ్రులు విచారింపఁజొచ్చిరి. ఆ సంగతి యెఱింగి సుగుణసముద్రయైన లోపాముద్ర జననీజనకుల మనోవేదన తొలఁగించి తా నగస్త్యుఁ దప్ప నన్యుల నంగీకరింపనని చెప్పెను.

కూఁతుమనోరథంబెఱింగి రాజదంపతు లమందానంద భరితులై విధ్యుక్తంబుగా నక్కన్యక నగస్త్యునకు వివాహంబు చేసిరి. అగస్త్యుఁడు లోపాముద్రను బరిగ్రహించి, యామె దివ్యాంబరాభరణము లపనయించి, వల్కలాజినధారిణిం జేసెను. వివాహానంతరము అమ్మహర్షి భార్యతోఁ గూడ గంగా ద్వారమునకు వచ్చి యచ్చటఁ దపము ప్రారంభించెను. అను దినమును నతిభక్తితో లోపాముద్ర గావించు శుశ్రూష కతఁ డెంతయు సంతుష్టుండై యొక నాఁడు నీ కెయ్యది యిష్టంబని భార్య నడిగెను. 'ప్రాణేశ్వరా! మన మిరువురమును లేపన మాల్యాభరణ దివ్యాంబరముల నలంకృతులమై యుండుటకు నామదిఁ గోరుచున్న' దని యామె చెప్పెను. అగస్త్యుఁ డామె వాంఛితమును మన్నించి, దపమ్మును వెచ్చించి ధనముసృష్టించుట కిష్టపడక పురుకుత్సకుమారుఁడైన త్రసదస్యుఁడను రాజు పాలి కేగి, 'నేను ధనార్థినై వచ్చితిని. నీపోష్యజనపోషణంబునకు విఘాతంబు గాకుండ మిగిలిన ధనంబుగలదేని నాకి'మ్మని యడిగెను. త్రసదస్యుండును "మహాత్మా! ఇమ్మణిమతీపురంబున నిల్వలుండును వాతాపియు నను నన్నదమ్ములు గలరు. వా రత్యధిక ధనవంతులు. మనము వారికడ కేగిన నత్యంత ధనమును బడసి కృతకృత్యులము కాఁగల'మని చెప్పెను.

అగస్త్యుం డందు కంగీకరించి రాజుతోఁగూడ బయలు దేఱి రాక్షసుఁడైన యిల్వలునియింటికి వచ్చెను. ఇల్వలుండు వారి నత్యాదరముతో నాతిథ్యవిధానంబుల నర్చించి, యుచితాసనములఁ గూర్చుండఁజేసి యతిథి భోజన సంస్కారార్థము లోనికేగెను. అప్పుడు రాజు మహర్షి కి రహస్యముగ నిట్లనియె. 'దేవా ! ఈ యిల్వల వాతాపు లిరువురును మహామాయావులైన దానవులు, అత్యంత బలవంతులు, బ్రాహ్మణ భక్షణంబునం దతిప్రీతులు. మొదట నిల్వలుం డొక బ్రాహ్మణు నతిభక్తిం బూజించి, "నాకు నఖిలాభీష్టసిద్ధికరంబగు మంత్రం బుపదేశింపు" మని ప్రార్థింప నా బ్రాహ్మణుఁ డందు కంగీకరింప లేదు. ఆ కోపంబున నిల్వలుండు కామరూప ధరుఁడైన వాతాపిని మేషరూపంబు చేసి వధియించి వాని మాంసం బిమ్ముగా వండించి, దాని నావిప్రునకు భోజనము పెట్టించెను. పాప మా బ్రాహ్మణుండెఱుంగక యా మాంసంబును భుజించెను. భుజించినంతనే యిల్వలుఁడు 'వాతాపీ' యని పిలువ బ్రాహ్మణుని యుదరంబు చీల్చుకొని వాతాపి వెలువడెను. బ్రాహ్మణుఁడు గతించెను. ఈ విధముగా వీ రనేక బ్రాహ్మణులను వధించి భక్షించిరి. ఇప్పుడు తమకును నట్టి భోజనంబే సంప్రాప్తింపఁగలదు.'

అగస్త్యుఁ డా వృత్తాంతమును విని శిరమ్మూచి మందహాసము గావించెను. ఇంతలో నిల్వలుఁడు వచ్చి యగస్త్యునకు నమస్కరించి భోజనమునకు రమ్మని ప్రార్థించెను. త్రసదస్యుని గుండెలు గడగడఁ గొట్టుకొనుచుండ నమ్మహర్షి యిల్వలుని వెంట నేఁగి యాకంఠముగ దృప్తిగా

భుజించి గట్టినఁ దేన్పుచు వచ్చి యథాక్రమంబుగ రాజు కడఁ గూర్చుండెను. కూర్చుండుటయే తడవుగ లోపలి యిల్వలుండు, 'వాతాపీ!' యని బిగ్గరగాఁ బిలిచెను. అగస్త్యుఁడు నవ్వుచుఁ జేతితోఁ గడుపుపై రాసి కొనుచు, 'ఓరి పశువా! ఇంకెక్కడి వాతాపి? నీవాతాపి నాయుదరంబున జీర్ణించి నాఁడు. ఇంక నీవొక్కఁడవే మిగిలితి.' వని పలికెను. ఇల్వలుండమ్మహాముని తపశ్శక్తికి భయపడి, గడగడ వడఁకుచుఁ గృతప్రణాముఁడై మీయిష్టంబు నెఱవేర్చెదనని పలుక, నగస్త్యుఁడు తనవచ్చిన కార్యమును వాని కెఱింగించెను. ఇల్వలుఁడు తనయొద్దనున్న సమస్త ధనకనక వస్తు వాహనాదులను నపారైశ్వర్యంబుతో నగస్త్యునకు సమర్పించుకొనెను.

గీ. కోపితుండైన విప్రుఁడు ఘోరశస్త్ర
మగు మహావిషమగు నగ్నియగు నతండ
యర్చితుండైన జనులకు నభిమతార్థ
సిద్ధికరుఁడగు గురుఁడగుఁ జేయుఁబ్రీతి.

---

## 22. కౌశికుఁడు - క్రోధస్వభావము

మార్కండేయ మహాముని పాండవుల యాశ్రమంబునకువచ్చి వారిచే విధివిధానంబునఁ బూజితుఁడై పెక్కుపుణ్యకథా విశేషంబులు వినిపించుచుఁ బతిసేవాసక్తియు జననీజనక శుశ్రూషయుఁ గ్రోధవిసర్జనంబును స్త్రీపురుషులకు ముఖ్యధర్మంబులని పలికి, వారికి యితిహాసంబును జెప్పెను.

పూర్వము కౌశికుం డను నొక బ్రాహ్మణుఁడు కలఁడు అతఁడు మహాతపస్సంపన్నుం డయ్యును నత్యంతక్రోధచిత్తుం

డగుటచే వాని తపము నిరర్థకం బగుచుండె. కౌశికుం డొక నాఁడు స్వగ్రామ సమీపంబునం దొక్క వృక్షము క్రింద నాసీనుండై వేదాధ్యయనము గావించుచుండఁ దద్వృక్ష శాఖాగతంబైన యొక్క కొక్కెర యతనిపై రెట్టవైచెను. తోడనే యాబ్రాహ్మణుఁడు క్రోధావేశ పరవశుండై తీవ్ర దృష్టితోఁ దలయెత్తి యక్కొక్కెరం గాంచినంతనే యయ్యది క్షణ మాత్రంబున భస్మంబై నేలవ్రాలెను. చచ్చిన కొక్కెరంజూచి కఠిన హృదయుండయ్యుఁ గౌశికుండు విచారించి, వికలహృదయుండై తన్నుదానే నిందించుకొనెను. మధ్యాహ్నంబగుటయు గ్రామంబు ప్రవేశించి, శుచులైన బ్రాహ్మణ గృహంబులకరిగి భిక్షాచరణముమ జేయుచుండెను. ఇట్లు తిరుగుచు నతఁడు క్రమముగా నొక్కబ్రాహ్మణగృహమునకు వచ్చి వాకిటనేనిలిచి 'భిక్షాం దేహి' యని యడిగెను. ఆ యింటనున్న విప్రాంగన యదివిని బ్రాహ్మణునకు భిక్షమొసఁగూర్చుట కుద్యమించెను. ఇంతలో నామెభర్త వచ్చి పెల్లాకటం దూలుచుండుటచే నా సాధ్వీమణి సంభ్రమముతోఁ బీఠమునమర్చి యర్ఘ్యపాద్యాదులఁ బూజించి రుచిరాన్నములఁ బెట్టి వానిని సంతుష్టుంగావించెను. పిమ్మట మెత్తని శయ్యనమర్చి యందు భర్త శయనించినంతనే వానికిఁదమ్ములంబిడి చరణమ్ములొత్తుచు వాకిటనున్న బ్రాహ్మణు నప్పుడు తలంచెను. తలంచి, భర్తయు నిద్రించుటచే నామె తటాలున లేచి, భిక్షనొసఁగుటకు బ్రాహ్మణునికడకు వచ్చెను.

ఆమెం జూచినంతన క్రోధస్వభావుండైన కౌశికుఁడు మండిపడుచు 'అడిగినంతనే పెట్టిన నింతకుఁ బోయియే యుందునుగదా? ఓసీ ! దుర్మతీ ! భిక్షంబిడక నన్నింతవఱకు

నిలిపి, యింతటి యవమానం బేలగలిగించితివి' వని పెక్కు భంగుల నిందింప సాగెను. ఆసాధ్వి వానిని మంచిమాటలతో శాంతచిత్తుం జేయుచు, 'అయ్యా! మీకు భిక్షమొసఁగుట కుద్యమించుచుండ నింతలో నాఁకటఁ దూలుచు నాభర్త వచ్చెను. అమ్మహాత్మునకు సేవసేయుటలో మీమాట మఱచితిని. ఇది తప్పుగాఁ గొనక నన్ను క్షమింప వలయు' నని వేడెను. కౌశికుఁడామె ప్రార్థనమును మన్నింపక, 'నాకంటెను నీమగం డధికుఁడా? కండకావరమునఁ గ్రొవ్వి నీవు గావించిన యవమానము నాక్రోధోద్రేకమునకుఁ గారణమైన' దని యింకను బలుకుచుండ నామె నవ్వుచు, కౌశికుఁడా! నీ క్రోధము నన్నేమి సేయఁగలదు? నీ క్రోధాగ్నిచే దహింపఁ బడుటకు నేను జెట్టుపైనున్న కొక్కెరనుగాను, పతివ్రతను. నాయెడ నీ కోపశాపములు నిరర్థకములు' అని చెప్పెను. ఆ మాటలు విని కౌశికుఁడు విస్మితుండై ఈమె దివ్యజ్ఞానంబున సమస్తమును గ్రహింపఁగల మహా పతివ్రత యని గ్రహించి, తన యజ్ఞానమును గర్హించి, చేతులు మోడ్చి 'తల్లీ! నీ పాతివ్రత్య మాహాత్మ్య మమోఘము. నన్ను క్షమించి నాకు ధర్మోపదేశము గావింపు' మని ప్రార్థించెను. అయ్యా! నేను నిరంతరము పతి సేవాపరురాలను. నీవు కేవల స్వాధ్యాయ పరుండవుగాని ధర్మసూక్ష్మము లెఱుంగవు. కావునఁ దడయక మిథిలానగరంబున కేగుము. అందు జితేంద్రియుండు సత్యవాదియు మాతా పితృభక్తుండును నయిన ధర్మవ్యాధుం డను కిరాతుఁడు కలఁడు. వాని నాశ్రయించితివేని యతండు నీకఖలధర్మములు నెఱిఁగింపఁ గలఁడు' అని యాపతివ్రత వానికి బోధించి పంపెను.

కౌశికుఁడు బయలుదేఱి పతివ్రత యొక్క విస్మయం బంచుచు నామెయెడఁ దాను జేసిన యపరాధమునకు నొచ్చు కొనుచు ననేక నగరగ్రామంబు లతిక్రమించి చని మిథిలానగరము ప్రవేశించెను. రాజమార్గమునుండి పోవుచు, వచ్చుటి జనంబుల ధర్మవ్యాధుండున్న ప్రదేశంబడిగి, వారు చెప్పిన చొప్పునఁ బోయి ధర్మవ్యాధుని యంగడి సమీపించెను. విక్రయాగతజన సమావృతంబై, యతి జుగుప్సితంబైయున్న యా మాంసపు టంగడిని సమీపింపలేక, కౌశికుఁడిటునటుఁ జూచుచుండ, ధర్మవ్యాధుఁడు తానే వానికడకు వచ్చి "విప్రోత్తమా! నీవేకదా కౌశికుఁడవు? పతివ్రత చెప్పిన చొప్పున ధర్మోపదేశార్థము నాకడకు వచ్చినవాఁడవు. వేళకు భిక్షయిడనందున నీవామెపై నాగ్రహించినట్లు శీఘ్రంబుగ నాతిథ్య మొసంగకున్న నాపైఁగూడఁ గోపింతువని యంగడి విడిచి నేనే నిన్నెదుర్కొనవచ్చితి" నని పలికెను. ఆమాట విని పతివ్రతప్రభావంబునకుంబోలె ధర్మవ్యాధ ప్రభావంబునకును విస్మితుండై చేతులుమోడ్చి, "మహాత్మా! కిరాతుండవును మాంసవిక్రయుండవు నగునీకింతటి దివ్యజ్ఞానమహిమం బెట్లలవడినది? నిన్నుదర్శించి నేఁడు నేను గృతార్థుండనైతిని. నీవొసరించు ధర్మోపదేశంబున నాజన్మంబును సార్థకము కాఁగలదు. అని కౌశికుఁడు పలికెను.

ధర్మవ్యాధుఁ డా బ్రాహ్మణునిఁ దనయింటికిఁ గొనిపోయెను. కౌశికుండునుజండాలగృహమని శంకింపక, యతిభక్తితో వానివెంటనరిగెను. ధర్మవ్యాధుఁడు కౌశికున కనేక ధర్మము లుపదేశించెను. ఆధర్మోపదేశంబులవలనఁ గౌశికుండుక్రోధమును

విడిచి, యజ్ఞానమును దొలంగి, మిక్కిలి వివేకవంతుఁడయ్యెను. పిదప ధర్మవ్యాధుఁడు కౌశికుని గృహాభ్యంతరంబునకుం గొని పోయి, యందు సకలాభరణాలంకృతులును నభిమతాహార పరితోషితులును, మహితాసనాసీనులును, ముదుసలి ముద్దులునై యున్న దంపతులంజూపి, "విప్రోత్తమా! వీరు నా జననీ జనకులు. వీరే నాకిష్టదైవములు. ఈదైవముల నిత్యముభక్తితో నారాధించుటచేతనే నాకింతటి దివ్యజ్ఞానమహిమ గలిగినది. నాసంగతి యట్లుండనిమ్ము. నీవునీతల్లిదండ్రులకేకపుత్రుఁడవై వారియనుజ్ఞ లేకయే తపశ్చరణమునకుఁ బూనుకొంటివి. పాపము వారిప్పుడెంతయు వృద్ధులై నిరంతరమునీనిమిత్తమెదురు చూచుచు దుఃఖించుచున్నవారు. స్వగృహమున కింకఁబోయి వారికిఁబ్రియమ్ము గూర్పుము. కృతార్థుఁడవయ్యెద, వని పలికి వానిని బంపెను.

క. కామంబును గ్రోధంబును
నేమఱక జయింపవలయు నెల్లవిధములన్
ధీమహిత! యిదియె సతత
క్షేమంకరమైన పథము కృతబుద్ధులకున్.

---

## 23. దుర్యోధనుఁడు - ఘోషయాత్ర.

పాండవులు వనములయందుఁ బరిభ్రమించుచుండఁ గౌరవులు హస్తిపురములో సకలైశ్వర్యములు ననుభవించుచుండిరి. తమయైశ్వర్యవైభవమునుబాండవులయెడఁబ్రదర్శించి వారినిజిన్నపుచ్చవలయునని కర్ణ శకుని దుర్యోధన దుశ్శాసనులు నిశ్చయించుకొనిరి. ధృతరాష్ట్రుఁడిట్టి దురుద్యోగమున

కంగీకరింపఁడని వారొక్కటింగి యొక నెపంబును గల్పించిరి. ద్వైత వనమునందుఁ గౌరవుల గోవులు గలవు. అరణ్యమృగముల వలన నా గోవ్రాతములకుఁ బ్రాణ భయము గలుగు చున్నదని యొక గోపాలకునిచే వారు ధృతరాష్ట్రునకుఁ జెప్పించిరి. అతండేమి చేయువలయునో యని యోచించు చుండఁ గ్రూరమృగ సంహారంబుచేసి గోరక్షణ మొనర్చుటకు నేను వెడలెదనని దుర్యోధనుఁడు తండ్రితో చెప్పెను. పాండవులా ద్వైతవనంబునందె యుండుటచేత వారితో నెట్టి కయ్యము దెచ్చునోయను భయంబున దుర్యోధనుని మృగయా ప్రయాణమునకు ధృతరాష్ట్రుఁడు సమ్మతింపలేదు. కాని పాండవులకు లేశమును బ్రతికూలముగాఁ బ్రవర్తింపక, వన్యమృగసంహారమునుగావించి గోగణంబుల రక్షించి భద్రముగాఁ దిరిగి వచ్చెదమని శకునియుఁ, గర్ణుఁడును, దుశ్శాసనుఁడును విశ్వాసముపుట్టునట్లు చెప్పి కడకు వానిని సమ్మతింపఁ జేసిరి.

అంత వారందఱు మహానంద భరితులై లలితాంబరాభరణాలంకృతులై బంధుమిత్ర సమేతంబుగ ఘోషయాత్ర సన్నాహమునుగావించిరి. దుర్యోధనాదులు నూర్వురును తమ తమ భార్యలతోఁ గూడ బయలుదేఱిరి. ఆ నూర్వుర భార్యలును తమదమ యంతఃపుర పరిచారికలను వెంటనిడుకొనిరి. వైశ్యులు తమతమ యంగళ్ళను వారితోఁ దీసికొనిపోయిరి. ఎనిమిది వేలరథంబులు, ముప్పది వే లేనుఁగులు, తొంబది వేల గుఱ్ఱములు, శత సహస్రసంఖ్యా కాల్బలంబుగల మహాసైన్యంబుతో వారు బయలుదేఱిరి. ఇట్లు పాండవులఁ బరాభవించు సంకల్పంబున సమస్తరాజ వైభవములతో బయలుదేఱి,

దుర్యోధనాదులు కతిపయదినంబులకు ద్వైతవనమును సమీపించిరి. సమీపించి యత్యంత రమణీయంబైన యొక కమలాకరముకడ విడిసిరి. భూలోకమున నంత సుందరమైన కాసారమును వారిదివఱ కెన్నడునుజూచినవారుకారు. దానిసౌందర్య వైభవంబున కాశ్చర్యపడుచు నాతటాకతటంబున గుడారములు వేయించుకొనిరి. అచ్చటికి సమీపంబుననే పాండవుల యాశ్రమంబును గలదు. ధర్మరా జప్పుడు సద్యస్కాందంబను నొక యజ్ఞమును జేయుచుండెను.

ఆ తటాకంబునఁ గౌరవులు క్రీడాగారములు కట్టుటకు బ్రారంభించినంతనే కొందరుగంధర్వులు పరుగునవచ్చి 'ఇది చిత్రసేనుండను గంధర్వపతికిం గ్రీడార్థంబు కల్పితంబైన కాసారము. కావున మీరిక్కలను చేరక తొలఁగిపోవునది' యని వారిని వారించిరి. కాని దుర్యోధనాదులు వారినిఁ బలువిధములఁ బరిభవించి, 'దేవగణములతో నింద్రుఁడువచ్చినను మే మిచ్చటినుండితొలంగ' మని వారిని గెంటివేసిరి. పాప మా గంధర్వులుపోయి యావృత్తాంతమునుఁ జిత్రసేనునకు విన్నవించుకొనిరి. తోడనె చిత్రసేనుండు రోషావేశవివశుండై, గంధర్వసైన్యములతో గంధగజము చందంబున వెడలివచ్చి కౌరవసైన్యములను ముట్టడించెను. అదివరకే రణసన్నాహ మొనర్చుకొనియున్న కౌరవసైన్యములును గంధర్వుల నెదిరించెను. కలహము పెచ్చుపెరిగి క్రమక్రమముగా యుద్ధరంగంబతి బీభత్సంబయినది. గంధర్వుల విక్రమాతిశయముల కోర్వలేక బెదరి చెదరి కురురాజుసైన్యము పాండవులున్నవైపునకు బరువెత్తఁ జొచ్చెను.

సైన్యములు చెదరినంతనే మహాసైన్యసమేతులైన గంధర్వులను కర్ణ దుర్యోధన దుశ్శాసనులు తామే యెదిరింప వలసినవారైరి. క్షణమాత్రములోఁ గర్ణుఁడు విరథుండయ్యెను. దుర్యోధనుఁడు వెలవెలఁబోయెను. వారిసోదరులు పరాజితులైరి. గంధర్వులు కౌరవుల నందఱినిఁ బట్టి పాఱిపోకుండ బంధించి చిత్రసేనున కప్పగించిరి. అప్పుడు చిత్రసేనుఁడు కౌరవులను వారితోఁ వచ్చిన బంధుమిత్రాదులను వారివారి భార్యలతోఁ గూడ కట్టలుగాఁ గట్టించి, యా కట్టలతోఁగూడ గంధర్వలోకమునకుఁ బ్రయాణమయ్యెను. తమ కేట్టి యుపద్రవము సంభవించునో యని కౌరవభార్యలు నూర్వురును గొల్లున రోదనము సేయఁ గడంగిరి. .బంధనంబులం బట్టువడక యెట్లో తప్పిపోయిన కౌరవులు పరుగునం జని ధర్మనందనుని పాదములపైఁబడి 'ధర్మరాజా! దుర్యోధనుని, దత్సోదరులను, దత్కాంతలను గూడ గంధర్వులు బంధించుకొని పోవుచున్నారు. దిక్కులేక స్త్రీలును శిశువులునుగూడ గొల్లున రోదనము సేయుచున్నారు. వారిని సత్వరముగ రక్షింపుము, రక్షింపు' మని యాక్రోశించుచుఁ దెలిపిరి. ఆ వృత్తాంతమును విని భీముఁడు మందహాసము చేయుచు, 'అన్నయ్యా! కాఁగల కార్యమును గంధర్వులే చేసిరి. అందుచే మనకు భారము తగ్గిన' దని పలికెను. 'భీమసేనా! నీ విట్లన రాదు. శరణార్థులైనవా రెట్టివారైనను గరుణించి కాపాడుట యుత్తమపురుష లక్షణము. మరియు మన మేకాన్వయజాతులము. ఒక్కకుటుంబమువారికి విరోధములు కలుగుచుండుట సహజము. ఇతరులు మనపైకెత్తి వచ్చినప్పుడు మనమందర మేకీభవింపవలయును. శరణాగత రక్షణముగాంచ

నుత్తమధర్మ మింకొకటి లేదు. కావున నీవును నర్జునుండును సర్వాయుధసన్నద్ధులై రథంబులెక్కి గంధర్వుల నడగించి కౌరవులను రక్షింపుఁ' డని ధర్మరాజు బోధించెను.

కౌరవరక్షణంబునకు భీమార్జునులు లేశమును సమ్మతింపక, జలంబులఁ ద్రోయుటయు, విషాన్నముపెట్టుటయు, లక్కయింటఁ గాల్చుటయు, మాయాజూదం బాడుటయుఁ, బాంచాలిని బరిభవించుటయు మున్నగు దుర్యోధన దుష్టచేష్టితంబు లన్నియు యుధిష్ఠిరునికి జ్ఞప్తికిందెచ్చిరి. కాని ధర్మజుఁడు వానిని లేశమును బాటింపక, "భీమా! అర్జునా! కాలహరణమున కిది తరుణముగాదు. యజ్ఞదీక్షయం దున్నవాఁడ నగుటచే నాశ్రమము విడచుటకు వీలులేదు. మీరు నాయాజ్ఞ తిరస్కరించిన యెడల యజ్ఞభంగమునకోర్చి నేనే స్వయముగ నేగి గంధర్వుల నడగించి కౌరవులను రక్షించెద" నని తీవ్రముగాఁ బలికెను. ఆ మాటలు వినుటయే తడవుగ, భీమార్జునులు మారుమాటాడక తటాలున లేచి యాయుధపాణులై యుధిష్ఠిరుని పాదంబులకు మ్రొక్కి తదాజ్ఞానుసారంబుగఁ గౌరవ రక్షణార్థము బయలు దేఱిరి.

భీమార్జునులతో నకులసహదేవులును నుత్సాహసమేతులై వెడలిరి. అన్నలిరువురు నాముక్తకవచులును నాబద్ధతూణీరులును నాకలిత కార్ముకులును నారూఢరథులును నై అతిత్వరితగతి నేగి గంధర్వులం గలిసికొని, ధర్మరాజు నాజ్ఞానుసారము కౌరవుల విడువవలయునని చెప్పిరి. కాని గంధర్వులు పాండవుల సామవాక్యముల కంగీకరింపలేదు. అప్పుడర్జునుఁడు గంధర్వులపై పునకుఁ బోలేకుండ నాకాశంబులును దిక్కులును

ందు లేకుండ బాణంబులతో దట్టముగఁ గట్టిపెట్టెను. పంజరంబునందుఁ జిలుకవలె నర్జునుని బాణపంజరంబున గంధర్వులు చిక్కుకొని, పాండవులపై శరపరంపర లేసిరి. వానిందునుమాడి యర్జునుఁడు దివ్యాస్త్రంబులతో గంధర్వనాయకులనెల్ల నిరాయుయుధులుగను నిస్తేజులుగను నిర్వీర్యులుగను గావించె. జగదేకవీరుండైన పార్థుని జయించుట యసాధ్యంబని కొంతసేపునకుఁ జిత్రసేనుఁడు యుద్ధమునుజాలించి వానికడకువచ్చెను. చిత్రసేనుంజూచినంతనే యాతఁడు తన మిత్రుఁడేయని గుర్తించి ధనంజయుఁడు వానిని మిక్కిలి సన్మానించెను. దురాత్ములై, మిమ్ముఁ బరిభవింపవచ్చిన యీకౌరవులపై మీకింతటి దాక్షిణ్యం బేల యని చిత్రసేనుఁడు వారిని మందలించెను. "మేమేమిచేయఁగలము? ఇది 'యుధిష్ఠిర శాసన' మని భీమార్జునులు పలికి గంధర్వులతోఁగూడ ధర్మరాజుకడకు వచ్చిరి. ధర్మరాజు కౌరవుల బంధనము లన్నియు భీమునిచే విప్పించెను. బంధ ముక్తులైన కౌరవకాంతలనెల్ల మహా సాధ్వియైన పాంచాలి గౌరవించెను.

ధర్మరాజు దుర్యోధనుంజూచి నీ వెన్నఁడు నిట్టిసాహస కృత్యములనొనర్పకుము. తమ్ములను దారలను వెంటఁబెట్టుకొని సుఖముగా నింటికేగుము. జరిగినదానికి దుఃఖింపకు' మని బుద్ధిచెప్పి పంపివేసెను.

క. శరణంబని వచ్చిన భీ
కరశత్రుని నయినఁ బ్రీతిఁ గావఁగవలయున్
గరుణాపరుల తెఱంగిది
యిరవుగ సరిగాపు దీని కేధర్మంబుల్.

# 24. సైంధవుఁడు - పరస్త్రీవాంఛా ఫలము

పాండవులు తృణబిందుఁడను ముని యాశ్రమంబునఁ గొంతకాలము నివసించిరి. ఆ దినములలో వారేవురు నొకనాడు ధౌమ్యసహితంబుగాఁ బాంచాలి నాశ్రమంబులో విడిచి, మృగయావినోదార్థము నలుదిక్కులకుఁ బోయిరి. అట్టి యవసరంబున సింధుదేశాధీశ్వరుఁడైన సైంధవుఁడను రాజు సాల్వరాజ కన్యకను బెండ్లియాడుటకుఁ జతురంగబల సమేతుండై యత్యంత వైభవంబుతోఁ బోవుచు నాశ్రమ సమీపంబునఁ దిరుగుచుండిన ద్రౌపదినిజూచెను. చూచి యా కామాంధుండు మోహించి, తనపరివారము నచ్చటనాపి, తాను రథముదిగివచ్చి, "సుందరీ! నీవెవతవు? ఈ వనదేవతవో! సురేశ్వరునితో నలిగి ధరిత్రి కరుదెంచిన శచీదేవివో! నీపతియెవ్వఁడు? నీపతి పేరెయ్యది? నా తెఱం గరయఁదలంచితివేని వినుము. సింధుసౌవీరనాథుండను, జయద్రథుఁడను." అని పలికెను. ద్రౌపది వానింజూచి, "నీవు శిబివంశోద్భవుఁడైన సురథపుత్రుఁడగుట యెఱుంగుదు. నేను పాంచాలపతియైన ద్రుపదుని కూతురను. కృష్ణయనుదానను. పాండునందనులగు యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవులకు ధర్మపత్నిని. అవ్వీరు లిప్పుడు నన్నీవనముననుంచి వేఁట కేగిరి. ఆమ్మహాత్ములువచ్చి చేయు సత్కారంబులం గైకొనిపోవచ్చును. ఒక్కింత మా యాశ్రమంబున విశ్రమింపు" మని గౌరవపూర్వకముగఁ బలికెను. అప్పుడు సైంధవుడు నవ్వుచు, సుందరీ! రాజ్యంబెల్లఁ గోలుపోయి యడవులం జొచ్చిన పాండవులంగూడి నీవేమి సుఖమనుభవింపఁగలవు? సింధుసౌవీర రాష్ట్రంబుల కధిపతినైన నన్నువరించి నాతో సమస్తరాజ్య

భోగము లనుభవింపుము. లెమ్ము. నీపతులు రాకమున్నే నారథంబెక్కుము' అని తొందర పెట్టెను.

ఆ పలుకులకు బాంచాలి ప్రకంపితచిత్తయై "సైంధవా! కౌరవ పాండవులకు జెల్లెలైన దుస్సలకు నీవు పతివి. నాకు దోబుట్టువు వగుదువు. నీకిట్లాడవచ్చునా?" అని మందలించుచుండ నాధూర్తుడు "పాంచాలీ! స్త్రీలయెడ రాజులకు పావి వెదకఁబనిలేదు, నీవురాకున్న బలిమినైన నిన్నుఁగొంపోయెద"నని కఠినముగఁ జెప్పెను. అప్పుడామె క్రోధకలుషితాంతరంగయై "ఓమూర్ఖా! మహావీరుల ధర్మపత్నినైన నన్ను సామాన్యవనితగా భావించి వదరుచున్నావు. అమ్మహాత్ములెఱింగిరేని నీ ప్రాణములఁ బరమేశ్వరుండైన రక్షింపలేఁడు. ఊరక చెడక నీదారింబొమ్ము. పాండవసింహంబుల కలుక పుట్టింపకుము. నీపాపబుద్ధిఁ బరిత్యజింపు"మని పెక్కువిధముల బోధించుచుండ, నప్పాపాత్ముండు తొందరలున నామె పయ్యెదకొంగుఁ బట్టుకొనెను. పట్టుకొనినంతనే కృష్ణ యొడలు మఱచి, క్రోధాతిశయంబున నొక్కట్రె వేసినంతనే, యా వ్రేటున వాఁడతి చిత్రంబుగ నేలపైఁ ద్రెళ్ళె. ఇట్లు నేలనుండి తడయక లేచి జయద్రథుండామెను బలిమినిరథంబుపై నిడుకొని పోవుచుండెను. ద్రౌపది యాక్రోశించుచు ధౌమ్యుఁబిలిచి, "ఈ సైంధవాధముఁడు నన్నుఁ గొనిపోవుచున్నాఁ"డని చెప్పెను. ధౌమ్యుఁడు భయవిస్మయంబుల సైంధవుని గాంచి "ఇట్టి దుస్సాహసంబు వదలు" మని యనేక విధముల బోధించెను. కాని వాఁడు వినక యప్పుడే బయలుదేఱి ప్రయాణమును సాగించెను.

కొంత సేపునకుఁ బాండవులేవురును నాశ్రమమునకు వచ్చి సంతసే ధాత్రికయను పరిచారిక బోరున నేడ్చుచు సైంధవుని దుర్ణయంబును వారికి తెలిపింగించెను. అప్పుడు వారేవురును ప్రళయకాలానలమూర్తులై దుర్నిరీక్ష్యంబులైన రూక్షేక్షణంబులతో నాయుధపాణులై రథంబులెక్కి వాయువేగంబున సైంధవుఁడేగిన దిక్కునకుఁ బోనఁజొచ్చిరి. ముందేగుచున్న సైంధవుఁడు కొంచెము సేపులోనే గాండీవనిర్ఘోషంబు వినియెను. ద్రౌపది నోదార్చుచున్న యతఁడా ధ్వని యెట్టిదో యని యటునటుఁ జూచుచుండఁ దీవ్రనిశాతబాణపరంపరలు రివ్వురివ్వునఁ దన్నును దన సైన్యములను గప్పఁదొడంగెను. ఇయ్యది పాండవాగమనమునకు సూచకంబని ద్రౌపది ధైర్యము వహించెను. సైంధవుఁడు యుద్ధసన్నద్ధుఁడయ్యెను. అప్పుడు లేళ్ళమందపై కురుకు కొదమసింగంబులవలెఁ బాండునందను లతిజవంబున వచ్చి సైన్యమధ్యంబునఁ జొచ్చి కంటఁబడిన వారినెల్ల నిష్కరుణంబుగాఁ జండాడుచుండిరి. భీముఁడు తన పెనుగదంబట్టి వారణముల కుంభములు వ్రయ్యలుచేసెను. రథముల పిండిగొట్టెను. వాయముల నేలపాలుగావించెను. విజయుండును, నమోఘంబులైన గాండీవబాణంబులతో శత్రువీరులశిరంబులెగుర వేయుచుండెను. ఒకవంక నకుల సహదేవులు సకలసైనిక నికాయముల గడ తేర్చుచుండిరి. ఇట్లమ్మహావీరుల రణకళాకౌశలమున నతిస్వల్ప కాలములోనే యా ప్రదేశంబంతయుఁ బీనుఁగు పెంటలతో నిండెను. అప్పు డతిసూక్ష్మముగా సైంధవుఁడు వారికిబట్టువడెను.

భీముఁడు వానిఁబందుకొని పిడికిటి పోటులతోఁ గొంత సేపును, వెలికాలిపోటులతోఁ గొంత సేపును, గదా ప్రహా

రంబులతోఁ గొంతసేపును మర్దించుచుండ నరునుఁడు "చాలు చాలు నింకఁ బొడిచినఁ బ్రాణ విముక్తుండగు" నని పలికి వారించెను. అంతతో భీముఁడు వానిని మర్దించుటమాని, వాఁడైన యొక కత్తివాతియున్న వాని శిరమును జెక్కలెగయ గొట్టి, చూచువారు కడుపుబ్బనవ్వున ట్లతివికారముగ నైదు కూకటులు లొనర్చెను. ఇట్లు సైంధవుని యాకారంబు వికృతంబు గాంచి, వృకోదరుఁడు ఓరి సైంధవా! నిన్నుబ్రతుకనిచ్చిన యెడల నేఁడు మొదలుగ నెల్లసభలయందును బాండవ దాసుఁడనని చెప్పుకొందువా, యని యడిగెను. వాఁడును భీముని భీమాఘాతములకు భయపడి చేతులుమోడ్చియేడ్చుచు, "అట్లే చెప్పుకొనుచుందును. నన్ను విడువుఁ" డని ప్రార్థించెను. పిదప వారలు వానిని ధర్మజునికడకుఁ గొనిపోయిరి. వాని వికృతాకారమును జూచి పాంచాలి నవ్వఁజొచ్చెను. యుధిష్ఠిరుఁడు "నేటినుండియు సివిట్టిదుర్వృత్తి వర్తించి. బుద్ధిమంతుఁడవై వర్తింపు, మనిబోధించి విడచెను.

ఇట్లు పాండవులు సదా శత్రువిజయంబులతో నరణ్యవాసమును గడపి, పదమూఁడవయేట విరాట నగరంబునఁ బ్రచ్ఛన్న వేషములతో నజ్ఞాతవాసమును గడపి, సమయ సంపూర్తియైనంతనే తమ యర్ధరాజ్యము దమకిమ్మ నాసిన నని కౌరవులకడకు రాయబారమంపెని, కడకైదూళ్ళిచ్చినను జాలునని ధర్మరాజనెను. అర్ధరాజ్యమునకే కాక యైదూళ్ళిచ్చుటకును దుర్యోధనుఁ డంగీకరింపలేదు. అందుచే మహాభారతయుద్ధము ప్రారంభింపఁబడినది. ఆయుద్ధమునందు భీష్మ ద్రోణ కర్ణ కృప శల్యాది మహావీరులెల్లరు గతించిరి. దుర్యో

ధనుని నూర్వురు తమ్ములును భీమునిచేఁ జచ్చిరి. ప్రతిజ్ఞా ప్రకారము భీముఁడు దుర్యోధనునితొడలు విరుగఁగొట్టె యంత మొనర్చెను. పాండవసైన్యములయందును ననేకులుగడ తేఱిరి. ధర్మమూర్తులైన పాండునందను లేవురును భగవంతుఁడైన శ్రీ నారాయణుని యనుగ్రహంబునఁ బ్రాణాపాయము లేకుండ సుఖజీవులైరి. నారాయణుని యనుమతంబున యుధిష్ఠిరుఁడు సమస్త రాజ్యమునకును బట్టభద్రుండై ధర్మపరిపాలనంబు సేయుచు సోదరులతోడను బవిత్రశీలయగు పాంచాలితోడను సుఖముగాఁ గాలము గడపెను.

సీ. ఆయురర్థులకు దీర్ఘాయు రవాప్తియు
నర్థార్థులకు విపులార్థములును
ధర్మార్థులకు నిత్యధర్మ సంప్రాప్తియు
వినయార్థులకు మహా వినయమతియుఁ
బుత్రార్థులకు బహు పుత్రసమృద్ధియు
సంపదర్థుల కిష్టసంపదలును
గావించు నెప్పుడు భావించి వినుచుండు
వారికి నిమ్మహా భారతమ్ము

ఆ. వె. భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ
వల్లభుండు భక్తవత్సలుండు
భవభయంబులెల్లఁ బాపి యిష్టార్థసం
సిద్ధి గరుణతోడఁ జేయుచుండు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః